C

# ఆంధ్ర నిఘంటు క్రం

## టీకా తాత్పర్య సహితము

250

STUDENTS LITARARY ASSOCIATION
LIBRARY

★

ప్రకాశకులు

## సరస్వతీ బుక్ డిపో,

బెజవాడ రాజమండ్రి

★

రేపరు బైండు 0-8-0

అట్ట బైండు 0-10-0

క్యాలికో బైండు 0-14-0

సర్వస్వామ్య
సంకలితము

CI

# ఆంధ్ర నిఘంటు త్రయము

## టీకా తాత్పర్య సహితము

ప్రకాశకులు

**సరస్వతీ బుక్ డిపో,**

బెజవాడ రాజమండ్రి

★

రేపరు బైండు 0-8-0

సర్వస్వామ్య సంకలితము

అట్ట బైండు 0-10-0

క్యాలికో బైండు 0-14-0

బెజవాడ
ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
ముద్రింపబడియె.

# పీఠిక

ఆంధ్రభాష విశేషముగ సంస్కృతముపై నాధారపడి యున్నమాట వాస్తవమేకాని యందుఁ జాలదేశ్యపదములు గూడ నిమిడియున్నమాట యంద తెలుఁగనిది కాదు. సంస్కృత భాషయం దమరకోశము మున్నగు నిఘంటువులు పెక్కులున్నవి. నిఘంటుసాహాయ్యము లేనిదే యెంతటి భాషా నిష్ణాతునకైన నొక్కొక్కచో నొక్కొక శబ్దముయొక్క విశేషార్థములు గోచరింపక మహాకవులు కావ్య రస గ్రహణమున కంతరాయము కలిగించును. అట్టి నిఘంటువులు మన యాంధ్ర భాషయందుఁ జాలతక్కువ. ఉన్నవానిలో నిఘంటుత్రయమని పిలువఁబడుచున్న 1 ఆంధ్రనామ సంగ్రహము 2 ఆంధ్రనామ శేషము 3 సాంబనిఘంటువు నను నీమూఁడును బ్రశస్తములు. వ్రాతకనువగు సాధనములు స్వల్పముగుటయు గురుముఖము నుండి శిష్యున కెట్టి శాస్త్రమైనఁ బరంపరాగతము కావలసి యుండుటచేతను బ్రాచీనకాలమునుండియు నేశాస్త్రమైనను ఛందోబద్ధము కావింపఁ బడుచుండెడిది. ఆ సంప్రదాయమున కనుగుణముగనే యీమూఁడు నిఘంటువులును బద్యరూపముగ విరచింపఁబడినవి. విశేషశబ్దములఁ దమనిఘంటువులఁ జేర్చి యాంధ్ర మహాకవుల రచనలు జనసామాన్యమున కందు బాటులో నుండుటకుఁ దోడ్పడిన పై నిఘంటుత్రయకర్తల కాంధ్రజనులు చిరకృతజ్ఞతను జూపవలసియున్నది.

## ఆంధ్రనామసంగ్రహము

ఇది పైడిపాటి లక్ష్మణకవిచే రచింపఁబడినది. ఈకవి యేకామ్రమంత్రిపుత్రుఁడు. కౌండిన్యసగోత్రుఁడు. శివభక్తుఁడు. ఈకవి కాలమును నిర్ణయించుటకుఁ దగినయాధారములు దొరకలేదు. కాని యడిదము సూరకవి యాంధ్రనామసంగ్రహమునఁ జెప్పని తెలుఁగుపదముల నేరి యాంధ్రనామశేషమను నిఘంటువు రచియించెదనని చెప్పుటచేత నాతనికన్నఁ బ్రాచీనుఁడని మాత్రము చెప్పవచ్చును.

## ఆంధ్రనామశేషము

ఇది అడిదము సూరకవిచే రచింపఁబడినది. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు. ఈకవితండ్రి బాలభాస్కరుఁడు. ఈతఁడు రచించిన చాటుపద్యములు మున్నగు వానివలన నీతఁడు విజయనగరాధిపతియైన రెండవ విజయరామరాజుగారి కాలములోనున్నటు విశదమగుచున్నది. ఈ విజయరామరాజుగారు క్రీ. శ. ౧౭౫౯ సం॥ రం మొదలుకొని ౧౭౯౪ సం॥ రం వరకు రాజ్యపాలనము చేసిరి. కావున నీకవికూడ నీకాలములోనివాఁడే యని తెలియుచున్నది. ఇతఁడు కవిజనరంజనము, కవిసంశయవిచ్ఛేదము, ఆంధ్రచంద్రాలోకము, రామలింగేశ్వరశతకము అను గ్రంథములనుగూడ రచించెను.

## "సాంబనిఘంటువు"

ఇది కస్తూరిరంగ కవిచే రచింపఁబడినది. ఈకవి యార్వేల నియోగిబ్రాహ్మణుఁడు. ఈతనితండ్రి వేంకటకృష్ణయామాత్యుఁడు. తల్లి కామాక్షమ్మ. ఇతఁడు క్రీ. శ. ౧౭౯౦ సం॥ రం ప్రాంతమున తంజావూరి సంస్థానమునందుండెను. ఈకవి లక్షణచూడామణియను నామాంతరము గల రంగరాట్ఛందస్సును, కృష్ణార్జునసంవాదమను ప్రబంధమునుగూడ రచించెను. ఆంధ్రకాళిదాస బిరుదశోభితుఁడగు నాలూరి కుప్పనకవి యీతని శిష్యుఁడని తన శంకరవిజయమున వ్రాసికొనియున్నాఁడు.

ఈ కవిత్రయము రచించిన పైమూఁడునిఘంటువులను బండితులగువారిచే టీక వ్రాయించి నిర్దుష్టముగ ముద్రింపించితిమి. దోషము లున్న యెడలఁ బండితులగువారు దయయుంచి మాకుఁ దెలియఁజేసినయెడల రాబోవుముద్రణమున సవరించుకొందుము.

కురుకూరి సుబ్బారావు.

శ్రీ రస్తు,

# ఆంధ్రనామసంగ్రహము.

## దేవవర్గు.

### అవతారిక.

పైడిపాటిలక్ష్మణకవిమంత్రి యాంధ్రనామసంగ్రహమనెడి యీ నిఘంటువును రచియింపఁబూని యిది నిర్విఘ్నముగా పరిసమాప్తినొందుటకొఱకు నాదియందు నిష్టదేవతానమస్కారరూప మంగళము నాచరించువాఁడై యిట్లాచరించుట శిష్టాచారమని శిష్యజనులకుఁ దెలియుటకొఱకు నామంగళము గ్రంథరూపముగా 'శ్రీపతివంద్య' అను తొలుపద్యమున నిబంధించుచున్నాఁడు. పిదప రెండుపద్యములందును దనయిష్టదైవమగు విశ్వనాథునికి స్తుతిపూర్వకముగా నీగ్రంథము నంకితముసేయుటయు, గ్రంథనామము స్వనామమునున్నగునవియుఁ దెలుపుచున్నాఁడు. మొదటి *మూఁడుపద్యములందేకాన్వయము గలదియని యెఱుంగునది.

క. శ్రీపతివంద్య విశాలా
శ్రీపతిని భజించి యిష్ట • సిద్ధులు వరుసం
బ్రాపింపఁగ గణనాథుని
శ్రీపాదంబులకు నెఱఁగి • చెందిన వేడ్కన్. 1

క. నతభక్తలోకరక్షా
రతికిం జంచత్కృపాత • రంగితమతికిన్

*ఇట్లు ఏకాన్వయముగల పద్యములు కుళక మనఁబడును. కావ్యాదులందుఁ గుళకముఁ జెప్పువాడుక లేకున్నగాఁ గానంబడుచున్నవి.

శతమఖముఖసురనుతిసం
గతికిన్ మహిమోన్నతికిని • గౌరీపతికిన్. 2

తే. అంకిత మొనర్తుఁ దెనుఁగుపే • ళ్లరసి కూర్చి
గరిమతో నాంధ్రనామ సం • గ్రహ మనంగ
నమరుకృతిఁ బైఁడిపాటి యే • కామ్రమంత్రి
సుతుఁడఁ గవిలక్ష్మణాఖ్యుఁడ • సుజనహితుఁడ. 3

టీ. ఇష్టసిద్ధులన్ - ఇష్ట = కోరఁబడిన, సిద్ధులన్ = పనులు చక్కఁబడుటలను, వరుసన్ = క్రమముగా, ప్రాప్తింపఁగన్ = పొందుటకు, శ్రీపతివంద్యున్ - శ్రీ = సంపదధిష్ఠానదేవత యగులక్ష్మీదేవికి, పతి = నాయకుఁడగు శ్రీమన్నారాయణునికి, వంద్యున్ = ఆరాధింపఁదగ్గవాఁడైన విశాలాక్షీపతిని = విశాలాక్షియనెడు పేరిటఁ బ్రసిద్ధిఁ నొందియుండు పార్వతీదేవికి పెనిమిటియగు విశ్వేశ్వరుని, భజింతు = సేవింతు, గణనాథుశ్రీపాదంబులకున్ - గణ = ప్రమథాదిగణములకు, నాథుని = ప్రభువగు విశ్వేశ్వరునియొక్క, శ్రీపాదంబులకున్ = శుభకరము లగునడుగులకు, ఎఱఁగి = వందనము సేసి, చెందిన = పొందిన, వేడ్కన్ = ఆనందముతో, పైఁడిపాటియేకామ్రమంత్రిసుతుఁడ = పైఁడిపాటి యనుగృహనామము గలయేకామ్రమంత్రికిఁ బుత్త్రుఁడును, సుజనహితుఁడ - సుజన = సత్పురుషులకు, హితుఁడ = ఇష్టుఁడైనవాఁడును, కవిలక్ష్మణాఖ్యుఁడ - కవిలక్ష్మణ = కవిలక్ష్మణుఁడనెడి, ఆఖ్యుఁడ = నామముగలవాఁడు నగు నేను, తెనుఁగుపేళ్లు = ఆంధ్రభాషాశబ్దములను, అరసి = నిఖిలాంధ్రగ్రంథములయందు విమర్శించి, కూర్చి = ఆయావర్గములతోఁ జేర్చి, ఆంధ్రనామసంగ్రహము - ఆంధ్రనామ = తెనుఁగుమాటలయొక్క, సంగ్రహము = సంక్షేపించి చెప్పుట, అనంగన్ = అని వ్యవహరించుటచేత, గరిమతోన్ = గౌరవముతో, అమరు = తగియుండెడి, కృతిన్ = గ్రంథమును, నతభక్తలోకరక్షారతికిన్ - నత = నమస్కరించువారును, భక్త = భక్తులును అగు, లోక = జనులయొక్క, రక్షా = కాపాడుటయందు, రతికిన్ = ఆసక్తిగలవాఁడును, చంచత్కృపాతరంగితమతికిన్ - చంచత్ = కదలుచుండెడు, కృపాతరంగిత = దయా

రవతరంగములతోఁగూడిన, మతికిన్ = మానసంబుగలవాఁడును, శతమఖముఖసురనుతిసంగతికిన్ - శతమఖముఖ = దేవేంద్రుఁడు మొదలైన, సుర = దేవతలయొక్క, నుతి = స్తోత్రములయొక్క, సంగతికిన్ = సంబంధముకలవాఁడును, మహోన్నతికిని = ప్రభావాధిక్యము గలవాఁడునై యున్నట్టి, కాశీపతికిన్ - కాశీ = వారణాశీపురికి, పతికిన్ = ప్రభువగు విశ్వేశ్వరునికి, అంకితము = అవిశ్వేశ్వరుని పేరఁ గృతినిచ్చుటను ఒనర్తున్ = చేయుదును.

అవతారిక. ఇపుడు గ్రంథకర్త తాను జేయంబూనిన గ్రంథమునందు సంకేతంబును దెలియఁజేయుచున్నాఁడు.

తే॥ దేవమానవస్థావర • తిర్యగాఖ్య
వర్గు లొనరింతు నానార్థ • వర్గుఁ గూడ
వర్గములు గాఁగఁ గూర్తు నా • వ్యయములందు
నిఘువివరించునెడల సం • స్కృతపదంబు. 4

టీక. దేవమానవస్థావరతిర్యగాఖ్యవర్గులు = దేవవర్గు, మానవవర్గు, స్థావరవర్గు, తిర్యగ్వర్గు, అను పేళ్లు గలనాలుగువర్గులను, నానార్థవర్గుఁ గూడన్ = నానార్థవర్గు వను నైదవవర్గును నైనను, ఒనరింతున్ = చేసెదను. అందును = ఆవర్గులయందును, అవ్యయములు = శేళ్లను, వర్గములు గాఁగఁ గూర్తున్ = ఒకటికి నొకటి సంబంధము గలవానినిగాఁ జేర్తును. వివరించునెడలన్ = అర్థమును దెలియఁబలుకునెడల, సంస్కృతపదంబున్ = సంస్కృతపదమును, ఇడుదున్ = ఉంతును.

అవతారిక. ఇపుడు గ్రంథకర్త కృతిపతియగు విశ్వేశ్వరుని సంబోధనచేసి యెచ్చరికను జెప్పుచున్నాఁడు.

క. శ్రీలలనాధిపవంద్య వి
శాలాక్షీ ప్రాణనాథ • శతమఖముఖది
క్పాలాభీష్టద సమధిక
శీలా కాశీనివేశ • శ్రీవిశ్వేశా! 5

టీ. శ్రీలలనాధిప = లక్ష్మీకాంతకు అధిపతియయిన శ్రీవిష్ణువునకు, వంద్య = పూజ్యుఁడవును, విశాలాక్షీప్రాణనాథ = విశాలాక్షీ దేవికిఁ బెనిమిటియును, శతమఖముఖ దిక్పాలాభీష్టద = దేవేంద్రుఁడు మొదలగు దిక్పతులకు నభీష్టముల నిచ్చువాఁడవును, సమధికశీల = ఎక్కువశీలము గలవాఁడవును, కాశీనివేశ = కాశీపట్టణము స్థానముగాఁగలవాఁడవునైన, శ్రీవిశ్వేశ = శ్రీమంతుఁడ వగువిశ్వేశ్వరస్వామి! అవధరింపుము.

సీ॥ ముక్కంటి యరపది • మోములవేలుపు
మినుసిగదయ్యంబు • మిత్తిగొంగ
గట్టువిల్తుఁడు గఱ • కంఠుఁడు మిక్కిలి
కంటిదేవర బేసి•కంటివేల్పు
వలిమలల్లుఁడు మిన్ను • వాఁకతాలుపు కొండ
వీటిజంగము గుజ్జు• వేల్పుతండ్రి
వలరాజుసూడు జ•క్కులఱేనిచెలికాఁడు
బూచులరేకిమీఁడు • పునుకతాల్పు

తే. విసపుమేఁతరిఁజన్నంపు • వేఁటకాఁడు
బుడుతనెలతాల్పు వెలియాల • పోతురౌతు
తోలుదాలుపు ముమ్మొన • వాలుదాల్పు
నాఁగ భవదాఖ్య లొప్పు నం • ధకవిపక్ష.

టీ. ముక్కంటి = మూఁడుకన్నులుకలవాఁడు, అరపదిమోముల వేలుపు = అయిదుముఖములుగల దేవుఁడు, మినుసిగ దయ్యంబు = ఆకాశము శిఖగా గలిగిన దేవుఁడు, మిత్తిగొంగ = మృత్యువును సంహరించినవాఁడు, గట్టువిల్తుఁడు = మేరుపర్వతము విల్లుగాఁ గలవాఁడు, కఱకంఠుఁడు = నల్లనికంఠముగలవాఁడు, మిక్కిలికంటిదేవర = ఎక్కువకన్నుగలదేవుఁడు, బేసికంటివేల్పు = బేసిగానికన్నులుగలదేవుఁడు, వలిమలల్లుఁడు = హిమవంతునకు అల్లుఁడు, మిన్నువాఁకతాలుపు = ఆకాశగంగను ధరించినవాఁడు, కొం

డవీటిజంగము = కైలాసపర్వతము పట్టణముగాఁ గలిగినభిక్షుకవ్యాపారివాఁ-, గజ్జువేల్పుతండ్రి = విఘ్నేశ్వరునకుఁ దండ్రి, వలరాజునాదు = మన్మథున కుఁబగవాఁడు. జక్కులఱేనిచెలికాఁడు = కుబేరునకుస్నేహితుఁడు, బూచు లరొయికిమాఁడు = పిశాచములకురాజు, పునుకతాల్ప = బ్రహ్మకపాలమును ధరించినవాఁడు, విసపుమేఁతరి = విషమును భక్షించినవాఁడు, జన్నంపువేఁట కాఁడు = దక్షయజ్ఞధ్వంసకుఁడు, బుడుతనెలతాల్పు = బాలచంద్రుని ధరించినవాఁడు; వెలియాలపోతురౌతు = ధవళవృషభ మెక్కువాఁడు, తోలు దాలుపు = చర్మమును ధరించినవాఁడు, ముమ్మొనవాలుదాల్పు = త్రిశూల మును ధరించినవాఁడు, వాఁగక = అనఁగా, ఈ [illegible]-ను-అంధకవిపక్ష = అంధకాసురునకు శత్రువైన ఓశివా, భవదాఖ్యలొప్పుగా = నీపేళ్లు తగును.

సీ॥ సోఁకుమూఁకలగొంగ • చుట్టుఁగైదువుజోదు
పచ్చవిల్తునితండ్రి • లచ్చిమగఁడు
పులుఁగుతత్తడిరౌతు • వలమురితాలుపు
వెన్నుఁడు కతివేల్పు • వెన్నదొంగ
నునుగాడ్పుదిండిపా • నుపుఁబండెడుమేటి
బమ్మదేవరతండ్రి • తమ్మికంటి
పదివేసములసామి • పసిఁడిపుట్టముదాల్పు
కట్టెనచ్చెలితరి • గట్టుదారి
తే॥ ఆలకాపరి వ్రేతల • మేలువాఁడు
పాలకడలల్లుఁడును బక్కి • డాలుతేఁడు
రేయుఁ బవలును జేయుక • న్దోయివాఁడు
మామమామన హరియొప్పు • శ్రీమహేశ. 7

టీ. సోఁకుమూఁకలగొంగ = రాక్షససమూహములను గొట్టినవాఁడు, చుట్టుఁగైదువుజోదు = చక్రమును ధరించినయోధుఁడు, పచ్చవిల్తునితండ్రి = మన్మథునకుఁదండ్రి, లచ్చిమగఁడు = లక్ష్మీదేవికిఁ బెనిమిటి, పులుఁగుతత్తడి-

రాతు = గరుడవాహనము నెక్కువాఁడు, వలమురితాలుపు = శంఖమును ధరించినవాఁడు, వెన్నుఁడు = విష్ణుఁడు-సర్వప్రపంచమందు వ్యాపించియున్న వాఁడు, కఱివేల్పు = నల్లనిదేవుఁడు, వెన్నదొంగ = వెన్నదొంగిలించినవాఁడు, నునుగాడ్పు దిండిపాముపైఁ బండెడుమేటి॥ పాఠాంతరము॥ నునుగాలిమేఁత పాముపైఁబండెడిదొర = మృదువాయువును భక్షించు శేషుఁడను పామునందు శయనించినదిట్ట, బమ్మదేవరతండ్రి = బ్రహ్మదేవునకుఁ దండ్రి, తమ్మికంటి = పద్మములవంటి నేత్రములుగలవాఁడు, పదివేసములసామి = దశావతారస్వరూపములను ధరించిన దేవుఁడు, పసిఁడిపుట్టముతాల్పు = కనకాంబరధారి, కవ్వడినెచ్చెలి = అర్జునునకు స్నేహితుఁడు, తరిగట్టుదారి = మంధరపర్వతమును ధరించినవాఁడు, ఆలకాపరి = గోవులను గాచినవాఁడు, వ్రేతలమేలువాఁడు = గోపస్త్రీలకు నిష్టుఁడు, పాలకడలల్లుఁడు = క్షీరసముద్రునకు అల్లుఁడు, పక్కిడాలుఱేఁడు = గరుడధ్వజముగలరాజు, రేయుఁబవలును చేయుకన్దోయివాఁడు = రాత్రిని బగటిని జేయునట్టి చంద్రసూర్యులు నేత్రద్వయముగాఁగల వాఁడు, మామమామ* = మామయగు సముద్రునకుమామ, అన నీ ౨౭ పేళ్ల చేతను, హరి యొప్పుఁ -విష్ణువొప్పును.

సీ॥ పక్కిడాల్వేలుపు • పొక్కిలిపసిబిడ్డఁ
డంచతేజీనెక్కి • యాఁడురాతు
మనెడుపొద్దుల నొసళ్లను వ్రాయుదేవర
చదువులవేలుపు • జన్నిగట్టు
తెలిదమ్మిగద్దియఁ • గొలువుండు రాయఁడు
నిక్కపుజగమేలు • నేర్పుకాఁడు
కడుపు బంగారుబొక్కసముఁ జేసినమేటి
పొరోగిరముతిండి • పోతుతండ్రి

* మామమామ యేలాగుననంటే సముద్రుఁడు తనకూఁతురైన లక్ష్మీదేవిని విష్ణువునకు భార్యగానిచ్చెను గాన విష్ణువునకు మామయయ్యెను. విష్ణువు తనకూఁతురైన గంగను సముద్రునకు భార్యగానిచ్చెను గాన సముద్రునకు విష్ణువు మామయయ్యెను.

నలువ తమ్మిచూలి • నలుమొగంబులవేల్పు
వేల్పుపెద్ద పలుకు•వెలఁదిమగఁడు
తాత బమ్మ యన వి•ధాతనామము లొప్పు
నఘవినాశ యీశ • యభ్రకేశ. 8

టీ. పక్కిడాల్వేల్పుపొక్కిలిపసిబిడ్డఁడు = విష్ణువుయొక్క నాభికమలమునుండిపుట్టినపసిబాలుఁడు, అంచతేజీనెక్కియాడురాతు = హంసవాహన మెక్కి తిరిగెడురాయఁడు, మనెడుపొద్దుల నూఱేళ్లను వారియు దేవర = జీవించెడుకాలములను నూఱేళ్లయందు వారియుట్టిదేవుఁడు, చదువులవేల్పు = విద్యలకు దేవుఁడు, జన్నిగట్టు = యజ్ఞోపవీతమును ధరించినవాఁడు, తెలిదమ్మిగద్దియఁ గొలువుండురాయఁడు = శ్వేతపద్మాసనమందుఁ గూర్చుండెడి యేలుగాఁడు, నిక్కుపుజగమేలు నేర్పుకాఁడు = సత్యలోకము నేలునట్టి నేర్పుగలవాఁడు, కడుపుబంగారుబొక్కసముఁ జేసినమేటి = గర్భము బంగారుపుట్టగాఁ జేసికొన్నదిట్టరి, పోఁగొగిను తిండిపోతు తండ్రి = కలహామే యన్నముగాఁ గలనారదునకుఁ దండ్రి, నలువ = నాలుగునోళ్లుగలవాఁడు, తమ్మిచూలి = పద్మమందుఁబుట్టినవాఁడు, నలుమొగంబుల వేల్పు = నాలుగు ముఖములుగల దేవుఁడు, వేల్పు పెద్ద = దేవతలలోఁబెద్ద, పలుకు వెలఁది మగఁడు = సరస్వతికిఁ బెనిమిటి, తాత, బమ్మ, అన నీ ౧౭-బ్రహ్మ పేళ్లు.

తే॥ గట్లరాయనిపట్టి ము•క్కంటివెలది
యేనుఁగులగొంగత్తడి • నెక్కుదంట
సామిసామేనుఁ జేకొన్న • చాన జగము
తల్లి యన గౌరిపేళ్లొప్పు • ధర నుమేశ. 9

టీ. గట్లరాయనిపట్టి = హిమవంతునకుఁ గూఁతురు, ముక్కంటి వెలఁది = ఈశ్వరునికిభార్య, ఏనుఁగులగొంగత్తడి నెక్కుదంట = సింహవాహనము నధిష్ఠించుదిట్టరి, సామిసామేనుఁ జేకొన్నచాన = పెనిమిటియొక్క అర్ధాంగము నంగీకరించినచిన్నది, జగముతల్లి = లోకమాత, అన నీ ౫ను పార్వతికిఁ బేళ్లు.

తే. లచ్చి, కలుములజవరాలు, • పచ్చవిల్తు
తల్లి, కడివేల్పునిల్లాలు • తల్లితల్లి
కడలికూఁతురు సిరి లిబ్బిపడఁతి, తమ్మి
యింటిగరిత తన శ్రీ యొప్పు • మృగధరాంక. 10

టీ. లచ్చి = లక్ష్మి, కలుములజవరాలు = భాగ్యప్రదయైన దేవత, పచ్చవిల్తునితల్లి = మన్మథునితల్లి, కడివేల్పునిల్లాలు = విష్ణువునకు భార్య, *తల్లితల్లి = తల్లియైనగంగకుఁదల్లి ॥పా॥ తాతతల్లి = బ్రహ్మకుఁదల్లి, కడలికూఁతురు = సముద్రునికూఁతురు, సిరి, లిబ్బిపడఁతి = ధననిక్షేపములయందుండు దేవత, తమ్మియింటిగరిత = పద్మాలయమునందుండు స్త్రీ, అన నీ ౯ యును లక్ష్మీదేవి పేళ్ళు.

క॥ తలవాకిటను మెలంగెడు
పొలఁతుక పలుకులవెలంది • పొత్తముముత్తో
నలువపడఁతి కలుములపై
దలికోడ లన్నగఁ బరఁగు • ధర వాణి శివా. 11

టీక. తలవాకిటను మెలఁగెడుపొలఁతుక = తలకు వాకిలియైన నోటిలో సంచరించుచున్నది, పలుకులవెలంది = విద్యలుగల చిన్నది, పొత్తముముత్తో = పుస్తకముం దుండెడి ముత్తయిదువ, నలువపడఁతి = బ్రహ్మకు భార్య, కలుములపైదలికోడలు = లక్ష్మికిఁ గోడలు, అనఁగా నీ ౫ ను సరస్వతికిఁ బేళ్ళు.

సీ॥ ఇద్దఱుతల్లుల • ముద్దుబిడ్డఁడు పని
చెలువుఁదొరఁగ చేట • చెన్నలవేల్పు

---

* తల్లితల్లి యనఁగా విష్ణువుకూఁతురైనగంగ సముద్రునకు భార్యయైనందున లక్ష్మీదేవికిఁ దల్లియాయెను. సముద్రునికూఁతురైనలక్ష్మి విష్ణువునకు భార్యయైనందున గంగకుఁదల్లియాయెను.

వంకరతొండంబువాఁ డేనుఁగుమొగంబు
దేవర పాపజం దెముల మేటి
మ్రొక్కువారలపనుల్ చక్కఁజేసెడుసామి
గటికపూజల మెచ్చు గబ్బివేల్పు
ముక్కంటిపండుల మెక్కెడితిండీఁడు
ముక్కంటి గారాబు ముద్దుపట్టి
ఆ॥ పెద్దకడుపువేల్పు పిళ్ళారి కుడుముల
తిండికాఁడు కొక్కు తేజిరౌతు
గుజ్జువేలు పొంటి కొమ్ము దేవర వెన
కయ్య యన వినాయకాఖ్య లీశ. 12

టీక. ఇద్దఱు తల్లుల ముద్దుబిడ్డఁడు = గంగాపార్వతులకుఁ బ్రియసుతుఁడు, పనిచెఱుపులదొర = విఘ్నములకు నాయకుఁడు, చేటచెవులవేల్పు = చేటలవంటి చెవులుగల దేవుఁడు, వంకరతొండంబువాఁడు = వంకరతొండముగలవాఁడు, ఏనుఁగుమొగంబుదేవర = ఏనుఁగుముఖముగలదేవుఁడు, పాపజందెములమేటి = సర్పములను యజ్ఞోపవీతములనుగా ధరించిన దిట్టరి, మ్రొక్కువారల పనుల్ చక్కఁజేసెడుసామి = మ్రొక్కునట్టివారి పనులు బాగుగాఁ జేయు దేవుఁడు, గటికపూజలమెచ్చు గబ్బివేల్పు = గటికపూజలను మెచ్చునట్టి గొప్పదేవుఁడు, ముక్కంటిపండుల మెక్కుడుతిండీఁడు = టెంకాయలనుదిను బలవంతుఁడు, ముక్కంటి గారాబు ముద్దుపట్టి = ఈశ్వరున కత్యంత ప్రియకుమారుఁడు, పెద్దకడుపువేల్పు = గొప్ప బొజ్జగల దేవుడు, పిళ్ళారి, కుడుముల తిండికాఁడు = కుడుములను భక్షించువాఁడు, కొక్కు తేజిరౌతు = మూషకవాహనము నెక్కువాఁడు, గుజ్జువేలుపు = పొట్టిదేవుఁడు, ఒంటికొమ్ముదేవర = ఒంటిదంతముగల దేవుఁడు, వెనకయ్య, వినాయకుఁడు - అను నీ ౧౭ వినాయకుని పేళ్ళు.

సీ॥ పెనుఁబాఁపకవణంబు • దినువారువముఁ రౌతు
గట్టుల యెకిమీని • పట్టిపట్టి
తెల్లచూ లార్గురు • తల్లుల కొమరుండు
గాడుపుసంగడి • కానికొడుకు
పుంజుదాలుపు వేలు•పులతేనిదళవాయి
జంటమూమొమ్ముల • దంటవేల్పు
కొంచగుబ్బలివ్రక్క • లించినబలుదిట్ట
రెండాఱుచేతుల • దండిమగఁడు
తే॥ వేలుపులమూఁక పేరిటి • వెలఁదిమగఁడు
వేల్పుగమికాఁడు వెనకయ్య • వెనుకవాఁడు
కొమరుసా మన సేనాని • కొమరుమిగులు
విగతభవపాశ కాశీని•వేశ యీశ. 13

టీ. పెనుఁబాఁపకవణంబుఁదిను వారువము రౌతు = పెద్దపాముల ముద్దగా భక్షించు నెమలి నెక్కినవాఁడు. గట్టులయెకిమీనిపట్టిపట్టి = పార్వతికిఁ గొమారుఁడు, తెల్లచూలు = తెల్లనందుఁ బుట్టినవాఁడు, ఆర్గురుతల్లులకొమరుండు = షట్కృత్తికల కొమారుఁడు, గాడుపుసంగడికానికొడుకు = అగ్నికొమారుఁడు, పుంజుదాలుపు = కుక్కుటమును ధ్వజమందు ధరించినవాఁడు, వేలుపులతేనిదళవాయి = ఇంద్రునియొక్క సేనానాయకుఁడు, జంటమూమొమ్ముల దంటవేల్పు = ఆఱుముఖములు గలదిట్టయైన దేవుఁడు, కొంచగుబ్బలివ్రక్కలించినబలుదిట్ట = క్రౌంచాద్రిని భేదించినయధికబలశాలి, రెండాఱుచేతులదండిమగఁడు = పండ్రెండు చేతులుగల దిట్టయైన పురుషుఁడు. వేల్పులమూఁక పేరిటివెలఁదిమగఁడు = దేవసేన యనుపేరు గలచిన్నదాని పెనిమిటి, వేల్పులగమికాఁడు = దేవతలకు మొనగాఁడు. వెనకయ్యవెనుకవాఁడు = విఘ్నేశ్వరునకు వెనుకఁ బుట్టినవాఁడు, కొమరుసామి, అన నీ ౧౮ ను కుమారస్వామి పేళ్ళు.

సీ॥ అలరువిల్తుండు కన్నులవిల్తుఁడును గమ్మ
విలుకాఁడు చక్కెర వింటివాఁడు
చెఱకువిల్కాఁడు కెంజిగురులవిల్తుఁడు
వెడవిల్తుఁడును బచ్చ విల్తుఁ డించు
విల్లుదాలుపు తుంట విలుకాఁడు తియ్యవి
ల్కాఁడును జమిలిముక్కాలినారి
విలుకాఁడు చౌవంచ ములుకులుగలదంట
రాచిల్కనెక్కుడు రాయరౌతు
తే॥ మీనుమొసలి సిడంబుల మేటి చంద
మామయల్లుఁడు వలరాజు మరుఁడు లచ్చి
కొమరుఁడను పేళ్లనొప్పును గుసుమధన్వి
విగతభవపాశ కాశీనివేశ యీశ. 14

టీ. అలరువిల్తుండు = పుష్పధనుస్సుగలవాఁడు, కన్నులవిల్తుఁడును = పర్వములు గలధనుస్సుగలవాఁడు, కమ్మవిలుకాఁడు = మధురమయినధనువు గలవాఁడు, చక్కెరవింటివాఁడు = శర్కరధనుస్సు గలవాఁడు: చెఱకువిల్కాఁడు = ఇక్షువు ధనువుగాఁగలవాఁడు, కెంజిగురులవిల్తుఁడు = ఎఱ్ఱనిచిగురులు ధనుస్సునందుఁ గలవాఁడు, వెడవిల్తుఁడు = చులకనివిల్లుగలవాఁడు, పచ్చవిల్తుఁడు = పచ్చనివిల్లుగలవాఁడు, ఇంచువిల్లుదాలుపు = ఇక్షుధనుస్సును ధరించినవాఁడు, తుంటవిలుకాఁడు = చెఱకుతుంటవిల్లు గాఁగలవాఁడు, తియ్యవిల్కాఁడు = మధురమైనవిల్లుగలవాఁడు, జమిలిముక్కాలినారివిలుకాఁడు = షట్పదములే నారిగాఁగలధనువుగలవాఁడు, చౌవంచములుకులుగలదంట = పంచబాణములు గలదిట్టరి, రాచిల్కనెక్కుడురాయరౌతు = రాచిలుక నెక్కుడురాజైరౌతు, మీనుమొసలిసిడంబులమేటి = మత్స్యమును మకరమును ధ్వజముగాఁగల దిట్టరి, చందమామయల్లుఁడు = చంద్రునికల్లుఁడు, వలరాజు = కామునకు రాజు, మరుఁడు, లచ్చికొమరుఁడు = లక్ష్మికిఁ గుమారుఁడు, అన నీ నామములు మన్మథునిపేళ్ళు.

సీ॥ చలువలఱేఁడు వెన్నెలఱేఁడు రేఱేఁడు
జాబిల్లి రేవెల్గు • చందమామ
తమ్ములపగవాఁడు • కమ్మవిల్తునిమామ
కలువలఱేఁడు పాల్కడలిపట్టి
జక్కవకవవిప్పు • ముక్కంటితలపువ్వు
చుక్కలదొర ప్రొద్దు • జోడుకోడె
తపసికన్నాప బిత్తరిజింకతాలుపు
కటివేల్పు డాకన్ను • కడలివెన్న
తే. పంటపయిరులయొకిమీఁడు • జంటదంట
చౌకములపాళ్ళ • తెలిముద్ద • చలివెలుంగు
వేలుపుఁబువ్వ చీఁకటి • వేరువిత్తు
నెల యనఁగఁ జంద్రు పేళ్లొప్పు • నీలకంఠ. 15

టీ. చలువలఱేఁడు = శీతలములకు రాజు, వెన్నెలఱేఁడు = వెన్నెలకు రాజు, రేఱేఁడు = రాత్రికధిపతి, జాబిల్లి = ఒప్పుచున్న బింబముగల వాఁడు, రేవెల్గు = రాత్రియందుఁ బ్రకాశించువాఁడు, చందమామ, తమ్ములపగవాఁడు = పద్మములకు విరోధి, కమ్మవిల్తునిమామ = మన్మథునకుమామ, కలువలఱేఁడు = కలువలకు రాజు, పాల్కడలిపట్టి = క్షీరసముద్రుని కుమారుఁడు, జక్కవకవవిప్పు = చక్రవాకపక్షులయొక్క జతను విప్పువాఁడు, ముక్కంటి తలపువ్వు = ఈశ్వరుని శిరమునం దుండెడుపువ్వము, చుక్కలదొర = నక్షత్రములకు రాజు, ప్రొద్దుజోడుకోడె = సూర్యునకు సమానమయినవాఁడు, తపసికన్నాప = అత్రిముని నేత్రమునందుఁ బుట్టిన చిన్నవాఁడు, బిత్తరిజింకతాలుపు = సొగసైన లేడిని ధరించినవాఁడు, కరివేల్పుడాకన్ను = విష్ణువునకు వామనేత్రము, కడలివెన్న = సముద్రమందుఁ బుట్టినవెన్న; పంటపయిరులయొకిమీఁడు = ఫలపాకాంతమైన సస్యములకు రాజు, జంటదంట చౌకములపాళ్ళ తెలిముద్ద = పదియాఱుకళలుగల తెల్లని బింబము, చలివెలుంగు = చల్లని ప్రకాశముగలవాఁడు, వేలుపులబువ్వ = దేవతల యన్నము

చీఁకటివేరువిత్తు = చీఁకటిని హరించువాఁడు, రెం, అక నీడఱ చంద్రుని వేల్పు.

సీ॥ వెన్నునివలకన్ను • వేఁడివేలుపు పొద్దు
తొవలరాయిడికాఁడు • పవలుసేయు
వేలుపు పచ్చగుఱ్ఱాల వజీరుండు
వేఁడి వెలుంగు రే • వెల్గుజోడు
జంటారుమేనుల • సామి చీఁకటిగొంగ
యెఱ్ఱనివేలుపు • నివముకూడు
పగలుమానికము పాఁ • జమువుల పెట్టియ
యేడు గుఱ్ఱముల తే • రెక్కుజోదు
మువ్వేలుపుల యిక్క • మ్రొక్కులదేవర
గాముల తేఁడు జ • క్కవలతేఁడు
వేయి చేతులతేఁడు • వెలుఁగుల యొకిమీఁడు
చెయువుల సాకిరి • చాయమగఁడు

తే॥ మింటితెరువరి తమ్మికవా • ల్గంటిమగఁడు
పోరనీర్గెడు మొఁగాండ్రు • పోవుదారి
జగముకట్టెంబు జముపయ్య • జగముకన్ను
నాఁగ సూర్యుని వేల్పొప్పు • నాగభూష.

టీ. వెన్నునివలకన్ను = విష్ణువునకుదక్షిణనేత్రము, వేఁడివేలుపు = వెచ్చని దేవుఁడు, పొద్దు = బ్రధ్నుఁ, తొవలరాయిడికాఁడు = కలువలకు విరోధి, పవలుసేయువేలుపు = దివసమును జేయుదేవుఁడు పచ్చగుఱ్ఱాల వజీరుండు = పచ్చనిగుఱ్ఱముల నెక్కెడువాఁడు వేఁడివెలుంగు = వెచ్చనివెలుఁగుగలవాఁడు, రేవెల్గుజోడు = చంద్రునికి జత, జంటారుమేనులసామి = పండ్రెండుశరీరములుగలదేవుఁడు, చీఁకటిగొంగ = తమస్సును హరించువాఁడు, ఎఱ్ఱనివేలుపు = రక్తవర్ణముగల దేవుఁడు, ఇవముకూడు = హిమమును హరించువాఁడు, పవలు

మానికము = ఆకాశమునకు రత్నము, మూఁజదువులపెట్టియ = వేదములకుఁ బెట్టె, ఏడుగుఱ్ఱముల తేరెక్కుజోదు = ఏడుగుఱ్ఱములుంగట్టినరథము నెక్కెడుయోధుఁడు, మువ్వేలుపులయిక్క = త్రిమూర్తులకుస్థానము, మొక్కులదేవర = నమస్కారములకుఁ బ్రియుఁడైన దేవుఁడు, గాముల ఱేఁడు = గ్రహములకు రాజు, జక్కవల ఱేఁడు = చక్రవాకపక్షులకు రాజు, వేయిచేతుల ఱేఁడు = సహస్రకరములుగలరాజు, వెలుఁగుల రౌకమీఁడు = తేజస్సుల కధిపతి. చెయువులసాకిరి = కర్మములకుసాక్షి, చాయమగఁడు = ఛాయాదేవికి మగఁడు మింటితెరువరి = నభోమార్గముగలవాఁడు, తమ్మివాల్గంటిమగఁడు = పద్మినియనెడు చిన్నదానికిఁ బెనిమిటి, పోరనీల్గెడు మొనగాండ్రు పోవుదారి = యుద్ధమందుఁ జచ్చువీరులు పోయెడుమార్గము, జగముచుట్టంబు = లోకబాంధవుఁడు, జమునయ్య = యమునకుఁ దండ్రి, జగముకన్ను = జగత్తునకు నేత్రము-అన నీ ౨౦ ను సూర్యుని పేళ్ళు.

సీ॥ చట్టుపల్ దెగ గట్టఁ • గొట్టెడుజెట్టి నూ
అంచులవాలుచే • మించుజోదు
దుగబోట్ల పిరిఁది యై•దు కనుంగవలవేల్పు
పాలుతపసియింటి • పంచకోడి
యొడలిచూ పొడయఁడె • క్కుడుమొగుల్ గలప్రోడ
నిక్కుపీనుల జక్కి • నెక్కురౌతు
తెల్లయేనుఁగు నెక్కి • తిరిగెడుదొర తూర్పు
మాగాని యేలెడు • మణిపకాఁడు

తే॥ జమిలిచౌవంచపదులు జ • న్నములు నేసి
నట్టివేలుపు సోమాసి • పెట్టుఁజెట్టు
పొట్టితమ్ముఁడు గల్గిన • యట్టివేల్పు
నాఁగ నింద్రునిపేళ్లొప్పు • నాగభూష. 17

STUDENTS LIBRARY ASSOCIATION LIBRARY

టీ. చట్టుపల్ దెగ గట్టఁ గొట్టెడు జెట్టి = పర్వతములయొక్క ఱెక్కలను దెగఁ గొట్టినదిట్ట, నూరంచులవాలుచే మించువాఁడు = నూఱుపదునులు గల వజ్రాయుధముచేత మించినరాఘుఁడు, దుగ్గాల్లసిల్లెడికన్నులవేల్పు = వేయినేత్రములుఁ గల దేవుఁడు, గౌతమునియింటిపంచకుఱ్ఱఁడు = బ్రహ్మర్షియైనగౌతముని యింటిపంచ నున్నవాఁడు, ఒడలుమేపాడయైనవాఁడు = శరీరముచేతఁ జూచెడిరాజు. ఎక్కుడుమొగుల్ గలప్రోద = మేఘములను వాహనములనుగా నెక్కెడిదిట్ట, నిక్కువీనులజక్కి నెక్కురాతు = ఉచ్చైశ్శ్రవమను గుఱ్ఱము నెక్కెడిరాజు. తెల్లయేనుఁగు నెక్కితిరిగెడుదొర = ఐరావతమను తెల్లయేనుఁగు నెక్కి తిరుగునట్టిరాజు, తూర్పుమూలగాని యేలెడు పనివకాఁడు = తూర్పురాజ్యము నేలెడి యుద్యోగముగలవాఁడు, జటిలి చాపంచపదులుఁ జన్నములు సేసినట్టివేలుపు = నూరుయజ్ఞములు చేసినదేవుఁడు సోమానిపెట్టుఁజెట్టు = సోమయాజికిఁ గల్పవృక్షమువంటివాఁడు, పొట్టితమ్ముఁగలిగినవేల్పు = ఉపేంద్రుఁడు తమ్ముఁడుగా గలదేవుఁడు-అన నీ ౧౨ను దేవేంద్రుని పేళ్ళు.

ఆ॥ నీరుపాప గాలి • నెచ్చెలి యన్నింటి
తిండికాఁడు కప్పుఁ • దెరువుజాడ
యంటరానివేల్పు • జంటమోములసామి
యగ్గియనఁగ నొప్పు • ననలుఁ డీశ. 18

టీ. నీరుపాప = ఉదకమునందుఁ బుట్టినవాఁడు, గాలినెచ్చెలి = వాయువునకు మిత్రుఁడు, అన్నింటితిండికాఁడు = సర్వమును భక్షించువాఁడు, కప్పుతెరువుజాడ = నల్లనిమార్గము గలవాఁడు, అంటరానివేల్పు = ముట్టశక్యముగానిదేవుఁడు, జంటమోములసామి = రెండుముఖములు గలదేవుఁడు, అగ్గి-అన నీ ౭ ను అగ్ని పేళ్ళు.

తే॥ జమునసైదోడు పెతరుల • సామి జముఁడు
ప్రొద్దుకొమరుఁడు గుదెతాల్పు • పోతుజక్కి
నెక్కియాడెడుబలురాతు • దక్కిణంపు
సామి యన నంతకుం డొప్పు • శ్రీమహేశ. 19

టీ. జమునపైదోడు = యమునానదికి సహోదరుఁడు, పితరులసామి = పితృదేవతలకు రాజు, ప్రాద్దుకొమరుఁడు = సూర్యుని కుమారుఁడు, గుదదాల్పు = గదను ధరించినవాఁడు, పోతుజక్కి నెక్కి యాడెడుబలురాతు = మహిషవాహనము నెక్కి సంచరించుబలముగలరాతు, దక్కిణంపుసామి = దక్షిణదిక్కునకు రాజు - అనఁ నీ ౮ ను యముని పేళ్ళు.

ఆ॥ మూలలేఁడు సోఁకు • మూఁకలలేఁడు రే
దిమ్మరీఁడు పొలసు • దిండిపోతు
రక్కసుండు నల్ల • ద్రావువాఁ డనఁగను
నిర్‌ఋతిపేళ్లు సెల్లు • నీలకంఠ. 20

టీ. మూలలేఁడు = కోణమందుండెడురాజు, సోఁకుమూఁకలలేఁడు = రాక్షసుల కధిపతి, రేద్రిమ్మరీఁడు = రాత్రియందు సంచరించువాఁడు, పొలసుదిండిపోతు = మాంసము భక్షించువాఁడు, రక్కసుండు, నల్లద్రావువాఁడు = రక్తమును పానముసేయువాఁడు - అనఁ నీ ౬ ను నిర్‌ఋతి పేళ్ళు.

ఆ॥ మేటినీరుచూలి • మెయితాలుపులసామి
వల్లెత్రాడుదాల్పు • నీళ్లరాయఁ
డేటిబోటిమగల • యొకిమీఁడు పడమటి
దొర యనంగ నొప్పు • వరుణుఁ డీశ. 21

టీ. మేటినీరుచూలిమెయితాలుపులసామి = సముద్రమందుఁబుట్టిన దేహములు గలజంతువులకు రాజు, వల్లెత్రాడుదాల్పు = పాశమునుధరించినవాఁడు, నీళ్లరాయఁడు = ఉదకములకధిపతి, ఏటిబోటిమగలయొకిమీఁడు = నదులకధిపతు లయినసముద్రములకు రాజు, పడమటిదొర = పశ్చిమదిక్కునకు రాజు - ఈ ౫ ను వరుణుని పేళ్లు,

సీ॥ వడి గలజింకతే • త్తడి నెక్కునెఅరాతు
మేటిపాములమేఁత • నీటితాత

యొడలితాల్పులపిండు ♦ కుసు రగు బలియుండు
సోఁకుదయ్యము మింటి♦చూలి గాలి
కరువలి తెమ్మెర ♦ గాడ్పు పయ్యెర యొంటి
మ్రాఁకులపెనుముప్పు ♦ మబ్బువిప్పు
సురఁటివీవులబుట్టు ♦ సుడిగొట్టు చలినట్టు
బక్కవారల పెను♦బాద యీఁద
తే॥ యబ్బురపుఁదియ్యవిలుకాని ♦ నిబ్బరంపు
దెబ్బపోరుల నలయిక ♦ ప్రబ్బుబోంట్ల
గబ్బిగుబ్బల చెమటల♦యు బ్బడంచు
గబ్బి నాఁ జను మారుతా♦ఖ్యలు వృషాంక. 22
క॥ మరుదాఖ్య లొప్పుచుండును
ధర వినుచూలి యన సోఁకు♦దయ్య మనం బ
య్యెర యన గొట్టన నీఁ దనఁ
గరువలి యనఁ దెమ్మె రనఁగ ♦ గాలి యనంగన్. 23

టీ. వడి గలజింకత త్తడి నెక్కు నెఱరౌతు=వేగముగల లేడిని వాహనముగా నెక్కినధికుం డయిన రౌతు. మేటిపాముల మేఁత=గొప్ప సర్పముల కాహారము, నీటితాత=ఉదకమునకుఁ బితామహుఁడు, ఒడలితాల్పుల పిండు కుసు రగుబలియుండు=దేహి సమూహములకు ప్రాణమైన బలవంతుండు, సోఁకుదయ్యము = కనఁబడక స్పృశించువట్టి దైవము, మింటిచూలి=ఆకాశమందు బుట్టినవాఁడు. గాలి, కరువలి, తెమ్మెర, గాడ్పు, పయ్యెర, ఒంటిమ్రాకుల పెనుముప్పు = ఒంటిగానున్న వృక్షములకు మిక్కిలి హానిచేయువాఁడు, మబ్బువిప్పు = మేఘములను విప్పువాఁడు, సురఁటివీవుల బుట్టు = చామరములు వీచుటవలనఁ బుట్టువాఁడు, సుడిగొట్టు=సుడిగాలిగొట్టువాఁడు, చలినట్టు = చలికి స్థానమైనవాఁడు, బక్కవారల పెనుబాద=చిక్కినవారిని మిక్కిలి బాధసేయువాఁడు, ఈఁద, అబ్బురపు = ఆశ్చర్యకరమైన, తియ్యవిలుకాని

= మన్మథునియొక్క, నిబ్బరంపు దెబ్బపోరుల=మిక్కుటమైన దెబ్బలుగల యుద్ధములయందు (అనఁగా రతిక్రీడలందు) అలయికప్రిబ్బు=మిక్కిలి యలసటఁ జెందునట్టి, బోఁట్ల = స్త్రీలయొక్క, గబ్బి = గొప్పలైన, గుబ్బల = స్తనములయందలి, చెమటల = చెమటలయొక్క, ఉబ్బు = అతిశయమును, అడంచు=అడఁచునట్టి, గబ్బి= గొప్పవాఁడు, వినుచూలి = ఆకాశమునందుఁ బుట్టినవాఁడు. సోఁకుదయ్యము = కనఁబడక స్పృశించుదేవుఁడు, పయ్యర, గొట్టు, ఈఁద, కరువలి, తెమ్మెర, గాలి-అన నీ ౨౮ ను వాయువు పేళ్ళు.

క॥ ముక్కంటియనుఁగుఁజెలి వడ
చక్కిలిక చాగకాఁడు ♦ జక్కులదొర బల్
గొక్కమెకిమీఁడు తత్తడి
నెక్కుడువాఁ డనఁగ జను ధ♦నేశుం డభవా. 24

టీ. ముక్కఁటియనుఁగుఁజెలి = ఈశ్వరునకు నత్యంత స్నేహితుఁడు, వడచక్కిలిక = ఉత్తరపుదిక్కు నేలెడివాఁడు, చాగకాఁడు ॥పా॥ తేగకాఁడు-త్యాగముగలవాఁడు, జక్కులదొర = యక్షులకురాజు, బల్గొక్కమెకిమీఁడు=అధికధనాధిపతి, తత్తడినెక్కుడువాఁడు =అశ్వము నెక్కుడువాఁడు, ॥పా॥ మానిసి నెక్కుడువాఁడు = మనుష్య నెక్కునట్టివాఁడు. అను నీ ౭ యును గుబేరునిపేళ్ళు.

క॥ విడిముడిగలవేలుపుచెలి
జడముడిజంగంబు గడదె♦సం గాఁపరి యా
యొడయండు పాఁపతొడవుల
నిడియెడివే ల్పనఁగ నొప్పు ♦ నీశానుఁ డిలన్. 25

టీ. విడిముడిగల వేలుపుచెలి = కుబేరునకు స్నేహితుఁడు, జడముడి జంగంబు = జడముడిగల జంగము, కడదెసం గాఁపరి యా యొడయండు = కడపటిదిక్కునఁ గాఁపురముండురాజు, పాఁపతొడవుల నిడియెడి వేల్పు =పాములను భూషణములనుగా ధరించినదేవుడు-అన నీ ౪ను ఈశానునిపేళ్లు

STUDENTS LITERARY ASSOCIATION
LIBRARY

క॥ దేవాలయాహ్వయంబులు
కోవెల యన దేవళంబు ♦ గుడి నా వెలయున్
దేవ ళ్ళన జేజే లన
గా వేలుపు లనఁగ వెలయుఁ ♦ గ్రతుభుగాఖ్యల్. 26

టీ. కోవెల, దేవళంబు, గుడి—అన నీ 3 ను దేవతాగృహముల పేళ్ళు. దేవళ్ళు, జేజేలు, వేలుపులు—ఈ 3 ను దేవతల పేళ్ళు.

ఆ॥ క్షితిని బేళ్ళు దనరు ♦ సీదరింపుఁ బెద్ద బల్
పాఁపఱేఁడు వెన్ను ♦ పాను పనఁగ
పుడమితాలు పనఁగఁ దడవుల నిడుపఁడు
చిలువఱేఁ డనంగ ♦ శేషునకును. 27

టీ. సీదరింపుఁబెద్ద = కుబుసము గల పెద్ద, బల్పాఁపఱేఁడు=గొప్ప సర్పరాజు, వెన్నపానుపు = విష్ణువునకుఁ బఱపు, పుడమితాలుపు=భూమిని ధరించినవాఁడు, తడవుల నిడుపఁడు = చిరకాలముండు సర్పము, చిలువఱేఁడు=పాములకు రాజు - అను నీ ౬ ను శేషుని పేళ్ళు.

క॥ మరునయ్యతేజి పులుగుల
దొర పాములవేఁటకాఁడు ♦ తూరుపునాఁ డేల్
దొరబువ్వఁ గొన్నలావరి
గరుటామంతుఁ డన నొప్పు ♦ గరుడుం డభవా. 28

టీ. మరునయ్యతేజి=విష్ణువునకు వాహనము, పులుఁగుల దొర = పక్షులకురాజు, పాముల వేఁటకాఁడు = సర్పములను సంహరించువాఁడు, తూరుపునాఁ డేల్ దొరబువ్వఁగొన్నలావరి = ఇంద్రుని కన్నమైన యమృతమును బుచ్చుకొన్న బలవంతుఁడు, గరుటామంతుఁడు=అధిక బలము గల ఱెక్కలు గలవాఁడు-అను నీ ౫ ను గరుత్మంతుని పేళ్ళు.

ఆ॥ నల్లవలువతాల్పు ♦ తెల్లని మైదంట
వెన్నదొంగయన్న ♦ వెట్టిసీళ్ళ
మేలువాఁడు దుక్కి♦వాలుదాలుపు తాటి
పడగవాఁ డనంగ ♦ బలుఁడు రుద్రి. 29

టీ. నల్లవలువతాల్పు = నల్లని వస్త్రమును ధరించినవాఁడు, తెల్లని మైదంట = తెల్లని శరీరముగల దిట్ట, వెన్నదొంగయన్న = కృష్ణునకు అన్న, వెట్టి నీళ్ళమేలువాఁడు = సురకుఁ బ్రియుఁడైనవాఁడు, దుక్కివాలుదాలుపు = హలాయుధమును ధరించినవాఁడు, తాటి పడగవాఁడు = తాళధ్వజముగల వాఁడు, ఈ ౬ ను బలరాముని పేళ్ళు.

క॥ వడముడి యనఁగా గాడుపు
కొడుకన నివి రెండుఁ బేళ్ళ♦గుఁ భీమునకుం
బుడమిం గట్టి యనం గ
వ్వడి యన వివ్వచ్చుఁ డనఁగ ♦ వాసవి యొంశా. 30

టీ. వడముడి, గాడుపుకొడుకు=వాయువు కుమారుడు, అనగా నీ౨ను భీమునకు పేళ్ళు. కట్టి, కవ్వడి, వివ్వచ్చుఁడు-అన నీ 3 ను అర్జునుని పేళ్ళు.

తే॥ వేలుపుల త్రోవ యుప్పర♦వీది యాక
సంబు విను విన్ను మిను మిన్ను ♦ చదలు నింగి
దివి మొయిలుదారి చుక్కల♦ తెరువు బయలు
గాడ్పుతం డ్రిన నభ మొప్పు ♦ గరళకంఠ. 31

వేలుపులత్రోవ= దేవతలకు మార్గము, ఉప్పరవీది = పై నుండెడు వీథి, ఆకసంబు, విను, విన్ను, మిను, మిన్ను, చదలు, నింగి, దివి, మొయిలు దారి=మేఘములకు మార్గము, బయలు, గాడుపుదండ్రి=వాయువునకుఁ దండ్రి ఈ ౧౪ ను ఆకాశమునకుఁ పేళ్ళు.

తే॥ వెలయు ధరణిఁ జతుర్దిశల్ ♦ నలుగడ లన
నలరు దచ్చికడ లన ది♦శాష్టకంబు
దనరు నీరైదుకడలు నా♦దశదిశలును
మౌళిధృతగంగ యంగజ♦మదవిభంగ. 32

టీ. నలుగడలు = నాలుగుదిక్కులు, దచ్చికడలు = ఎనిమిదిదిక్కులు, ఈరైదుకడలు = పది దిక్కులు.

ఆ॥ తాటిసిడమువాని ♦ తల్లి కూఁతురిబిడ్డ
వెన్నునడుగుపాప ♦ మిన్నువాఁక
వేల్పుటేఱు గడలి♦వెలఁదుక ముత్త్రోవ
ద్రిమ్మరనఁగ నొప్పు ♦ దివిజగంగ. 33

టీ. తాటిసిడము వానితల్లి=భీష్మునకుఁ దల్లి; కూఁతురిబిడ్డ = కూఁతురైనలక్ష్మికిఁ గూఁతురు, వెన్నునడుగుపాప=విష్ణుపాదమునందుఁ బుట్టిన చిన్నది, మిన్నువాఁక=ఆకాశమందుండునది. వేల్పుటేఱు=దేవతలయొక్క నది, కడలివెలఁదుక=సముద్రమునకు భార్య, ముత్త్రోవ ద్రిమ్మరి=మూఁడు మార్గములఁ దిరుగునది—అనఁగ నీ 2 ను ఆకాశగంగకుఁ బేళ్లు.

తే॥ వేలుపులగౌరు చౌదంతి ♦ వెల్లయేనుఁ
గనఁగ నైరావతంబున ♦ కాఖ్య లమరు
వేల్పుదొరతేజి యనఁగను ♦ వెల్లగుఱ్ఱ
మనఁగ నుచ్చైశ్శ్రవం బొప్పు ♦ నంబికేశ. 34

టీ. వేలుపులగౌరు=దేవతలయొక్క గజము, చౌదంతి = నాలుగు దంతములు గలది, వెల్ల యేనుఁగు=తెల్లయేనుగు—అన నీ 3 ను దేవేంద్రుని యేనుఁగుపేళ్ళు, వేల్పుదొరతేజి=ఇంద్రునియొక్క గుఱ్ఱము, వెల్లగుఱ్ఱము=తెల్లగుఱ్ఱము—అనగ నీ 3 దేవేంద్రునిగుఱ్ఱముపేళ్ళు.

ఆ॥ పుడుకుఁ దోడుకు వేలు♦పులగిడ్డి వెలిమొద
వనఁగఁ గామధేను ♦ వలరు చుండుఁ
గల్పకంబు దనరు ♦ వేల్పుఁజెట్టీవుల
మ్రాను వెల్లమ్రాను ♦ నా నుమేశ. 35

టీ. పుడుకుఁదోడుకు=అభీష్టముల నిచ్చెడియావు, వేలుపులగిడ్డి = దేవతలయొక్క యావు, వెలిమొదవు=తెల్లనియావు—అన నీ 3 ను కామధేనువుపేళ్ళు. వేల్పుఁజెట్టు=దేవతలయొక్క వృక్షము, ఈవులమ్రాను = అభీష్టముల నిచ్చువృక్షము, వెల్లమ్రాను=తెల్లనివృక్షము—అన నీ 3 ను కల్పవృక్షమునకుఁ బేళ్ళు.

ఆ॥ అవని గుదుసుకైదు ♦ వనఁగ వేయంచుల
కైదు వనఁగ జుట్టుఁ ♦ గైదు వనఁగ
బటువుఁగైదు వనఁగ ♦ బరఁగు సుదర్శన
చక్రమునకుఁ బేళ్లు ♦ చంద్రమౌళి. ✓ 36

టీ. గుదుసుకైదువు=గుండ్రమైనయాయుధము, వేయంచులకైదువు= వేయి మొనలు గల యాయుధము, చుట్టుఁగైదువు=వలయాకృతి గల యాయుధము. బటువుఁగైదువు=దృఢమైన యాయుధము—అనఁగా నీ ౪ ను విష్ణుచక్రమునకుఁ బేళ్లు.

ఆ॥ వలమురి యనఁ జుట్టు♦వాలుజోడనఁ గల్మి
కొమ్మమగనిబూర♦గొమ్మనంగఁ
దనరుఁ బాంచజన్య♦మునకు నభిఖ్యలు
ధృతకురంగ ధవళ ♦ వృషతురంగ. 37

టీ. వలమురి = దక్షిణముగాఁ దిరిగినది. చుట్టువాలుజోడు=చక్రమునకు జత, కల్మికొమ్మమగనిబూరగొమ్ము=లక్ష్మీపతి పూరించువాద్యవిశేషము—అన నీ 3 ను విష్ణుశంఖమునకుఁ బేళ్ళు.

తే॥ రిక్కలనఁ జుక్క లనఁగను ♦ ఋక్షములకు
నాఖ్య లై యొప్పుఁ దెఱగంటి ♦ యున్ను లనఁగ
నచ్చర లనంగ వేలుపు ♦ మచ్చెకంటు
లనగ సురకాంతలకు నాఖ్య ♦ లగు గిరీశ. 38

టీ రిక్కలు, చుక్కలు—అన నీ ౨ ను నక్షత్రములకు పేళ్లు. తెఱగంటియున్నలు=రెప్పపాట్లులేని స్త్రీలు, అచ్చరలు, వేలుపు మచ్చెకంటులు—అనఁగ నీ 3 ను దేవకాంతలకు పేళ్ళు.

తే॥ పవలు పగ లనఁ బే ళ్లొప్పు ♦ దినమునకును
రాత్రిపే ళ్లొప్పు రే రేయి ♦ రాతి రనగ
వెలయు చుండును రేయెండ ♦ వెన్నె లనఁగఁ
జంద్రికకును సమాఖ్యలు ♦ చంద్రమౌళి. 39

టీ. పవలు, పగలు—ఈ ౨ ను పగటిపేళ్ళు. రే, రేయి, రాతిరి—ఈ 3 ను రాత్రిపేళ్ళు. రేయెండ, వెన్నెల—ఈ ౨ ను వెన్నెలపేళ్ళు.

క॥ మించు లన మెఱుపు లనఁగను
జంచలలకుఁ బేళ్లు దనరు ♦ *జన మంభోభృ
త్సంచయములఁ బలుకు మొయి
ళ్ళంచు మొగు ళ్ళంచు మబ్బు ♦ లంచుఁ భర్గా. 40

టీ. మించులు, మెఱుపులు—అన నీ ౨ ను మెఱుపులకుఁ బేళ్ళు. మొయిళ్ళు, మొగుళ్ళు, మబ్బులు—అన నీ 3 మేఘముల పేళ్ళు.

క॥ ♦ తొలుచదువులు ప్రాఁజదువులు
దొలుమినుకులు ప్రామినుకులు ♦ దొలుపలుకులు ప్రాఁ

*"జలధరములు రా,ణించుం బలుకంగ మొయి, ళ్ళంచు-అని పాఠాంతరము.
♦తొలఁచదువులు మొదలుకొని ప్రాఁబలుకులువఱకుఁగల ౬ పదములకును మొదటివిద్య లని యర్థము.

బలుకులు పెనుమినుకులు నా
వెలయుఁ శ్రుతులకును బేళ్లు ♦ విశ్వాధిపతీ. 41

టీ. తొలు చదువులు, ప్రాఁజదువులు, తొలుమినుకులు, ప్రాఁమినుకులు, తొలుపలుకులు, ప్రాఁబలుకులు, పెనుమినుకులు, ॥పా॥ పెనఁబలుకులు = విస్తార మయిన వాక్యములు — అనఁగా నీ ౭ యును వేదముల పేళ్లు.

క॥ ఇది దేవవర్గు దీనిం
జదివిన వ్రాసినను వినిన ♦ జనులకు నిత్యా
భ్యుదయంబు లొసఁగు చుండును
వదలక కాశీనివాస♦వాసుఁడు పేర్మిన్. 42

---

## మా న వ వ ర్గు

తే॥ పాఱుఁ డనఁగఁ బుడమివేల్పు ♦ బాఁపఁ డనఁగ
జన్నిగట్టన విప్రుండు జగతిఁ ♦ బరఁగు
నొడయఁ డేలిక యెకిమీఁడు ♦ పుడమిఱేఁడు
ఱేఁడు దొర సామి యన నొప్పు ♦ నృపతి పేళ్లు. 1

టీ. పాఱుఁడు, పుడమివేల్పు=భూదేవుఁడు, బాఁపఁడు, జన్నిగట్టు=యజ్ఞోపవీతమును ధరించినవాఁడు—అను నీ ౪ ను బ్రాహ్మణుని పేళ్ళు ఒడయఁడు, ఏలిక, ఎకిమీఁడు, పుడమిఱేఁడు=భూమికధిపతి, సామి, దొర, ఱేఁడు—అన నీ ౭ ను రాజు పేళ్ళు.

సీ॥ కోమట్లు మూఁడవ ♦ కొలమువాం డ్రన బేరు
లన వైశ్యనామముల్ ♦ దనరుఁ గాఁపు

వాండ్రు నా నాలవ • వాండ్రు నా బలిజె వాం
డ్రనఁ జను శూద్రసంజ్ఞాహ్వయములు
వడుగు నా గోఁచిబాఁపఁడు నాఁగ బ్రహ్మచా
రికిఁ బేళ్లు నడచు ధారిత్రియందు
నాలుబిడ్డలు గల • యతఁడిలుఱేఁడు గే
స్తన నొప్పుఁ బేళ్లు గృహాధిపతికి
ఆ॥ నడవిమనికిపట్టు • జడదారి యన వన
వాసి యొప్పు నిల్లువాసి తిరుగు
బోడ తపసి కావి • పుట్టగోఁచుసామి
యన యతీంద్రుఁ డలరు • నలికనేత్ర. 2

టీ. కోమట్లు, మూఁడవకొలమువాండ్రు, బేరులు — ఈ 3 ను వైశ్య నామములు. కాఁపువాండ్రు, నాలవవాండ్రు, బలిజెవాండ్రు — ఈ 3 ను శూద్రులకుఁ బేళ్లు. వడుగు, గోఁచిబాఁపఁడు = కౌపీనముగల బ్రాహ్మణుఁడు — ఈ ౩ ను బ్రహ్మచారికిఁ బేళ్లు. ఆలుబిడ్డలు గలయతఁడు = దారాపత్యములు గలవాఁడు. ఇలుఱేఁడు = గృహాధిపతి, గేస్తు — ఈ 3 ను గృహస్థుని పేళ్లు. అడవిమనికిపట్టు = అరణ్యము నివాసస్థానముగాఁ గలవాఁడు, జడదారి = జడలను ధరించినవాఁడు — ఈ ౩ ను వానప్రస్థుని పేళ్లు. ఇల్లువాని తిరుగు = ఇల్లు విడిచి తిరుగువాఁడు, బోడ, తపసి, కావిపుట్టగోఁచులసామి = కాషాయకౌపీనములు గలవాఁడు — ఈ ౮ ను సన్న్యాసి పేళ్లు.

సీ॥ అమ్మ నాఁ దల్లి నా • నవ్వ నాఁ గన్నది
యన మాతృకాఖ్యలౌ • నభ్రకేశ
యబ్బ నాయన యయ్య • యనఁ దండ్రి యన నప్ప
యన జనకాఖ్యలౌ • నగనివేశ
తోఁడఁబుట్టనఁగ నైదోడు తోఁబుట్టిన
సోదరాహ్వయములౌ • నాదిదేవ

భర్తృసహోదరు•భార్యకుఁ దోడికో
డలన నేరా లన • నలరు సభవ

తే॥ చెలియ లనఁ జెల్లె లనఁగను • వెలయుఁ దుండు
నామద్వయములు కనిష్ఠక•న్యకు గిరీశ
జ్యేష్ఠకన్యకు నాఖ్య లై • తొంటిని వెలయు
నప్ప యన కక్క యనఁగఁ జం•ద్రార్ధమకుట. 8

టీ. అమ్మ, తల్లి, అవ్వ, కన్నది—అనఁగా నీ ౪ను మాతృనామంబులు. అబ్బ, నాయన, అయ్య, తండ్రి, అప్ప—అన నివి ౫ను పితృనామంబులు, తోఁడబుట్టు, ॥ పా॥ తోఁడఁబుట్టుగు, తోఁడఁబుట్టువు, సైదోడు, తోఁబుట్టు, ॥పా॥ తోఁబుట్టువు—అన నీ ౩ ను సోదరనామంబులు. తోడికోడలు=తనకు సమాన మైనకోడలు, ఏరాలు—అన నివి ౨ను పెనిమిటి తోఁ బుట్టినవానిభార్యకుఁ బేళ్ళు. చెలియలు, చెల్లెలు—అన నీ ౨ను కనిష్ఠకన్యకుఁ బేళ్ళు. అప్ప, అక్క,—అను నీ ౨ను జ్యేష్ఠకన్యకకుఁ బేళ్ళు.

సీ॥ ముగ్ధకుఁ బేళ్లగు • ముగుద యనఁగ ముద్ద
రాలు నా గోల నా • బేల యనఁగ
గట్టివాయి యనంగ • గయ్యాళి యన బాఁగ
యన ధూర్తసతికి నా•మ ద్వయము లమరు
నైదువ నాఁగ ము•త్తైదువ నా నయి
దువరాలు నాఁ బుణ్య • యువతి వెలయు
మృతచిరంటికి నాఖ్య • లెసఁగుఁ బేరంటాలు
నాఁగను జక్కని • నా ధరిత్రి

తే॥ గేస్తురా లను నాఖ్యచే • గృహిణి వెలయు
నాలు పెండ్లాము రాణి యి•ల్లా లనంగ

భార్య దనరును దొత్తన • బానిసె యన
వరవు డన దాసి కాఖ్య లౌ • గరళకంఠ. 4

టీ. ముగుద, ముద్దరాలు, గోల, బేల — అన నీ ౪ ను ముగ్ధస్త్రీకి పేళ్ళు. గట్టివాయి = గట్టినోరుగలది, గయ్యాళి, జాఁగ — అన నీ ౩ ను ధూర్తస్త్రీ పేళ్ళు. ఐదువ, ముత్తైదువ, ఐయిదువరాలు — అన నీ ౩ ను పుణ్యస్త్రీకిఁ బేళ్ళు. పేరఁటాలు, జక్కని — అన నీ ౨ ను గరిందిన ముత్తైదువ పేళ్ళు. గేస్తురాలు = గృహస్తురాలు. ఆలు, పెండ్లాము, రాణి, ఇల్లాలు — అన నీ ౪ ను భార్యకుఁ బేళ్ళు. తొత్తు, బానిస, పరవుడు — అన నీ ౩ ను దాసికిఁ బేళ్ళు.

సీ॥ కన్నియ కన్నె నాఁ • గన్యకుఁ బేళ్లొప్పు
జవరాలు కొమరాలు • జవ్వని యనఁ
దనరు యువతి ప్రౌఢ • యన కట్టివయసుది
యనఁ బ్రౌఢ దాల్చు నీ•యాహ్వయములు
ముసలి మిండలకోర • ముప్పదియాతేండ్లు
చనినది యనుపేళ్ల • నెరయు లోల
ముసలిది ముదుసలి • ముదియ పెద్దన వివి
యాఖ్యలై తనరు వృ•ద్ధాంగనకును

ఆ॥ చెడిప అంకులాఁడి • చెడ్డతొయ్యలి వెలి
చవులు గనిన దనఁగ • జార దనరు
నిలను విటులదూత • యెడకాఁడు కుంటెన
కాఁ డనంగఁ దనరు • గరళకంఠ, 5

టీ. కన్నియ, కన్నె — అన నీ ౨ కన్య పేళ్ళు. జవరాలు, కొమరాలు, జవ్వని — అన ౩ ను యౌవనము గలస్త్రీ పేళ్ళు. ప్రౌఢ, గట్టి వయసుది = దృఢ మైనవయస్సు గలది — అన నీ ౨ ను ప్రౌఢస్త్రీ పేళ్ళు. ముసలి

మిండలకోర, ||పా|| మిండలకోరి, ముప్పదియాేండ్లు చనినది=ముప్పదియేరా
డుసంవత్సరములవయస్సు చెల్లినది—అను నీ 3 ను లోలస్త్రీపేళ్ళు. ముస
లిది, ముదుసలి, ముదియ, పెద్ద—అన నీ ౪ ను వృద్ధస్త్రీ పేళ్ళు. చెడి
ప=చెడినది, అంకులాఁడి=వ్యభిచరించినది, కొడతోయ్యాలి=చేడిపోయిన
స్త్రీ, తెలిచవుఁగనినది=జారభావములను గ్రహించినది—అన నీ ౪ ను
జారస్త్రీపేళ్ళు. ఎడకాఁడు, సంకెనకాఁడు=విటీవిటులను సమకూర్చు
వాఁడు—అన నీ ౨ ను విటులదూత పేళ్ళు.

తే|| వేల్పుబానిసె వెలయాలు • వేల్పుకత్తె
లంజె బోగముచాన వె • ల్లాటకత్తె
పడుపుఁజెలి యాటచేడియ • గడనకత్తె
యనఁగ నివి వేశ్య కాఖ్య లౌ • నగనివేశ, 6

టీ. వేల్పుబానిసె=దేవతలకుబానిసె, వెలయాలు=వెలకువచ్చుస్త్రీ
స్త్రీ, వేడ్కకత్తె=వేడుకగలది, లంజె, బోగముచాన=భోగారమైనస్త్రీ,
వెల్లాటకత్తె, ||పా|| వెల్లాటకత్తె=మిక్కిలి నాట్యముజేయునది, పడుపుఁ
జెలి, ఆటచేడియ=నాట్యముజేయుస్త్రీ, గడనకత్తె=ధనమును గడించు
నది—ఈ ౧౦ యును వేశ్యకుఁ బేళ్ళు.

ఆ|| వెచ్చకాఁడు బొజుఁగు • వేడుకకాఁడు మిం
డండు ననుపుకాఁడు • మిండగీఁడు
లంజెకాఁడు నా ధ•రం జనుఁ బల్లవ
నామధేయములు పి•నాకహస్త. 7

టీ. వెచ్చకాఁడు=సొమ్మిచ్చువాఁడు, బొజుఁగు, వేడుకకాఁడు=
విలాసముగలవాఁడు, మిండఁడు, ననుపుకాఁడు=మృదువైనవాఁడు, మిండ
గీఁడు, లంజెకాఁడు=లంజగలవాఁడు—ఈ ౭ ను విటునిపేళ్లు.

ఆ|| కోడెకాఁ డనంగ • గోవాళ్లు నాఁగను
యువజనాఖ్య లొప్పు • చుండు రెండు

నాగవాస మనఁగ ♦ నామమౌ వేశ్యాజ
నంబు మేళమునకు ♦ నంబికేశ.

టీ. కోడెకాఁడు = యౌవనముగలవాఁడు, గోవాళ్లు — ఈ ౨ ను యౌవనవంతుని పేళ్లు. నాగవాసము = వేశ్యాజనముల మేళము.

సీ. నెలతుఁక కాల్గంటి ♦ పొలఁతుక ముద్దియ
వాలుఁగంటి మగువ ♦ పడఁతి మడఁతి
చెలి మచ్చెకంటి యు♦గ్మలి యింతి తొయ్యలి
నవలా కలువకంటి ♦ నాతి గోతి
పూఁబోఁడి చిగురాకు♦బోఁడి పైదలి మించు
బోఁడి ముద్దులగుమ్మ ♦ పొలఁతి కొమ్మ
ప్రోయాలు ఉవిద తీఁగె♦బోఁడి చేడియ యించు
బోఁడి యన్నువెలంది ♦ బోటి జోటి
తే. చాన తెఱవ వెలఁదుక ♦ చాను లేమ
చెలువ యెలనాగ చిలుకల♦కొలికి కలికి
తలిరుబోఁడి యలరుబోఁడి ♦ నెలత పొల్తి
గరిత యతివ నా స్త్రీసమా♦ఖ్యలు మహేశ. 9

టీ. నెలఁతుక, కాల్గంటి = చంచలములగు నేత్రములు గలది, పొలఁతుక, ముద్దియ, వాలుఁగంటి = విశాలనేత్రములు గలది, మగువ, పడఁతి, ॥పా॥ పణఁతి, మడఁతి, చెలి, మచ్చెకంటి = మత్స్యములవంటి నేత్రములు గలది, ఉగ్మలి, యింతి, తొయ్యలి, నవలా, కలువకంటి = కలువలవంటి నేత్రములు గలది, నాతి, గోతి, పూఁబోఁడి = పుష్పమువలె మృదువైన శరీరము గలది, చిగురుటాకుబోఁడి = చిగురుటాకువలె మృదువైన దేహముగలది, పైదలి, మించుబోఁడి = మెఱుపువలెఁ బ్రకాశించు దేహముగలది, ముద్దులగుమ్మ = మురిపెముల నిచ్చునది, పొలఁతి, కొమ్మ, ప్రోయాలు, ఉవిద, తీఁగెబోఁడి = తీఁగెవలె మనోజ్ఞమైన మేనుగలది, చేడియ, ఇంచుబోఁడి = చెఱుకువలె

ప్రియమైన మేనుగలది, అన్న, వెలఁది, బోటి, జోటి, చాన, తెఱవ, వెలదుక చామ, శేమ, చెలువ, ఎలనాగ, చిలుకలకొలికి = చిలుకముక్కువంటి కన్నులకొలఁకులు గలది, కలికి, తలిరుఁబోఁడి = చిగురువలె మృదువైన మేను గలది, అలరుఁబోఁడిపుప్పువలె మృదువైన మేనుగలది, నెలఁత, పొల్తి, గరిత, ఆతివ — ఈ ౨౮ స్త్రీకి పేళ్ళు.

తే॥ చెలిమి నేస్తంబు పొందు నా • స్నేహ మలరు
నెచ్చెలి యనుంగు సంగాతి • నేస్తకాఁడు
సంగడీఁ డనఁ జెలికాఁ డ•నంగఁ దనరు
స్నేహితునకు సమాఖ్యలు • శ్రీమహేశ.

టీ. చెలిమి, నేస్తంబు, పొందు — ఈ 3 స్నేహమునకుఁ బేళ్ళు. నెచ్చెలి, అనుంగు, సంగాతి, నేస్తకాఁడు, సంగడీఁడు చెలికాఁడు — ఈ ౬ను స్నేహితునకుఁ బేళ్ళు.

సీ॥ దొంగ తెక్కలికాఁడు • దొరకోలు సన్యాసి
మ్రుచ్చుత్రుబఁకాఁడు • ముడియవిడుపు
తెరువాటుకాఁడు క•న్నెరదొంగ చేవాఁడి
కాఁడు పల్లడికాఁడు • కన్నగాఁడు
మునిముచ్చు గడిదొంగ • యనఁ దస్కరాఖ్యలౌ
జెండిపోతు గరాసు • మొండికట్టె
టకటొంకు టాటోటు • టక్కులాఁడు పిసాళి
టక్కరి ముడికాఁడు • తవళికాఁడు

తే. కల్లరియు గొంటు కైలాట•కాఁడు చెడుగు
బేరజము కుచ్చితుఁడు దోస•కారి చెనఁటి
పాలసుఁడు నాలిబూతంబు • పలువ తులువ
కూళ గడు సన వర్తిల్లుఁ • గుజను పేళ్లు. 11

టీ. దొంగ, తెక్కలికాఁడు = బందిపోటు వేయువాఁడు, దొరకోలు పన్నాసి = వేషము వేసి నమ్మించి వెఱక సొమ్ము నెత్తుకొనిపోవువాఁడు, మొచ్చు, ఎత్తుబరికాఁడు, ముడియవిడుపు = సొమ్ము ముడి విప్పువాఁడు, తెరువాటుకాఁడు = దారి కట్టి కొట్టి దోఁచుకొనువాఁడు, కత్తెరదొంగ = నగలు కత్తిరించుకొనువాఁడు, చేవాఁడికాఁడు = చేతిబలముగలవాఁడు, వల్లడికాఁడు = కొల్లపెట్టువాఁడు, కన్నగాఁడు = కన్నము వేయువాఁడు, మునిముచ్చు = మునివలెఁ గపటవేషము వేసి యేమరించువాఁడు, గడిదొంగ = ఒళ్ల వెఱఁగిన దొంగ — ఈ ౧౩ను దొంగకుఁ బేళ్ళు. చెండిపోతు = మందబుద్ధి గలవాఁడు, గరాసు, మొండికట్టె = మోఁడితనముఁ జేయువాఁడు, టకటొంకు, టాటోటు, టక్కులాఁడు = అబద్ధములాడువాఁడు, పిసాళి, టక్కరి, ముడికాఁడు, తవళికాఁడు = కపటముగలవాఁడు, కల్లరి = అబద్ధములాడువాఁడు, గొంటు, కైలాటకాఁడు = మాయోపాయముగలవాఁడు, చెనుగు, బేరజము, కుచ్చితుఁడు, ద్రోహకారి, చెనటి, పాలసుఁడు, నాలిబూతకు, పలువ, తులువ, కూళ, గడుసు — ఈ ౨౮ ను కుత్సితజనులకుఁ బేళ్ళు.

ఆ. పాప బుడుత చిఱుత • పట్టి సిసువు కందు
కూన నిసువు బిడ్డ • కుఱ్ఱ బొట్టె
యనఁగ శిశుసమాఖ్య • లగుఁ గొమరుండు నాఁ
గొడుకు నాఁ గుమార•కుండు వెలయు. 12

టీ. పాప, బుడుత, చిఱుత, పట్టి, సిసువు, కందు, కూన, నిసువు, బిడ్డ, కుఱ్ఱ, బొట్టె — ఈ ౧౧ శిశువు పేళ్ళు. కొమరుఁడు, కొడుకు — ఈ ౨ కుమారుని పేళ్ళు.

ఆ. వటుసమాఖ్య లగును • వసుధలోఁ గొండిక
వాఁ డనంగఁ బడుచు•వాఁ డనంగఁ
బిన్నవాఁ డనంగఁ • జిన్నవాఁ డనఁగను
విమత కుఱ్ఱసాథ • చిక్కివాథ.

టీ. కొండికవాఁడు, ॥రూ॥ కొండొకవాఁడు, పసుచువాఁడు, పిన్న వాఁడు, చిన్నవాడు — ఈ ౪ బాలునకుఁ బేళ్ళు.

సీ॥ గిటక పొట్టి కుఱచ • గిట్ట గుజ్జరఁగ వా
మనుఁ డొప్పుఁ జను నప•స్మారి పేళ్లు
నెడఁగు వేఁదుఱు వెఱ్ఱి • వీఱిఁడి వేఱిఁడి
వెంగిలి వెంబర•వి త్తనంగఁ
జతురునకును పేళ్లు • జాణ దంట వలంతి
వెరవరి ప్రోడ నే•ర్పరి యనంగఁ
బ్రన్ననివాఁడు రూ•పరి చూడఁగలవాడు
చక్కనివాఁడు నా • జగతిఁ బరఁగు
తే॥ సుందరాకారవంతుఁడు • సొగసుకాఁడు
వన్నెకాఁ డన శృంగారి • వసుధ వెలయు
నంధకుని పేళ్లు చీకు గ్రు•డ్డనఁగ మూఁగ
మూవ యన మూకనామముల్ • దేవదేవ. 14

టీ. గిటక, పొట్టి, కుఱుచ, గిట్ట, గుజ్జు — ఈ ౫ ను వామనుని పేళ్ళు. వెడఁగు, వేఁదుఱు, వెఱ్ఱి, వీఱిఁడి, వేఱిఁడి, వెంగలి, వెంబరవిత్తు — ఈ ౭ను అపస్మారిపేళ్ళు. జాణ, దంట, వలఁతి, వెరవరి, ప్రోడ, నేర్పరి — ఈ ౬ను జతురునకు పేళ్ళు. ప్రన్ననివాఁడు = సుందరుఁడు, రూపరి = రూపవంతుడు, చూడఁగలవాఁడు, చక్కనివాఁడు = చక్కనైనవాఁడు ఈ ౪ ను సౌందర్యము గలవానిపేళ్ళు. సొగసుకాఁడు = సొగసైనవాఁడు. వన్నెకాఁడు = కాంతిగలవాఁడు — ఈ ౨ను శృంగారవంతుని పేళ్ళు చీకు, గ్రుడ్డి — ఈ ౨ ను అంధకునిపేళ్ళు. మూఁగ, మూవ — ఈ ౨ ను మూకనామంబులు.

క॥ కాయము పేళ్లై వెలయును
మే యన నొడలనఁగ మేను • మెయి యన భోగ్యో

ప్రాయము పేళ్లగుఁ బరువము
ప్రాయము జవ్వన మనంగ • ధ్వజదమనా. 15

టీ. మే, ఒడలుఁ, మేను, మెయి — ఈ ౪ ను శరీరము పేళ్ళు. పరువ
ము, ప్రాయము, జవ్వనము — ఈ 3 ను యౌవనము పేళ్ళు.

తే॥ నెఱులు కురులు వెండ్రుకలు నా • నెఱిక లనఁగఁ
గొప్పు తురుము మన వేనలి • కొప్పెర యనఁ
గేశ ధమ్మిల్లములు మించుఁ • గీలుగంటు
కొప్పుముడి యనంగఁ గేశబంధమ్ముగు భవ. 16

టీ. నెఱులు, కురులు, వెండ్రుకలు, నెఱికలు — ఈ ౪ ను కేశము
లకు పేళ్ళు. కొప్పు, తురుము, వేనలి, కొప్పెర — ఈ ౪ ను ధమ్మిల్లము
నకు పేళ్ళు. కీలుగంటు, కొప్పుముడి — ఈ ౨ ను కేశబంధము పేళ్ళు.

తే॥ నొసలు నెన్నొసల్ నుదురు నెన్నుదు రనంగఁ
దనరు ఫాలంబు చూడ్కి చూపనఁగ నొప్పు
నాహ్వయము లీక్షణమునకు • నక్షికాఖ్య
లలరుఁ గణ్ గను కన్ను నా • నభ్రకేశ. 17

టీ. నొసలు, నెన్నొసలు, నుదురు, నెన్నుదురు — ఈ ౪ ను ఫాల
ము పేళ్ళు. చూడ్కి, చూపు — ఈ ౨ ను ఈక్షణమునకుఁ బేళ్ళు. కణ్, కను
కన్ను — ఈ 3 ను నేత్రమునకుఁ బేళ్ళు.

క॥ వీను లనఁ జెవు లనంగా
జానుగు లన నాహ్వయములు • శ్రవణంబులకుం
గౌ నన నడు మనఁగా నభి
ధానము లగు మధ్యమునకుఁ • దరుణేందుధరా.

టీ. వీనులు, చెవులు, జానుగులు — ఈ 3 ను శ్రవణముల పేళ్ళు.
కౌను, నడుము — ఈ ౨ ను మధ్యమునకు బేళ్ళు.

తే॥ అక్కు ఱొమ్మెద బోర నా • నలరు వక్ష
మాస్యమున కొప్పుచుండు నాఖ్యలు మొగంబు
మోర మోము నన బేళ్లొప్పు • నూరువునకుఁ
బెందొడ యనంగఁ గురువు నా • సందివాహ. 19

టీ. అక్కు, ఱొమ్ము, ఎద, బోర — ఈ 4 ను వక్షస్స్థలమునకు పేళ్ళు. మొగంబు, మోర, మోము — ఈ 3 ను ముఖము పేళ్ళు. పెందొడ, కురువు — ఈ 2 ను ఊరువునకుఁ బేళ్లు.

తే॥ వదనగుహ యొప్పు నోరు నా • వాయి యనఁగఁ
బల్లు పలు నాఁగ దంతంబు • పేళ్లు వెలయుఁ
బెదవి వాతెఱ మోవి యన • న్పేళ్లఁ దనరు
చుండు నోష్ఠంబు శీతాంశు • ఖండమౌళి. 20

టీ. నోరు, వాయి — ఈ 2 ను వదనగుహకుఁ బేళ్లు. పల్లు పలు — ఈ 2 ను దంతము పేళ్ళు. పెదవి, వాతెఱ, మోవి — ఈ 3 ను ఓష్ఠమునకు పేళ్ళు

క. కయి యనఁ గై నాఁ గే లనఁ
జెయి యనఁ జై నాఁగఁ జెయ్యి • చే నా హస్తా
హ్వాయము లగు సన్నుతపూర్ణా
ప్రియవల్లభ కాశికాపు • రీవరనిలయా. 21

టీ. కయి, కై, కేలు, చేయి, చై, చెయ్యి, చే — ఈ 7 ను హస్తమునకు పేళ్ళు.

క॥ ఎద యన డెందం బనఁగా
మది యనఁగా నెడఁ దనంగ • మఱి యుల్లము నా
హృదయమునకు నివి యెసఁగును
విదితంబుగ నాహ్వయములు • విశ్వాధిపతీ. 22

టీ. ఎద, డెందము. మది, ఎడద, ||పా|| ఎద, ఉల్లము—ఈ౫ను హృదయమునకుఁ పేళ్ళు.

క|| లోఁచె య్యన నఱచెయ్యనఁ
గాఁ జెల్లుం బేళ్ళు రెండు • కరతలమునకుఁ
మీఁజెయ్యనఁ బెడచె య్యనఁ
గాఁ జనుఁ గరచరమభాగ • నామములు శివా. 23

టీ. లోచెయ్యి = లోపలగా నుండెడిచెయ్యి, అఱచెయ్యి = లోపలిచెయ్యి — ఈ౨ను కరతలమునకుఁ బేళ్ళు. మీఁజెయ్యి = మీఁదుగా నుండెడుచెయ్యి, పెడచెయ్యి = పెడగా నుండెడిచెయ్యి — ఈ౨ను కరచరమభాగము పేళ్ళు.

ఆ|| పొట్ట డొక్క కడుపు • బొజ్జ బొఱ్ఱ యనంగ
నొప్పు చుండు నాఖ్య • లుదరమునకు
నాభిబిలమునకును • నామధేయము లగు
బొడ్డు నాఁగ మఱియుఁ • బొక్కి లనఁగ. 24

టీ. పొట్ట, డొక్క, కడుపు, బొజ్జ, బొఱ్ఱ — ఈ౫ను ఉదరము పేళ్ళు. బొడ్డు, పొక్కిలి—ఈ౨ను నాభిబిలమునకుఁ బేళ్ళు.

తే|| వెన్న నంగను వీఁపు నా • వెనుకమేను
నాఁగఁ జగమాంగమున నొప్పు • నామములుగఁ
బుఱ్ఱె తలపాల నాఁ బుర్క • పుఱియ నాఁగఁ
ఫాలమున కాఖ్య లై యొప్పు • ఫాలనేత్ర. 25

టీ. వెన్ను, వీఁపు, వెనుకమేను — ఈ 3 ను పృష్ఠభాగము పేళ్ళు. పుఱ్ఱె, తలపాల, పుర్క, పుఱియ — ఈ౪ను ఫాలమునకు బేళ్ళు.

క|| అడు గంజ హజ్జ యనఁగాఁ
బుధవిఁ బదంబునకు నాఖ్య•ములు విలసిల్లున్

మెడ కుత్తు కట్టు గొంతు తన
పడరు గళంబునకుఁ బేళ్లు • సంగధ్వాంసీ. 26

టీ. అడుగు, అంజ, పజ్జ — ఈ౩ను పాదమునకుఁ బేళ్ళు. మెడ, కుత్తుక, అట్టు, గొంతు — ఈ౪ను గళంబునకుఁ బేళ్ళు.

ఆ॥ బువ్వ వంటకంబు • బోనంబు మెతుకు కూ
డోగిరము పసాద • మోరె మనఁగ
నన్న మొప్పుఁ జేల • మలరుఁ బుట్టంబు దు
వ్వాలువ చీర కోక • వలువ యనఁగ. 27

టీ. బువ్వ, వంటకము, బోనము, మెతుకు, కూడు, ఓగిరము, పసాదము, ఓరెము — ఈ ౮ అన్నమునకుఁ బేళ్ళు. పుట్టము, దువ్వాలువ, చీర, ॥పా॥ చీరె, కోక, వలువ — ఈ౬ను వస్త్రమునకుఁ బేళ్ళు.

తే॥ మెసవె నారోగిణ మొనర్చె • మెక్కెఁ దినియెఁ
కుడిచె నారగించెను బసా • పడియె నమలె
సాపడె ననంగ నొప్పు భో • జనము సేసె
ననుట కివి యాఖ్యలై యాశ • యభ్రకేశ. 28

టీ. మెసవె, ॥పా॥ మెసఁగె, ఆరోగిణమొనర్చె, ॥పా॥ ఆరోగణ మొనర్చె, మెక్కె, తినియె, కుడిచె, ఆరగించె, పసాపడియె, నమలె, సాపడె — ఈ౧౧ను భోజనముచేసె ననుటకుఁ బేళ్ళు.

క॥ నాన యన సిగ్గు సిబ్బితి
నా నివి వ్రీడాపదంబు • నామంబు లగుఁ
బానము సేయుట పేళ్లగు
నానుట త్రావు టనఁ ద్రాగుఁ • టనఁ గ్రోలు టనన్. 29

టీ. నాన, సిగ్గు, సిబ్బితి — ఈ౩ను లజ్జకుఁ బేళ్ళు. ఆనుట, త్రావుట, త్రాగుట, క్రోలుట — ఈ ౪ను పానము సేయుటకుఁ బేళ్ళు.

ఆ॥ తళియ పళ్లెరంబు • తెలె హరివాణంబు
తట్ట కంచ మనఁగఁ • దనరుఁ బాత్రి
చెల్లుఁ జషకమునకుఁ • బేళ్ళు దబ్బర కోర
గిన్నె యనఁగ రజత•గిరినివాస 30

టీ. తళియ, పళ్లెరము, తెలె, హరివాణము, తట్ట, కంచము— ఈ౬ను భోజనపాత్రి పేళ్ళు. దబ్బర, ॥పా॥ దబుర, కోర, గిన్నె— ఈ౩ను పానపాత్రికుఁ బేళ్ళు.

తే॥ నతికిఁ బేళ్లొప్పు జోత దం•డము జొహారు
మ్రొక్కు జేజే యనంగఁ గేల్•మోగిచెఁ గొలిచె
నెఱఁగెఁ జేమోడ్చె నన నమ•స్కృతి యొనర్చె
ననుట కివి యాఖ్యలగు నీశ • యభ్రకేశ. 31

టీ. జోత, దండము, జోహారు, మ్రొక్కు, జేజే— ఈ౫ను నమస్కారము పేళ్ళు. కేల్మోగిచె=చేతులుజోడించె, కొలిచె, ఎఱఁగె, ॥రూ॥ ఎరగె, చేమోడ్చె=చేతులు ముకుళింగెను— ఈ౪ను నమస్కారము చేసె ననుటకుఁ బేళ్ళు.

తే॥ ఒప్పు శయనించుటకును బ•న్నుండెఁ బండె
బవ్వడించెఁ బరుండెను • బవ్వళించె
నత్తమిల్లె ననఁగ మఱి • మెత్త సెజ్జ
పఱుపు పాన్పనఁ దగుఁ శయ్య • ఫాలనేత్ర. 32

టీ. పన్నుండె, ॥పా॥ పండుండె, పండె, పవ్వడించె, పరుండెను, పవ్వళించె, అత్తమిల్లె— ఈ౭ను, శయనించె ననుటకుఁ బేళ్ళు. మెత్త, సెజ్జ, పఱుపు, పాన్పు— ఈ౪ను శయ్య పేళ్ళు.

తే॥ ఒప్పు ధ్వనిపేళ్లు రొద యన • నులివు నాఁగ
నద్దపంగను మ్రోఁత నాఁ • జప్పు డనఁగ

నలుకు డన రోదనము సేసె ♦ ననుట కాఖ్య
లెసఁగు నలిచెను వాపోయె ♦ నేడ్చె ననఁగ. 33

టీ. రొద, ఉలివు, సద్దు, మ్రోఁత, చప్పుడు, అలుకుడు — ఈ ౬ను ధ్వనిపేళ్ళు. అలిచెను, వాపోయెను, ఏడ్చెను — ఈ ౩ను రోదనము చేసె ననుటకుఁ బేళ్ళు.

క॥ అగుఁ బేళ్ళు నీరువట్టన
దగ దప్పియు దూప యనఁగ ♦ దాహంబునకున్
నగవు నగు నవ్వు నవు నా
నగు నాఖ్యలు హాసమునకు ♦ నగజాధీశా. 34

టీ. నీరువట్టు, దగ, దప్పి, దూప — ఈ ౪ను దాహమునకు పేళ్లు. నగవు, నగు, నవ్వు, నవు — ఈ ౪ను హాసము పేళ్ళు.

క॥ చాగము నాఁ బుడుకనఁగా
నీగి యనఁగ నిడుట యనఁగ ♦ నీవి యనంగాఁ
దేగము నాఁ బెట్టుడు నాఁ
ద్యాగమునకు నాఖ్య లగుచు ♦ ధరఁ బరగు శివా. 35

టీ. చాగము, పుడుకు, ఈగి, ఇడుట, ఈవి, తేగము, పెట్టుడు ఈ ౭ను త్యాగము పేళ్ళు.

ఆ॥ ఎలసె బెరసె హత్తెఁ ♦ గలసె నదికెఁ జెందెఁ
బొందె దొరసెఁ గూడె ♦ నొందె నెనసె
ననఁగ సక్తమయ్యె ♦ ననుటకు నివి యాఖ్య
లగు గిరీశ యీశ ♦ యభ్రకేశ. 36

టీ. ఎలసె, బెరసె, హత్తె, కలసె, అదికె, పా॥ అతికె, చెందె, పొందె, దొరసె, కూడె, ఒందె, ఎనసె - ఈ ౧౧ ను సక్తమయ్యె ననుటకుఁ బేళ్ళు.

ఆ॥ ఎడసెఁ బాసె వేఱు • పడెఁ బురివిచ్చె నా
నలరు భేద మయ్యె • ననుట పేళ్లు
స్వవశ మయ్యె ననుట • కవ్వఁ బేళ్లు లోనయ్యె
నగ్గమయ్యె ననఁగ • నసదునేత్రి. 37

టీ. ఎడసె, పాసె, వేఱుపడె, పురివిచ్చె-ఈ ౪ ను భేదమయ్యె ననుటకుఁ బేళ్ళు. లోనయ్యె, అగ్గమయ్యె-ఈ ౨ ను స్వాధీనమయ్యె ననుటకుఁ బేళ్లు.

ఆ॥ అగు గృహీత మయ్యె • ననుటకుఁ బేళ్ళగ
పడియెఁ జేపడియెను • బట్టువడియెఁ
జిక్కువడియెఁ దగిలెఁ • జిక్కెఁ దగుల్పడె
ననఁగ నగనివేశ • యభ్రకేశ. 38

టీ. అగపడియె, చేపడియె, పట్టువడియె, చిక్కువడియె, తగిలె, ||పా|| తవిలె, చిక్కె, తగుల్పడె-ఈ ౮ ను గృహీత మయ్యె ననుటకు బేళ్లు,

తే॥ అనియె నొడివె వక్కాణించె • నాడెఁ జెప్పె
వినిచె వాక్రుచ్చెఁ బలికె నాఁ • జను వచించె
ననుట కాలించె నాలకిం • చెను వినె నన
నలరు నవధరించె నటంట • కాఖ్య లీశ. 39

టీ. అనియె, నొడివె, వక్కాణించె, ఆడె, చెప్పె, వినిచె, వాక్రుచ్చె, పలికె-ఈ ౮ యును వచించె ననుటకుఁ బేళ్ళు. ఆలించె, ఆలకించెను, వినెను-ఈ ౩ ను అవధరించె ననుటకుఁ బేళ్లు.

క॥ కనియెను జూచెను కాంచెను
కనుఁగొనె గన్గొనె ననంగఁ • గలయవి పేళ్లై
చను వీక్షించె నటంటకు
ఘనతర గోరాజగమన • కాయజదమనా. 40

టీ. కనియె, చూచె, కాంచె, కనుఁగొనె, కన్గొనె-ఈ ౫ను వీక్షించె ననుటకుఁ బేళ్ళు.

క॥ చనుఁ గృతగమనుఁడ నయ్యెద
ననుటకు నామంబు లగుచు • నవని నరిగెదం
జనియెదఁ బోయెద నేఁగెదఁ
బనివినియెద ననెడునట్టి • పలుకులు ధరాత్రి. 41

టీ. అరిగెద, చనియెద, పోయెద, ఏఁగెద, పనివినియెద-ఈ ౫ను కృతగమనుఁడ నయ్యెద ననుటకు బేళ్లు.

ఆ॥ ద్విగుణమున కభిఖ్య • లగు నిబ్బ డిమ్మడి
జంట దంట దుగయు • జమిలి రెట్టి
యినుమడి యన మిథున • మున కాఖ్య లగు జోడు
దోయి కవ యనంగ • ధూతకలుష. 42

టీ. ఇబ్బడి, ఇమ్మడి, జంట, దంట, దుగ, జమిలి, రెట్టి, ॥పా॥ రెంట, ఇనుమడి-ఈ ౮ యును ద్విగుణమునకుఁ బేళ్ళు. జోడు, దోయి, కవ-ఈ ౩ ను మిథునమునకుఁ బేళ్ళు.

సీ॥ ఒం డొక్కఁ డొకటి యొక్కం డన నగు నేక
మీరు రెం డిరు నాఁగ • నెసఁగు ద్వయము
తిగ మూఁడు మూ న్నాఁగఁ • దగుఁ ద్రయి, తీవంచ
నలు నాల్గు చౌ యన • నగుఁ జతుష్క
మెసఁగుఁ జౌవంచ రైదు • దేసనఁ బంచకం
బా ఆరుమూఁ డిత్తి • గనఁగ నొప్పు
షట్కంబు ఋషిసంఖ్య • సత చక్కపగడ యే
డన నొప్పు సప్తసం • ఖ్యకును బేళ్లు

తే॥ దనరు నిరునాలు గెనిమిది • దచ్చి యనఁగ
బరఁగు నీరాలు పండ్రెండు • బార యనఁగ
ద్వాదశమునకు నాఖ్యలు • ధరణియందు
శైలజానాథ ప్రమథసం• చయసనాథ. 43

టీ. ఒండు, ఒక్కఁడు, ఒకటి, ఒక్కండు-ఈ ౪ ను ఏకము పేళ్ళు. ఈరు, రెండు, ఇరు- ఈ 3 ను ద్వయము పేళ్ళు. తిగ, మూఁడు, మూర్-ఈ 3 ను త్రయము పేళ్ళు. తీవంచ=మూఁడునొకటియును, నలు, నాల్గు, చౌ-ఈ ౪ ను చతుష్కము పేళ్ళు. చౌవంచ=నాల్గునొకటియును, [ఐదు, ఏను-ఈ 3 ను పంచకము పేళ్ళు. ఆఱు, ఇరుమూఁడు=రెండుమూళ్ళు, ఇత్తిగ=రెండుమూళ్లు-ఈ 3 ను షట్కము పేళ్ళు. పత, చక్కపగద=ఆఱునొకటియును, ఏడు-ఈ 3 ను సప్తసంఖ్య పేళ్ళు. ఇరునాలుగు=రెండు నాల్గులు, ఎనిమిది, దచ్చి-ఈ 3 ను అష్టసంఖ్య పేళ్ళు. ఈరాఱు=రెండాఱులు, పండ్రెండు, బార-ఈ 3 ను ద్వాదశసంఖ్య పేళ్ళు.

తే॥ జరిగె నూడెను జాఱెను • నుఱికె వెళ్ళెఁ
బాఱెఁ బఱచెను దొలఁగె న • న్పలుకు లెల్ల
నవనిలోనఁ బలాయితుం • డయ్యె ననుట
కాఖ్యలై యొప్పుఁ జంద్రరే• ఖావతంస. 44

టీ. జరిగెను, ఊడెను, జాఱెను, ఉఱికె, వెళ్లె, పాఱె, పఱచె, తొలఁగె-ఈ ౮ యును పలాయితుఁడయ్యె ననుటకుఁ బేళ్ళు.

క॥ వేంచేసెను వచ్చెం జను
దెంచెను విచ్చేసె నరుగు•దెంచె ననఁగ నే
తెంచె నన నయ్యె నాగతుఁ
డంచుం బలుకుటకు నాఖ్య • లంబరకేశ. 45

టీ. వేంచేసెను, వచ్చెను, చనుదెంచెను, విచ్చేసెను, అరుగుదెంచెను, ఏతెంచెను-ఈ ౬ ను ఆగతుం డయ్యె ననుటకుఁ బేళ్ళు.

తే॥ నాఁటిసుత నాఁటనుండియు • నాఁటఁగోలె
నాఁటఁబట్టి నాఁడు మొదలు • నాఁగ నాహ్వ
యమ్ము లయ్యెఁ దదారభ్య • యనుట కవని
వినుతకరుణాసనాథ శ్రీ • విశ్వనాథ. 46

టీ. నాఁటిసుత, నాఁటనుండి, నాఁటఁగోలె, నాఁటఁబట్టి, నాఁడుమొదలు- ఈ ౫ను తదారభ్య యనుటకుఁ బేళ్ళు.

తే॥ వైరమునకును ధర సమా • హ్వయము లమరఁ
గంటు పగ మచ్చరంబు సూ • డొంటమి యన,
వలపు కూరిమి మేలు నా • నలరుఁ బేళ్లు
మోహమునకును శారదాం • బుదనిభాంగ. 47

టీ. కంటు, పగ, మచ్చరము, సూడు, ఒంటమి- ఈ ౫ను వైరముపేళ్ళు, వలపు, కూరిమి, మేలు - ఈ ౩ను మోహము పేళ్ళు,

క॥ పెనఁకువ జగడము కయ్యం
బని బవరము కలను చివ్వ • యాలము పోట్లా
టన దురము పోరు నాఁగాఁ
జను యుద్ధంబునకుఁ బేళ్ళు • చంద్రార్ధధరా. 48

టీ. పెనఁకువ, జగడము, కయ్యము, అని, బవరము, కలను, చివ్వ, ఆలము, పోట్లాట, దురము, పోరు - ఈ ౧౧ను యుద్ధమునకుఁ బేళ్ళు.

ఆ॥ నదమదంబు సేసెఁ • జక్కాడె నుగ్గాడెఁ
జదిపెఁ బీఁచమడఁచెఁ • జంపెఁ గెడపె
నుఱుము చేసెఁ ద్రుంచెఁ • బరిమార్చెఁ దెగటార్చె
మన్నిగొనియెఁ దునిమె • మడిపె ననఁగ

తే॥ హతము గావించె ననుటకు • నాఖ్య లయ్యె
మనిపె నేలెను బ్రతికించె • మంచెఁ బ్రోచె

సాఁకె నన నొప్పు నాఖ్యలు • సరవిఁ బ్రోడ
సరయఁ బోషించె ననుటకు • నంబికేశ. 50

టీ. పదనుడఁబు సేసె, చక్కాడె, నుగ్గాడె, చదిపె, పీఁచమడఁచె, చంపె, కడపె, నుఱుము సేసె, తుత్తుంచె, పరిమార్చె, తెగటార్చె, మన్నిగొనియె, తునిమె, మడిపె - ఈ౧౪ను వధియించె ననుటకుఁ బేళ్ళు. మనిపె, ఏలె, బ్రతికించె, మనిచె, ప్రోచె, సాఁకె - ఈయాఱును పోషించె ననుటకుఁ బేళ్ళు.

క॥ ధరలోఁ శూరాహ్వయములు
పరఁగుఁ దొలి మొనకాఁడనంగ • బంటనఁగాఁ బో
టరి యన వడిగలవాఁ డన
బిరు దన వాఁడిమగఁ డనఁగ • భీమకపర్ది. 51

టీ. మొనకాఁడు, బంటు, పోటరి, వడిగలవాఁడు, బిరుదు, వాఁడిమగఁడు - ఈయాఱును శూరుని పేళ్ళు.

తే॥ బాసట యనంగఁ దోడ్పాటు • నా సమాహ్వ
యంబు లగుచుండు రెండు సా • హాయ్యమునకు
నాఖ్యలు శుభంబునకును ల • గ్గనఁగ బాగ
నంగ మే లన లెస్స య • నంగ నీశ. 52

టీ. బాసట, తోడ్పాటు - ఈ రెండును సాహాయ్యము పేళ్ళు. లగ్గు, బాగు, మేలు, లెస్స - ఈనాలుగును శుభమునకుఁ బేళ్ళు.

ఆ॥ కూలె నీల్గెఁ జచ్చె • గాలంబు సేసెను
గెడసె సమసె నాఱె • మడిసెఁ జెల్లెఁ
బెద్దనిదురవోయె • బిద్దె దొరెను గంతు
గొనియె ననుట పేళ్ళ • గును మృతునకు. 53

టీ. కూలె, నీల్గె, చచ్చె, కాలంబుచేసెను, కడసె, సమసె, ఆఱె, మడిసె, చెల్లె, పెద్దనిదురవోయె, బిద్దె, దొరెను, గంతుగొనియెను - ఈ౧౩ మృతుఁడయ్యె ననుటకుఁ బేళ్ళు.

సీ॥ తిమ్మనైనది యనఁ • దిన్ననైనది యన
జాణైన దనఁగ బా • గైన దనఁగ
నాణెమైన దన వి • న్నాణమైనది యన
మానైన దనఁగ లె • స్సైన దనఁగఁ
బిన్ననైనది యనఁ • జెన్నైన దన నలు
వైనది యనఁగ జె • ల్వైన దనఁగఁ
బొనరినయది యన • నొనరిన దనఁగఁ జొ
క్కటమైన దనఁగఁ జ • క్కని దనంగ
సొబగైన దనఁగను • సొంపైన దనఁ గొమ
రైనది యన గొ • నబైన దనఁగఁ
దోరమైన దన సిం • గారమైనది యన
మేలైన దనఁగ మె • చ్చైన దనఁగ
తే॥ మురువుగలయది యొప్పైన • దొఱపుగలది
యందమైనది తనరిన • దలరినట్టి
దనఁగఁ బరఁగిన దనఁ బేళ్లు • దనరుచుండు
మంజులంబైన దనుటకు • మదనదమన. 54

టీ. తిమ్మనైనది, తిన్ననైనది, జాణైనది, బాగైనది, నాణెమైనది, విన్నాణమైనది, మానైనది, లెస్సైనది, పిన్ననైనది, చెన్నైనది, నలువైనది, చెలువైనది, పొనరినయది, ఒనరినది, చొక్కటమైనది, చక్కనిది, సొబగైనది, సొంపయినది, కొమరైనది, గొనబైనది, తోరమైనది, సింగారమైనది, మేలైనది, మెచ్చైనది, మురువుగలయది, ఒప్పైనది, ఒఱపుగలది, అందమైనది, తనరినది, అలరినట్టిది, పరఁగినది, ఈ 31 మనోజ్ఞమైనది అనుట పేళ్ళు.

తే॥ కపుర మనఁ గప్పురంబనఁ • గప్రి మనఁగఁ
బుడమి గర్పూర మొప్పుఁ దాం • బూల మొప్పు

వీడియము వక్కలాకులు • విడెము తమ్ము
లంబు వీడెంబు వీడ్య మనంబు రారి. 55

టీ. కపురము, కప్పురము, కప్రము—ఈ ౩ ను కర్పూరము పేళ్ళు. వీడియము, ॥రూ॥ విడియము, వక్కలాకులు, విడెము, తమ్ములము, రూ॥ తమలము, వీడెము, వీడ్యము—ఈ ౮ ను తాంబూలమునకుఁ బేళ్ళు.

తే॥ వెలయుచుండును సిరి లచ్చి • కలిమి యనెడు
పేళ్ల సంపద యెద్దడి • పేదఱికము
లేమి నిప్పచ్చరము నెవ్వ • లేమి డనగ
నలరు దారిద్ర్యమునకు నాఖ్యలు గిరీశ. 56

టీ. సిరి, లచ్చి, కలిమి—ఈ ౩ ను సంపదకు పేళ్లు ఎద్దడి, పేదఱికము, లేమి, నిప్పచ్చరము, నెవ్వ, లేమిడి—ఈ ౬ ను దారిద్ర్యమునకుఁ బేళ్ళు.

తే॥ మగతనం బన గండన • మగఁటిమి యనఁ
బౌరుషంబున కాఖ్యలై • పరఁగుచుండు
నుక్కు చేగ దిటము చేవ • యుదుటు గట్టి
దిట్ట ముఱిది బిగువు నాఁగ • ధృతికిఁ బేళ్లు. 57

టీ. మగతనంబు, గండు, మగఁటిమి—ఈ ౩ ను పౌరుషమునకుఁ బేళ్లు. ఉక్కు, చేగ, దిటము, చేవ, ఉదుటు, గట్టి, దిట్టము, ఉఱిది, బిగువు—ఈ ౯ దృఢమునకుఁ బేళ్ళు.

తే॥ బద్దు నా బొంకు నాఁగ దబ్బర యనంగఁ
గల్ల నాఁగ హుళిక్కి నాఁ • జెల్లుఁ బేళ్లు
ధర నసత్యమునకును సత్యంబు పరఁగు
నిజ మనఁగ నిక్కువం బన • నిక్క మనఁగ. 58

టీ. బద్దు, బొంకు, దబ్బర, కల్ల, హుళిక్కి, ॥పా॥ హుళక్కి—ఈ ౬ ను అసత్యమునకుఁ బేళ్ళు. నిజము, నిక్కువము, నిక్కము—ఈ ౩ ను సత్యమునకుఁ బేళ్ళు.

క. బెడఁద దెస చేటు చేడ్పా
టోడ వాత్రిం బంగలార్పు ♦ గోరంబు దొసం
గిడుము వెత కష్టి యంగద
కడగం డ్లనఁ జను విపత్తు ♦ గౌరీరమణా. 59

టీ. బెడఁద, దెస, చేటు, చేడ్పాటు, గోడవ, ఆత్రిమ, అంగలార్పు గోరము, దొసఁగు, ఇడుము, వెత, కష్టి, అంగద, కడగండ్లు-ఈ౧౪ విపత్తు పేళ్ళు.

క॥ వెల జట్టి విలువ రో యనఁ
గల నుడువులు దనరు చుండుఁ ♦ గ్రయనామములై
వెలయంగ వంగసము నాఁ
గోల మన వంగడము నాఁగఁ ♦ గుల మొప్పు శివా.

టీ. వెల, జట్టి, విలువ, రో-ఈ ౪ ను క్రయమునకు పేళ్ళు. వంగసము, కోలము, వంగడము-ఈ 3 ను కులము పేళ్లు. 60

క॥ క్రిమ్మఱ సప్పటి వెండియుఁ
గ్రిమ్మటి తిరుగన్ మఱిన్ మఱల మగుడను నా
నిమ్మహిఁ బునఃపదంబున
కిమ్ముల నివి యాఖ్య లగు మ ♦ హీధరచాపా. 61

టీ. క్రిమ్మఱన్, సెప్పటి, వెండియును, క్రిమ్మటి, తిరుగన్, మఱి, మఱలన్, మగుడన్-ఈ ౮ పునరర్థమునకుఁ బర్యాయములు.

క॥ ఒకమరి యొకపరి యొకమా
టొకసా రొక తేప యనఁగ ♦ నొకపా రనఁగా
నొకవిడుత యొక్కతూ కన
నొకతడవ యనంగ మఱియు ♦ నొకతూరి యనన్. 62

తే॥ ఏకవారం బనుట కొక్క • నిన్ని పేళ్లు
జగతిఁ బల్మారు వేమారు • సారెఁ బెక్కు
మారు లెన్నేనిమార్లనఁ • బరఁగు నాఖ్య
లగుచు నివి బహువారంబు • లనుట కీశ. 63

టీ. ఒకమఱి, ఒకపరి, ఒకమాటు, ఒకసారి, ఒకతేప, ఒకపారి, ఒకవిడుత, ఒక్కతూరు, ఒకతడవ, ఒకతూరి ॥పా॥ ఒకమారు- ఈ ౧౦ ఏకవారమనుటకుఁ బేళ్లు. పల్మారు, వేమారు, సారె, పెక్కుమారులు, ఎన్నేనిమార్లు ఈ౫ను మాటిమాటికి యను నర్థమునకుఁ బర్యాయములు.

తే॥ త్వరితమున కొప్పుఁ బేళ్ళు చెచ్చెరను సరగ
వేగిరము వేగ వేళము • వెసను వడిగ
గ్రక్కునను గ్రద్దన నటంగఁ • గ్రన్న నఁగ
గొబ్బునను దిగ్గున నటంగఁ • గుధరచాప. 64

టీ. చెచ్చెరను, సరగ, వేగిరము, వేగ, వేళము ॥పా॥ వైళము, వెసను, వడిగను, గ్రక్కునను, గ్రద్దనను, గ్రన్నను, గొబ్బునను, దిగ్గునను- ఈ ౧౫ త్వరితమునకుఁ బేళ్లు.

క॥ కలవు వివరింపఁగా నా
ఖ్యలు వరుసన్ నిర్గమించె • ననుటకు ధరలో
వెలువడియె వెళ్ళె వెడలెను
వెలలె నిసం జిత్ప్రశశ • విశ్వాధిపతీ. 65

టీ. వెలువడియె, వెళ్ళె, వెడలెను, వెలలెన్- ఈ ౪ ను నిర్గమించె ననుటకుఁ బేళ్లు.

క॥ వినుతి యొనరించె ననుటకుఁ
దనరున్ నామంబు లగుచు • ధరపై నగ్గిం

చెను గైవారము సేసెం
గొనియాడెను బొగడె ననఁగఁ • గొండాడె ననన్. 66

టీ. అగ్గిచెన, కైవారము సేసెను, కొనియాడెను, పొగడెను, కొండాడెను—ఈ ౫ ను స్తుతించె ననుటకుఁ బేళ్ళు.

సీ॥ చుట్టలు విందులు • చుట్టాలు బందుగు
లనఁ జను బంధుస • మాహ్వయములు
వఱలు నన్యుఁడు లాఁతి • వాఁ డనఁగా వింత
వాఁ డనఁగాఁ బెఱ • వాఁ డనంగ
వ్యాజంబునకు నామ • మా నెపం బనఁగ న
న్వేషించె ననుట కౌ • వెదకె నెమకె
నరసె రోసె ననంగ • నారసెఁ దడవె నాఁ
గాంక్షకుఁ బేరు లౌఁ • గ్రమముతోడఁ
తే॥ గ్రచ్చు కోరికె తమి కోర్కె • యిచ్ఛ యనఁగ
నెపుడు నెడపక యుడుగక • యెల్లపు డన
నిచ్చ యనయంబు నాఁగను • నిచ్చ లనఁగఁ
దనరు నాఖ్యలు సంతతం • బనుట కభవ. 67

టీ. చుట్టలు, విందులు, చుట్టాలు, బందుగులు — ఈ ౪ బంధువుల పేళ్ళు. లాఁతివాఁడు, వింతవాఁడు, పెఱవాఁడు — ఈ ౩ అన్యుని పేళ్ళు. నెపంబు = వ్యాజము, వెదకె, నెమకె, అరసె, రోసె, ఆరసి, తడవె — ఈ ౬ అన్వేషించుటకుఁ బేళ్ళు కఱిచ్చు, కోరికె, తమి, కోర్కె, ఇచ్ఛ — ఈ ౫ ఇచ్ఛకు పేళ్ళు. ఎప్పుడును, ఎడపక, ఉడుగక, ఎల్లప్పుడును, నిచ్చ, అనయమును, నిచ్చలు — ఈ ౭ సతత మనుటకుఁ బేళ్ళు.

సీ॥ తనరుఁ బ్రవేశించె • ననుటకు నాఖ్యలు
తూకొనెఁ జొచ్చెను • దూఱె ననఁగ

నంఘ్రితాడితుఁ జేసె • ననుటకుఁ బేళ్లగుఁ
    దాఁచెఁ గాళ్లంగ్రుమ్మెఁ • దన్నె ననఁగఁ
నాలస్య మొనరించె • ననుటకుఁ జెల్లు నా
    మమ్ములు తడసెను • మసలె ననఁగఁ
ద్యక్తంబు గావించె • ననుటకు నాఖ్యలౌ
    వీడెను వదలెను • విడిచె ననఁగఁ

తే॥ దాఱుమాఱయ్యె వీడ్వడెఁ • దడబడె నన
    నాఖ్య లొప్పు విపర్యస్త • మయ్యె ననుట
    కలరుఁ బరిహరించె ననుట కా•హ్వయము లడిచెఁ
    గొట్టె మొత్తెను మోఁదె నాఁ • గుధరనిలయ.    68

టీ. తూకొనె, చొచ్చె, తూఁగె — ఈ 3 ప్రవేశించె ననుటకుఁ బేళ్లు. తాఁచె, కాళ్లంగ్రుమ్మె, తన్నెను ఈ 3 అంఘ్రితాడితుఁజేసె ననుటకుఁ బేళ్ళు. తడసెను, మసలెను — ఈ 2 ఆలస్యముచేసె ననుటకుఁ బేళ్ళు. వీడెను, వదలెను, విడిచెను — ఈ 3 త్యక్తంబుచేసె ననుటకుఁ బేళ్ళు. తాఱుమాఱయ్యె, వీడ్వడె, తడఁబడె — ఈ 3 విపర్యస్తమయ్యె ననుటకుఁ బేళ్లు. అడిచె కొట్టె, మొత్తె, మోఁదె, ఈ 4 ను పరిహరించె ననుటకు బేళ్ళు.

సీ॥ ముందట నెదుటను • మ్రోల ముంగల నాఁగ
    నాఖ్యలౌ సముఖమం •దనుట కభవ!
యలయిక బడలిక • యలవు సేద యనంగ
    శ్రమమున కాఖ్యలౌ • శమనదమన!
తాళిమి యోరుపు • తాళిక నాఁగను
    క్షమకు నాహ్వయము లౌఁ • జర్మవసన!
తవళి బవంతంబు • టక్కు దుత్తూరంబు
    వెడ్డు నా ఛద్మ మౌ • విషమనేత్ర!

తే॥ వెఱ పనఁగ నెద యనఁగను • వెఱ యనంగ
నళుకు ననఁగ భీతి కాఖ్యలౌ • నసితకంఠ!
నిమ్మళం బన నెమ్మి నా • నెమ్మది యనఁ
దనరుఁ బేళ్లు నిరాతంక•మునకు నీశ. 69

టీ. ముందటను, ఎదుటను, మ్రోలను, ముంగలను - ఈ ౪ సమ్ముఖమునం దనుటకుఁ బేళ్లు. అలయిక, బడలిక, అలపు, సేద - ఈ ౪ ను శ్రమమునకుఁ బేళ్లు. తాళిమి, ఓరుపు, తాలిక - ఈ 3 క్షమకుఁ బేళ్లు. తవలి, బవంతంబు, టక్కు, దుత్తూరము, బెడ్డు, ఈ ౫ కపటతకుఁ బేళ్లు. వెఱపు, ఎద, వెఱ, అళుకు - ఈ ౪ భీతికిఁ బేళ్లు. నిమ్మళంబు, నెమ్మి, నెమ్మది - ఈ 3 నిరాతంకమునకుఁ బేళ్లు

సీ. అనదు కొంచెము సైక • మలఁతి యన్నువ చిన్న
నలికంబు సన్నంబు • నాఁ దనర్చు
స్వల్ప, మెక్కుడు నాఁగఁ • జాల నెంతేనియు
మిగులఁ దద్దయుఁ బద్ద • మిక్కిలి యన
బెద్దయు నను నివి • పేళ్లగు భృశముగా
ననుటకు, నుత్కట • మయ్యెననుట
కగుఁ బేళ్లు వెగ్గలం • బయ్యెఁ గ్రిక్కిరిసె వె
క్కస మయ్యె నను నివి • క్రమముతోడ

ఆ॥ నగ్గఁ గుందె డొంకెఁ • దగ్గెను సడలెను
గ్రుంగె నుబ్బణంగె • సుక్కె ననఁగఁ
దనరుఁ బేళ్లు క్షీణ • దశ నొందె ననుటకు
నీశ్వరీసనాథ • విశ్వనాథ 70

టీ. అపదు, కొంచెము, సైకము, అలఁతి, అన్నువ, చిన్న, నలికము, సన్నము - ఈ ౯ స్వల్పమునకుఁ బేళ్లు. ఎక్కుడు, చాలఁ, ఎంతేనియును,

మిగులను, తద్దయును, తద్ద, మిక్కిలి, పెద్దయును-ఈ ౫ అధికముగా ననుటకుఁ బేళ్ళు. వెగ్గలంబయ్యె, క్రిక్కిరిసె, వెక్కసమయ్యె-ఈ 3 ఉత్కటమయ్యె ననుటకుఁ బేళ్ళు. పగ్గె, కుందె, డొంకె, తగ్గెను, పడలెను, కృంగెను, ఉబ్బణంగె, క్రుస్సిక్కె-ఈ ౮ క్షీణదశఁ బొందె ననుటకు నామములు.

ఆ॥ మించు వాసి మేలు • మేటి పెచ్చెచ్చర
నధికమునకు నాఖ్య • లగుచు వెలయుఁ
బనులు నాఁగఁ జెయువు • లనఁ జేఁత లన నొప్పుఁ
గర్మమునకుఁ బేళ్ళు • చర్మవసన 71

టీ. మించు, వాసి, మేలు, మేటి, పెచ్చు, ఎచ్చు-అనఁగ నీ౬ను అధికమునకుఁ బేళ్ళు. పనులు, చెయువులు, చేఁతలు-ఈ 3 కర్మమునకుఁ బేళ్ళు.

ఆ॥ అనిపె ననిచెఁ బనిపెఁ • బనిచె నంపెను బంపెఁ
బుచ్చె గెలువు రనియెఁ • బొమ్మ టనియె
ననఁగ నివి సమాఖ్య • లగును బ్రస్థాపించె
ననెడు క్రియకు నీశ • యభ్రకేశ. 72

టీ. అనిపె, అనిచె, పనిపె, పనిచె, అంపె, పంపె, పుచ్చె, గెలువుమనియె, పొమ్మటనియె-ఈ౯ ప్రస్థాపించె ననెడు క్రియకుఁ బేళ్ళు.

తే॥ కొదవ కొద కుందు తగ్గు త•క్కువ కొఱంత
వెలితి కొఱ లొచ్చు కడమ నా • వెలయు న్యూన
సమభిధానము లర సాము • సగము సవము
నాఁగ నర్ధాహ్వయంబు లౌ • నాగభూష. 73

టీ. కొదవ, కొద, కుందు, తగ్గు, తక్కువ, కొఱత, వెలితి, కొఱ, లొచ్చు, కడమ-ఈ ౧౦ న్యూనమునకుఁ బేళ్ళు. అర, సాము, సగము, సవము-ఈ ౪ అర్ధమునకుఁ బేళ్ళు.

తే॥ పేళ్లు పశ్చాత్తనుటకును • జెల్లు వెనుకఁ
బిదపఁ దర్వాతఁ బదపడి • పిమ్మట నన
మునుపు మును మున్ను తొలి తొల్లి • ముందు తొలుత
ననఁగఁ బూర్వపదార్థాఖ్య • లౌ గిరీశ. 74

టీ. వెనుకను, పిదపను, తర్వాతను, పదపడి, పిమ్మటను-ఈ 5 పశ్చాత్తనుటకుఁ బేళ్లు, మునుపు, మును, మున్ను, తొలి, తొల్లి, ముందు, తొలుతను-ఈ 8 పూర్వపదార్థమునకుఁ బేళ్లు.

ఆ॥ పాఱుఁబోతు పిఱికి • పంద కోఁచ యనంగఁ
బేళ్లు దనరు సమర•భీరువునకు
దిట్ట యుక్కుతునియ • గట్టిడెందమువాఁడ
నంగ ధైర్యవంతుఁ • డలరు నీశ. 75

టీ. పాఱుఁబోతు, పిఱికి, పంద, కోఁచ-ఈ 4 యుద్ధమున కెఱచెడివాని పేళ్ళు. దిట్ట, ఉక్కుతునియ, గట్టిడెందమువాఁడు-ఈ 3 న్ను ధైర్యవంతుని పేళ్ళు.

తే॥ పౌఁజు చేరువ మొత్తంబు • బారు తుటుము
దండు పరి గమి కూటువ • పిండు దాఁటు
మూఁక దళమును బేళ్లు స•మూహమునకు
భుజగవరహార యవిముక్త•పురవిహార. 76

టీ. పౌఁజు, చేరువ, మొత్తము, బారు, తుటుము, దండు, పరి, గమి, కూటువ, పిండు, దాఁటు, మూఁక, దళము-ఈ 13 సమూహమునకు పేళ్ళు.

సీ॥ పూనె నూనెను దాల్చె • నానెను మోచెనా
వహియించె ననుట కౌ • నహివిభూష

నామము లుచ్చాట•నము చేసె ననుటకు
వరుసతోఁ దఱిమెను • బఱపె వెలిచెఁ
దోలెను ఱొప్పె నా • ద్రుహిణాదిసురనుత!
త్రిప్పెను నాఁ గ్రమ్మ•ఱించె ననఁగ
మగిడించె ననఁగను • మరలించె నన సమా
హ్వయములై పరఁగు ని•వర్తితంబు

తే॥ చేసె ననుటకు సురముని•సిద్ధసేవ్య!
యడ్డగించెను నా నిల్పె • ననఁగ నాఁగె
నన నివారించె ననుటకు • నాఖ్య లమరు
నగసుతానాథ గుహగజా•ననసనాథ. 77

టీ. పూనె, ఊనె, తాల్చె, ఆనె, మోచె-ఈ ౫ వహించె ననుటకుఁ బేళ్ళు. తఱిమెను, పఱపె, వెలిచె, తోలె, ఱొప్పె-ఈ ౫ ఉచ్చాటనము చేసె ననుటకుఁ బేళ్ళు. త్రిప్పె, క్రమ్మఱించె, మగిడించె, మరలించె-యీ ౪ నివర్తితంబు చేసె ననుటకు పేళ్ళు. అడ్డగించెను, నిల్పెను, ఆఁగెను-ఈ 3 నివారించె ననుటకు పేళ్ళు.

తే॥ దండ చేరువ సంగడి • దాపు చెంత
సరస చెంగట యొద్ద డ•గ్గఱ కుఱంగ
టండ పజ్జయు నా సమీ•పాఖ్య లమరు
రమ్యధవళాంగ కలశనీ•రధినిషంగ! 78

టీ. దండ, చేరువ, సంగడి, దాపు, చెంత, సరస, చెంగట, ఒద్ద, డగ్గఱ, కుఱంగట, అండ, పజ్జ-ఈ ౧౨ను సమీపమునకుఁ బేళ్ళు.

తే॥ అచట నచ్చట నచ్చోట • నందు నాడ
నచోట నచ్చోట నక్కడ • నయ్యెడ నట

నసఁగఁ దత్ప్రదేశంబునం • దనుట కాఖ్య
లయ్యె భక్తనిధేయ యా • ర్యాసహాయ. 79

టీ. అచట, అచ్చట, అచ్చోట, అందు, అడ, అచోట, అచ్చోట, అక్కడ, అయ్యెడ, అట-ఈ ౯ తత్ప్రదేశంబునందు అనుటకు పేళ్ళు.

క॥ ఇరుగెలఁకుల నిరువంకల
నిరుదెస నిరుచక్కియందు • నిరుపక్కియలం
దిరుగ్రేవల నిరుగడ నసఁ
బొరిఁ బేళ్ళగు నుభయపార్శ్వ • ముల ననుట కజా.

టీ. ఇరుగెలఁకుల, ఇరువంకల, ఇరుదెస, ఇరుచక్కియందు, ఇరుపక్కియలందు, ఇరుగ్రేవల, ఇరుగడ-ఈ ౭ ఉభయపార్శ్వముల ననుటకుఁ బేళ్ళు.

క॥ నవముగ ధరలో నీమా
నవవర్గవు వేడ్కఁ జదివి • నను వ్రాసిన మా
నవులకు ననవరతంబును
శివుఁ డవిముక్తేశ్వరుండు • చెలువం బొసఁగుత. 81

---

## స్థావరవర్గు

సీ॥ వలిదిప్ప వడఁకుగు • బ్బలి చలిమిరిమల
గట్టులఱేఁడు ము • క్కంటిమామ
మంచుకొండన హిమ • క్ష్మాధరాఖ్యలు చను
వేలుపుఁగొండ జే • జేలగట్టు
పుత్తడిగుబ్బలి • పునుకకంచమువాని
విల్లునా మేరువు • పేళ్ళు వెలయు

వెలిదిప్ప ముక్కంటిమల వెండికొండ నాఁ
గైలాసపర్వతాఖ్యలు సెలఁగు
తే॥ వెలయఁ దరికొండ కవ్వంపుమల యనంగ
మంథరాఖ్యలు కడపటిమల యనంగ
జుట్టుఁగొండనఁ దనరు నీ క్షోణియందుఁ
జక్రవాళాద్రి వృషవాహ శైలగేహ. 1

టీ. వలిదిప్ప = చల్లఁదనముగల కొండ, వడఁకుగుబ్బలి ॥పా॥ వణఁకుగుబ్బలి = చలిచే వడఁకునట్లు చేయుకొండ, చలిమిరిమల, గట్టులఱేఁడు = పర్వతములకు రాజు, ముక్కంటిమామ = శివునకు మామ, మంచుకొండ = హిమము గలపర్వతము - ఈ 8 హిమవత్పర్వతమునకుఁ బేళ్లు. వేల్పుఁగొండ, జేజేలగట్టు (ఈ రెండుశబ్దములకును దేవతలపర్వతమని యర్థము.) పుత్తడిగుబ్బలి = సువర్ణపర్వతము, పసుకకఁచముపానివిల్లు = ఈశ్వరునిధనుస్సు = ఈ 8 మేరుపర్వతము పేళ్లు. వెలిదిప్ప = తెల్లనిపర్వతము, ముక్కంటిమల = శివునిపర్వతము, వెండికొండ = రజతపర్వతము - ఈ 3 కైలాస పర్వతము పేళ్లు. తరిగొండ, కవ్వంపుమల, (ఈ రెండుశబ్దములకుఁ గవ్వమైనపర్వతమని యర్థము) ఈ 2 మందరపర్వతము పేళ్లు. కడపటిమల = కడ గానుండెడు పర్వతము, చుట్టుఁగొండ = భూమిచుట్టునుండెడు పర్వతము - ఈ 2 చక్రవాళపర్వతము పేళ్లు.

ఆ॥ తూర్పుఁగొండ నాఁగఁ దొలుగట్టు నాఁగను
బొడుపుగుబ్బ లనఁగఁ బూర్వశిఖరి
పరఁగు గ్రుంకుమెట్టు పడమటికొండ నా
వెలయు నస్తశిఖరి విశ్వనాథ. 2

టీ. తూర్పుఁగొండ = పూర్వభాగమందుండెడు పర్వతము, తొలుగట్టు = ప్రథమపర్వతము, పొడుపుగుబ్బలి = సూర్యుఁ డుదయించెడు పర్వతము — ఈ 3 ఉదయపర్వతమునకుఁ బేళ్ళు. గ్రుంకుమెట్టు = సూర్యుఁడస్తమించుపర్వతము, పడమటికొండ = పశ్చాద్భాగమందుండెడు పర్వతము — ఈ 2 అస్తగిరి పేళ్ళు.

తే॥ ఒప్పుగిరిపేళ్లు మల గట్టు • తిప్ప మెట్టు
కొండ గుబ్బలి నా మేరు • కుధరచాప
ఱాయి నాఁ గల్లనంగను • ఱా యనంగ
శిలకభిఖ్యలు దగు నిల • శేషభూష. 3

టీ॥ మల, గట్టు, తిప్ప, మెట్టు, కొండ, గుబ్బలి — ఈ ౬ పర్వతము నకుఁ బేళ్లు. ఱాయి॥రూ॥రాయి, కల్లు, ఱా — ఈ 3 శిలకుఁ బేళ్లు.

తే॥ పల్లె కొట్టిక కొటిక కు • ప్పము మ్రె నాఁగ
నూ రనఁగ గ్రామనామంబు • లొప్పుచుండుఁ
బట్టణంబున కాఖ్యలు • పరగుచుండుఁ
బ్రోలనఁగ వీ డనంగను • శూలపాణి. 4

టీ. పల్లె ॥పా॥ పల్లియ, కొట్టిక, కొటిక, కుప్పము, ఊరు — ఈ ౫ను గ్రామము పేళ్లు. ప్రోలు, వీడు — ఈ ౨ పట్టణము పేళ్లు.

తే॥ ఉనికిపట్టు తావు • మనికిపట్టి ర విల్లు
తెంకి యిక్క నట్టు • టెంకి యిమ్మ
నెలవు గీము నాఁగ • నలరు నివాసదే
శంబునకును బేళ్లు • చంద్రమౌళి. 5

టీ. ఉనికిపట్టు, తావు, మనికి, పట్టు, ఇరవు, ఇల్లు, తెంకి, ఇక్క, నట్టు, టెంకి, ఇమ్మ, నెలవు, గీము — ఈ ౧3 నివాసస్థానము పేళ్లు.

సీ॥ టెంకాయచెట్టన • టెంకాయమ్రాకన
నారికేళం బొప్పు • నగనివేశ
మావిమ్రా కనఁగను • మామిడిచె ట్టన
నామ్రభూజం బొప్పు • నభ్రకేశ
అత్తిమ్రా కన మేడి • యనఁగ నౌదుంబర
ధారుణీజం బొప్పు • మేరుచాప

STUDENTS LITARARY ASSOCIATION LIBRARY No.

యరఁటి యనఁటి నాఁగ • నంశుమత్ఫల
ణీరుహం బగు ధర • ణీశ తాఁగ
తే. యలరుఁ దుంబీశలాటుస • మాఖ్యల లాను
గంబు సొఱకాయ వదరు నా • గరళకంఠ
తా డనంగను దాడి నా • తాళభూరు
హంబునకు నాఖ్యలై యొప్పు • నంబికేశ. 6

టీ. తెంకాయచెట్టు, టెంకాయమ్రాను - ఈ ౨ ను కొబ్బరిచెట్టు పేరులు. మామిమ్రాను, మామిడిచెట్టు - ఈ ౨ ను చూతవృక్షము పేరులు. అత్తిమ్రాను, మేడి - ఈ ౨ ను అత్తిచెట్టు పేరులు. అరఁటి, అనఁటి - ఈ ౨ ను కదళీవృక్షమునకు నామములు. అనుగము, సొఱకాయ, వదరు - ఈ ౩ ను సొఱకాయ పేరులు. తాడు, తాడి - ఈ ౨ ను తాటిచెట్టు పేరులు.

సీ॥ మొక్క మోక నిసువు • మొలక మొానరఁగ నం
కురమునకును జెల్లు • కుధరచాప
యిగు రనఁ దలిరు నా • జిగురు నాఁ జివు రనఁ
బల్లవనామముల్ • పరఁగు నీశ
మ్రాననఁ జెట్టన • మ్రాఁకన భూరుహ
నామధేయము లగు • వామదేవ
పువు పువ్వు పూ నాఁగఁ • బుష్పము విరి యల
రనఁ గుసుమాఖ్యలై • యలరు నీశ
తే. గుబురు దట్టము జొంపంబు • గుంపు తఱుచు
నాఁగ నిబిడంబు పేళ్ళొప్పు • నంది వాహ
వల్లరిసమాఖ్యలగుచు వ • ల్లిల్లుఁ దీఁగ
తీవ తీవియ తీవె నాఁ • ద్రిపురవైరి. 7

టీ. మొలక, మోక, నిసువు, మొలక, మోసు- ఈ ౫ ను అంకురము పేళ్ళు, ఇగురు, తలిరు, చిగురు, చివురు-ఈ ౪ ను పల్లవము పేళ్లు. మ్రాను ||పా|| మాను, చెట్టు, మ్రాకు-ఈ ౪ ను వృక్షమునకు పేళ్ళు. పువు, పువ్వు పూ, పుష్పము, విరి, అలరు- ఈ ౬ ను కుసుమమునకు పేళ్లు. గుబురు, దట్టము తోంపము, గుంపు, తెలుచు- ఈ ౫ను నిబిడము పేళ్ళు. తీఁగ, తీవ, తీవియ, తీవె ||పా|| తీఁగె ఈ ౫ ను లతకుఁ బేళ్లు.

ఆ. అగ్రమున కభిఖ్య • లగు చుండుఁ దుద సుద
కొన యనంగ; వృక్షకోటరమున
కలరుఁ బేళ్ళు తొఱ్ఱ • తొఱ్ఱి తొఱ్ఱ తొఱ నాఁగ
నాగహార రజిత • నగవిహార. 8

టీ. తుద, సుద, కొన- ఈ ౩ ను అగ్రమునకుఁ బేళ్ళు. తొఱ్ఱ, తొఱ్ఱి, తొఱ్ఱ, తొఱ- ఈ ౪ ను వృక్షకోటరమునకుఁ బేళ్ళు.

ఆ. ఇక్షువున కభిఖ్య • లిక్షిత గన్నుల
మ్రాను చెఱకు తియ్య • మ్రాను నంగఁ
దనరు దవ యనంగఁ • దలవాడె నాఁగఁ ద
దగ్రమున కభిఖ్య • లగు గిరీశ! 9

టీ. కన్నులమ్రాను=కణుపులుగల శాఖ, చెఱకు, తియ్యమ్రాను= మధురమైన వృక్షము- ఈ ౩ ను ఇక్షువునకు బేళ్ళు. దవ, తలవాఁడె-ఈ ౨ ను చెఱకుకొనకుఁ బేళ్ళు.

క. అగుఁ బేళ్ళుత్పలమునకుం
దొగ తొవ కల్వ కలు వనఁగఁ • దోయజ మొప్పం
దగఁ దమ్మి తామ రనఁగా
మొగ డన మొగ్గ యనఁ దనరు • ముకుళంబు శివా! 10

టీ. తొగ, తొవ, కల్వ, కలువ - ఈ ౪ను ఉత్పలమునకుఁ బేళ్లు. తమ్మి, తామర - ఈ ౨ను కమలమునకుఁ బేళ్లు. మొగడ, మొగ్గ - ఈ ౨ను ముకుళంబునకుఁ బేళ్లు.

తే. ఎసఁగుఁ జెందొవ చెందొగ • యెఱ్ఱగలువ
యనఁగ రక్తోత్పలంబు రక్తాబ్జ మొప్పు
నిలుచు గెందమ్మి కెందామ • రెఱ్ఱదామ
రనఁగఁ జెందమ్మి చెందామ • రస మహేశ! 11

టీ. చెందొవ, చెందొగ, ఎఱ్ఱగలువ - ఈ 3ను రక్తోత్పలంబునకు బేళ్లు. కెందమ్మి, కెందామర, ఎఱ్ఱదామర, చెందమ్మి, చెందామర - ఈ ౫ను రక్తాబ్జమునకుఁ బేళ్లు.

క. గొడుపు గొడు గెల్లి యనఁ జె
న్నడరును ఛత్త్రంబు కేత • నాహ్వయములగున్
సిడె మనఁగఁ డెక్కె మనఁగా
బడగ యనన్ డా లనంగఁ • బర్వతధన్వీ. 12

టీ. గొడుపు, గొడుగు, ఎల్లి - ఈ 3ను ఛత్త్రమునకుఁ బేళ్లు. సిడెము, డెక్కెము, పడగ, డాలు - ఈ ౪ను కేతనమునకుఁ బేళ్లు.

క. మఱుఁ గనఁగ నోల మనఁగా
మఱు వనఁగాఁ జా టనంగ • మా టన వరుసం
బరగు ని వెల్ల నగోచర
ధరణీనామంబు లగుచు • దర్పకదమనా. 13

టీ. మఱుగు, ఓలము, మఱువు, చాటు, మాటు - ఈ ౫ను కన్నుల కగపడని ప్రదేశమునకు నామములు.

క. పొసఁగుఁ దృణాఖ్యలు పుల్లు నాఁ
గస వసఁగాఁ బూరి యనఁగ • గడ్డి యనంగా
వసుమతిలో నెన్నంబడు
పసి పస్సెము పైరనంగ • సస్యం బభవా! 14

టీ. పుల్లు, కసవు, పూరి, గడ్డి - ఈ ౪ ను తృణములకుఁ బేళ్ళు. పసి, పస్సెము, పైరు - ఈ 3 ను సస్యములకు నామములు.

ఆ. తెలుపు తెల్ల వెల్ల • తెలి వెలి నాఁగ నా
మ్నాయము లమరు ధవళ • వర్ణమునకుఁ
గప్పు నలుపు నల్ల • కఱ యన నాఖ్యలౌ
నీలవర్ణమునకు • నీలకంఠ. 15

టీ. తెలుపు, తెల్ల, వెల్ల, తెలి, వెలి - ఈ ౫ ను ధవళవర్ణమునకుఁ బేళ్ళు. కప్పు, నలుపు, నల్ల, కఱ [నాం] కటి - ఈ ౪ ను నీలవర్ణమునకుఁ బేళ్ళు.

ఆ. కెంపు తొగరు తొవరు • కెంజాయ యెఱుపు వెఱ్ఱ
యనఁగ నరుణకాంతి • కాఖ్య లయ్యె
నలిది పసుపుచాయ • యనఁగ హారిద్రవ
ర్ణమున కాఖ్య లగుఁ బి•నాకహస్త. 16

టీ. కెంపు, తొగరు, తొవరు, కెంజాయ, ఎఱుపు, ఎఱ్ఱ - ఈ ౬ ను అరుణకాంతికిఁ బేళ్ళు. అలిది, పసుపుచాయ - ఈ ౨ ను హారిద్రవర్ణమునకుఁ బేళ్ళు.

ఆ. శ్యామవర్ణమునకు • నామంబు లగు చుండఁ
బసరుచాయ యనఁగఁ • బచ్చ యనఁగ

వన్నె డాలు రంగు • వన్నియ జిగి జోతి
చాయ యనఁగ బరగు • జగతిఁ గాంతి. 17

టీ. పదరుచాయ, పన్నె-ఈ 2 ను శ్యామవర్ణము పేళ్ళు. వన్నె, డాలు, రంగు, వన్నియ, జిగి, జోతి, చాయ-ఈ 8 కాంతి పేళ్ళు.

తే. మానికము లన రతనముల్ • నా నెసంగు
నవని మాణిక్యములకు స • మాహ్వయములు
మెఱుఁగనంగను నిగ్గ నా • మెఱయుచుండు
నాఖ్య లుత్కృష్టకాంతికి • నభ్రకేశ. 18

టీ. మానికములు, రతనములు-ఈ 2 మాణిక్యముల పేళ్లు. మెఱుఁగు, నిగ్గు-ఈ 2 ను ఎక్కువైన కాంతి పేళ్ళు.

తే. జలధి పేళ్లగు మున్నీరు • కడలి సంద్ర
మనఁగ మడుఁగన మడువు నా • హ్రదము దనరుఁ
బరఁగు నాఱవసంద్రంబు • పాలవెల్లి
జిడ్డుకడలి పాల్కడలి నా • క్షీరజలధి. 19

టీ. మున్నీరు, కడలి, సంద్రము-ఈ 3 సముద్రము పేళ్ళు. మడుఁగు, మడువు-ఈ 2 హ్రదము పేళ్ళు. ఆఱవసంద్రము, పాలవెల్లి, జిడ్డుకడలి, పాల్కడలి-ఈ 4 ను క్షీరసముద్రము పేళ్ళు.

క. నంజె యన మడి యనంగను
మంజుల కేదారభూమ • మాఖ్యలు వెలయుం
బుంజె యనఁ జేను పొల మనఁ
గం జను మరుభూమి పేళ్లు • కాయజదమనా. 20

టీ. నంజె, మడి-ఈ 2 కేదారభూమి పేళ్ళు. పుంజె, చేను, పొలము ఈ 3 మరుభూమి పేళ్లు.

క. ధరణిఁ వివరాఖ్య లగుఁ
బోటియ కలుఁగు లాఁగుఁ బొక్క • బొంద యనంగా
దరి యొడ్డు గట్టనంగాఁ
బరఁగుం దీరంబు పేళ్లు • ప్రమథగణేశా. 21

టీ. బోటియ, కలుగు, లాగు, బొక్క, బొంద-౫ = వివరము. దరి, ఒడ్డు, గట్టు-౩ = తీరము.

తే. అవ లనంగను తోంపినా • నడుసనంగ
బురద నాఁ నొప్పుఁ గర్దమం • బునకుఁ బేళ్లు
భూమికి సమాఖ్య లగు బువి • పుడమి నేల
మన్ను పంటవలంతి నా • మదనదమన. 22

టీ. అవలు, తోంపి, అడుసు, బురద-౪ = కర్దమము. బువి, పుడమి, నేల, మన్ను, పంటవలంతి-౫ = భూమి.

తే. జెగిలె యనఁగ నరుఁగు నాఁగ • జగతి నాఁగ
దిన్నె యన వేదికాఖ్యలై • యెన్నఁ దనరు
మిఱ్ఱనంగను మెరక నా • మిట్ట యనఁగ
నున్నతక్షితికాఖ్యలై • యొప్పు నభవ. 23

టీ. జగిలె [ఱా॥ జగ్గిలె], అరుగు, జగతి, తిన్నె-౪ = వేదిక. మిఱ్ఱు, మెరక, మిట్ట-౩ = ఉన్నతప్రదేశము.

తే. తనరు నిశ్రేణి తాపఁ ని • చ్చెన యనంగఁ
దెప్ప తేపనునాఖ్యల • నొప్పుఁ బ్లవము
పరఁగు నోడఁ గల మనఁ • దరణి ధరణిఁ
దరణిశీతాంశుశిఖినేత్ర • ధవళగాత్ర. 24

టీ. తాప, నిచ్చెన-౨=నిశ్రేణి. తెప్ప, తేప-౨=ప్లవము. ఓడ, కలము-౨=తరణి.

తే. కార్ముకం బొప్పు విల్లు సిం • గాణి యనఁగఁ
దూణ మొప్పు బత్తళిక నా • దొన యనంగఁ
దరకసం బనఁ బొది యనఁ • దనరు శరము
కోల ములికి యమ్ము తూఁపు నా • శూలపాణి. 25

టీ. విల్లు, సింగాణి-౨-ధనుస్సు. బత్తళిక, దొన, తరకసము, పొది-౪-అమ్ములపొది. కోల, ములికి, అమ్ము, తూఁపు-౪=శరము

తే. తనరుఁ జెల్లు తనుత్రాణ • మునకుఁ గత్త
ళంబు జోడు జిరా దుప్ప • టంబు బొంద
ళం బనఁగ నాఖ్య లగు శతాం • గంబునకును
దేరు నా నరదము నాఁగ • మేరుచాప. 26

టీ. కత్తళము, జోడు, జిరా, దుప్పటము, బొందళము-౫=కవచము. తేరు, అరదము-౨=రథము.

క. కన్నా కన్నను దలక
ట్టన్నను మఱి మేలుబంతి • యన్నను ధరలో
నెన్నియు శ్రేష్ఠము పేళ్లై
యెన్నంబడు రాజసభల • నిభదైత్యహరా. 27

టీ. కన్నాకు, తలకట్టు, మేలుబంతి-3=శ్రేష్ఠము.

క. సొమ్మనఁ దొడ వనఁగా రవ
ణమ్మన నగుఁ జెల్లు భూష • ణమ్ములకును హా
రమ్ములకు నగును నభిధా
నమ్ములు పేరు లన సరులు • నా శితికంఠా. 28

టీ. సొమ్ము, తొడవు, రవణము-3 = భూషణములు. పేరులు, సరులు-౨ = హారములు.

తే. సరము లెత్తులు దండలు • సరు లనంగ
నామధేయంబు లగుఁ బువ్వు•దామములకు
వాసనకు నాఖ్యలై యొప్పు • వలపు కంపు
తావి కమ్మన యనఁగఁ గా•త్యాయనీశ. 29

టీ. సరములు, ఎత్తులు, దండలు, సరులు-౪ = పుష్పదామములు. వలపు, కంపు, తావి, కమ్మన-౪-వాసన.

క. ఒడమె యన సొమ్మనంగా
విడెముఁడి యన రొక్క మనఁగ • విత్తంబునకుం
బుడమిని నామము లగు నివి
యుడురాజకళావతంస • యురగాభరణా. 30

టీ. ఒడమె, సొమ్ము, విడెముడి, రొక్కము-౪ = విత్తము.

తే. మచ్చు లన మిద్దె లనఁగను • మాడుగు లన
దారునిర్మితగేహముల్ • దనరు చుండుఁ
బరఁగు సౌధంబు మేడ యు•ప్పరిగ యనఁగ
నాగకేయూర, మానిమా•నసవిహార. 31

టీ. మచ్చులు, మిద్దెలు, మాడుగులు [పా॥ మాడువులు]-3 = దారునిర్మితగృహములు. ఉప్పరిగ, మేడ-౨ = సౌధము.

తే. పెట్టె యన మందసం బనఁ • బెట్టెయనఁగ
బెట్టియ యనంగఁ బేటికా•భిఖ్య లమరు
మోఁపు దనంగను మోటు నా • మొద్దనంగ
వెలయు సోఁకు సమాఖ్యలు • విశ్వనాథ. 32

టీ. పెట్టి, మందసము, పెట్టె, పెట్టియ-౪=పేటిక. మ్రోడు, మోటు మొద్దు-౩=స్థాణువు.

ఆ. విస్తృతాఖ్య లొప్పు • విప్పు తనర్పు నా
వెడఁద విరివి పఱపు • వెడలు పనఁగ
దీర్ఘమునకు నామ • ధేయంబు లై యొప్పు
నిడుద చాఁపు నిడివి • నిడుపనంగ. 33

టీ. విప్పు, తనర్పు, వెడఁద, విరివి, పఱపు, వెడలుపు-౬=విస్తృతము; నిడుద, చాఁపు, నిడివి, నిడుపు-౪=దీర్ఘము.

ఆ. ఈడు దినుసు సాటి • యెన దొర సరి జోడు
సవతు మాద్రి యుద్ది • జత తరంబు
పురుడు నాఁగ సదృశ • మున కివి యాఖ్యలౌ
వివిధగుణసనాథ • విశ్వనాథ. 34

టీ. ఈడు, దినుసు, సాటి, ఎన, దొర, సరి, జోడు, సవతు, మాద్రి, ఉద్ది, జత, తరము, పురుడు-౧౩=సమానము.

తే. పసిఁడి బంగరు బంగారు • పైఁడి పొన్ను
జాళువా పుత్తడి యనంగ • స్వర్ణ మమరుఁ
దప్తకాంచన మమరుఁ గుం • దన మనంగ
డాని యపరంజి నా గజ • దానవారి. 35

టీ. పసిఁడి, బంగరు, బంగారు, పైఁడి, పొన్ను, జాళువా, పుత్తడి-౭=స్వర్ణము. కుందనము, కడాని, అపరంజి-౩=పుటముదీరిన బంగారము.

ఆ. చిదుర తునుక తునియ • చిదురుప వ్రక్క పా
లనఁగ ఖండమునకు • నాఖ్య లమరుఁ

బ్రోగు కుప్ప వామి • ప్రోవు దిట్ట యనంగ
రాశి కాఖ్య లగు ధ• రాశతాంగ. 36

టీ. చిదుర, తునుక, చిదురుప, వ్రక్క, పాలు-౬ = ఖండము. బ్రోగు, కుప్ప, వామి, ప్రోవు, తిట్ట-౫ = రాశి.

క. ఈస్థావరవర్గం గడు
నాస్థఁ విని జదువ వ్రాయ • నవనీస్థలిలో
నాస్థావిక్రుప నఖిల శు
భస్థితులును జనుల కొదవు • భాసురలీలఁ. 37

---

## తిర్యగ్వర్గు.

సీ. వెడఁదమోము మెకంబు • జడలమెకం బేనుఁ
గులగొంగ మెకములకోలముసాము
తెల్లడాలు మెకంబు • తెఱనోటిమెకము సిం
గంబు నా బొబ్బమె•కం బనంగఁ
బరఁగును మృగరాజు • పసిదిండి పులి మెకం
బులతిండిపోతు చా•ఱలమెకంబు
మువ్వన్నె మెక మన • నివ్వసుంధరయందు
వ్యాఘ్రంబునకు సమా•ఖ్యలు చెలంగుఁ
ఆ. బుట్టకూడుదిండి•పోతన వెనుకచూ
పులమెకంబు నాఁగ • నెలు వనంగ
నెలుఁగు నాఁగ మోర•తెలుపుమెకంబు నా
భల్లుకంబు దనరుఁ • ఖ్యాలనేత్ర.

టీ. పెద్దమోముమెకము = విశాలముఖముగల మృగము, జడల మెకము = జడలు గలమృగము, ఏనుఁగులగొంగ = గజములను గొట్టునది, మెకములకోలముసామి = మృగకులాధిపతి, తెల్లడాలుమెకము = ధవళకాంతి గలది, తెఱనోటిమెకము = తెఱచియుండెడు నోరు కలది, సింగము, బొబ్బమెకము = బొబ్బలు వేసెడి మృగము — వీ = సింహము ; పసిదిండి = పశువులను భక్షించునది, పులి, మెకంబులతిండిపోతు = మృగములను భక్షించునది, చాఱలమెకము = చాఱలుగలమృగము, మువ్వన్నెమెకము = మూఁడువన్నెలు గలది — వీ = వ్యాఘ్రము; పుట్టకూడుదిండిపోతు = పుట్టకూడు తినునది, వెనుకచూపులమెకము = పశ్చాద్దృష్టిగలది, ఎలువు, ఎలుఁగు, మోరతెలుపుమెకము = ముఖమందు తెలుపుగలమృగము — వీ = భల్లూకము.

క. పలుగొమ్ముల మెకమనఁగా
నిల నెక్కుడుమెక మనంగ • నేనుఁగ నంగా •
బలువంజమెకము నాఁ జే
గలమెక మన గొరసంగఁ • గరి యొప్పు శివా. 2

టీ. పలుగొమ్ములమెకము = దంతములే కొమ్ములుగాఁగలమృగము, ఎక్కుడుమెకము = అధిష్ఠింప యోగ్యమైనమృగము, ఏనుఁగు, బలువంజమెకము ॥పా॥ బలుపాజ్జమెకము = బలువైనపాదములుగలది, చేగలమెకము = హస్తము(అనఁగా తొండము) గల మృగము. గొరసంగ = గజము.

తే. వాజికి సమాఖ్య లగుఁ దేజి • వారువంబు
మావు గుఱ్ఱంబు తట్టువ • మావురంబు
కత్తలాని బాబా జక్కి • తత్తడి యన
విగతభవపాశ కాశీని•వేశ యీశ. 3

టీ. తేజి, వారువము, మావు, గుఱ్ఱము, తట్టువ, హావురము, కత్తలాని, బాబా, జక్కి., ఉత్తడి, -౧౦ = అశ్వము.

క. తగ రేడిక పొట్టే లన
నగు మేషసమాఖ్య లెనిమిఁదడుగుల మెక మే
నుఁగుఁగొంగనూ డనంగా
జగతిన్ శరభాఖ్యలొప్పుఁ • జంద్రార్ధధరా. 4

టీ. తగరు, ఏడిక, పొట్టేలు-౩ = మేషము. ఎనిమిఁదడుగుల మెకము = అష్టపాదములుగల మృగము, ఏనుఁగుఁగొంగనూడు = సింహమునకు విరోధి -౨ = శరభమృగము.

క. సంగతి నుష్ట్రాఖ్యలు నొ
ప్పొం గడు నొంటె లన లొట్టి • పిట్టలనన్ సా
రంగాఖ్య లలరు నిఱ్ఱు ల
నంగా జింక లన లేళ్లు • నా సర్వజ్ఞా. 5

టీ. ఒంటెలు, లొట్టిపిట్టలు -౨ = ఉష్ట్రము. ఇఱ్ఱులు, జింకలు, లేళ్లు -౩ = సారంగములు.

క. నులిగొమ్ముల మెక మిఱ్ఱన
నలమృగమనఁ గొప్పుఁ బెళ్లు • మృగి లేఁడి యనన్
వెలయునను రెంటికిఁ దగు నా
ఖ్యలు జింక యనంగ నీశ • యంబరకేశా. 6

టీ. నులిగొమ్ముల మెకము = మెలిగా నుండెడుకొమ్ములు గలమృగము. ఇఱ్ఱి -౨ = మొకజింక. లేఁడి = ఆఁడుజింక, జింక యనునది యారెంటికిని పేరు.

తే. పసులు తొడుసులు పసరముల్ • పసి యనంగఁ
బశువులనుఁ బశునామాఖ్యలై • పరఁగు నాల

పోతు బసవఁడు గిబ్బ యాఁ • బోతనంగ
వృషభమున కాఖ్యలై యొప్పు • వృషభవాహ. 7

టీ. పసి, తొడుకు, పసరము ॥ పొ ॥ పసరము, పశు-4 = పశువులు; ఆఁబోతు = పశువులకుఁ బతి, బసవఁడు, గిబ్బ, ఆఁబోతు-4 = వృషభము.

సీ. తొల్లుపట్టు లనంగ • దొడ్డనంగా నివి
గోష్ఠదేశమునకుఁ • గోలు నీశ
కదుపులు మొదవులు • పదువులు మందలు
నా ధేనుగణ మొప్పు • నగనివేశ
యలరు నాఖ్యలు లేఁగ • లనఁ దూడ లనఁ గ్రేపు
లన వత్సములనును • ధరణిధర
యా వరఁగా గిడ్డి • యనఁ దొడుకన మొద
వన ధేనునామముల్ • దనరు నభవ

తే. యుక్షమునకు సమాఖ్యలై • యొప్పుచుండు
గిత్త యెద్దనఁ గోడె నాఁ • గృత్తివాస
యా లనఁగ ధేనువుల కాఖ్య • యలరుచుండు
శైలజానాథ ప్రమథపం • చయనాథ. 8

టీ. తొలుపట్టులు, దొడ్డి-2 = గోవు లుండెడు స్థానము. కదుపులు, మొదవులు, పదువులు, మందలు-4 = ధేనుసమూహము. లేఁగలు, దూడలు, క్రేపులు-3 = వత్సములు. ఆవు, గిడ్డి, తొడుకు, మొదవు-4 = గోవు. గిత్త, యెద్దు, కోడె-3 = ఉక్షము. ఆలు = ధేనువులు.

తే. అలరుఁ గుందేలు చెవులపో • తనఁగ శశక
మొప్పుఁ బోడెలమేకంబు నా • దుప్పి యనఁగఁ

గాలికొమ్ముల మెకి మనం • గను ధరిత్రి
రామనామమృగంబు ధ • రాశతాంగ. 9

టి. కుందేలు, చెవులపోతు-౨ = శశకము. పొడల మెకము = మచ్చలు గలది, దుప్పి, గాలికొమ్ముల మెకము = సాంద్రశృంగములు గల మృగము-3 = రామనామమృగము.

తే. దుంత యెనుపోతు జము నెక్కి • రింత దున్న
యనఁగ మహిషంబునకు సమా • హ్వయము లమరుఁ
బరఁగు నెనుపెంట్లు గేదులు • బఱ్ఱె లెనుము
లనఁగ మహిషీసమాఖ్యలు • ధనదమిత్ర. 10

టి. దుంత, ఎనుపోతు, జము నెక్కిరింత = యమునివాహనము, దున్న-౪ = మహిషము. ఎను పెంట్లు, గేదెలు, బఱ్ఱెలు, ఎనుములు-౪ = మహిషి.

తే. పక్కి పులుఁగు పిట్ట యనంగఁ • బతి. యొప్పు
గఱులు ఱెక్కలు చట్టుప • లెఱక లనఁగఁ
బక్షముల కివి పేళ్ళగుఁ • బర్ణములకు
నాఖ్య లగు లావు లన నీఁక • లనంగ నీశ. 11

టి. పక్కి, పులుఁగు, పిట్ట-3 = పక్షి. గఱులు, ఱెక్కలు, చట్టుపలు, ఎఱకలు-౪ = పక్షములు. లావులు, ఈఁకలు-౨ = పర్ణములు.

సీ. తోలతరికలు గుఱ్ఱ • ల్గులు నల్వ తేజీలు
పాలు నీరును నేరు • పలుదుపులుఁగు
లంచలు తెలిపిట్ట • లన నొప్పు హంసలు
క్రౌంచముల్ దనరారుఁ • గొంచ లనఁగఁ
గొక్కరా లనఁగను • గొక్కు లనంగను
గొక్కెఱ లనఁగను • గొంగ లనఁగఁ

బరఁగు నభిఖ్యలు • బకవిహంగములకు
నట్టువపులుఁగునాఁ • జుట్టుపులుఁగు
తే. నాఁగ నెమ్మిన నెమిలి నా • నమ్మి యనఁగఁ
గేకికి సమాఖ్యలగుఁ జంచ•రీకములకు
నాఖ్యలు జమిలిముక్కాలి • యనఁగఁ దేఁటి
యనఁగఁ దుమ్మెద నా నీశ • యభ్రకేశ. 12

టి. తొలకరికలుగుపుల్లులు = వర్షాకాలమునకుఁ బరాఙ్ముఖము లయ్యెడు పక్షులు, నల్వతేజీలు = బ్రహ్మకువాహనములు, పాలునీరును వేర్పఱుచుపులుఁగులు = క్షీరోదకములను వేఱుపఱుచునట్టిపక్షులు, అంచలు, తెలిపిట్టలు = తెల్లనిపక్షులు-౫ = హంసలు; కొంచలు = క్రౌంచపక్షులు. కొక్కెరాలు, కొక్కులు కొక్కెరలు, కొంగలు-౪ = బకములు, నట్టువపులుఁగు = నాట్యమును జేయుపక్షి, జుట్టుపులుఁగు = సిగగలపక్షి, నెమ్మి, నెమిలి, నమ్మి-౫ = కేకి. జమిలిముక్కాలి = ఆఱుపాదములుగలది, తేఁటి, తుమ్మెద-౩ = భ్రమరము.

తే. పరఁగు నొడ్డీలు కూకీలు • పల్లటీలు
పావురాలును బకదార్లు • పావురములు
నాఁగఁ గలరవపక్షిబృం•దముల పేళ్లు
పంకజాతాక్షసన్నుత • ఫాలనేత్ర. 13

టి. ఒడ్డీలు, కూకీలు, పల్లటీలు, పావురాలు, బకదార్లు, పావురములు-౬ = కలరవపక్షులు.

తే. పుడమిలోపలఁ జదువు•పులుఁగ నంగఁ
జిగురువిల్కాని తేజి నాఁ • దొగరుముక్కు
పులుఁగ ననఁగఁ బచ్చతెక్కల•పులుఁగ నంగఁ
జిలుక యన నొప్పుఁ గీరంబు • శ్రీమహేశ. 14

టీ. చదువులపులుఁగు = చదువులుగలపక్షి, చిగురువిలుకానితేజి = మన్మథునివాహనము, తొగరుముక్కుపులుఁగు = ఎఱ్ఱనిముక్కుగలపక్షి, పచ్చెఱెక్కలపులుఁగు = పచ్చనిఱెక్కలుగలపక్షి, చిలుక -౫ = కీరము.

తే. బట్టికాఁ డన గోరవంక • పిట్ట యనఁగఁ
బరఁగు శారిక; యేట్రింత • పసులపోలి
గాఁడు కూఁకటిమూఁగ నాఁ • గను జెలఁగు
నిల భరద్వాజవిహగంబు • నిలకంఠ. 15

టీ. బట్టికాఁడు [పుం] బట్టుకాఁడు, గోరువంకపిట్ట -౨ = శారిక, ఏట్రింత, పసులపోలిగాఁడు, కూఁకటిమూఁగ -౩ = భరద్వాజపక్షి.

తే. జాలె డేగ కుఱుజు నా • సాళ్వ మనఁగఁ
గణుజు నాఁగను జలకట్టె • యనఁగ వేస
డం బనఁగ గిద్దు నా నోర • ణం బనంగ
శ్యేనభేదంబు లగు మహా • సేనజనక. 16

టీ. జాలె, డేగ, కుఱుజు, సాళ్వము, కణుజు, జలకట్టె, వేసడము, గిద్దు, ఓరణము -౯ = శ్యేనవిశేషములు.

తే. కోటఁ డనఁగను గూబ నా • ఘూక మమరుఁ
జిఱుతగూబ యనంగఁ బ • సిఁడికంటి
యనఁగ సకినాలపులుఁగన • నలరుచుండు
బృథివిఁ గనకాక్షి యనుపక్షి • శ్రీమహేశ. 17

టీ. కోటఁడు, గూబ -౨ = ఘూకము. చిఱుతగూబ = చిన్నగూబ, పసిఁడికంటి = బంగారమువంటి నేత్రములుగలది, సకినాలపులుఁగు = శకునములపక్షి -౩ = కనకాక్షి యనుపక్షి.

తే. పాము సప్పంబు నిడుపఁడు • పడగదారి
గాలిమేఁతరి విసదారి • కానరాని
కాళ్ళయది చిల్వ వీనుల•కంటి పుట్ట
పెట్టెపట్టునఁ జను నహి • పేళ్లు భర్గ. 18

టీ. పాము, సప్పంబు, నిడుపఁడు = చిరకాలముగానుండునది, పడగదారి = పడగను ధరించినది, గాలిమేఁతరి = వాయుభక్షణము సేయునది, విసదారి = విషమును ధరించినది, కానరానికాళ్లయది = అదృశ్యపాదములు గలది, చిల్వ, వీనులకంటి = చెవులే కన్నులుగాఁ గలది, పుట్టపెట్టెపట్టు = వల్మీకమును బెట్టెయును నివాసముగాఁ గలది -౧౦ = సర్పము.

క. ఇల నెంచ రుధిరమున కా
ఖ్యలు నల్ల యనంగ నెత్తు • రనఁగ ధరిత్రిం
బొల యీఁకు వెఱచి నంజో కా
పొలసన నివి పరగు మాంస•మునకు మహేశా. 19

టీ. నల్ల, నెత్తురు-౨ = రక్తము. పొల, ఈఁకువు, ఎఱచి, నంజుడు, పొలసు-౫ = మాంసము.

క. భర్గుఁడు కాశీనిలయుఁడు
దుర్గాపతి యొసఁగు నూఁదము • తో నీతిర్య
గ్వర్గు లిఖించినఁ జదివిన
దౌర్గత్యము లణఁచి సంప•దలు నిత్యంబుల్. 20

---

## నా నా ర్థ వ ర్గు.

క. కలు పనఁ జే రగు దధికిం
గలు పన సస్యంబులోని • గాదమువే రా
వెలు గండ్రు కంప కోటను
వెలుఁగందురు ప్రభను జనులు • విశ్వాధిపతీ. 1

టీ. కలుపు = దధి, పైరులోనికసవు, వెలుఁగు = కాంతి, వెలుగు = కంపకోట.

క. మావు లనం దగు హయములు
మావు లనం బరఁగు నామ్ర•మహీజంబు లిలం
దావు లన స్థల మొప్పును
దావు లనన్ వాసనలకుఁ • దగుఁ జేరు శివా. 2

టీ. మావులు = గుఱ్ఱములు, మామిడిచెట్లు. తావులు = స్థలములు, వాసనలు.

క. ఇమ్మహిలోపలఁ జే రగుఁ
గొమ్మ యనన్ వృక్షశాఖ•కును భామినికిం
దమ్ము లనం జే రగుఁ బ
ద్మమ్ముల కనుజన్ములకును • దరుణేందుధరా. 3

టీ. కొమ్మ = వృక్షశాఖ, స్త్రీ; తమ్ములు = పద్మములు, అనుజులు.

క. ఇమ్ములఁ జే రగుఁ దాటం
కమ్ములకును లేఖలకును • గమ్మ లనన్ నా
మమ్ము దగుం గంఠాభర
ణమ్మునకును లతకుఁ దీఁగె • నా గౌరీశా. 4

టీ. కమ్మలు = తాటంకములు, జాబులు. తీఁగె = కంఠాభరణము, లత.

క. చెల్లును బేళ్లయి ధరలోఁ
దాళ్లన సూత్రంబులకును • దాళంబులకుం
గోళ్లనఁ గుక్కుటములకును
బేళ్లగు ఖట్వాంగములకుఁ • బేళ్లగు నభవా. 5

టీ. తాళ్ళు = సూత్రములు, తాళవృక్షములు. గోళ్ళు = కుక్కుటములు, మంచముకోళ్ళు.

క. చామ యన సస్యమునకును
భామినికిని నాఖ్య యగుచుఁ • బరఁగు ధరిత్రిన్
నామము లగుచును వెలయును
బాములు లనఁ జన్మములకు • భంగమ్ములకున్. 6

టీ. చామ = సస్యవిశేషము, స్త్రీ. బాములు = జన్మములు, భంగపాటు.

తే. దంట యనఁగ నభిఖ్యయై • తనరుచుండు
జగతిలోపలఁ బ్రౌఢకు • యుగళమునకుఁ
బఱప యనంగ నభిఖ్యయౌ • పానుపునకు
విస్తృతమునకు శైలని • వేళయాళ. 7

టీ. దంట = ప్రౌఢస్త్రీ, జంట. పఱపు = పానుపు, విస్తృతము.

క. తొలి యనఁగా నగు నామం
బిలఁ బూర్వంబునకు సుషిగ • మునకును ధరలో

వెలి యనఁగ బహిర్ధవళం
బులకును నామంబు శేష•భుజగవిభూషా. 8

టీ. తొలి = పూర్వము, రంధ్రము. వెలి = బయలు, ధవళవర్ణము.

క. నెమ్మి యనఁగ వంజులవృ
క్షమ్మునకుఁ బర్హికిని సు•ఖస్థితికిని నా
మమ్మగుఁ దగు నతిధీర య
హమ్మతిజనదూర పన్న•గాధిపహారా. 9

టీ. నెమ్మి = వంజులవృక్షము, నెమలి, సుఖముగా నుండుట.

క. పాలం బేరగు మందను
బా లనఁగా క్షీరమునకు • భాగంబునకుం
గా లనఁ బేరగు నాలవ
పాలికిఁ బాదంబునకును • బాలేందుధరా. 10

టీ. పాలు = క్షీరము, భాగము. కాలు = నాలవపాలు, పాదము.

క. మే లన శుభంబు పే రగు
మే లన నుపరికిని గూరి•మికినిం బేరౌ
మే లన మెచ్చుచుఁ బల్కిన
యాలాపంబునకు నాఖ్య•యగు జగదీశా. 11

టీ. మేలు = శుభము, మీఁదు, కూరిమి, మెచ్చుచేతఁ బలికినమాట.

క. ధారుణిఁ బేరు వహించును
బూరుగు నా నూఁదుపాద్య•మును శాల్మలియుం
బేరన నభిధానం బగు
హారమునకు నామమునకు • నంబరకేశా. 12

టి. బూరుగు = ఊఁదుపట్టివాద్యము, శాల్మలీవృక్షము. పేరు = హారము, నామధేయము.

క. కప్పన నీలిమ పేరగుఁ
గప్పనఁగా నింటిమీఁది • కసవున్ బేరౌఁ
గొప్పనఁ దగుఁ జూపాగ్రము
నొప్పగు ధమ్మిల్లమును గృ • హోపరియును శివా. 13

టి. కప్పు = నల్లవర్ణము, ఇంటిమీఁదికసవు. కొప్పు = ఇంటికోన స్త్రీలకొప్పు. యింటినడికొప్పు.

క. ఒకభూరుహమునకును ధమ
నికిఁ బేరగుఁ గ్రోవి యనఁగ • నెఱి నట్టుల వే
ఱొకభూజమునకు నధరము
నకుఁ బేరగు మోవియనిన • నగరాట్పాపా. 14

టి. క్రోవి = కురవకవృక్షము, గొట్టము. మోవి = ఒకవృక్షవిశేషము, అధరోష్ఠము.

క. చవు లనఁగా నభిధానము
లవు షడ్రుచులకును ముత్తి • యపునెత్తులకున్
భువిలోపల నామము లగు
గవు లన గుహలకునుఁ బూతి • గంధంబునకున్. 15

టి. చవులు = షడ్రుచులు, ముత్యములయెత్తులు. గవులు = పర్వతగుహలు, దుర్గంధము.

తే. ఆఖ్యలైయొప్పు ధరణిలో • నపరదివస
మునకు ఛత్రంబునకు నెల్లి • యనెడినుడువు

జక్కి యనుపేరు పరఁగును • సైంధవంబు
నకు ఖురట్టంబునకును గం•దర్పదమన. 16

టి. ఎల్లి = అపరదివసము, ఛత్రము. జక్కి = గట్టము, తిరుగలి.

తే. ఆడె ననుమాట నటియించె•ననుటకును వ
చించె ననుటకు మఱియు నిం•దించె ననుట
కాఖ్య యగుచును శోభిల్లు•నాలు నాఁగ
గోపులకు భార్యకును బేర•గుఁ గమహేశ. 17

టి. ఆడెను = నటియించెను, వచించెను, నిందించెను. ఆలు = గోవులు, భార్య.

సీ. రజతపునఃపదా•ర్థములకు నభిధాన
మగు వెండి యన బంతి • యనఁగఁ గంటు
కమునకు శ్రేణికి • నమరు నాహ్వయముగా
దండ యనం బుష్ప•దామమునకు
నంతికంబునకుఁ జే•రగు దొరయన నాఖ్య
యగు సదృశమునకు • నవనిపతికి
నత్రిసంఖ్యకు నహ • మ్మనుటకు నాహ్వయం
బగు నే ననఁగ నరి • యనఁగ సదృశ

తే. మునకు సమసంఖ్యకును నాయు•ముగ నెసంగు
గొం తనఁగ నాహ్వయం బగుఁ • గుక్కుటాస
నంబునకు గంతమునకును • నల్ల యనిన
రక్తనీలాఖ్య యై యొప్పు • రాజమకుట. 18

టి. వెండి = రజతము, పునఃపదార్థము. బంతి = కందుకము, శ్రేణి. చెండ = పుష్పమాల, సమీపము. దొర = సమానము, రాజు. ఏను = పంచసంఖ్య, నేను. సరి = సమానము, సమసంఖ్య. గొంతు = కుక్కుటాసనము, కంఠము. నల్ల = నెత్తురు, స్త నీలవర్ణము.

సీ. తీరంబునకు ధరి♦త్రీధరంబునకు స
మాఖ్యయై యొప్పు గ♦ట్టనఁగ నీశ
కేతువునకుఁ గాంతి♦కిని సమాహ్వయ మగు
డా లనంగను మేరు♦శైలచాప
శౌర్యధుర్యునకు లాం♦ఛనమునకును నామ
మగు బిరు దనఁగఁ బ♦న్నగవిభూష
గూబ నా నాఖ్య యగా♦ ఘూకంబునకుఁ గర్ణ
మూలంబునకు నవి♦ముక్తనిలయ
తే. యంతికంబునకును సమూ♦హంబునకును
నామమై యొప్పుఁ జేరువ ♦ నాఁగ నభవ
సమభిధానమై యొప్పుఁ బి♦శాచమునకు
బవనమునకును గాలి య♦న్నలుకు రుద్ర. 19

టి. గట్టు = నద్యాదితీరము, పర్వతము. డాలు = ధ్వజము, కాంతి. బిరుదు = శూరుఁడు, లాంఛనము. గూబ = ఘూకము, కర్ణమూలము. చేరువ = సమీపము, సమూహము. గాలి = పిశాచము, వాయువు.

కం. ఇలలోపల నామం బగుఁ
బలుకులు నా శకలములకు ♦ భాషణములకున్
నెల యన నభిధానం బగుఁ
జలజారికి మాసమునకు ♦ శైలనిశాంతా. 20

టి. పలుకులు = తునియలు, వచనములు. నెల = చంద్రుడు, మాసము.

సీ. అంతర్హితుండయ్యె • ననుటకు నాగతుం
డయ్యె ననుటకు స•మాఖ్య యగుచు
నలరును విచ్చేసె • ననుట యంబరకేశ
నెఱి సమాహ్వయ మగుఁ • గఱచె ననఁగ
నభ్యాస మొనరించె • ననుటకు దంతపీ
డ యొనర్చె ననుటకు • నయుగనయన
వెలయుఁ దప్తక్షీర•ములకు నభిజ్ఞకు
నాఖ్యయై యానవా • లనుట యీశ
తే. పఱచె ననఁగ సమాఖ్యయా • బాధచేసెఁ
బ్రచలితుండయ్యె ననుటకుఁ • బొందుగాంగ
బరఁగ మోహించె ననుటకుఁ • బరిమళించె
ననుట కొప్పును వలచె నా • నళికనేత్ర. 21

టి. విచ్చేసెను ॥పా॥ వేంచేసెను = పోయెను, వచ్చెను. కఱచెను = అభ్యసించెను, కొఱికెను. ఆనవాలు = కాఁగినపాలు, చిహ్నము. పఱచెను = భంగపడిచెను, పలాయితుండయ్యెను. వలచెను = మోహించెను, పరిమళించెను.

సీ. ఆనె నంట సమాఖ్య • యాను వహించెఁ బా
నము చేసె ననుటకు • నగనివేశ
చషకంబునకును దం•ష్ట్రికు నాఖ్య యాఁగోర
యనఁగ శశాంకక•ళావతంస

మొక్కలీఁ డనఁగఁ గొ•మ్ములులేనికరికి ము
ష్కరునకుఁ బే రగు • గరళకంఠ
మరకతచ్ఛవికి నం•బరమున కగుఁ బేరు
పచ్చడం బనిన నం•బాకళత్ర
తే. క్షితిని దురగిపతికి వృత్త•శిలకు నామ
ధేయమై యొప్పు గుండు నాఁ • ద్రిపురహరణ
నామ మౌ నొక్కసస్యంబు•నకును లోప
మునకు కొఱ్ఱ యనంగ నం•బుదనిభాంగ. 22

టీ. ఆనెను = ధరించెను, పానముచేసెను. కోర = గిన్నె. కోఱ = కోఱపల్లు. మొక్కలీఁడు = కొమ్ములు లేనియేనుఁగు, ముష్కరుఁడు. పచ్చడంబు = మరకతకాంతి, అంగవస్త్రము. గుండు = మగగుఱ్ఱము, గుండురాయి. కొఱ్ఱ = ఒకదినుసుపైరు, తక్కువ.

సీ. తాల్పు నాఖ్యను వధూ•ధమ్మిల్లభారంబుఁ
గోణంబు మూలనాఁ • గుధరచాప
కోఱ యనునాఖ్యచేఁ • గోఱలు లోపంబు మ
నోజ్ఞవస్తువు దక్ష•యజ్ఞమథన
నెఱి సోయపడియె న•న్వేషించె నను రెంటి
కాఖ్య యా రోసె నా • నసితకంఠ
నరసె నాఁ బే రగు • నార్తి వారించె వి
మర్శించె ననుటకు • మదనదమన
తే. చరణమునకు నధఃప్రదే•శంబునకు న
మాఖ్యయై యొప్పు నడుగు నా • నళికనేత్ర

మహిని జెరగు చుండుఁ బ్రమాణికంబు
నకును భాషకు బాస నా నగనివేశ. 23

టి. మూల = స్త్రీలకొప్పు, దిక్కు. కొఱ = తక్కువ, మనోజ్ఞవస్తువు. రోసెను = అసహ్యించుకొనెను, వెదకెను. అరసె = బాధను పోఁగొట్టెను, విచారించెను. అడుగు = పాదము, క్రిందిప్రదేశము. బాస = ప్రమాణికము, భాష.

సీ. నాగవాస మన ఘంటాప్రతీకమునకు
వేశ్యల కగుఁ బేరు విశ్వనాథ
నామమౌ నండంబునకు నంధకునకును
గ్రుడ్డనంగను రౌప్యకుధరనిలయ
చర్మవాద్యమున కుష్ణమునకుఁ బేరగు
నుడుకనియెడు నాఖ్య యుడుపమకుట
యభిధాన మగు మేడి యన హాలాంగమునకు
దుంబరమునకును ధూతకలుష
తే. కల్లనఁగ శిల సురయు నాగరళకంఠ
పరఁగు నాఖ్యయు లాంగల పద్ధతికిని
శ్రేణికిని జాలనంగ భసితసితాంగ
వారిధినిషంగ కాశీనివాసలింగ. 24

టి. నాగవాసము = ఘంటావయవము, వేశ్యాసమూహము. గ్రుడ్డు = అండము, అంధకుఁడు. ఉడుకు = చర్మవాద్యము, ఉష్ణము. మేడి = నాగేటియవయవము, అత్తిచెట్టు. కల్లు = రాయి, సుర. చాలు = నాఁగేటిచాలు, బంతి.

తే. జననికిని మాతృజననికి • జనకజనని
కాఖ్య యగు నవ్వ యనఁగ నా • ర్యాసహాను
భగినికిని జనకునకు నా • హ్వాయము దనరు
నప్ప యనఁగను జంద్రరే • ఖావతంస. 25

టి. అవ్వ = తల్లి, తల్లితల్లి, తండ్రితల్లి. అప్ప = అక్క, తండ్రి.

క. పో తనఁగఁ బరఁగు మహిషము
భూతలమునఁ బురుషమృగముఁ • బురుషఖగంబుం
దా తన ధాతృ పితామహ
మాతామహులకును నగు స • మాఖ్య మహేశా. 26

టి. పోతు = మహిషము, పురుషమృగము, పురుషపక్షి. తాత = బ్రహ్మ, తండ్రితండ్రి, తల్లితండ్రి.

క. పుడమిని బేరు వహించును
వడిగలవాఁ డనఁగ శౌర్య • వంతుఁడు జవియుణ్
నడు మన నవలగ్నముఁ జె
న్నడరఁగ మధ్యస్థలంబు • నగు నగధన్వీ. 27

టి. వడిగలవాఁడు = శౌర్యముగలవాఁడు, వేగముగలవాఁడు. నడుము = కౌను, మధ్యప్రదేశము.

క. ఎద యనఁగఁ బరఁగు భీతికి
హృదయమునకు వక్షమునకు • నిల బోఁడనఁగా
నది తనరు నామ మగుచును
సదృశమునకు వర్మమునకుఁ • జంద్రార్ధధరా. 28

టీ. ఎద = హృదయము, మనస్సు, ఱొమ్ము. జోడు = సమానము, కవచము.

క. నానార్థవర్గు విది స
న్మానముతో దీనిఁ జదివినను వ్రాసిన నా
మానవుల కబ్బు నెప్పుడు
నానార్థంబులును విశ్వనాథునికరుణన్. 29

గద్య. ఇది శ్రీమదేకామ్రమంత్రిపుత్త్ర కౌండిన్యగోత్రపవిత్ర సదారాధితమహేశ్వర పైఁడిపాటి లక్ష్మణకవిప్రణీతంబైన యాంధ్రనామసంగ్రహం బను నిఘంటువునందు సర్వంబు నేకాశ్వాసము. సంపూర్ణము.

శ్రీ ర స్తు.

# సటీకాంధ్ర నామ శేషము.

## అ వ తా రి క.

అడిదము - సూరన యనుకవి ఆంధ్రనామశేష మను నీ నిఘంటువును రచియింపఁబూని యది నిర్విఘ్నముగా సమాప్తి నొందుటకుఁగాను గ్రంథనాయకుఁ డగు నీశ్వరుని సంబోధన రూపముగాఁ బ్రార్థించి త దంకితముగా గ్రంథనామ పూర్వక ప్రతిజ్ఞను రెండుపద్యములచేతఁ జేయుచున్నాఁడు:

క. శ్రీగౌరీప్రియవల్లభ
రాగద్వేషాదిరహిత • రమ్యచరిత్రా
యోగిధ్యేయపదాంబుజ
భోగివలయ రామచంద్ర • పురవరనిలయా.

టీ. శ్రీగౌరీప్రియావల్లభ = శోభాయుక్తురా లయిన పార్వతీదేవికి నిష్టభర్తయును, రాగద్వేషాదిరహిత = రాగద్వేషాదిదోషములు లేనివాఁడును, రమ్యచరిత్రా = మనోహరమైన చరిత్రములు గలవాఁడును, యోగిధ్యేయపదాంబుజ = యోగీశ్వరులచేత ధ్యానము సేయఁదగిన పాదారవిందములు గలవాఁడును, భోగివలయ = సర్పములు హస్తకంకణములుగాఁ గలవాఁడును, రామచంద్ర పురవరనిలయా = శ్రేష్ఠమైన రామచంద్రపురము నివాసముగా గలవాఁడును అగు ఓయీశ్వరా.

వ. అవధరింపుము.

ఆ. ఆంధ్రనామసంగ్రహమునందుఁ జెప్పని
కొన్ని తెనుఁగుమఱుఁగు • లన్ని కూర్చి
యాంధ్రనామ శేష • మనుపేరఁ జెప్పెద
దీనిఁ జిత్తగింపు • దేవదేవ.

టీ. అవధరింపుము = సావధానచిత్తుఁడవై యాలకింపుము. ఆంధ్రనామసంగ్రహమునందున్ = లక్ష్మణకవికృతమగు నాంధ్రనిఘంటువునందు, చెప్పని = తెలియఁజేయనటువంటి, కొన్ని తెనుఁగుమఱుఁగులు = సర్వసాధారణముగాఁ దెలియ శక్యముగాని కొన్నియాంధ్రశబ్దములను, అన్ని = అన్నిటిని, కూర్చి = పర్యాయపదములతో సమర్చి, ఆంధ్రనామశేషము = ఆంధ్రనామసంగ్రహమునందుఁ జెప్పఁగా మిగిలినవానిని జెప్పెడిగ్రంథము, అను = అనెడి, పేరన్ = పేరితో, చెప్పెదన్ = యికమీద జెప్పుచున్నాను. చిత్తగింపు = మనఃపూర్వకముగా నంగీకరింపుము.

క. తఱి యజ్జ దనన సమయం
బుఱుఁ దనఁగను పరకుసేయ • కుండె ననఁగఁ జె
ల్లొఱపగు గణింపఁ దనుటకుఁ
గరిచర్మాంబర త్రినేత్ర • గౌరీమిత్రా. 1

టీ. తఱి, అజ్జ, అదను - 3 = సమయము. ఉఱఁదు, పరకుసేయకుండెను - 2 = గణింపఁడు.

తే. పెంపుసొందెను దామర • తంప రయ్యెఁ
బ్రబలె నెగడెను గొనసాగె • బలిసె పెరిఁగె
ననఁగ రేకెత్తె ననఁగఁ బేళ్ళయ్యె వృద్ధిఁ
బొందె ననుటకు శేషాహి • భూషితాంగ. 2

టీ. పెంపుసొంద, తామరతంపరయ్యె, ప్రబలె, నెగడె, కొనసాగె, బలిసె, పెరిఁగె, రేకెత్తె - ౯ = వృద్ధిఁబొందెను.

తే. పేర్మి యర్మిలి మక్కువ • కూర్మి నెమ్మి
నెనరు గాదిలి గారాము • నెయ్య మింపు
ప్రేముడి యనుఁగు మద్దుఁ • బ్రియమునకును
నామధేయంబు లయ్యెఁ బి • నాకపాణి. 3

టీ. పేర్మి, అర్మిలి, మక్కువ, కూర్మి, నెమ్మి, నెనరు, గాదిలి, గారాము ॥రూ॥ గారము, నెయ్యము, ఇంపు, ప్రేముడి, అనుఁగు, మద్దు - ౧౪ = ప్రియము.

క. ఒనఁగూర్చె ననఁగ సమకూ
ర్చె నన౯ వీల్పఱిచె ననఁగఁ • జేకూర్చెను నా
ననుకూలపఱిచె ననుటకుఁ
దనరును నామంబు లై సు • ధాకరమకుటా. 4

టీ. ఒనకూర్చెను, సమకూర్చెను, వీలుపఱిచెను, చేకూర్చెను - ౪ = అనుకూలపఱిచెను.

క. చరియించె ననుట కాఖ్యలు
తిరిగెను జెరలాడె ననఁగఁ • దిరిమ్మరె ననఁ గ్రు
మ్మరె ననఁగ మసలె ననఁగాఁ
బురదానవహరణ శేష • భుజగాభరణా. 5

టీ. తిరిగె, చెరలాడె, తిరిమ్మరె, క్రుమ్మరె, మసలె - ౫ = చరియించెను.

తే. ఆఱుమూఁ డయ్యెఁ గచ్చువిచ్చయ్యె ననఁగ
బెడిసె బుసివోయె ననఁగను జెడియె ననఁగ
నాఖ్యలగుఁ గార్యవైకల్య మయ్యెననుట
కంధకాసురహరణ రౌప్యాద్రిశరణ. 6

టీ. ఆఱుమూఁడయ్యె, కచ్చువిచ్చయ్యె, బెడిసె, బుసివోయె, చెడియె - ౫ = కార్యముచెడెను.

క. అలజడి నెంజిలి పిమ్మట
సిలుగు గుత్తలపాటు వంత సేగి నెగుల్ గొం
దల మలమ టడరు గోఁడు
మ్మలిక వనట కుందు నా నమరు దుఃఖాఖ్యల్. 7

టీ. అలజడి, నెంజిలి, పిమ్మటి, సిలుగు, ఉత్తలపాటు, వంత, సేగి, నెగులు, కొందలము, అలమట, అడరు, గోడు, ఉమ్మలిక ॥రూ॥ ఉమ్మలికము, వనట, కుందు - ౧౫ = దుఃఖము.

క. అరిది వెలుం గచ్చెరు వ
బ్బుర మబ్రం బనఁగఁ జిత్రమునకుం బేళ్లౌ
సరణికిఁ బేళ్లగుఁ ద్రోవ యనఁ
దెరు వన దారి యన బాట తెన్నన నభవా. 8

టీ. అరిది, వెలుఁగు, అచ్చెరువు, అబ్బురము, అబ్రము - ౫ = చిత్రము. త్రోవ, తెరువు, దారి, బాట, తెన్ను - ౫ = మార్గము.

తే. ఐదుపదిచేసె వెనుకముందయ్యె జేణిఁగె
వీఁగె వెన్నిచ్చె వెనుకంజ వేసె ననఁగ

నోహటించె ననంగఁ జెల్లొప్పుచుండు
నాహవపరాఙ్ముఖుం డయ్యె • ననుట కభవ. 9

టి. అయిదుపదిచేసె, వెనుకముందయ్యె, జాఱఁగె, వీఁగె, వెన్నిచ్చె, వెనుకంజవేసె, ఓహటించె - ౭ = యుద్ధమందు పరాఙ్ముఖుఁడయ్యెను.

తే. మోహరించెను దండెత్తె • మొనసె దాడి
చేసెఁ బోటాగ్గెఁ గోల్తలఁ జేసె మాఱు
కొనియె దళమెత్తె ననఁగఁ జెల్లొప్పుచుండు
నాహవోద్యోగ మొనరించె • ననుట కభవ. 10

టి. మోహరించె, దండెత్తె, మొనసె, దాడిచేసె, పోటాగ్గె, కోల్తలచేసె, మాఱుకొనియె, దళమెత్తె-౯ = యుద్ధప్రయత్నము చేసెను.

తే. ఆహవోన్ముఖతకు నోల • మాస గొనక
పిఱుతివియ కీడఁబోక నఁ • జెల్లు దనరు
నబ్బెస మొనర్చెఁ గఱచె నా • నభ్యసించె
ననుట కభిధానములు చంద్ర • మోనతంస. 11

టీ. ఓలమాసగొనక, పిఱుతివియక, ఈడఁబోక-౩ = యుద్ధాభిముఖత. అబ్బెసమొనర్చె, కఱచె - ౨ = అభ్యసించెను.

క. వేటొక టనఁ బై పెచ్చన
మాఱట యిమ్మడి యనఁ జె స • మాహ్వయములు పెం
పారును వస్త్వంతరమున
కౌరగకేయూరసహిత • హతమారజితా. 12

టీ. వేటొకటి, పైపెచ్చు, మాఱట, ఇమ్మడి-౪ = వస్త్వంతరము.

సీ. ఆఱడిపోయెను • బీఱువోయెను రిత్త
వోయెను వీసర • వోయె ననఁగ
నుడివోయెఁ బొలివోయె • నుడివోయె ననఁగను
వ్యర్థమయ్యె ననుట • నాఖ్యలయ్యెఁ
గడిమి బీరంబు మ•గంటిమి గండన
విక్రమాహ్వానంబు లై • వెలయుచుండు
నాస్ఫాలన మొనర్చె • ననుటకుఁ జఱచె నా
నప్పళించె ననంగ • నాఖ్యలయ్యె
తే. నొగి వరుస యొలి సొరిద నా • నోజ నాఁగఁ
గ్రమమునకు నాఖ్య లయ్యెను • గాలకంత
కొలఁ కొలఁత తక్కువ వెలితి • కొదవ కడమ
యనఁగ నూనంబునకు నాఖ్య • లై తనర్చు. 13

టీ. ఆఱడిపోయె, బీఱువోయె, రిత్తవోయె, వీసరవోయె, నుడివోయె, పొలివోయె, నుడివోయె - 6 = వ్యర్థమయ్యెను. కడిమి, బీరము, మగఁటిమి, గండు - 4 = విక్రమము. చఱచె, అప్పళించె - 2 = ఆస్ఫాలన మొనర్చెను. ఒగి, వరుస, ఒలి, సొరిది, ఓజ - 5 = క్రమము. కొలఁ, కొలఁత, తక్కువ, వెలితి, కొదవ, కడమ - 6 = ఊనము.

తే. నెట్టుకొనెఁ బొలుపడె నొడి • గట్టె ననఁగఁ
గడఁగెఁ దొడఁగెను జెలరేఁగెఁ • గాలుద్రొక్కెఁ
గవిసెఁ గదిసె ననంగ నా • ఖ్యలయి యొప్పు
నభిముఖుం డయ్యె ననుటకు • నగని వేళ. 14

టీ. నెట్టుకొన, పొలుపడి, ఒడిగట్టి, కదఁగ, తొడఁగ, చెలరేఁగ, తాఁబ్రొక్క, కవిస, కదిసెన్ = అభిముఖుఁడయ్యెను.

తే. అగపడకపోయె విచ్చుమొగ్గయ్యె ననఁగఁ
గంటఁబడదయ్యెఁ బంచబంగాళ మయ్యె
ననఁగ దృగ్గోచరం బయ్యె ననుట పెల్లు
కలుషఘటితశూల వైయాఘ్రచర్మచేల. 15

టీ. అగపడకపోయె, విచ్చుమొగ్గయ్యె, కంటఁబడదయ్యె, పంచబంగాళమయ్యె - ౪ = దృగ్గోచరంబయ్యెను.

క. వెలిచవి చీఁకటితప్పనఁ
బొలుపారఁగ జారభావమునకుం బేళ్లౌ
బులుఁ గసటు చిలుమనంగను
మలిన మనుట కాఖ్య లయ్యె మనసిజదమనా. 16

టీ. వెలిచవి, చీఁకటితప్పు - ౨ = జారభావము. బులుఁగు, కసటు, చిలుము - ౩ = మలినము.

ఆ. వింగడం బనంగ విపరీత మగు నుక్కి-
వం బనఁగను గుత్సితంబు పరఁగు
నాఖ్య యగుచుఁ దనరు నామని యనఁగను
మదమునకును జంద్రమగకలాప. 17

టీ. వింగడము = విపరీతము. ఉక్కివము = కుత్సితము. ఆము = మదము.

క. ఎల యండ్రు తరుణ మనుటకుఁ
గొల యన దురితంబుపేరు కుడియెడమ లనన్

వలపలదాపల లనఁగను
బోలువుగ నపసవ్యసవ్య • ములకుం జెల్గా- 18

టీ. ఎల = తరుణము. కొల = దురితము. కుడియెడమలు, వలపల దాపలలు-౨ = దక్షిణవామభాగములు.

క. తగు నౌద్ధత్యము పేళ్లై
పొగరన నామనఁగఁ దుర్లు • పోతర మనఁగా
నెగడును భయంబు పేళ్లై
బెగడు దిగులు వెఱపు జంకు • బీతలు కనఁగన్. 19

టీ. పొగరు, అమ, తుర్లు, పోతరము-౪ = ఔద్ధత్యము. బెగడు దిగులు, వెఱపు, జంకు, బీతు, అలుకు -౬ = భయము.

క. అరి యనఁ గప్పం బనఁగాఁ
గరమునకుం బేళ్లు కాఁగు • కడవ పనఁటి నాఁ
బరఁగు ఘటాఖ్యలు నమితా
మరమానిని కాయ భూతి • మండితకాయా. 20

టీ. అరి, కప్పము-౨ = పన్ను. కాఁగు, కడవ, పనఁటి ॥పా॥ పంటి-౪ = ఘటము.

తే. అలరుచుండును గొండ్లి రం • తనఁగఁ గేళి
హాని కాఖ్యలు చేటు కీ • డుఱ యనంగ
హెచ్చరిక హాళి సంతసం • బెలమి వేడ్క
యనఁగ నానందమున కాఖ్య • లై తనర్చు. 21

టీ. గొండ్లి, రంతు-౨ = కేళి. చేటు, కీడు, ఉఱ-౩ = హాని. హెచ్చరిక, హాళి, సంతసము, ఎలమి, వేడ్క-౫ = ఆనందము.

క. సాహిణ మనఁ బాగా యన
శ్వాహాగారంబునకును • వర్తిలుఁ జెల్లె
వ్యూహమున కాఖ్య లయ్యెను
మోహార మన నొడ్డనంగ • మొగ్గర మనఁగన్. 22

టీ. సాహిణము, పాగా - 2 = అశ్వశాల. మోహారము, ఒడ్డు. మొగ్గరము - 3 = వ్యూహము.

క. ఒనరించె ననఁగఁ గావిం
చె ననంగను సలిపె ననఁగఁ • జేసె ననంగాఁ
జను నాచరించె ననుటకుఁ
గనకాచలచాప చంద్ర • ఖండకలాపా. 23

టీ. ఒనరించె, కావించె, సలిపె, చేసె - 4 = ఆచరించెను.

తే. చీఁకువా లిరు లనఁగను • జీఁకటి యనఁ
దిమిరమునకు నభిఖ్యలై • తేజరిల్లు
నాఖ్యలై తనరారు ను•పాయమునకు
సుళు వనఁగ వెర వనఁగను • సూటి యనఁగ. 24

టీ. చీఁకువాలు, ఇరులు, చీఁకటి - 3 = తిమిరము. సుళువు, వెరవు, సూటి - 3 = ఉపాయము.

తే. చేరువయ్యెను దాసెను • దారసిల్లె
ననఁగ సన్నిహితం బౌట • నాఖ్య లయ్యె
స్థూల మనుటకుఁ బెళ్ళగుఁ • దోర మనఁగఁ
గడిఁది వలుఁద యనంగను • గాలకంఠ. 25

టీ. చేరువయ్యె. దాసె. ||పా|| దాసె, దారసిల్లె - 4 = సన్నిహితమవుట. తోరము, కడిఁది, వలుఁద - 3 = స్థూలము.

తే. వాడెఁ గనుగొందె ననఁ బుయి • లోఁడె ననఁగ
విన్నవోయె ననంగను • జిన్నవోయె
ననఁగఁ జెల్లగు నివి ఖిన్నుఁ • డయ్యెననుట
కంధకాసురహరణ రౌ • ప్యాద్రిశరణ. 26

టి. వాడె, కనుగొందె, పుయిలోఁడె, విన్నవోయె - ౪ = ఖిన్నుఁడయ్యె.

క. గరువము మురిపం బనఁగను
బరఁగుఁ గర్వంబు పేళ్లు • భటనామము లొం
టరి లెంక బం టనంగను
బురదానవహరణ శేష • భుజగాభరణా. 27

టి. గరువము, మురిపము, - ౨ = గర్వము. ఒంటరి, లెంక, బంటు -
3 = భటుఁడు.

క. అరదంబు తేరనంగను
బరఁగు రథంబునకుఁ బేళ్లు • పరి యన్నను గా
లరు లనఁ బదాతిసంహతి
పురదానవహరణ శేష • భుజగాభరణా. 28

టి. అరదము, తేరు - ౨ = రథము. పరి, కాలరులు - ౨ = కాల్బలము.

క. సందియ మన ననుమాన మ
నం దనరును సంశయంబు • నకుఁ బేళ్లై గో
బృందాహ్వయంబు లలరును
మం దనఁ గోన యనఁ జంద్ర • మఃఖండధరా. 29

టి. సందియము, అనుమానము - ౨ = సంశయము. మంద, కోన
- ౨ = గోసమూహము.

క. మొన వాఁగు దండు దళ మనఁ
దనరుఁ సైన్యంబు పేళ్లు ♦ దళవాయి యనన్
మొనకాఁ డనంగఁ బడవా
లనఁగన్ సేనాధిపతికి ♦ నాఖ్యలు వొలుచున్. 30

టీ. మొన, వాఁగు, దండు, దళము - ౪ = సైన్యము. దళవాయి; మొనకాఁడు, పడవాలు - 3 = సేనాధిపతి.

తే. మైకొనిరియె నియ్యకొనె నొడం♦బడియె నొప్పె
ననఁగ నంగీకరించుట ♦ కాఖ్య లయ్యె
సంఘటించుట కాఖ్య లై ♦ జానుమీఱుఁ
జెరివెఁ దుఱిమెను గీల్కొల్పె ♦ జెక్కెననఁగ. 31

టీ. మైకొనియె, ఇయ్యకొనె, ఒడఁబడె. ఒప్పె - ౪ = అంగీకరించెను. చెరివె, తుఱిమె, కీల్కొల్పె, చెక్కె - ౪ = సంఘటించెను.

తే. దిట్టపడియె ముక్కాఁకలు ♦ దీఱె ననఁగ
నాఱితేఱె ననం గడి♦దేఱె ననఁగఁ
గసిమసంగె ననంగనా ♦ ఖ్యలు దనర్చు
నిపుణుఁ డయ్యె నటంచుఁ ♦ ద్రిపురవైరి. 32

టీ. దిట్టపడియె, ముక్కాఁకలుదీఱె, ఆఱితేఱె, గడిదేఱె, కసిమసంగె - ౫ = నిపుణుఁడయ్యె.

క. తడవు వడి కారనంగా
నడరుం గాలంబు శిథిల ♦ మయ్యె ననుట యా
విడె వీడె నూడె విచ్చెను
వడలె నురలె వదలెఁ బ్రిదిలె ♦ జాఱె ననంగన్. 33

టి. తడవు, వడి, కాలు-3 = కాలము. విడె, పీడె, ఊడె, పిచ్చె, సడలె, ఉరలె, వదలె, ప్రిదిలె, జాఱె-౯ = శిథిలమయ్యెను.

క. మది డెంద ముల్ల మెద యన
హృదయంబున కాఖ్య లయ్యె • నీరం బనఁగాఁ
బొదరి ల్లనఁగ నికుంజము
సదయాంతఃకరణ తరుణ•చంద్రాభరణా. 34

టి, మది, డెందము, ఉల్లము, ఎద-౪ = హృదయము. ఈరము, పొదఱిల్లు-౨ = నికుంజము.

క. తెగ దినుసు తోయ మనఁగను
నెగడుఁ బ్రకారంబునకును • నెత్తి నామములై
మెగ మనఁగ మెక మనంగను
మృగమునకు నభిఖ్యలయ్యె • మేరుశరాసా. 35

టి. తెగ, దినుసు, తోయము-3 = ప్రకారము. మెగము, మెకము-౨ = మృగము.

క. ఎడ దవ్వు కెళవ నంగా
నడరుఁ దూరంబునకు స•మాఖ్యలు నలి నా
పొడి నుగ్గు తుమురు నలు మన
బెడఁగడరుం జూర్ణమునకుఁ • బేళ్లై శర్వా. 36

టి. ఎడ, దవ్వు, కెళవు-3 = దూరము. నలి, పొడి, నుగ్గు, తుమురు, నలుము-౫ = చూర్ణము.

క. ప్రేరేచెను బురిగొలిపెను
దారిచె ననఁ జోదనకును • దగు నాఖ్యలు పెం

పారును జంబూద్వీపము
నేరెడుదీవి తొలుదీ వ॰నెడు నామములన్. 37

టీ. ప్రేరేచెను, ప్రోకొలిపెను, తారిచెను - 3 = ప్రేరణచేసెను.
నేరెడుదీవి, తొలుదీవి - 2 = జంబూద్వీపము.

క. తొలఁగెం బాసె ననంగా
నలరున్ విముఖతకుఁ బ్రాప్తమయ్యె ననుట పే
ళ్ళలమె నొదవె దక్కెనియెను
నెలకొనియెం జెందె ననఁగ నెక్కొనియె ననన్. 38

టీ. తొలఁగెను, పాసెను - 2 = విముఖత. అలమె, ఒదవె, దక్కె-
నియె, నెలకొనియె, చెందె, నెక్కొనియె - 6 = ప్రాప్తమయ్యెను.

క. వెనుకఁ దరువాతఁ బిమ్మట
ననఁగా నంతట ననంగ నంత ననంగాఁ
దనరుం బశ్చాదర్థము
కనకాచలచాప చంద్రఖండకలాపా. 39

టీ. వెనుకన్, తరువాతన్, పిమ్మటన్, అంతటన్, అంతన్ - 5 =
పశ్చాదర్థము.

క. పల్లఱుపులు రజ్జు లనం
బ్రిల్లదము లనంగ వ్యర్థభాషణములకుం
జెల్లై వర్తిలు నోలిగ
సల్లోకజనాభిశరణ యురగాభరణా. 40

టీ. పల్లఱుపులు, రజ్జులు, ప్రిల్లదములు - 3 = వ్యర్థభాషణము.

క. కైసేఁ తలంకరించుట
చేసి యనఁగ విషమమునకుఁ • బేరై వెలయుఁగ
సేసలు దీవనఁబ్రాలన
ఖాసిలు మంత్రాక్షతలకుఁ • బర్యాయము లై. 41

టీ. కైసేఁత = అలంకరించుట, చేసి = పరిగాపెడి, సేసలు, దీవనఁబ్రాలు-౨ = మంత్రాక్షతలు.

క. కోరన పాలన నంశం
బే అన వాకఁ యన నదికి • నెసఁగును బ్రత్తై
నీరాజనంబు పేళ్లగు
నారతి నివ్వాళి యనఁగ • నంగజగమనా. 42

టీ. కోరు, పాలు-౨ = అంశము. ఏఱు, వాఁక-౨ = నది. ఆరతి, నివ్వాళి-౨ = నీరాజనము.

ఆ. మొఱవవోయె ననఁగ • మొద్దువోయె ననంగఁ
గుంఠమయ్యె ననుట • కుం దనర్చు
శాతమునకు నాఖ్య • లై తనరారును
జులుకు వాఁడి తెగువ • కలుకు కనంగ. 43

టీ. మొఱవవోయె, మొద్దువోయె-౨ = కుంఠమయ్యెను. చులుకు, వాఁడి, తెగువ, కలుకు-౪ = తీక్ష్ణము.

సీ. యామికులకు నాఖ్య • లై ప్రవర్తిలు చుండు
నారెకు లనఁగఁ దలారు లనఁగఁ
గల్లంబు వాగె నాఁ • గను ఖలీనంబు పే
ళ్లలరు దంతంబు వే • రౌ మనంగ

దళపి నా ముదురు నాఁ • దరుణేతరం బంట
యించుఁ జెఱకన • నిక్షు వలరు
నష్టం బొనర్చె నం•టకు నాహ్వయము లన్యోఁ
బొకార్చె ననఁగ గొ•ల్పుచ్చె ననఁగ

తే. గుదె యనఁగ దుడ్డనంగను • గదనఁ బేళ్లు
యినుమనఁగ మంచనంగను • హిమము పేళ్లు
కాన యన నడవి యనంగఁ • గాననంబు
వర్ధకుఁడు తోడియల్లుఁడు • జగిలెఁడనఁగ. 44

టీ. అరెపలు, తలారులు - ఇ = తెలవర్లు కళ్లెము, వాగె - ఇ = ఖలీనము. ఓడు = దంతము. దళపి, ముదురు - ఇ = తేఁత కానిది. ఇంచు, జెఱకు - ఇ = ఇక్షువు. పొకార్చె, గొల్పుచ్చె - ఇ = నష్టముచేసెను. గుదె, దుడ్డు - ఇ = గద. ఇనుము, మంచు - ఇ = హిమము. కాన, అడవి - ఇ = అరణ్యము, తోడియల్లుడు, జగిలెఁడు - ఇ = వర్ధకుఁడు.

క. తేనియ యన జున్నన నభి
ధానంబులు మధువునకును • దనరుం బేళ్లై
పానకము చెఱకుపా లనఁ
గా నిక్షురసంబునకును • గం శేకాలా. 45

టీ. తేనియ, జున్ను - ఇ = మధువు. పానకము, చెఱకుపాలు - ఇ = ఇక్షురసము.

క. ఉడిగెను జాలించెను నా
నడఁకు విరామం బొనర్చె • నడుటకు బేళ్లై

తొడరుం బశ్చాద్భాగము
పెడ యనఁగా వెనుక యనఁగ • విఱుఁదు ననంగ౯. 46

టీ. ఉడిగెను, చాలించెను -౨ = విరమించెను. పెడ, వెనుక, విఱుఁదు -3 = పశ్చాద్భాగము.

క. విడుమర యన విడుదల యనఁ
గడముట్టుట యనఁగ శాంతి • గనుటకుఁ జెల్లా
నెడ వంక చక్కి చోటన
నడరు స్థలంబునకు నాఖ్య • లై శితికంఠా. 47

టీ. విడుమర, విడుదల, కడముట్టుట-3 = శాంతిగనుట. ఎడ, వంక, చక్కి, చోటు—౪ = స్థలము.

క. చూచుఁ గ్రుద్ధుఁ డయ్యె ననుటకుఁ
గినిసెఁ గనలె నలిగెఁ గోప • గించె ననంగాఁ
దనరు౯ మర్మములకుఁ జె
ళ్ళనువు లనఁగ నెఱుకు లనఁగ • నాయము లనఁగ౯. 48

టీ. కినిసె, కనలె, అలిగె, కోపగించె-౪ = క్రుద్ధుఁడయ్యెను. అనువులు, నెఱుకులు, ఆయములు-3 = మర్మములు.

ఆ. పరగుఁ జెళ్ళు కార్య • కరునకుఁ బార్పత్తె
కాఁ డనంగ మణియ • కాఁ డనంగఁ
దేజరిల్లుచుండు • దేవేరి దొరసాని
రాణి యనెడు పేళ్ళు • రాజపత్ని. 49

టీ. పార్పత్తెకాఁడు, మణియకాఁడు-౨ = కార్యకరుఁడు. దేవేరి, దొరసాని, రాణి-3 = రాజపత్ని.

క. మ్రింగె నన గుత్కగొనియె న
నంగం దగుఁ గబళనం బొ•నర్చె ననుటకున్
బ్రుంగె మునింగె ననంగ న
నంగహరా మగ్న మయ్యె • ననుటకుఁ జెల్లున్. 50

టీ. మ్రింగె, గుత్కగొనియె — 2 = కబళనముచేసెను. బ్రుంగె. మునింగె — 2 = మగ్నమయ్యెను.

సీ. అఖ్యలై తనరు ధ•నాగారమునకు ను
గ్రాణం బనంగ బొ•క్కస మనంగ
నాస్థానమండ పా•హ్వయములై తనరు హ
జారం బనంగ మో•సల యనంగ
దయకు నీ రెం డభి•ధానంబు లయ్యెను
గనికర మనఁగ న•క్కటిక మనఁగ
బాల్యస్థునకుఁ జెల్లు • పరిఢవిల్లుచు బిన్న
వాఁడన గొండిక•వాఁ డనంగ

తే. సంధ్య కాఖ్యలు మునిమాపు•సంజ యనఁగ
జూదమన నెత్తమనఁగ దు•రోదరంబు
జడి యనఁగ వాన యనఁగ వ•ర్షంబు పేళ్లు
నోలి యుంకువ యన శుల్క • మొప్పు నభవ. 51

టీ. ఉగ్రాణము, బొక్కసము — 2 = ధన ముండెడిస్థలము. హజారము, ॥పా॥ పేజారము, మోసల — 3 = ఆస్థానమండపము. కనికరము, అక్కటికము — 2 = దయ. పిన్నవాఁడు, గొండికవాఁడు — 2 = బాల్యస్థుఁడు.

మునిమాపు, కంజ — లు = సంధ్యాకాలము. జూదము, నెత్తము — లు = ద్యూతము. జడి, వాన — లు = వర్షము. ఓరి, ఉంకువ — లు = శుల్కము.

సీ. పయ్యెద యనఁగను • పైఁట యనంగ సం
వ్యానంబునకు నాఖ్యలై తనర్చు
నొకపెట్ట ననంగ • నువ్వెత్తుగ ననంగ
యుగపత్ప్రసంగమున • కొప్పుఁ బేళ్లు
కవలు లనఁ బోఁచిక లనంగ నక్షముల్
బన్న మొచ్చె మనంగఁ • బరిభవంబు
వ్యాపార మగు చెయ్ద • మనఁ జెయ్దు యనఁగను
గన్న నఁగీ లనఁ • గపటచేష్ట
తే. కందుకము బంతి చెండనఁగను దనర్చు
నలవలలు విద్రిప లన ఖం • డాహ్వయములు
కాఁచువడియంబు లనఁగను • గైరవళ్ళు
నంగ ఖాదిరఘుటిక లనంగఁదనర. 62

టీ. పయ్యెద, పైఁట — లు = ఉత్తరీయము. ఒకపెట్ట, ఉవ్వెత్తుగ — లు = ఒకపారిగ. కవలులు పోఁచికలు — లు = అక్షములు. బన్నము, ఒచ్చెము — లు = తిరస్కారము. చెయ్దము, చెయ్దు — లు = వ్యాపారము. కన్న, కీలు — లు = కపటచేష్ట. బంతి, చెండు — లు = కందుకము. అలవలలు, విద్రిపలు — లు = ఖండములు. కాఁచువడియములు, కైరవళ్ళు — లు = ఖాదిరఘుటికలు.

సీ. మాగాని రాజ్యంబు • మణిప ముద్యోగంబు
చిట్టలు చిత్రముల్ • చిలుకు శరము

ఎత్తికోలు ప్రియమ్న • మీాలువు మానంబు
బారియనంగ నుపద్రవంబు
విన్నను వనఁగఁ బ్రావీణ్యం బెలర్పను
దాగ్రాణమనఁగ నిదర్శనంబు
నిట్టుపంట యనంగ • నిష్కారణం బంట
బాసనం బనఁగ మహాసనంబు
తే. నామ మేకాంతమునకు మంతన మనంగ
నంతిపుర మన శుద్ధాంత • మలరుచుండు
నుదిరి యనఁ దప్తకాంచన • మొప్పుచుండు
దివురుట యభిలషించుట • దేవదేవ. 53

టీ. మాగాణి = దళము. మణిపము = ఉద్యోగము. బిట్ట = ఆశ్చర్యము. చిలుక = బాణము. ఎత్తికోలు = ప్రయత్నము. తాలువు = పాతివ్రత్యము. బారి = ఉపద్రవము. విన్ననువు = ప్రావీణ్యము — నేర్పు. దాగ్రాణము = నిదర్శనము. నిట్టుపంట = నిష్కారణము. బాసనము = పంటకాల్లు. మంతనము = ఏకాంతము. అంతిపురము = అంతఃపురము. ఉదిరి = అపరంజి, తివురుట = కోరుట.

సీ. బిట్టు గట్టనఁ బెల్లు • పెద్దయుఁ దద్దయు
నురవడి పరువడి • యుద్ధవిడియుఁ
బనివడి పదపడి • బలువిడి తలకొని
నెట్టన యెంతేని • నెఱి గరంబు
లలి వార కేస్త్రై అ • పెలుచ వావిరి యన
నఱిమిఱి యనఁ బోరిఁ•బోరి యనంగఁ

గడుఁ జాల మిగులంగ • గాటఁ మనంగ న
త్యంతముగ ననుట • కాఖ్య లయ్యె
తే. నుడుకు సెక వెట్ట వేఁడిమి • యుబ్బ యావి
యుక్క యన నొప్పు నామంబు • లుష్ణమునకు
దాల్మి యోరిమి సైరణ • తాళుకొంట
సైఁచు టోర్పుట యనఁగను • క్షాంతిపేళ్లు 54

టి. బిట్టు, గట్టి, పెల్లు, పెద్దయు, తద్దయు, ఉరవడి, పరువడి, ఉద్దవిడి, ||పా|| ఉద్దవడి, పనివడి, పదపడి, బలువిడి, తలకొని, నెట్టన, ఎంతేని, నెఱి, కరము, లలి, వారక, ఎడ్డెఱ, వెలుచ, వావిరి, అతిముఱి, పొరిఁబొరి, కడు, చాల, మిగుల, గాటము - ౨౭ = అత్యంతము. ఉడుకు, సెక, వెట్ట, వేఁడిమి, ఉబ్బ, ఆవి, ఉక్క - ౭ = ఉష్ణము. తాల్మి, ఓరిమి, సైరణ, తాళుకొంట, సైఁచుట, ఓర్పుట - ౬ = క్షాంతి.

తే. పెద్దనిద్దురఁ జెందించెఁ • బిలుకుమార్చె
గీటణంచెను గుదెతాల్పు • పీటి కనిచెఁ
గూలిచెను రూపుమాపెను • నేలఁగలిపె
ననఁగ హతిచేసె ననుట కా • ఖ్యలు దనర్చు. 55

టి. పెద్దనిద్దురఁజెందించె, పిలుకుమార్చె, గీటణఁచె, గుదెతాల్పు వీటికనిచె, కూలిచె, రూపుమాపె, నేలఁగలిపె - ౭ = హతిచేసెను.

క. పరిమార్ణ మయ్యె ననుటకు
వరుసఁ నామంబు లగుచు • వర్తిలుచుండుఁ
దుఱు మయ్యెం బరుమయ్యెఁ
నుఱుమయ్యెఁ బిండియయ్యె • నుగ్గయ్యె ననఁ. 56

టీ. ఊలుమయ్యె, పరుమయ్యె, నలుమయ్యె, పిండియయ్యె, నుగ్గయ్యె—౫=చూర్ణమయ్యెను.

క. కునికె నిదురించెఁ గూర్కెను
గనుమోడ్చె ననంగ నిద్రఁగనుటకుఁ బేళ్లౌఁ
గనువిచ్చె ననఁగ మేల్కనె
ననఁగఁ బ్రబోధంబునొందె ననుటకుఁ బేళ్లౌ. 57

టీ. కునికె, నిదురించెను, కూర్కెను, కనుమోడ్చెను—౪=నిద్రగనెను కనువిచ్చె, మేల్కనె—౨=ప్రబోధమయ్యెను.

క. డులిచె వదలించె నూడ్చెను
దొలఁగించెం బాపె ననఁగ ద్రోచె ననంగా
వెలిగొత్తె ననఁగఁ బేళ్లయి
యలరున్ విఘటన మొనర్చె ననుటకు శర్వా. 58

టీ. డులిచె వదలించె, ఊడ్చె, తొలఁగించె, పాపె, త్రోచె, వెలిగొత్తె—౭=విఘటన మొనర్చెను.

క. పాలయులుక యనఁగ నెయ్యపు
టులుక యనం బ్రణయకలహ మలరారుఁ గుచం
బుల కొప్పు నామములు గు
బ్బ లనంగాఁ జన్ను లనఁగఁ బాలిండ్లనఁగన్. 59

టీ. పాలయులుక, నెయ్యపుటులుక—౨=ప్రణయకలహము. గుబ్బలు, చన్నులు, పాలిండ్లు—౩=కుచములు.

తే. చోటమున్నీ రనఁగ సుప్పుసంద్ర మనఁగ
రాజిలుచు నుండు లవణవారాశి పేళ్లు

కాలువ నన బట్టె దనరంగను • జాలనంగఁ
గుల్య కభిధానమై పొల్చుఁ • [illegible] 60

టీ. చాటియున్నగు, ... — ౧ = ...ము. కాలువ, బట్టె, జాలు — ౩ = కుల్య.

తే. వెల్లగించెను బెకలించెఁ • బెతికె ననంగ
నాఖ్య లుత్పాటన మొనర్చె • ననుట కలదు
నాహ్వయంబులు ఛేదించె • ననుట కరయ ఖం
డించె నన వ్రచ్చె నన వ్రక్కలించె ననఁగ. 61

టీ. వెల్లగించె, పెకలించె, పెతికె — ౩ = ఉత్పాటన మొనర్చెను. ఖండించె, వ్రచ్చె, వ్రక్కలించె — ౩ = ఛేదించెను.

తే. కనుమొఱఁగె నేమఱించె నాఁ • గను నిగూఢ
వర్తన మొనర్చె ననుట కాఁ • హ్వయము లడరు
మొయిలు లన మొగుళ్లంగను • మొనయును మబ్బు
లన ఘనంబుల కాఖ్యలై • యభ్రకేశ. 62

టీ. కనుమొఱఁగె, ఏమఱించె — ౨ = నిగూఢవర్తనము చేసెను. మొయిలు, మొగుళ్లు, మబ్బులు — ౩ = మేఘములు.

క. పగఱనఁగ మార్తురనఁగను
బగవాండ్రనఁ బగతురనఁగఁ • బరిపంథికిఁ బే
ళ్లగు మెగ మనంగ మెకమన
మృగమునకు నభిఖ్య లయ్యె • మేరుశరాసా. 63

టీ॥ పగఱు, మార్తురు, పగవాండ్రు, పగతురు — ౪ = విరోధి, మెగము, మెకము, — ౨ = మృగము

తే. ఇంకె నడుగంటె వట్టె నా • యివిరె నరఁగ
నిర్జలంబయ్యె ననుటకు • నెగడుఁ బెల్లు
నిండెఁ గ్రిక్కిఱిసె నఁ బూ • ర్ణించె ననుట
కాఖ్యలై తనరారు సు • ధాంశుమకుట. 64

టి॥ ఇంకె, అడుగంటె, వట్టె, ఇవిరె-౪ = నిర్జలమయ్యెను. నిండె, క్రిక్కిఱిసె,-౨ = పూర్ణించెను.

తే. పెచ్చు పెరిఁగె ననం బురి • విచ్చె మీఱె
నన విజృంభించె ననుటకు • నాఖ్యలయ్యె
దిండికాఁ డనఁ దిండీఁడు • తిండిపోత
నంగ భక్షకునకును ద • నర్చుఁ బెల్లు

టి॥ పెచ్చుపెరిగె, పురివిచ్చె, మీఱె-౩ = విజృంభించెను. తిండికాఁడు, తిండీడు, తిండిపోతు-౩ భక్షకుడు

క. పెనఁగొనె గిఱికొనియెను వల
గొనియెన్ మెలికొనియెఁ జుట్టు • కొనె సుడిగొనె నాఁ
గను నులిగొనె నన నాఖ్యల
గును వలయిత మయ్యె ననుట • కును శితికంఠా. 65

టి॥ పెనఁగొనె, గిఱికొనె, వలగొనె, మెలికొనె, చుట్టుకొనె, సుడిగొనె, నులిగొనె-౭ = వలయిత మయ్యెను.

సీ. మొగరా లనఁగ స్తంభ • ములు పిట్టకము దంభ
మెరగలి వనవహ్ని • యెద్దె మార్గుఁ
డుపగర యుపహార • మూఱట విశ్రాంతి
మొకలని యనఁగను • మూల మనుట

తఱు లన వళులు చింద • మనంగ శంఖంబు
తఱటవంగఁ గశాభి • ధాన మయ్యెఁ
దమ టనఁ గీల పా • నం బగు మెట్టన
గాయకులకుఁ బేరు • గాణ లనఁగ

తే. మృత్యువునకును బేరయ్యె • మిత్తి యనఁగ
మకుటమున కాఖ్య యగు బొమి • డిక మనంగ
నోముట యనంగఁ బోషించు • టూడిగంబు
సేవ కభిధానమై యొప్పు • శేషభూష. 67

టీ. మెంగరాలు = స్తంభములు. చిట్టకము = దంభము. (లేక) మిష. ఎరగలి (ఎరవలి) — ఇ = వనవహ్ని. ఎడ్డె = మూర్ఖుఁడు. ఉడుగర = కానుక (లేక) బహుమానము. ఊటాటు = విశ్రాంతి. మొదలు = మూలము. తఱులు = వళులు (అనఁగా కడుపుమీఁది మడుతలు) చిందము = శంఖము. తఱటు = కశ (గుఱ్ఱముల శిక్షించు చబుకు). తమట = అగ్నిజ్వాల. మెట్ట = పానము. గాణలు = గాయకులు. మిత్తి = మృత్యువు. బొమిడికము = కిరీటము. ఓముట = పోషించుట. ఊడిగము = సేవ.

సీ. ఎట్టకేల కనంగ • నెనయును సకృదర్థ
మఖిలం బటంటకు • నంతవట్టు
ఏకాకి యెక్కటి • నేకులు పలువురు
వేనవేల్ పెక్కండ్రు • వేవు రనఁగ
వలరు నోచేదర్థ • మై కాసినాఁ డన
నేతాదృశులె యంట • కిట్టివారె

మిన్నక యూరక • యున్నఁ దూష్ణీమర్థ
మనుసరించి యటంట • కగును దొట్టి
తే. యొండొకఁ డనంగ మఱియు వేఱొకఁడు లాఁతి
వాఁడు పెఱవాఁడు దక్కినవాఁ డనంగ
నన్యునకు నాఖ్య లగుచుఁ బెంపారు చుండు
శయఘటితశూల వైయాఘ్రచర్మచేల. 68

టీ. ఎట్టకేలకు = ఒకానొకప్పుడు. అంతవట్టు = అఖిలము. ఎక్కటి = ఏకాకి. పలువురు, వేనవేలు, పెక్కండ్రు, వేవురు -౪- అనేకులు. కానివాఁడు = అట్లుకాకపోయిన. ఇట్టివారె = ఏతాదృశులె-ఈలాటివారేయనుట. మిన్నక, ఊరక -౨- తూష్ణీమర్థకములు. తొట్టి = అనుసరించి. ఒండొకఁడు, వేఱొకఁడు, లాఁతివాఁడు, పెఱవాఁడు, తక్కినవాఁడు -౫- = అన్యుఁడు.

క. వడి యనఁగాఁ గాలం బగు
వడి యన వేగంబునకును • వర్తిలు బేరై
మడి యనఁ గేదారంబగు
మడి యనఁగా శుద్ధికిని స • మాహ్వయ మయ్యెన్. 69

టీ. వడి = కాలము, వేగము. మడి = వరిచేను, శుద్ధి.

క. ఈ డనఁగ వయసు పే రగు
నీ డన సామ్యంబునకును • నెసఁగును బేరై
నా డన రాజ్యము పే రగు
నాఁ డనఁ దత్కాలమం ద•నఁగఁ బెంపారున్. 70

టీ. ఈడు = వయస్సు, సామ్యము. నాడు = రాజ్యము. నాఁడు = తత్కాలమందు.

క. మొన యనఁ జైన్యము పేరగు
మొన యనఁగా నగ్రభాగ • మునకును బేరౌ
దొన యనఁ దూణీరం బగు
దొన యన నవపానమునకుఁ • దొడవును బేరై. 71

టీ. మొన = సైన్యము, అగ్రభాగము. దొన = అమ్ములపొది, ఆఁతము.

క. వెన్ననఁగ బీజమంజరి
వెన్ననఁ జఘనాంగమునకు • వెలయును బేరై
కన్నులనం బర్వంబులు
కన్నులనన్ లోచనములు • కంఠేకాలా. 72

టీ. వెన్ను = సస్యముల వెన్ను, వీఁపు. కన్నులు = కణుపులు, లోచనములు.

క. తమ్మి యనఁ దరువిశేషము
తమ్మి యనం బంకజాభి • ధానం బయ్యెన్
నెమ్మి యనఁ బ్రియము పేరగు
నెమ్మి యన మయూరమునకు • నెగడుం బేరై. 73

టీ. తమ్మి = వృక్షవిశేషము, తామర. నెమ్మి = ప్రియము, నెమలి.

క. దండ యనన్ సాన్నిధ్యము
దండన సుమమాలికాభి • ధానం బయ్యెన్
మండనఁ బ్రకోష్ఠ మయ్యెన్
మండన మృత్పాత్రికను స • మాహ్వయ మయ్యెన్. 74

టీ. దండ = సాన్నిధ్యము, పుష్పమాలిక. మండ = ప్రకోష్ఠము, మృత్పాత్రము.

క. తెలుఁగుం గబ్బపుఁబర్వము
తెలుఁగు కవీంద్రులకుఁ దేటతెల్లము గాఁగన్
దెలియఁగ నడిపము సూరయ
చెలువారఁగ నాంధ్రనామశేషముఁ జెప్పెన్. 76

సటీకాంధ్రనామశేషము

సంపూర్ణము.

శ్రీరస్తు.

# ఆంధ్రనామనిఘంటువు.

## (సాంబనిఘంటువు)

---

## సటీకము.

అవతారిక:—కస్తూరిరంగకవి యనునతఁడీ నిఘంటువును శ్రీసాంబమూర్తి కంకితముసేయువాఁడై మొదట దీనిని రచించు పద్ధతిని దెలుపుచున్నాఁడు:—

సీ. శ్రీవెలయంగ దే♦శీయముల్ దెనుఁగులుఁ
దద్భవంబులుఁ గూర్చి ♦ దైవవర్గ
దనరు మానవవర్గ ♦ స్థావరవర్గ తి
ర్యగ్వర్గ ననునాలు ♦ గలవరించి
జల్లు లుంపక వ్యర్థ♦శబ్దముల్ రానీక
కుంటెనడత గాక ♦ కోదుకు లేక
యుర్వీజనంబుల ♦ కుపకారసరణిగా
నాంధ్రనామనిఘంటు ♦ వనెడుకృతిని
తే. గవులదయచేత నీకటా♦క్షంబువలన
సీసశతకంబుఁ జెప్పెదఁ ♦ జిత్తగింపు
దనుజసమవర్తి భక్తహృ♦దబ్జవర్తి
సకలసురచక్రవర్తి శ్రీ♦సాంబమూర్తి. 1

టీ. ఓ సాంబమూర్తి ! ఈయాంధ్రభాషయందుఁగల యన్యదేశీయములను(దిలింగదేశీయములను సంస్కృతప్రాకృతభవములును గూర్చి, వానిని దేవ

వర్గు మానవవర్గు స్థావరవర్గు తిర్యగ్వర్గు అను నాలుగువర్గులుగా విభజించి, జల్లి (కల్ల) పదములుగాని, వ్యర్థపదములుగాని పెట్టక, వర్గములోప పదములను వోర నీక సరళశైలిని "ఆంధ్రనామ నిఘంటువు" అను నీగ్రంథమును తెనుఁగు జనువారల కుపయుక్తముగ కవులకృపచే నీయనుగ్రహముచేతను సీసశతకముగాఁ జెప్పుచున్నాను చిత్తగింపుము!

సీ. ముక్కంటితొలిపట్టి ♦ మొట్టికాయలమెప్పు
గొప్పబొజ్జగలాఁడు • గుజ్జువేల్పు
గబ్బుచెక్కిళ్ల మొ♦కముమోముగలసామి
కలుగులాయపుఁదేజి♦బలుసిపాయి
గుంజిళ్లు బెట్టించు♦కొనుమేటి పిళ్లారి
కుడుముదాలుపు పెద్ద♦కడుపువేలు
పొంటిపల్లుదొర ము♦క్కంటిపండులమెక్కు
దేవర చిలువజం♦దెములమేటి
తే. జమిలితల్లులబిడ్డ పె♦ద్దమయిపోఁడి
చేటవీనులదణి పని♦చెఱుపువాఁడు
మొదటివేలుపు వెనకయ్య • పుంజుదారి
పెద్ద యనఁ దగు గణపతి♦వేల్పు సాంబ. 2

టీ. ముక్కంటితొలిపట్టి = శివుని మొదటిబిడ్డ; మొట్టికాయల మెప్పు = భక్తులువేసికొను మొట్టికాయలను మెచ్చుకొనువాఁడు; గొప్ప...గలాఁడు = పెద్దపొట్టగలవాఁడు; గుజ్జువేల్పు=పొట్టిదేవుఁడు; గబ్బు...సామి = ఏనుఁగు మొగముగల దేవుఁడు; కలుఁగు...సిపాయి = కలుగులు గుఱ్ఱపుశాలగాఁ గల గుఱ్ఱములు (అనఁగా ఎలుకలు) వాహనముగాఁ గల గొప్ప వీరుఁడు; గుంజిళ్ళు

పెట్టించుకొనుమేటి = భక్తులచే గుంజిళ్ళు పెట్టించుకొను దొర; పిళ్ళారి; కుడుముదాలుపు = కుడుములను చేత ధరించియున్నవాఁడు ; పెద్ద...వేలుపు = గొప్పబొజ్జగల దేవుఁడు; ఒంటిపల్లుదొర = ఒకదంతముగల యేలిక; ముక్కంటి...దేవర = టెంకాయలనుభక్షించు దేవుఁడు; చిలువ...పేటి = సర్పములు జందెములుగాఁగల దొర; జమిలి...బిడ్డ = ఇద్దరుతల్లుల (అనఁగా గంగాపార్వతుల) బిడ్డ; పెద్దమెయిపోఁడ = గొప్ప దేహముగల దిట్ట; చేటవీనులదంటి = (గజముఖుఁడు గనుక) చేటలవంటి చెవులుగలదొర ; పని...వాఁడు = విఘ్నములకు రాజు; మొదటివేలుపు = మొదటఁబూజింపఁబడు దేవుఁడు; వెనకయ్య; పుంజుదారి పెద్ద = కుక్కుటధ్వజుఁడగు కుమారస్వామికి అన్నయైన వాఁడు -౨౦ = వినాయకుఁడు.

సీ. చౌవంచమోముల♦సాహేబు జాళువా
గుబ్బలివిలుకాఁడు ♦ గిబ్బరౌతు
జక్కులదొరనేస్తి ♦ జన్నంపుఁబగవాఁడు
పోఁడలగింటముదాల్పు ♦ పునుకదారి
వినువాఁకమోపరి ♦ వెండికొండదునేఁడు
మినుజుట్టుదేవర ♦ మిత్తిమిత్తి
మంచుమలల్లుఁడు ♦ మరుగొంగ ముక్కంటి
నెలదారి ముమ్మొన♦యలుఁగుమేటి
తే. విసపుమేఁతరి తిగపోరి♦వేఁటకాఁడు
కప్పుటైదువపెనిమిటి ♦ గాములదొర
వేల్పుదణిగన్నతఁడు గుజ్జు♦వేల్పుతండ్రి
జేసికస్వామి యన నీదు♦పేళ్లు సాంబ. 3

టీ. చౌవంచ...సాహేబు = (౪+౧) ఐదుముఖములుగల దొర జాళువా...విలుకాఁడు = బంగారుకొండ (మేరుపర్వతము) విల్లుగాఁ గల వాఁడు; గిబ్బరౌతు = ఎద్దునెక్కువాఁడు; జక్కుల...నేస్తి = యక్షపతియగు కుబేరునికి చెలికాఁడు; జన్నంపుఁబగవాఁడు = దక్షయజ్ఞవిరోధి; పొడల...దాల్పు = జంటపోగులుగల మచ్చలవస్త్రమును (పులితోలును) ధరించినవాఁడు; పునుకదారి = కపాలమును ధరించువాఁడు; వినువాఁకమోపరి = ఆకాశగంగను దలఁ ధరించినవాఁడు; వెండికొండదునీఁడు = కైలాస పర్వతమునికిగాఁ గలమేటి; మినుజొట్టుదేవర = ఆకాశమే సిగగాఁగలదేవుఁడు; మిత్తిమిత్తి = మృత్యువును చంపినవాఁడు; మంచుమల్లుఁడు = హిమవత్పర్వతమున కల్లుఁడు; మరునొంగ = మన్మథుని విరోధి; ముక్కంటి = మూఁడుకన్నులవాఁడు; నెలదారి = చంద్రుని ధరించినవాఁడు; ముమ్మొన...మేటి = మూఁడు మొనల (త్రిశూల మను) ఆయుధముగలదొర; విసపుమేఁతరి = హాలాహలమును భక్షించినవాఁడు; తిగ...కాఁడు = త్రిపురముల వేఁటాడినవాఁడు; కప్పు...పెనిమిటి = నల్లనిచాయగల స్త్రీకి (పార్వతికి) భర్త; గాములదొర = భూతపతి; వేల్పుదళిఁగన్నతఁడు = దేవసేనానియగు కుమారస్వామికి తండ్రి; గుజ్జు...తండ్రి = పొట్టిదేవుఁడగు వినాయకునితండ్రి; బేసికన్సామి = మూఁడుకన్నులదేవుఁడు—౨౩ = శివుఁడు.

సీ. వెన్నుఁడు పెరుమాళ్లు ♦ వేకంటిసైదోడు
కవ్వపుమలదాల్పు ♦ కఱ్ఱినేస్తి
చిలువపానుపుదంట ♦ తెలిదీవిమన్నీఁడు
బటువుఁగైదువుజోదు ♦ బమ్మతండ్రి
కఱివేల్పు మరునయ్య ♦ కడలియల్లుఁడు సంకు
దారి గరుడిరౌతు ♦ తమ్మికంటి

STUDENTS LITARARY ASSOCIATION LIBRARY No.

పదివేసములుఁదిట్ట ♦ యెదమచ్చగలసామి
యడుగువాఁకగలాఁడు ♦ పుడమినంటు

తే, గీ॥ మొసలివాయొంట్లతాల్పు ర♦క్కసులగొంగ
లచ్చిమగఁ డుడ్డకేలుగ♦లాఁడు పుట్టు
వడుగు తామరపొక్కిలి♦వాఁడు పసిఁడి
వలువతాల్పన హరిపేరు ♦ లలరు సాంబ. 4

టీ. వెన్నుఁడు; పెరుమాళ్లు (ఇది ద్రావిడపదము); కేకంటి పైదోడు=(వామనావతారమున) వేయికన్నులుగలయింద్రునికిఁ దోఁబుట్టువైనవాఁడు-ఉపేంద్రుఁడు; కవ్వపు...తాల్పు=మందరపర్వతమును (కూర్మావతారమున) ధరించినవాఁడు; క్రీడి నేస్తి=అర్జునుని చెలికాఁడు; చిలువ...దంట=సర్పము (అనఁగా ఆదిశేషుఁడు) శయ్యగాఁ గలనేర్పరి; తెల...మన్నీఁడు=శ్వేతద్వీపము వాసస్థానముగాఁ గల ప్రభువు; చుటుపు...జోదు=చక్రాయుధమును దాల్చినయోధుఁడు; బమ్మతండ్రీ=బ్రహ్మకుఁ దండ్రి; కఱివేల్పు=నల్లనిదేవుఁడు; మరునయ్య=మన్మథునితండ్రి; కడలియల్లుఁడు=పాలసముద్రునికి నల్లుఁడైనవాఁడు; సంకుదారి=శంఖమును ధరించిన వాఁడు; గరుడిరౌతు=గరుత్మంతు నెక్కి తిరుగువాఁడు; తమ్మికంటి=తామరలవంటి కన్నులుగలవాఁడు; పది...దిట్ట=దశావతారముల నెత్తిననేర్పరి; ఎద...సామి=ఱొమ్మునందు శ్రీవత్సమను పుట్టుమచ్చ గల దేవుఁడు; అడుగు...గలాఁడు=పాదములందు గంగానది గలవాఁడు (గంగ యతనిపాదములందుఁ బుట్టినదని యర్థము); పుడమినంటు=భూదేవికి స్నేహితుఁడు (అనఁగా ప్రియుఁడు); మొసలి...తాల్పు=మొసలినోటివలె నుండు పోఁగులను (అనఁగా మకరకుండలములను) ధరించినవాఁడు; రక్కసులగొంగ=రాక్షసులకు శత్రువు; లచ్చిమగఁడు=లక్ష్మీదేవి భర్త; ఉడ్డ...

గలాఁడు = నాలుగుచేతులు గలవాఁడు - చతుర్భుజుఁడు; పుట్టువడుగు = నిత్య బ్రహ్మచారి; తామర...వాఁడు = కమలము నాభియందుఁ గలవాఁడు - పద్మనాభుఁడు; పసిఁడి...తాల్పు = బంగారువస్త్రమును ధరించువాఁడు - ౨౬. = విష్ణుదేవుఁడు.

సీ. తీవంచమోములదిట్ట ♦ తామరచూలి
తలఁపుకేళాకూళి ♦ పులుఁగురౌతు
తగవులజడదారి ♦ తండ్రి వేలుపుఁబెద్ద
మాటలజవరాలి ♦ మగఁడు నలువ
యలరులవిలుకాని ♦ యన్న కేలిమిబొజ్జ
గలదుముగారి పాఁ ♦ బలుకులదణి
నుదురాకు లెక్కఁ జెన్నుగ వ్రాయుకరణీకుఁ
డచ్చంపుఁ దమ్మిపై ♦ నమరుజాణ
తే. నిక్కఁపుజగంబుఁ బొ(ప్రో)చుమ ♦ న్నీఁడు మొదటి
జాతిదొర బమ్మ దుగినఁడు ♦ తాత జగము
లన్ని పుట్టించుమేటి త ♦ నంతఁ గల్గు
నతఁడు పజదొర యన నజా ♦ ఖ్యలగు సాంబ. 5

టీ. తీవంచ...దిట్ట = (3 + ౧) నాలుగుముఖములు గల ప్రోడ; తామరచూలి = కమలమునందుఁ బుట్టినవాఁడు; తలఁపు...రౌతు = మానసస రస్సు పక్షులగు హంసలు వాహనముగాఁ గలవాఁడు; తగవుల...తండ్రి = కలహప్రియుఁడగు నారదముని తండ్రి; వేలుపుఁబెద్ద = దేవతలలో శ్రేష్ఠుఁడైనవాఁడు; మాటల...మగఁడు = సరస్వతికిఁ బెనిమిటి; నలువ = నాలుగు నోళ్లు గలవాఁడు; అలరు...యన్న = మన్మథునికి నన్నయైనవాఁడు;

మేలిమి...దారి = బంగారుమయమైన కడుపుగల సరదారు-హిరణ్యగర్భుఁడు; ప్రాఁబలుకులదణి = వేదముల కధిపతి; నుదురాకు...కరణీకుఁడు = నొసళ్ళనెడు తాటాకులలో నాయుస్సుల లెక్కలను జక్కఁగా వ్రాయునట్టి కరణము. నొసళ్ళయం దాయుఃప్రమాణములను వ్రాయునట్టివాఁ డని యర్థము; అచ్చంపు...జాణ = తెల్లనితామరపువ్వు (అనెడు సింహాసనము) మీఁద గూర్చుండునట్టి నేర్పరి; నిక్కపు...మన్నీఁడు = సత్యలోకమును బాలించు ప్రభువు; మొదటి...దొర = బ్రాహ్మణజాతికి నధిపతియైనవాఁడు; బ్రహ్మ; దుగినఁడు = ద్రుహిణుఁడు; తాత = పితామహుఁడు; జగము...మేటి = లోకములనెల్ల సృజి చునట్టి ఘనుఁడు. తనంత...నతఁడు = తనంతటఁదానే పుట్టినట్టివాఁడు-స్వయంభువు; పజదొర = ప్రజాపతి-౨౦ = బ్రహ్మ.

సీ. గబ్బిరాకొమరిత ♦ కప్పుముత్తైదువ
మగనియందపుమేనఁ ♦ దగినమగువ
కఱకంఠురాణి సిం♦గపుఁదేజిగలచాన
వెనకయ్యతల్లి నా ♦ వెలయు గౌరి;
కలుములచెలి జిడ్డు♦కడలిబొట్టియ లచ్చి
తమ్మిగద్దియబోటి ♦ తల్లితల్లి
పెనిమిటియెదనుండు♦ననబోఁడి మరుతల్లి
నెలచెలియలు లిబ్బి♦నెలఁతుక సిరి
తే. యనఁగ లక్ష్మిసమాఖ్య లౌ; ♦ నంచతేజి
పొలఁతి తలవాకిటమెలంగు ♦ చెలువ నలువ
రాణి పలుకులజవరాలు ♦ లచ్చికోడ
లనఁగ భారతినామంబు ♦ లమరు సాంబ. 6

టీ. గట్టురాకొమరిత = పర్వతరాజగు హిమవంతుని కూఁతురు; కప్పుముత్తైదువ = నల్లని శరీరచ్ఛాయగల వృద్ధసువాసిని; మగని...మగువ = భర్తయగు శివుని సుందరశరీరమునందు సగభాగముగా నొప్పియుండెడు స్త్రీ; కలికంతురాణి = శివునిపత్ని; సింగపు...చాన = సింహవాహనము గల స్త్రీ; వెనకయ్యతల్లి = వినాయకునితల్లి-౬ = పార్వతి. కలిములచెలి = సంపదల కధిదేవత యగు స్త్రీ; జిడ్డు...బోట్టియ = పాలసముద్రపుకూఁతురు; లచ్చి = లక్ష్మి; తమ్మి...బోటి = పద్మసింహాసనముగల స్త్రీ; తల్లి తల్లి = తన తల్లియైన గంగకుఁ దాను దల్లియైనది. పెనిమిటి... బోఁడి = మగనిఱొమ్మునందు వసించు స్త్రీ; మరుతల్లి = మన్మథునితల్లి; నెలచెలియలు = చంద్రుని చెల్లెలు (ఇరువురును సముద్రమునం బుట్టినవారగుటచే నిట్లు చెప్పఁబడినది.) లిబ్బి నెలఁతుక = ధననిక్షేపములయందుండు స్త్రీ; సిరి = శ్రీ-౧౦ = లక్ష్మి. అంచతేజిపొలఁతి = హంసవాహనముగల స్త్రీ; తల... చెలువ = నోటియందు సంచరించు స్త్రీ; నలువరాణి = బ్రహ్మభార్య; పలుకులజవరాలు = వాక్కులకు (అనఁగా విద్యలకు) అధిదేవత యగు స్త్రీ; లచ్చికోడలు = లక్ష్మీదేవికోడలు-౯ = సరస్వతి.

సీ. అడుగుఁ గైదువుపుల్గు ♦ పడగదునేదారి
యరబారతల్లుల ♦ యరిదిబిడ్డ
వెనకయ్య వెనుకయ్య ♦ వేల్పులదళవాయి
చిలువలబోనంపుఁ ♦ బులుఁగురౌతు
సత్తిఁబూనువలంతి ♦ యిత్తిగమోముల
బలియుఁడు బారచే♦తులుగలాఁడు
రిక్కరక్కసుమిత్తి ♦ తెల్లుకానుపు కొంచ
మలవఱిక్కలించిన ♦ మన్నెకాఁడు

తే. గట్లయేలికమనుమఁడు ♦ కప్పుతెఱవ
మేటికొమరుఁడు వేలుపు♦టేటిసవతి
కొడుకు ముద్దయ్య కందుఁడు ♦ కొమరుసామి
యనఁగ గుహనామధేయంబు ♦ లమరు సాంబ.

టీ. అడుగు...దు సేదారి = (పాదములే యాయుధముగాఁగల పక్షి యగు) పుంజుకోడి ధ్వజమునందుఁగల సరదారు; అర...బిడ్డ = ఆఱు తల్లుల (అనఁగా షట్కృత్తికల) యబ్బురపుబిడ్డ; వెనకయ్యవెనుకయ్య = వినాయకునికి వెనుకఁ బుట్టినవాఁడు; వేల్పుల దళవాయి = దేవతల సేనాధిపతి; చిలువల...రౌతు = (సర్పములను భక్షించుపక్షి యగు) నెమలినెక్కి తిరుగువాఁడు; సత్తి...వలంతి = శక్తియను నాయుధమును ధరించిన నేర్పరి; ఇత్తిగ...బలియుఁడు = (౨ × 3) ఆఱుముఖములుగల బలవంతుఁడు; బార...గలాఁడు = పండ్రెండుచేతులు గలవాఁడు; రిక్క...మిత్తి = చుక్క యను పేరుగల రాక్షసుని (అనఁగా తారకాసురుని) జంపినవాఁడు; ఱెల్లుకానుపు = ఱెల్లునందుఁబుట్టినవాఁడు; కొంచ...మన్నెకాఁడు = క్రౌంచ పర్వతమును భేదించినప్రభువు; గట్ల...మనుమఁడు = పర్వతరాజగు హిమవంతునికిఁ బౌత్రుఁడు; కప్పు...కొమరుఁడు = పార్వతి గొప్పకొడుకు; వేల్పు...కొడుకు = గంగకు సవతియగు పార్వతికుమారుఁడు; ముద్దయ్య; కందుఁడు = స్కందుఁడు; కొమరుసామి-౧౨ = కుమారస్వామి.

సీ. తలఁపుచూలి మరుండు ♦ వలతేఁడు చిలుకరా
తానునిచెలి గాడ్పు ♦ టరదపువౌర
జాబిల్లియల్లుఁడు ♦ చౌవంచతూపుల
నెఱదంట కలుముల ♦ గరితబిడ్డ

కన్నులవిల్తుఁడు ♦ కమ్మవిల్తుఁడు పచ్చ
విలుకాఁడు చక్కెర ♦ వింటిజోదు
వెడవిలుతుఁడు తియ్య♦విల్తుఁడు చిగురాకు
విలుకాఁడు తుంటవిల్ ♦గల దునీఁడు

తే. తలిరువిల్తుఁడు ననవిల్తుఁ ♦ డలరువిల్తుఁ
డించువిల్కాఁడు రాచిల్క ♦ నెక్కురౌతు
మీను మొసలిసిడెంబుల♦మేటి తేఁటి
యల్లవాఁ డన మదనాఖ్య ♦ లమరు సాంబ. 8

టీ. తలఁపుచూలి = తలంపునందుఁ బుట్టువాఁడు-సంకల్పసంభవుఁడు; మరుఁడు = స్మరుఁడు; వలఱేఁడు = కామములకురాజు; చిలుకరౌతు = చిలుకనెక్కి తిరుగు వాఁడు: ఆమనిచెలి = వసంతఋతువునకుఁ జెలికాఁడు; గాడ్పు...దొర = గాలియే తేరుగాఁ గలప్రభువు; జాబిల్లియల్లుఁడు = చంద్రుని కల్లుఁడు; చౌ...దంట = (౪ + ౧) ఐదు బాణములు గల మహాని పుణుఁడు; కలుముల...బిడ్డ = లక్ష్మికుమారుఁడు; కన్నుల విల్తుఁడు = కణుపులుగల విల్లు గలవాఁడు; కమ్మ విల్లుఁడు = తియ్యనివిల్లుగలవాఁడు, పచ్చవిలుకాఁడు = పచ్చనియెన్ను విల్లుగాఁగలవాఁడు; చక్కెర...జోదు = చక్కెర విల్లుగల యోధుఁడు; వెడవిలుతుఁడు = చులకని విల్లుగలవాడు; తియ్యవిల్తు చిగురాకువిలుకాఁడు = చిగుళ్ళచేనైన విల్లుగలవాఁడు; తుంట...దునీఁడు = చెఱకుతుంట విల్లుగాఁ గల సరదారు; తలిరువిల్తుఁడు = చిగుళ్ల చేనైన విల్లుగలవాడు; ననవి పువ్వులతోఁజేయఁబడినవిల్లుగలవాఁడు; అలరువిల్తుఁడు; ఇంచువిల్కాఁడు = చెఱకువిల్లుగలవాఁడు; రాల్తురౌతు = శ్రేష్ఠమైన చిలుక నెక్కి తిరుగువాఁడు; మీను...మేటి = చేఁపయును మొసలియును ధ్వజమందు గలదిట్ట; తేఁటి...వాఁడు = తుమ్మెదలు అల్లెత్రాడుగాఁ గల వాఁడు-౨౮ = మన్మధుడు.

సీ. సతపేరుతత్తడి ♦ జతతేరుగలప్రోడ
యనిబడ్డ నెఱబంటు ♦ లరుగుత్రోవ
వెన్నునివలగన్ను ♦ వేయిచేతులదిట్ట
తిగవేలుపులటెంకి ♦ పగటిజోతి
జమునయ్య మినుమాని♦కము చాయపెనిమిటి
పగలుసేయువలంతి ♦ జగముకన్ను
నెలజోడు తమ్మి చ♦క్కిలిగింత వేవెల్గు
కలువలసూడు చీఁ♦కటులగొంగ
తే. జక్కవలయంటు మ్రొక్కుల♦సొక్కుసామి
బారరూపులవేల్పు పాఁ♦బల్కుసొమ్ము
పెట్టె చలిదాయ ప్రొద్దు నాఁ♦ బేళ్లు దనరు
లోకబాంధవునకు శివా♦లోల సాంబ. 9

టీ. సత...ప్రోడ=సప్తయను పేరుగల గుఱ్ఱములు రెండు గట్టిన రథము గల నేర్పరి-సప్తాశ్వుఁడు; అని...త్రోవ = యుద్ధమందు హతులై పడునట్టిమహావీరులుస్వర్గమునకుఁ బోవుమార్గము-ఆవీరులు [సూర్యమండలము భేదించుకొని స్వర్గమునకుఁ బోవునట్లు పురాణప్రతీతి ; వెన్ను ని...గన్ను = విష్ణుని కుడినేత్రము; వేయి...దిట్ట=సహస్రహస్తములు గలప్రోడ; తిగ... టెంకి = త్రిమూర్తులుండు స్థానము; పగటిజ్యోతి = పగటియందు వెలుఁగు జ్యోతియైనవాఁడు; జమునయ్య = యమునితండ్రి, మినుమానికము = ఆకాశమునకు మణివంటివాఁడు-ద్యుమణి; చాయపెనిమిటి = ఛాయాదేవిమగఁడు; పగలు...వలంతి=అహస్సును జేయునట్టినేర్పరి-అహస్కరుఁడు; జగము కన్ను =జగత్తునకు నేత్రమువంటివాఁడు-జగచ్చక్షువు; నెలజోడు = చంద్రు

నికి జతయైనవాఁడు; తమ్మిచక్కిలిగింత = తామరను చక్కిలిగింతలు పెట్టి (అనఁగా తాఁకి) వికసింపఁజేయువాఁడు; వేవెల్గు = వేయికిరణములుఁగలవాఁడు; కలువలసూడు = కలువలకు విరోధి; చీఁకటులగొంగ = అంధకారములను నశింపఁజేయువాఁడు; జక్కవలయంటు = చక్రవాకపక్షులకు హితుఁడు; మ్రొక్కుల...సామి = నమస్కారముల నానందించునట్టి దేవుఁడు; బా...వేల్పు = పండ్రెండురూపములు గలదేవుఁడు-ద్వాదశాత్ముఁడు; పా...పెట్టె = వేదములనెడియాభరణములకుఁ బెట్టెవంటివాఁడు; చలిదాయ = చలిని బోఁగొట్టువాఁడు; పొద్దు-౨౨ = సూర్యుఁడు.

సీ. కరకంఠుతలమాని♦కము వేలుపులబువ్వ
జాబిల్లి మరుమామ ♦ చందమామ
జింకతాలుపు తొగ ♦ చెలికాఁడు జడదారి
కన్నాప రేఱేఁడు ♦ కడలివెన్న
చుక్కలగమికాఁడు ♦ జక్కవపగవాఁడు
చలివెల్గు రేవెల్గు ♦ చలువజోతి
వెన్ను నెడమకన్ను ♦ వెన్నెలరాయఁడు
నెలతమ్మిదాయము ♦ న్నీటిపట్టి
తే. కందుగలదుండగీఁడు చీఁ♦కటులమిత్తి
పంటపైరులదొర పొద్దు ♦ జంట లచ్చి
యన్న రేజోతి చందన ♦ నమరుచుండుఁ
గుముదమిత్రునినామధే♦యములు సాంబ. 10

టీ. కర...మానికము = శివునికి శిరస్సునందలి రత్నమైనవాఁడు; వేలుపుల బువ్వ = దేవతల కాహారమైనవాఁడు; జాబిల్లి = ఒప్పుచున్న బింబ

మొగలవాఁడు; మరుమామ = మన్మథునకు మేనమామ; చందమామ; జింకతాలుపు = జింకను ధరించినవాఁడు; తొగచెలికాఁడు = కలువలకు స్నేహితుఁడు; జడదారికన్నాప = అత్రిముని నేత్రమువలనఁ బుట్టినబిడ్డ; రేయేఁడు = రాత్రి కధిపతి; కడలివెన్న = పాలసముద్రమును జిలుకఁగాఁబుట్టినవెన్న- అనఁగా పాలసముద్రమునందుఁ బుట్టినవాఁడు; చుక్కలగమికాఁడు = నక్షత్రములకు రాజు; జక్కవపగవాఁడు = చక్రవాకముల విరోధి; చలివెల్గు = చల్లనికిరణములవాఁడు; రేవెల్గు = రాత్రియందుఁ బ్రకాశించువాఁడు; చలువజోతి = చల్లనిజ్యోతియైనవాఁడు; వెన్ను...కన్ను = విష్ణుదేవుని వామనేత్రము; వెన్నెలరాయఁడు = చంద్రికకు నధిపతి; నెల; తమ్మిదాయ = తామరలకు విరోధి; మున్నీటిపట్టి = పాలసముద్రునిబిడ్డ; కందు...దుండగీఁడు = నల్లనికళంకముగల ధూర్తుఁడు; చీఁకటులమిత్తి = అంధకారములను హరించువాఁడు; పంటపైరులదొర = సస్యముల కధిపతి; ప్రొద్దుజంట = సూర్యునికి జతయైనవాఁడు; లచ్చియన్న = లక్ష్మికన్నయైనవాఁడు; రేజోతి = రాత్రియందుఁ బ్రకాశించు జ్యోతియైనవాఁడు; చందురుఁడు = చంద్రుఁడు.

సీ. పదిపదులంచుల ♦ బాకుదాల్పుదునీఁడు
కొండలఱెక్కలు ♦ కొట్టినదణి
జమిడియేఁబదులజ♦న్నములు చేసినమేటి
సోమాసులకుఁ దావు ♦ సూపుజాణ
యెత్తరంపుఁజెవుల ♦ తత్తడివజీరుఁడు
విప్పుఱెప్పలఱేఁడు ♦ వెల్లగొరు
మావటీఁడు తలపు ♦ మానికముగలాఁడు
నిలువెల్లఁ జూపులై ♦ వెలయువాఁడు
తే. మింటిప్రోల్సామి జడదారి ♦ యింటికోడి
పెట్టుమ్రాఁకుల వెలిగిడ్డిఁ ♦ బెనిచినదొర

మొదటిదిక్కు సుబాదారి ♦ మొయిలుజక్కి-
సామి యన నింద్రునామముల్ ♦ జరగు సాంబ. 11

టీ. పది...దునీఁడు = (౧౦ × ౧౦) నూఱంచులుఁగల వజ్రాయుధమును ధరించునట్టి సరదారు; కొండల...దణి = పర్వతముల ఱెక్కలను ఖండించిన దొర; జమిడి...మేటి = (౨ × ౫౦) నూఱుయజ్ఞములుచేసినట్టి-శతక్రతుఁడు; సోమా...జాణ = సోమయాజులకు స్వర్గమునందు వసతిచూపునట్టి నేర్పరి; ఎత్తరంపు...వజీరుఁడు = పొడవైన చెవులుఁగల గుఱ్ఱము (అనఁగా ఉచ్చైశ్శ్రవము) నెక్కెడుశూరుఁడు; విప్ప ఱెప్పల ఱేఁడు = తెఱచికొని యుండు ఱెప్పలుఁగలవారికి (అనఁగా ఱెప్పపాటులేనివారగు దేవతలకు) రాజు; వెల్ల...మావటీఁడు = తెల్లయేనుఁగు నెక్కెడివాఁడు; తలఁపు...గలాఁడు = చింతామణిగలవాఁడు; సిలువు...వాఁడు = శరీరమెల్లఁ గన్నులు గలిగి యొప్పువాఁడు-సహస్రాక్షుఁడు; మింటి...సామి = అమరావతి కధిపతి; జడ...కోడి = గౌతముఁడను ఋషిగృహమునఁ గుక్కుటమై యుండిన వాఁడు; పెట్టుమ్రాకుల...దొర = కల్పవృక్షములను గామధేనువును బెంచిన ప్రభువు; మొదటి...సుబాదారి = తూర్పుదిక్కునేలెడి యధికారి; మొయిలు జక్కిసామి = మేఘవాహనముగల దేవుఁడు-౧౪ = దేవేంద్రుఁడు.

సీ. తగరుబాబాసాని ♦ దుగమోరపాదుసా
తెమ్మెర చెలి యన్ని ♦ తిండికాఁడు
నీటిబిడ్డఁడు కిత్తు ♦ నిప్పు ముట్టఁగరాని
చలియుఁడు సతనాలు ♦ కలదునీఁడు
కప్పుత్రోవరి తిగ ♦ కాళ్లదేవర యగ్గి
చి చ్చింగలం బనఁ ♦ జెలఁగు వహ్ని

పోతుతత్తడిరౌతు ♦ పొద్దుకూన జముండు
మిత్తి దక్కినమేలు ♦ మేటి జమున
తే. తోడు గుదెతాల్పు పెతరుల♦ఱేఁ డనంగఁ
గాలునిసమాహ్వయము లగు ♦ మూలఱేఁడు
తిరిమ్మరీఁడు రక్కసి పొల♦దిండి సోఁకు
మూఁకదణి నా నిరృతిపేళ్లు ♦ పొసఁగు సాంబ. 12

టీ॥ తగరు...సాని = పొట్టేలు వాహనముగాఁ గలరౌతు; దు×...పాదుసా = రెండుముఖములు గలదొర; తెమ్మెరచెలి = వాయుదేవుని స్నేహితుఁడు; అన్నితిండికాఁడు = సర్వమును భక్షించువాఁడు; నీటిబిడ్డఁడు = జలమునందుఁ బుట్టినవాఁడు; కిత్తు; నిప్పు; ముట్టఁగరాని బలియుఁడు = అంటుటకు సాధ్యముకాని బలవంతుఁడు; సత...దునీఁడు = ఏడుజిహ్వలు గల సరదారు - సప్తజిహ్వుడు; కప్పుత్రోవరి = నల్లనిదారి గలవాఁడు - కృష్ణవర్త్మ; తిగ...దేవర = మూఁడుపాదములు గలదేవుఁడు; అగ్గి; చిచ్చు; ఇంగలము-లగి = అగ్ని. పోతురౌతు = మహిషవాహనము నెక్కి తిరిగెడివాఁడు; పొద్దుకూన = సూర్యునిబిడ్డఁడు; జముఁడు = యముడు; మిత్తి; దక్కి...మేటి = దక్షిణదిక్కును బాలించుదిట్ట; జమునతోడు = యమునానది సహోదరుఁడు; గుదెతాల్పు = గుదియనుధరించినవాఁడు; పెతరులఱేఁడు = పితృదేవతలకు రాజు-లు = యముఁడు. మూలఱేఁడు = నైరృతీమూలకురాజు; తిరిమ్మరీఁడు = రాత్రులయందుఁ దిరుగువాఁడు; రక్కసి = రాక్షసుఁడు; పొడిదిండి = మాంసమును భక్షించువాఁడు; సోఁకుమూఁకదణి = రాక్షససమూహముల కధిపతి-లగి = నైరృతి.

సీ. పడమటిదొర నీటి♦యొడయఁడు జడిసామి
మొసలిగుఱ్ఱమురౌతు ♦ మొగులుఱేఁడు

వల్లెత్రాడు గలట్టి♦వాఁడు నా వరుణాఖ్య
లమరెను జింకగు♦ఱ్ఱమువలంతి
బీదలపెనుబాద ♦ యీఁద త్రాఁచులమేఁత
గందపుమలగుఱి♦కాఁడు గాడ్పు
పయ్యర తావిమో♦పరి వలి మరుతేరు
సుడిగొట్టు తెమ్మెర ♦ సోఁకుబూచి
తే. మేనుతాల్పుల కుసురైన♦మేటి నింగి
చూలి మబ్బులపగదాయ ♦ గాలి సురఁటి
వీవనలపుట్టు దువ్వ గా♦వించుజాణ
కరువలి యనంగ మారుతా♦ఖ్య లగు సాంబ. 13

టీ. పడమటిదొర = పశ్చిమదిక్కునకు రాజు; నీటియొడయఁడు = జలములకధిపతి; జడిసామి = వర్షమున కధిదేవుఁడు; మొసలిరౌతు = మొసలి వాహనము నెక్కి తిరుగువాఁడు; మొయిలుటేఁడు = మేఘములకధిపతి; వల్లె...వాఁడు = పాశమును ధరించినవాఁడు-ఇ = వరుణుఁడు. జింక... వలంతి = జింకవాహనముగల నేర్పరి; బీదల...బాద = బీదవారిని చలిచే మిక్కిలి బాధపెట్టువాఁడు; ఈఁద = చలిగాలి; త్రాఁచులమేఁత = సర్పము లకాహారము; గందంపు...కాఁడు = మలయపర్వతము స్థానపు గుఱుతుంగాఁ గలవాఁడు (అనఁగా మలయగిరినుండి గుఱిగా వీఁచు వాఁడు); గాడ్పు; పవ్వర; తావిమోపరి = వాసనలను వహించువాఁడు (అనఁగా వ్యాపింపఁ జేయువాఁడు-గంధవహుఁడు; వలి; మరుతేరు = మన్మథుని రథము; సుడి గొట్టు = సుడిసి కొట్టువాఁడు; తెమ్మెర; సోఁకుబూచి = కనఁబడకుండ స్పృశించునట్టి దేవుఁడు; మేను...మేటి = శరీరధారులగు జంతువులు జీవించుట

కాధారమైన దిట్ట; నింగిచూలి = ఆకాశమునఁ బుట్టినవాఁడు; మబ్బుల పగదాయ = మేఘములకు విరోధి; గాలి; సురఁటి...పుట్టు = వట్రువ లగు సురఁటులందును విసనకఱ్ఱలందును బుట్టువాఁడు; దువ్వ...జాణ = ధూళి సేచునట్టి నేర్పరి; కరువలి-౨౦ = వాయుదేవుఁడు.

సీ. జక్కులపాదుసా ♦ ముక్కంటిసంగాతి
కాయకన్మోటి రొ♦క్కముల తేఁడు
వానీఁడు రారాజు ♦ వడచక్కియెకిమీఁడు
తత్తడి నెక్కెడు ♦ దఁట యనఁగ
ధనదు పేళ్లగు జడ♦దారి గిబ్బసిపాయి
తిగకంటిదొర తుది ♦ దిక్కుటెంకి
యనఁగ నీశానాఖ్య ♦ లను వొందుఁ జిందము
కూఁత కైదువు బూరఁ ♦గొమ్ము సంకు
తే. వలమురి యనంగ శంఖము ♦ వెలయుఁ జుట్టు
వాలు సుడివాలు వట్రువ♦వాలు బటువు
వాలు పదనూఁఋలంచుల♦వాలు బిల్ల
వా లన సుదర్శనాఖ్యలు ♦ వఱలు సాంబ! 14

టీ. జక్కులపాదుసా = యక్షులకు రాజు; ముక్కంటిసంగాతి = శివుని చెలికాఁడు; కాయకన్మోటి = కాయ కాచిన యొక కన్నుగలదిట్ట-లేక కాయవలెఁ బచ్చనైన యొక కన్నుగలవాఁడు; రొక్కముల తేఁడు = ధనముల కధిపతి; వానీఁడు; రారాజు = రాజరాజు; వడచక్కియెకిమీఁడు = ఉత్తరపుదిక్కున కధిపతి, తత్తడి...దంట = గుఱ్ఱము వాహనముగాఁ గలదిట్ట-౭ = కుబేరుఁడు; జడదారి = జడలను ధరించినవాఁడు; గిబ్బసిపాయి=వృష

భమునెక్కి తిరుగువీరుఁడు; తిగకంటిదొర = మూఁడుకన్నులుగల ప్రభువు; తుది...టెంకి = కడపటిదైన యీశాన్యపుదిక్కు వాసస్థానముగాఁగలవాఁడు-౪ = ఈశాన్యుఁడు. చిందము, కూఁతకైదువు, బూరగొమ్ము, సంకు, వలమురి = దక్షిణముగాఁ దిరిగినది-౫ = శంఖము. చుట్టువాలు = గుండ్రనియాయుధము, సుడివాలు, వట్రువవాలు, జటువువాలు, పదినూఱులంచులవాలు = వేయి మొనలునలవాలు, బిల్లవాలు = బిల్లవలెనుండు నాయుధము-౬ = విష్ణు దేవుని చక్రాయుధము.

సీ. తుదచుక్కపేరిటి♦తొయ్యలిపెనిమిటి
కప్పుదేవరయన్న ♦ కలపదారి
కటివల్వపోఁడ రోఁ♦కలితాల్పు తాటటె
క్కెముమేటి బలియుఁడు ♦ జమునగొంగ
యన బలభద్రు పే♦ళ్లగుఁ గ్రిడిచెలి తేరు
పులుఁగురాయఁడు డెలి♦మోముపక్కి
బొల్లిమోరపులుంగు ♦ నల్లనయ్యరవాలు
తొడలేనివానిసై♦దోడు గరుడి
తే. వేలుపులబువ్వగొనుజోదు ♦ వెన్నుపడగ
చిలువమేతరి మేలిచ్చు♦పులుఁగు గరుటి
తల్లివేసటవాపిన♦దంట యనఁగ
వైనతేయసమాఖ్యలు ♦ వఱలు సాంబ. 15

టీ. తుద...పెనిమిటి = కడపటిచుక్కయైన రేవతి యను పేరుగల స్త్రీకి భర్తయైనవాఁడు; కప్పు...యన్న = విష్ణుని కన్న; కలపదారి = నాఁగేటిని ధరించినవాఁడు; కటి...పోఁడ = నల్లనిబట్టను గట్టుకేర్పరి; రోఁకలి

తాల్పు = ముసలమును ధరించినవాఁడు; తాటి...బలియుఁడు = తాళధ్వజము గల గొప్పబలవంతుఁడు; జమునగోఁగ = యమునానదికి శత్రువు-౭ = బలరాముఁడు. క్రీడి...తేరు = అర్జునునకు చెలికాఁడైన విష్ణుని రథము; పులుఁగురాయఁడు = పక్షిరాజు; తెలి...పక్కి = తెల్లనిముఖముగలపక్షి; బొల్లి... పులుఁగు = తెల్లనిముఖము గలపక్షి; నల్లనయ్యరవాలు = విష్ణుదేవుని రవగాలు-ఆస్కందితగతిని పోవుగుఱ్ఱము-విష్ణుదేవుఁడు వేగముగాఁ బోవుటకు సాధనమైన వాహనము; తోడ...సైదోడు = అనూరుని తోఁబుట్టువు; గరుడి; వేలుపుల...జోదు = దేవతల కాహారమైన యమృతమును హరించినట్టి యోధుఁడు; వెన్నుపడగ = విష్ణునిధ్వజము; చిలువమేఁతరి = సర్పములను భక్షించువాఁడు; మేలిచ్చుపులుఁగు = శుభముల నిచ్చునట్టిపక్షి; గరుటి; తల్లి...దంట = తల్లి యగువినతదుఃఖమును దీర్చిన నేర్పరి-౧౩ = గరుత్మంతుఁడు.

సీ. వడముడి తెమ్మెర♦కొడుకు కన భీముఁడౌ
 వేగంటికొమరుఁడు ♦ వెన్నునంటు
వెన్నుమచ్చదునీఁడు ♦ బివ్వచ్చు కవ్వడి
 గెలుపుపేరుగలాఁడు ♦ క్రీడి యనఁగ
నర్జుననామంబు ♦ లగు ముత్తెరువులాడి
 తెలివాఁక పొందామ♦రలకుఁ బంట
కలికంఠు తలయేఱు ♦ పెరుమాళ్లడుగుబుగ్గ
 జెడదారి చెవియూట ♦ చదలువాఁక
తే. తాటిటెక్కెముదణితల్లి ♦ తాతపనటి
వెల్లి మినువాఁక మిన్నేఱు ♦ వేల్పుటేఱు
వెల్లుకాన్గుపసవతి♦తల్లి యనఁ దనరు
నమరతటినికి నామధేయములు సాంబ.

టీ. వడముడి; తెమ్మెరకొడుకు = వాయుపుత్త్రుఁడు-౨ = భీముఁడు. వేగంటికొమరుఁడు = వేయికన్నులుఁగల యింద్రుని కొడుకు; వెన్నునంటు = కృష్ణుని చెలికాఁడు; వెన్ను...దునీఁడు = వీఁపునందు మచ్చగల సరదారు; *వివ్వచ్చు — బీభత్సుఁడు; కవ్వడి = రెండుచేతుల వడిగలవాఁడు; గెలుపు...గలాఁడు = విజయుఁ డను పేరుగలవాఁడు; క్రీడి = కిరీటి - ౭ = అర్జునుఁడు. ముత్రెరువులాఁడి = మూఁడు మార్గములఁ బ్రవహించునది-త్రిపథ; తెలివాఁక = తెల్లనినది; పొం...బంటు = బంగారుతామరలు పూచునట్టిచోటు; కఱకంఠుతలయేఱు = శివుని తలయందుండు నది; పెను...బుగ్గ = విష్ణువుపాదము నందుఁ బుట్టిన నీటిబుగ్గ-విష్ణుపది; జడ...యూట = జహ్నువనెడుఋషి చెవినుండి యూరివచ్చిన జలము - జాహ్నవి; చదలువాఁక = ఆకాశనది; తాటి...తల్లి = తాళధ్వజముగల దొర యగు భీష్మునితల్లి; తాత...వెల్లి = బ్రహ్మకమండలు జలప్రవాహము; మినువాఁక; మిన్నేఱు; వేల్పుటేఱు = దేవతలనది; ఱెల్లు...తల్లి = కుమారస్వామికి మాఱుఁదల్లి-౧౩ = ౫౦౫.

సీ. వేల్పుసువారంపు♦విడిది వెన్నునిచెంకి
రతనాలపంట సం♦ద్రంబు కడలి
పుడమిముద్దియకోక ♦ మున్నీరు ప్రోయేఱు
మబ్బుపువ్వులవెల్లి ♦ మామమామ
గట్టురాకొమరుని ♦ గాచిన నేర్పరి
యేఱులమగఁడు రే♦యింతిమామ
ముక్కటియమ్ముల♦పొది మింటిలోయంబు
తోఁటదొడ్డియొనర్చు ♦ నీటుకాఁడు
తే. చందునయ లచ్చితండ్రి నా ♦ జలధి పరఁగు
వెల్లయేనుఁగు చొదంతి ♦ వేల్పుగొరు

* దీనికి దుర్వర్ణకము రామి విచార్యము.

మొదటిహత్తి నా సురకరి ♦ పొదలుఁ దెల్ల
జక్కి నిక్కువీనులమావు ♦ చదలు తేజి
యనఁగ నుచ్చైశ్శ్రవముపేరు ♦ లమరు సాంబ. 17

టీ. వేల్పు...విడిది = దేవతలవంటయిల్లు; వెన్నునిటెంకి = విష్ణుదేవుని వాసస్థానము; రతనాలపంట = రత్నములుండుతావు-రత్నాకరము; సంద్రము = సముద్రము; కడలి = అలలుగలది; పుడమి...కోక = భూదేవిచీరయైనది; మున్నీరు = పురాతనమైనజలము; పాత్రియేఱు = పురాతననది; మబ్బుపువ్వుల వెల్లి = మేఘపుష్పముల (అనఁగా జలముల) రాశి; మామమామ = మామ యగు విష్ణుదేవునికి మామయైనవాఁడు; గట్టు...సేర్పరి = హిమవంతుని కొడు కగు మైనాకుని గాపాడిన పోడ; ఏఱులమగఁడు = నదులకుభర్త; రే... మామ = రాత్రియను స్త్రీకి మామయైనవాఁడు-రాత్రి చంద్రునిభార్య యను ప్రతీతిని బట్టి చంద్రునితండ్రి యగు సముద్రుఁడు దానికి మామగాఁ జెప్పఁ బడెను; ముక్కంటి...పొది = శివునికిఁ ద్రిపురాసురుల సంహరించునపుడు తూణీరమైనవాఁడు; మిఁటి...నీటుకాఁడు = ఆకాశమును (అనఁగా స్వర్గ మును) గుఱ్ఱపులాయముగాను వృక్షములతోఁటగాను ఆవుదొడ్డిగాను జేసిన నేర్పరి-స్వర్గంబునఁగల యుచ్చైశ్శ్రవ మను గుఱ్ఱమును కల్పవృక్షములను గామధేనువును గన్నట్టివాఁ డని యర్థము; చఁదురుని = చంద్రునితండ్రి; లచ్చి తండ్రి = లక్ష్మీదేవితండ్రి - ౧౭ = సముద్రుఁడు. వెల్లయేనుఁగు = తెల్లని గజము; చౌదంతి = నాలుగుదంతములుగలది; వేల్పుగొఱ = దేవతలగజము; మొదటిహత్తి = ప్రథమగజము-౪ = ఐరావతము. తెల్లజక్కి = తెల్లనిగుఱ్ఱము; నిక్కువీనుల మావు = పొడవైనచెవులు గల గుఱ్ఱము, చదలు తేజి = ఆకా శమునందుండు గుఱ్ఱము-3 = ఉచ్చైశ్శ్రవము.

సీ. వేలుపుటెంకి కో♦వెల దేవళము గుడి
యనఁగ దేవాలయా♦ఖ్యలు చెలంగుఁ

తెలుగంట్లు జన్నంపుఁ♦దిండులు జేజేలు
తొలివేల్పుపగతురు ♦ పలుకుటల్గు
మేటులు వేల్పులు ♦ మింటిత్రోవరులు ని
ద్దురలేనిప్రోడలు ♦ నరలు గనని
పెద్ద లనఁగ సురా♦భిఖ్య లౌ విన్ప్రోలు
వేగంటికచ్చేరి ♦ వేల్పుటెంకి
తే. యనఁగ స్వర్గము పేళ్లగు ♦ వినుమిటారు
లచ్చరలు వేల్పుచెలు లన ♦ నమరు నమర
తరుణులకుఁ జాగరతనము ♦ తలఁపుమాని
క మనఁ జింతామణిసమాఖ్య ♦ లమరు సాంబ. 18

టీ. వేలుపుటెంకి = దేవస్థానము; కోవెల; దేవళము; గుడి-౪ = దేవాలయము. తెలుగంట్లు = తెలుచుకొనియుండుకన్నులుగలవారు; జన్నంపుఁదిండులు = యాగములందు హావిస్సులను భక్షించువారు; జేజేలు; తొలివేల్పుపగతురు = రాక్షసులకు శత్రువులు; పలుకుటల్గుమేటులు = మాటలే యాయుధముగాఁగలవారు-గీర్వాణులు; వేల్పులు; మింటిత్రోవరులు = ఆకాశమున సంచరించువారు; నిద్దురలేని ప్రోడలు = నిద్రపోవుట లేనిదిట్టలు; ...నరలు పెద్దలు = పలితములు (అనఁగా ముదిమి) లేనిపెద్దవారు-౯ = దేవతలు. విన్ప్రోలు = ఆకాశమునందలి పట్టణము; వేగంటికచ్చేరి = దేవేంద్రుని కొలువుకూటము; వేల్పుటెంకి = దేవతల నివాసస్థానము-3 = స్వర్గము. వినుమిటారులు = ఆకాశమందలి స్త్రీలు; అచ్చరలు-అప్సరసలు; వేల్పుచెలులు-3 = దేవతాస్త్రీలు. చాగరతనము = కోరినసంపదలదానము సేయురత్నము; తలపుమానికము = చింతామణి ౨ = చింతామణి.

సీ. అడిగిననోసంగెడి ♦ యావు జేజేగిడ్డి
చదలుతోడుకు తెల్ల♦మొద వనంగ
సురగవి పేళ్లగుఁ ♦ దెలిగంటిమ్రాఁకులు
పెట్టుమ్రాఁకులు మింటి♦చెట్టు లనఁగఁ
గల్పకాఖ్య లగు వే♦గంటిగొంగలు రక్క-
సులు రేయిద్రిమ్మరుల్ ♦ సుకురుసిసులు
వేల్పుదాయలు తొలి ♦ వేల్పులు నా దైత్య
నామంబు లగు గాలి ♦ గాము నెగడి
తే. కొఱవిరాలుపు బూచి సోఁ♦కుడు పిసాసి
దయ్య మనఁగఁ బిశాచాభి♦ధానము లగు
నివము వలిమం చనంగను ♦ హిమము దనరుఁ
బిడు గనఁగఁ జెల్లు నశనికిఁ ♦ బేళ్లు సాంబ. 19

టీ. అడిగిన నోసంగెడియావు = కోరినవానినిచ్చునట్టిధేనువు; జేజేగిడ్డి = దేవతలయావు; చదలుతోడుకు = ఆకాశమునందుండు ధేనువు; తెల్లమొదవు = తెల్లనియావు-౪ = కామధేనువు. తెలిగంటిమ్రాఁకులు = దేవతావృక్షములు; పెట్టుమ్రాఁకులు = కోర్కులిచ్చుచెట్లు; మింటిచెట్లు = ఆకాశమందుండు వృక్షములు-౩ = కల్పవృక్షములు. వేగంటిగొంగలు = దేవతలకు శత్రువులు; రక్కసులు; రేయిద్రిమ్మరులు = రాత్రులందుఁదిరుగువారు; సుకురుసిసులు = శుక్రాచార్యుని శిష్యులు; వేల్పుదాయలు = దేవతలకు దాయాదులు-లేక శత్రువులు; తొలివేల్పులు = పూర్వదేవతలు-౬ = రాక్షసులు. గాలి, గాము, నెగడి, కొఱవిరాలుపు, బూచి, సోఁకుడు, పిసాసి, దయ్యము-౮-పిశాచము. ఇవము, వలి, మంచు, ఇగము-౪ = హిమము. పిడుగు = అశని.

సీ. మిన్నుచుక్కలత్రోవ ♦ విన్నుప్పరము నింగి
వెన్నునియడుగు వి౯ ♦ వేల్పుఁ దెరువు
గాలితండ్రి బయ లా♦కసము మొగులు తెన్ను
చదలు నా గగనాఖ్య ♦ లొదవుచుండుఁ
బవలు పగలు నాఁగ ♦ దివము పేళ్లగు రేయి
రాతిరి రే యన ♦ రాత్రి యమరు
దెస దిక్కు కడ యన ♦ దిశ యొప్పు నెల చంద
నఁగ మాస మమరుఁ బు♦న్నమ యనంగ
తే. నలరుఁ బూర్ణిమకు నమాస ♦ యమవస యనఁ
జను నమావాస్య పేరులు ♦ సంజ సందె
యనఁగఁ దగు సంధ్య కాతపం♦బునకు నెండ
ప్రొద్దు వేండ్రిం బనెడిపేళ్లు ♦ పొసఁగు సాంబ. 20

టీ. మిన్ను; చుక్కలత్రోవ = నక్షత్రమార్గము; విన్ను; ఉప్పరము; నింగి; వెన్నునియడుగు = విష్ణుపదము; విను; వేల్పుఁదెరువు = దేవతలమార్గము; గాలితండ్రి = వాయువునకు జన్మస్థానము; బయలు; ఆకసము; మొగులు తెన్ను = మేఘములమార్గము; చదలు-౧౩ = ఆకాశము. పవలు, పగలు-౨ = అహస్సు. రేయి, రాతిరి, రే-౩-రాత్రి. దెస, దిక్కు, కడ-౩ = దిశ. నెల, చందు-౨ = మాసము. పున్నమ = పూర్ణిమ. అమాస, అమవస-౨ = అమావాస్య. సంజ, సందె-౨ = సంధ్య. ఎండ, ప్రొద్దు, వేఁడ్రిము-౩ = ఎండ.

సీ. మెఱుపులు మెఱుఁగులు ♦ మించు లనఁ దటిత్తు
లగును జుక్కలు రిక్క ♦ లనఁగఁ దార

లమరు జేజేతేని♦యరదము నీటిమో
పరి మబ్బు మొయి లనఁ ♦ బరఁగు ఘనము
తెర యల తరఁగ నాఁ ♦ బొరయు వీచికపేళ్లు
నుఱువు నుఱు గనంగఁ ♦ గొఱలు ఫేన
మంత స్సమాభిఖ్య ♦ లగును లోపల లోన
లోనన బహిరాఖ్య ♦ లొప్పును వెలి
తే. బయలు వెలుపల నాఁగ దీ♦పంబుపేళ్లు
వఱలుచుండును జోతి తి♦ర్వళిక దివ్వె
యనఁగ మందోష్ణమునకు వె♦చ్చన యొకింత
వేఁడి యిసుమంతకాఁక నా ♦ వెలయు సాంబ. 21

టీ. మెఱుపులు, మెఱుఁగులు, మించులు-3 = మెఱుపుఁదీఁగెలు. చుక్కలు, రిక్క-2 = నక్షత్రములు. జేజేతేని యరదము = దేవేంద్రుని రథము, నీటిమోపరి = జలమును ధరించునది-జలధరము, మబ్బు, మొయిలు॥ రూ॥ మొయులు॥ పా॥ మొగులు॥ రూ॥ మొగిలు-4 = మేఘము. తెర, అల, తరఁగ-3 = అల. నుఱుగు, నుఱువు-2 = ఫేనము. లోపల౯, లోన౯, లో౯-3 = లోపల. వెలి, బయలు॥ రూ॥ బయిలు-బైలు, వెలుపల-4 = బయలు. జోతి, తిర్వళిక (ఇది యఱవపదము), దివ్వె॥ రూ॥ దివ్వియ-దివియ-దివె-దీవియ-దీవె-5 = దీపము. వెచ్చన, ఒకింత వేఁడి, ఇసుమంత కాఁక-3 = కొంచెమైన ఉష్ణము.

క. సిస్తుగ లక్షణకవి యగు
కస్తురిరంగాఖ్యుఁడను జ♦గద్విదితముగ నీ

నిస్తుల దైవతవర్గును
విస్తర మొనరించినాఁడ ♦ విబుధుల కరుణన్. 22

తా. లక్షణము చక్కఁగాఁ దెలిసిన కవిని, కస్తురిరంగనామము గలవాఁడను. పండితుల దయచేత లోకమునకు హితముగా నసమానమైన యీ దేవవర్గును విస్తరింపఁ జేసినాఁడను.

దే వ వ ర్గ స ం పూ ర్ణ ము .

---

## మా న వ వ ర్గ .

క. శ్రీనగజామానసలస
మానసరోహంస నిరుప♦మానవిభవధా
మా నవముగ నీ పేరిట
మానవవర్గువు రచింతు ♦ మానక సాంబా. 1

టీ. శ్రీపార్వతీదేవిమనస్సు అనెడు ప్రకాశించుచున్న కొలనికి హంసయైనవాఁడా! (పార్వతీహృదయమందు విహరించువాఁ డని యర్థము) పోలిక లేని వైభవమునకు స్థానమైనవాఁడా! సాంబమూర్తీ! క్రొత్తగ మానవవర్గును నీ కంకితముగా రచించెదను.

సీ. తొలిచదువులు ప్రాఁత♦పలుకులు మినుకులు
ప్రామినుకులు తొంటి♦బాస లనఁగ
వేదాఖ్యలగు నేల♦వేల్పులు తొలిజాతి
వారు మిన్కులచదు♦వరులు జన్ని
గట్టులు దుగపుట్టు♦కలు పార్లు భాఁపలు
నాఁగ బ్రాహ్మణులకు ♦ నామము లగు

తేలు దొరలు నేల♦యేలు దంటలు వెన్ను
వలబుజమునఁ గల♦వారు రాచ
తే. వారు ఱేఁడులు రెండవ♦వంగడంపుఁ
బబువు లన క్షత్రియాఖ్యలౌ ♦ బచ్చు బేరి
మూఁడవకొలంబతేఁడు నాఁడె♦కాఁడు నల్ల
నయ్యతోడబిడ్డ కోమటి ♦ నాఁ దనర్చు
వైశ్యనామంబు లదిరిని♦వాస సాంబ. 2

టీ. తొలిచదువులు, శ్రుతపలుకులు, మినుకులు॥ రూ॥ మిన్కులు, ప్రాఁమినుకులు, తొంటిబాసలు-౬ = వేదములు. నేలవేల్పులు = భూదేవులు, తొలిజాతివారు = అగ్రివర్ణజులు, మిన్కుల చదువరులు = వేదములు చదివిన వారు, జన్నిగట్టులు = యజ్ఞోపవీతమును ధరించినవారు, దుగపుట్టుకలు = రెండుజన్మములుగలవారు - ద్విజులు, పార్లు = పాఱువారు, బాఁపలు-౭ = బ్రాహ్మణులు. ఱేలు, దొరలు, నేల...దంటలు = భూమిని పాలించు నేర్పరులు, వెన్ను... వారు = విష్ణువు కుడిభుజమునుండి పుట్టినవారు, రాచ వారు, ఱేఁడులు, రెండవవంగడంపుఁబబువులు = రెండవవంశమునఁ (అనగా క్షత్త్రివంశమునఁ) బుట్టిన ప్రభువులు-౭ = క్షత్రియులు. బచ్చు, బేరి, మూఁడవకొలంబతేఁడు = మూఁడవకులమునఁ (వైశ్యకులమునఁ) బుట్టిన వాఁడు, నాఁడెకాఁడు = నాణెము గలవాఁడు, నల్లనయ్యతోడబిడ్డ = విష్ణువుతోడఁ బుట్టినవాఁడు, కోమటి-౬ = వైశ్యుఁడు.

సీ. కలపతాల్పులు తుది♦కొలము నేర్పరులు కాఁ
పులు విమవాఁకతోఁ♦బుట్టువు లన
నలరును శూద్రాఖ్య ♦ లమ్మ కన్నది తల్లి
యవ్వ నా మాతి పే ♦ ళ్ళమరుఁ దండ్రి

యబ్బ కన్నయ్య నా♦యన యయ్య య ప్పన
జన కాఖ్య లగుఁ దమ్ముఁ♦డనుఁగు తోడు
తోడఁబుట్టు వనంగఁ♦ దోఁబుట్టు వన సోద
రాఖ్యలౌ మొదటివాఁ♦డన్న పెద్ద
తే. యనఁగ నగ్రజుఁ డగు నక్క♦ యప్ప యనఁగ
జ్యేష్ఠకన్యకుఁ జెల్లెలు♦ చెల్లె చెలియ
లనఁగఁ దనరుఁ గనిష్ఠ కి♦ల్లాలు రాణి
యాలు పెండ్లా మనఁగ భార్య♦ కగును సాంబ. 3

టీ. కలపతాల్పులు = నాఁగేటిని ధరించినవారు, తుదికాలము సేద్య రులు=కడపటిదగు శూద్రకులమునఁ బుట్టిన దిట్టలు, కాపులు, విను...బుట్టువులు=గంగకుఁ దోడఁబుట్టినవారు (ఉభయులు విష్ణుపాదమునఁ బుట్టినవారగుటచే నిట్లు చెప్పఁబడెను) - ౪ = శూద్రులు. అమ్మ, కన్నది, తల్లి, అవ్వ ౪=తల్లి. తండ్రి, అబ్బ, కన్నయ్య, నాయన, అయ్య, అప్ప-౬ = తండ్రి. తమ్ముఁడు, అనుఁగు, తోడు, తోడఁబుట్టువు, తోఁబుట్టువు-౫ = సోదరుఁడు. మొదటివాఁడు, అన్న, పెద్ద-౩ = అగ్రజుఁడు. అప్ప, అక్క-౨=జ్యేష్ఠ రాలు. చెల్లెలు, చెల్లె, చెలియలు-౩ = కనిష్ఠురాలు. ఇల్లాలు, రాణి, ఆలు, పెండ్లాము॥ రూ॥ పెండ్లము-౫ = భార్య.

సీ. అయిదువరాలు ము♦త్తైదు వనఁ బురంధ్రి
కగుఁ దోడికోడ లే♦రా లనంగఁ
బతిసోదరుని భార్య♦ పరఁగుఁ గూతురు కూఁతు
కొమరిత యనఁ బుత్రి♦ కమరుచుండుఁ
గొమరుండు బుడకఁడు♦ కొడుకు పట్టి యనంగఁ
బుత్రుఁడౌ బిడ బిడ్డ♦ పూప పాప

కుఱ్ఱ చిఱుత కందు ♦ కూన నిసువు పాల
బుడుత నా శిశునామ♦ములు దనర్చు

తే. గోల ముద్దియ ముద్దరాల్ ♦ బేల ముగుద
యనఁగ ముగ్ధాంగనకు నాఖ్య ♦ లగును ముదిమి
వాఁడు ముదుకఁడు ముదిసిన♦వాఁడు ముసలి
ముదుసలి యనంగ వృద్ధుపే ♦ ళ్లౌదవు సాంబ. 4

టీ. అయిదువరాలు॥ రూ॥ ఐదువరాలు, ముత్తైదువ-౩=సుమంగలి, తోడికోడలు, ఏరాలు-౨=మగని సహోదరునిభార్య. కూఁతురు, కూఁతు. కొమరిత॥ రూ॥ కొమారిత-కొమార్త-కొమారి-౬=కొమార్త కొమరుఁడు॥ రూ॥ కొమారుఁడు, బుడుకఁడు, కొడుకు, పట్టి-౫=కుమారుఁడు. బిడ, బిడ్డ, ప్రాప, పాప, కుఱ్ఱ, చిఱుత, కందు, కూన, నిసువు॥ రూ॥ నిసుఁగు॥ పా॥ సిసువు, పాలబుడుత-౧౨=శిశువు. గోల, ముద్దియ, ముద్దరాలు, బేల, ముగుద-౫=ముగ్ధస్త్రీ. ముదిమివాఁడు। రూ॥ ముది, ముదుకఁడు, ముదిసిన వాఁడు, ముసలి, ముదుసలి-౬=వృద్ధుఁడు.

సీ. పిన్న కొండికవాఁడు ♦ చిన్న పడుచు చోఱ
పసివాఁ డనెడిపేళ్లు ♦ బాలున కగుఁ
జతురుపే ళ్ళగు దిట్ట ♦ జాణ దంట వలంతి
వెరవరి ప్రోడ నే♦ర్పరి యనంగఁ
జెలికాఁడు సంగాతి ♦ చెలిమరి గాదిలి
సకియ సంగడికాఁడు ♦ సంగడీఁడు
చెలి నేస్తి యనఁ జను ♦ స్నేహితునకుఁ జెల్మి
నంటు మాలిమి పొం ద♦నంగ మైత్రి

తే. కొఱలుఁ గుఱుచ టింగణ గిడ్డ ♦ గిఱిక గుజ్జు
పొట్టి యన వామనాఖ్యలౌ ♦ గట్టివాయి
జాఁగ జంత గయాళియు ♦ నాఁగఁ దనరు
ధూర్తవనితకు దురితవి♦దూర సాంబ. 5

టీ. పిన్న, కొండికవాఁడు, చిన్న, పసఁచు, చోఁఱు॥ రూ॥ చోఱు, పసివాఁడు-౭ = బాలుఁడు. జిట్టు, జాణ, దంటు, కలఁతి, వెరవరి, ప్రోడ, నేర్పరి-౭ = చతురుఁడు. చెలికాఁడు, సంగాతి, చెలిపఁ, గాదిలి, సఖియ, సంగడికాఁడు, సంగడీఁడు, చెలి, నేస్తి-౯ = స్నేహితుఁడు. చెలిమ॥ రూ॥ చెలిమి, నంటు, మాలిమి, పొందు-౪ = మైత్రి. కుఱుచ, టింగణ॥ రూ॥ టింగణా, గిడ్డ, గిఱిక, గుజ్జు, పొట్టి-౭ = వామనుఁడు. గట్టివాయి, జాఁగ, జంత, గయాళి॥ రూ॥ గయ్యాళి-౪ = ధూర్తురాలు.

సీ. కబ్బపుసేఁతరి ♦ కయి కైసరుఁడు మాట
లల్లువాఁ డనుపేళ్లు ♦ చెల్లుఁ గవికి
బట్టులు చదువరుల్ ♦ బట్లు క్రిక్కు లనంగ
వందుల కగుఁ బడ♦వాళ్లు వేగు
వారు వేగరు లనఁ ♦ జారులపే ళ్ళొప్పు
బోయీలు బెస్తలు ♦ మోపరు లన
వాహకులకుఁ జెల్లు ♦ సాహిణి సాని రౌ
తనఁగ నశ్వారోహ♦కునకుఁ దనరుఁ
తే. గట్టికలు పణిహారులు ♦ కటిక లనఁగ
వేత్రపాణుల కగు బోయ ♦ వేఁటకాఁడు

నడవిదిమ్మరి యనఁ గిరాతాఖ్య లెసఁగు
నన్నగళ పేడి యన షండుఁ డగును సాంబ. 6

టీ. కబ్బపుసేఁతరి, కయి, కైసరుఁడు, మాటల్లువాఁడు-౪ = కవి. బట్టులు, చదువరులు, బట్లు, కిర్కులు-౪ = వందులు. పడవాళ్లు, వేగువారు, వేగరులు-3 = చారులు. బోయీలు॥ రూ। బోయలు, బెస్తలు, మోపరులు-౪ = వాహకులు. సాహిణి, సాని, రౌతు-3-అశ్వారోహకుఁడు. కట్టికలు, పణిహారులు, కటికలు-3 = బెత్తము చేతఁగల ద్వారపాలకుఁడు మొదలైన కొలువుడుగాండ్రు. బోయ, వేఁటకాఁడు, అడవిదిమ్మరి-3 = బోయవాండ్రు (కిరాతకులు), అన్నగళ, పేడి-౨ = నపుంసకుఁడు.

సీ. జాలరి వలతేఁడు మీలవేఁటరి యనఁ
దగు ధీవరునిపేళ్లు తడుపుదాల్పు
వడు గొంటిజందెము వాఁడు బ్రహ్మచారి
యన బ్రహ్మచారి పేళ్లమరు గేస్తు
మనికత్తెఁ డింటివాఁ డన గృహస్థున కగు
నడవికాఁపు తపసి జడలదారి
నాఁ జెలువొందు వానప్రస్థునకు నొంటి
కాఁడు గోణముదారి బోడ బీద.
తే. కావులుగలాఁడు సన్యాసి నా వెలుంగు
యతిసమాఖ్యలు ముగితియుత్తైదు వనఁగ
జక్కి నసఁ బేరఁటా లన జరగు మృతచి
రంటినామంబు లాపన్నరక్ష సాంబ. 7

టీ. జాలరి = జాల(వల) లుగలవాఁడు, వలఱేఁడు, మీలవేఁటరి = మత్స్యములను వేఁటాడువాఁడు -3 = చేఁపలనుబట్టువాఁడు. తఱుపు దాలుపు = చిన్నవస్త్రము గట్టుకొనువాఁడు, వటుఁగు, ఒంటిజందెమువాఁడు = ఒకపేఁటజందెము గలవాఁడు, బమ్మచారి-౪ = బ్రహ్మచారి. గేస్తు, మనికిఱేఁడు, ఇంటివాఁడు-3 = గృహస్థుఁడు. అడవికాఁపు = అడవియందు వసించువాఁడు; తపసి = తపస్సు చేయువాఁడు; జడలదారి = జడలను ధరించినవాఁడు-3 = వానప్రస్థుఁడు. ఒంటికాఁడు, గోణముదారి = కౌపీనము ధరించినవాఁడు, బీద, కావులుగలాఁడు = కాషాయములను ధరించినవాఁడు, సన్న్యాసి-౫ = సన్న్యాసి. ముగితి, ముత్తైదువ = ముక్తిచెందిన సువాసిని, జక్కిని, పేరఁటాలు-3 = మృత-చిరంటి (లోకాంతరముపొంది దేవత్వము వడసిన ముత్తయిదువ).

సీ. మూకాఖ్య లగు మూవ ♦ మూఁగ మూఁగి యనంగ
గుడ్డి చీకన నంధ♦కునకుఁ జెల్లుఁ
బరువము ప్రాయము ♦ వయసు జవ్వన మన
యౌవనాభిఖ్య లౌ ♦ నందగాఁడు
వగకాఁ డమరువాఁడు ♦ వన్నెకాఁ డెమ్మెకాఁ
డొసుకాఁ డన సొగ♦సైనవాఁడు
నీటుకాఁ డనఁగ రా♦ణించు శృంగారికి
గోవాళ్లు బొజుఁగు నాఁ ♦ గోణెకాఁడు
తే. వెచ్చకాఁడు ననుపుకాఁడు ♦ వేడ్కకాఁడు
లంజెకాఁడు మిండఁ డనఁ బ♦ల్లవుఁడు దనరు
సోయగంబు చక్కఁదనంబు ♦ సొబగు రూపు
నాఁగ సౌందర్యమునకుఁ జె♦న్నగును సాంబ. 8

టీ. మూఁగ, మూఁక, మూఁగి-౩ = మూక. గుడ్డి, చీకు-౨ = అంధకుఁడు. పరువము, ప్రాయము॥ రూ॥ప్రాయము, వయసు, జవ్వనము-౫ = యౌవనము. అందగాఁడు, వగకాఁడు, అమరువాఁడు, వన్నెకాఁడు, ఎమ్మెకాఁడు, ఔసుకాఁడు = హౌసుగలవాఁడు, సొగసైనవాఁడు, నీటుకాఁడు-౮ = శృంగారవంతుఁడు. గోవాల్లు = యౌవనముగలవాఁడు, బొజుఁగు, కోడెకాఁడు, మెచ్చుకాఁడు = మెచ్చుము నిచ్చువాఁడు, ననుపుకాఁడు = అనురాగము గలవాఁడు, వేడ్కకాఁడు, లంజెకాఁడు = లంజెగలవాఁడు, మిండఁడు-౮ = విటుఁడు. సోయగము, చక్కఁదనము, సొబగు, రూపు-౪ = సౌందర్యము.

సీ. గట్టిమనసువాఁడు ♦ గడుసరి యుక్కరి
దిటవరి దిట్టన ♦ ధీరున కగుఁ
గుచ్చితుఁ డడిగొట్టు ♦ కూళ పెంకె బికారి
ముడికాఁడు చిలుమువాల్ ♦ మోటు లుచ్చ
చెండిపోతుగ రాసు ♦ మొండికట్టె తులువ
కైలాటకాఁడు ట ♦ క్కరి పిసాళి
టకటొంకు టాటోటు ♦ తవళి దబ్బిలి దూబ
గడుసు కల్లరి దోస ♦ కారి చెనఁటి

తే. పాలసుఁడు లండి పిక్కరి ♦ పలువ చెడుగు
బేరజ మనంగ ధూర్తుని ♦ పేరు లమరుఁ
బగఱు మార్తురు పగతురు ♦ పవతు రనఁగ
నహితులకు నామధేయము ♦ లమరు సాంబ. 9

టీ. గట్టిమనసువాఁడు, గడుసరి, ఉక్కరి = శౌర్యముగలవాఁడు, దిటవరి = వెనుదీయనివాఁడు, దిట్ట-౫ = ధీరుఁడు. కుచ్చితుఁడు, అడిగొట్టు

ఖూళీ, పెంకె, బికారి, ముడికాఁడు, చిలుమువాలు, మోటు, లుచ్చ, చెండి పోతు, గరాసు, మొండికట్టె, తులువ, కైలాటకాఁడు = జగడమాడువాఁడు, టక్కరి, పిసాళి, టకటొంకు, టాటోటు॥ రూ॥ తాటోటు, ఠవళి॥ రూ॥ తవళి, దబ్బలి, దూబ, గడుసు, కల్లరి = అబద్ధములాడువాఁడు, దోసకారి = దుష్కార్యములుసేయువాఁడు, చెనఁటి, పాలసుఁడు, లండి, పిక్కరి = వంచనగలవాఁడు, పలువ, చెడుగు, బేరజము-33 = ధూర్తుఁడు. పగఱు, మాఱ్తురు, పగతురు, పవతురు-౪ = శత్రువులు.

సీ. పెఱవారు కడవారు ♦ వింతవా రెడవారు
లాఁతివా రన నన్యు♦లకుఁ జెలంగుఁ
జుట్టలు చుట్టాలు ♦ చుట్టముల్ విందులు
బందుగు లనఁ జెల్లు ♦ బంధువులకుఁ
గూర్చువాఁ డెడకాఁడు ♦ కుంటెనకాఁ డనఁ
దాపికాఁ డనఁ బేరు ♦ దనరుచుండు
విటదూత, బయకాఁడు ♦ వీణెకాఁ డనఁ బొల్చు
వైణికునకు గాణ ♦ పాటకుఁ డన
తే. గాయకుని కగుఁ దిక్క వెం♦గలి వెడంగు
వెకలి వీఱిఁడి వెంబర♦విత్తు వెఱ్ఱి
వేఁదు అనఁగ నపస్మారి ♦ వెలయుఁ జెవిటి
వినని వాఁ డన బధిరాఖ్య ♦ లొనరు సాంబ. 10

టీ. పెఱవారు, కడవారు, వింతవారు, ఎడవారు, లాతివారు-౫ = అన్యులు. చుట్టలు, చుట్టాలు, చుట్టములు, విందులు, బందుగులు-౫ = బంధువులు. కూర్చువాఁడు, ఎడకాఁడు, కుంటెనకాఁడు, తాపికాఁడు-౪ = విటుని

దూత-విటీవిటులను తార్చువాఁడు. బయకాఁడు, వీణెకాఁడు-౨ = వైణికుఁడు. గాణ, పాటకుఁడు-౨ = గాయకుఁడు. తిక్క, వెఁగలి, వెడఁగు, వెకలి, వీఁకుఁడి, వెంబరవిత్తు, వెఱ్ఱి, వేఁదులు-౭ = అపస్మారి. చెవిటి, విననివాఁడు-౨ = బధిరుఁడు.

సీ. ఏకిమీఁడు పాదుసా ♦ యేలిక మన్నీఁడు
సాహేబు రాయఁడు ♦ సామి పబువు
జియ్య తుపాసి వ♦జీరుండు రాయలు
దునెదారి రా ఱేఁడు ♦ దొర యొడయఁడు
నేఁ డన వర్తిలు ♦ నృపుపేళ్లు పడవాలు
దళవాయి దళ్వాయి ♦ దణి యనంగఁ
దగు దళకర్తకుఁ ♦ దగువాఁడు వెరవరి
తీర్పరి కార్బారి ♦ దిట్ట యనఁగఁ

తే. గార్యకర్తకుఁ జెలఁగుఁ బె♦గ్గడ నియోగి
పెగడ మంతిరి నా మంత్రి♦పేళ్లు వెలయుఁ
బంగునకు లేవఁజాలని♦వాఁడు పుట్టు
మొండి పిచ్చుకుం టనుపేళ్లు ♦ పొసఁగు సాంబ. 11

టీ. ఏకిమీఁడు, పాదుసా (ఇది తురకపదము) ॥రూ॥ పాదుసాహి, ఏలిక, మన్నీఁడు ॥పా॥ మన్నియ ॥రూ॥ మన్నియఁడు-మన్నెఁడు-మన్నె, సాహేబు (ఇది తురకపదము), రాయఁడు, సామి, పబువు, జియ్య, తుపాసి, వజీరుఁడు, (ఇది తురకపదము)॥రూ॥ వజ్జీరుఁడు-వజీరుఁడు, రాయలు, దునెదారి ॥రూ॥ దునేదారి, రా, ఱేఁడు, దొర, ఒడయఁడు; నేఁడు. ౨౬ = రాజు. పడవాలు, దళవాయి, దళ్వాయి, దణి-౪ = సేనాధిపతి. తగు

వాఁడు, వెరవరి = ఉపాయమెఱిఁగినవాఁడు, తీర్పరి, కార్భారి, దిట్ట-గ = కార్యసమర్థుఁడు. ప్రెగ్గడ, నియోగి, ప్రెగడ ॥రూ॥ పెగడ, మంతిరి-గ = మంత్రి. లేవఁజాలనివాఁడు, పుట్టుమొండి, పిచ్చుకుంటు ॥రూ॥ పిచ్చుకకుంటు-పిచ్చికుంటు-పిచ్చికకుంటు-ఁ = కాళ్ళులేనివాఁడు.

సీ॥ ఎడకాఁడు కొల్లగాఁ ♦ డెడత్రోవకాపరి
గడిదొంగ దోఁపుడు♦కాఁడు నాఁచు
గజముచ్చు చేవాఁడి♦కాఁడు జాజరకాఁడు
మచ్చరి మునిముచ్చు ♦ మాయదారి
తెరువాటుకాఁడు క♦త్తెరదొంగ దొరకోలు
సన్న్యాసి వడికాఁడు ♦ కన్నగాఁడు
రేదిమ్మరీఁడు ము♦ల్లియవిప్పులోవాఁడి
కాఁడు తెక్కలికాఁడు ♦ కల్లరీఁడు
తే. తవళి మోసరి యనఁ జెల్లుఁ ♦ దస్కరునకుఁ
దొత్తు సాఁకుడు బోసము♦కత్తె దాది
విలువరమ్మ్రుడు వరవుఁ డిల్ ♦ బిడ్డ యనఁగ
దాసికానామధేయముల్ ♦ దనరు సాంబ. 12

టీ. ఎడకాఁడు, కొల్లగాఁడు, ఎడత్రోవకాపరి = నడిదారిని కాచుకొనియుండువాఁడు, గడిదొంగ = ఒళవెఱిఁగినదొంగ, దోఁపుడుకాఁడు॥రూ॥ దోఁపిడికాఁడు-దోఁపుకాఁడు, నాఁచు, గజముచ్చు = పెద్దదొంగ, చేవాఁడికాఁడు = చేతులచే దూర్తత్వమును జూపువాఁడు, జాజరకాఁడు॥రూ॥ జజ్జరకాఁడు = మోసముగలవాఁడు, మచ్చరి, మునిముచ్చు = మునివేషముతో నమ్మించి దొంగలించువాఁడు, మాయదారి = మాయలుగలవాఁడు, తెరువా

టుకాఁడు = బందె కట్టి కొట్టువాఁడు, కత్తెరదొంగ = కత్తిరించువాఁడు, దొరకోలుసన్యాసి = నమ్మించి మోసపుచ్చి దొంగిలించుకొని పోవువాఁడు, కడికాఁడు = చులుకుఁదనముగలవాఁడు, కన్నగాఁడు = కన్నముపెట్టువాఁడు, కేద్రిమ్మరీఁడు = దొంగిలించుటకు రాత్రులందుఁ దిరుగువాఁడు, ముల్లియవిప్పు = సొమ్ముమూఁటిని విప్పువాఁడు, లోవాఁడికాఁడు = పైకి మెత్తనివాఁడుగాఁ దోఁచి లోఁపలఁ గ్రూరత్వము గలిగి యుండువాఁడు, తెక్కలికాఁడు, కల్లరీఁడు, తపశి. (రూ. తపశి), మోసరి-అరి = దొంగ. తొత్తు, సాఁకుడు, బోనముకత్తె, (రూ. బోనకత్తె), దాది, విలువరమ్మడు, వావుడు, ఇలుబిడ్డ-ట = దాసి.

సీ. పడుపుఁజాన గడించు♦పడఁతి మేల్దాపరి
　　భోగపుఁజేడియ ♦ పొత్తుటాలు
వేఁడుకచెలి లంజె ♦ వెలయాలు రోచెల్వ
　　వెల్లాటకత్తె నా ♦ వేశ్య వెలయుఁ
గూర్చియిచ్చుమిటారి ♦ కుంటెనకత్తియ
　　తాపికత్తె యనంగఁ ♦ దనరు దూతి
నాగవాసం బన ♦ నామ మా వేశ్యల
　　మేళంబునకుఁ గొమ♦రాలు కొమిరె

తే. చాను జవరాలు కొమరిత ♦ జవ్వని యన
సుందరికిఁ జెల్లు గట్టివె♦సుదియుఁ బ్రోఢ
యనఁగఁ దగుఁ బ్రౌఢ వయసు♦చెల్లినది ముసలి
మిండకో రన లోలాక్షు ♦ మెఱయు సాంబ.

టీ. పడుపుఁజాన = అఙ్ఞనముగల స్త్రీ, గడించుపడఁతి = ఆర్జించు స్త్రీ, మేల్దాపరి, బోగపుఁజేడియ, పొత్తుటాలు, వేడుకచెలి = విలాసార్థమైన స్త్రీ, లంజె, వెలయాలు = క్రియమునకు భార్యగా వచ్చెడు స్త్రీ, రోఁచెల్వ = ద్రవ్యమునకు వచ్చెడు స్త్రీ, వెల్లాటకత్తె = మిక్కిలి నాట్యమాడు స్త్రీ-౧౦ = వేశ్య. కూర్చియిచ్చుమిటారి, కుంటెనకత్తె, కాపికత్తె-౩దూతిక. వాఁగవాసము = వేశ్యలమేళము. కోమరాలు, కోమిరె = లేతవయస్సుగలది, చామ, జవరాలు = యౌవనముగలది, కోమరిత॥ రూ॥ కోమారిత-కౌమార్త, జవ్వని = యౌవనముగలది-౮ = ప్రాయముగల స్త్రీ. గట్టివైసుది, ప్రోడ-౨ = ప్రౌఢ స్త్రీ. వయసుచెల్లినది, ముసలి, మిండకోరి॥ రూ॥ మిండలకోరి॥-౪ = లోల స్త్రీ.

సీ. కన్నియ కన్నె నా ♦ కన్యక కగుఁ బేరు
లాసగలది అంకు♦లాడి చెడిపె
వెలిచోరవరి యన ♦ వెలయు జారిణి పేళ్లు
మెయి మేయి యొడలు నె♦మ్మేను మేను
బొంది మే మై యనఁ ♦ బొసఁగు దేహమునకు
నెఱికలు నెండ్రికల్ ♦ నెఱు లనంగఁ
కేశసమాఖ్యలౌఁ ♦ గేశబంధము పేళ్ళు
కీల్జడి కొప్పుడి ♦ కీలుగంటు
తే. నూనెముడి వెన్నుగం టన ♦ నొనరు శిఖకు
జుట్టు సిక సిగ యనఁ జెల్లుఁ ♦ జుంచు కురులు
ముంగురులు కూఁకటు లనంగఁ ♦ బొసఁగు చుంచుఁ
గుంతలమునకు జితదైత్య♦కూట సాంబ. 14

టీ. కన్నియ, కన్నె-౨ = కన్య. ఆసగలది, అంకులాఁడి, చెడిపె, వెలిచోరవరి = బయటిచోరవగలది-౪ = జారిణి. మెయి, మేయి, ఒడలు,

నెమ్మేను, మేను, బొంది, మే, మై-౫ = దేహము. నెఱికలు, వెండ్రుకలు, నెఱులు॥ రూ॥ నెరులు-౪ = కేశములు, కీల్ముడి, క్రొమ్ముడి, కీలుగంటు, సూనెముడి, వెన్నుగంటు - ౫ = కేశబంధము - అనఁగా జాలుగా ముడిఁచిన వెండ్రుకల దూముడి. జుట్టు, సిగ, సిక-౩ = శిఖ. చుంచు, కురులు, ముంగురులు. కూఁకటులు-౪ = కుంతలములు, అనఁగా పొడివెండ్రుకలు.

సీ. కొప్పు వేనలి మూల ♦ క్రొవ్వెద తుఱు మనఁ
గబరియా కన్ గను ♦ కన్ను నంగ
నేత్రాఖ్య లగు నొసల్ ♦ నెన్నొసల్ నుదురు నె
న్నుదు రన నిటలాఖ్య ♦ లొదవుఁ జూడ్కి-
పారువ దిష్టి చూ ♦ పన వీక్షణము లొప్పు
వీనులు చెవులును ♦ జానుగులును
నా నొప్పు శ్రోత్రముల్ ♦ కౌను లేఁగౌను నె
న్నడుము నడు మనంగ ♦ నడరు మధ్య
తే. మునకుఁ బొక్కిలి బొడ్డనఁ ♦ దనరు నాభి
మూతి మోర మొకము మోము ♦ మొగ మనంగ
వదనము దనర్చు వా నోరు ♦ వాయి యనఁగ
ముఖగుహాభిఖ్య లగు గురు♦మూర్తి సాంబ. 15

టీ. కొప్పు, వేనలి, మూల, క్రొవ్వెద, తుఱుము-౫ = కొప్పు. కన్, కను, కన్ను-౩ = నేత్రము. నొసలు, నెన్నొసలు, నుదురు, నెన్నుదురు-౪ = నిటలము. చూడ్కి, పారువ, దిష్టి, చూపు-౪ = దృష్టి. వీనులు, చెవులు, జానుగులు - ౩ = కర్ణములు. కౌను॥ రూ॥ కవును, లేఁగౌను, నెన్నడుము, నడుము-౫ = మధ్యము. పొక్కిలి, బొడ్డు-౨ = నాభి. మూతి, మోర, మొకము, మోము, మొగము-౫ = ముఖము. వా, నోరు, వాయి-౩ = నోరు.

ఇందు చుంచు, కూఁకటులు- ఈ రెండు శబ్దములను కుంతల పర్యాయములగుట విచార్యము.

సీ. పలు పల్లు పండులు ♦ పండ్లన రదము లౌఁ
జెంప దవడ చెక్కు ♦ చెక్కి లనఁగఁ
దగుఁ గపోలము నెత్తి ♦ తల యన శిర మొప్పు
ముకు ముక్కనంగ నా♦సిక చెలంగు
బొమ కనుబొమ యన ♦ భ్రూనామ మమరు మీ
సలు మీసము లనంగ ♦ శ్మశ్రువలరు
నదరము కెమ్మోవి ♦ పెదవి వాతెఱ మోవి
యన నోష్ఠ మగు నెద ♦ యక్కు ఱొమ్ము
తే. నెడఁద యన వక్ష మగుఁ బొట్ట ♦ కడుపు బొజ్జ
బొఱ్ఱ డొక్కన నుదరంబు ♦ పొసఁగుచుండుఁ
గేలు కై కయి చేయి కెం♦గే లనంగఁ
బంచశాఖకు నామముల్ ♦ పరఁగు సాంబ. 16

టీ. పలు, పల్లు, పండులు, పండ్లు-౪=దంతములు. చెంప॥పా॥ చెంక, దవడ, చెక్కు, చెక్కిలి-౫ = కపోలము. నెత్తి, తల-౨ = శిరము. ముకు - ముక్కు-౨ = నాసికము. బొమ, కనుబొమ-౨ = భ్రూలత. మీసలు, మీసములు-౨ = శ్మశ్రువులు. అదరము, కెమ్మోవి, పెదవి, వాతెఱ, మోవి-౫= ఓష్ఠము. ఎద, అక్కు, ఱొమ్ము, ఎడద-౪ = వక్షము. పొట్ట, కడుపు, బొజ్జ, బొఱ్ఱ, డొక్క-౫ = ఉదరము. కేలు, కై, కయి, చెయ్యి॥ రూ॥ చెయి, చేయి, చే, కెంగేలు-౭ = హస్తము.

సీ. అఱచెయ్యి లోచెయి ♦ యనఁ గరతల మొప్పఁ
బెడచెయ్యి మీఁజెయి ♦ వెనుకచెయ్యి
యనఁ దగుఁ జరమశ ♦ యంబు వేల్ వ్రేలన
నంగుళి యగుఁ జర ♦ మాంగమునకు
వెన్ను వెనుక మేను ♦ వీఁ పన వర్తిల్లు
గద్దువ గడ్డము ♦ గౌద యనఁగఁ
జిబుకనామంబు రా ♦ జిల్లుఁ గడవసంబు
చట్టు తోలనఁ గళా ♦ సంబు నాఁగఁ
తే. జర్మ మమరు మోఁకాళ్ళన ♦ జానువు లగుఁ
బిక్క చిఱుదొడ యన జంఘ ♦ పేళ్లు దనరుఁ
గుఱువు తొడ యన నూరువు ♦ వఱలు ముడ్డి
పిఱుఁదు తుంటన జఘనంబు ♦ పేళ్లు సాంబ. 17

టీ. అఱచెయ్యి లోచెయి-౨ = కరతలము. పెడచెయ్యి, మీఁజెయి, వెనుకచెయ్యి-3 = హస్తచరమభాగము. వేలు, వ్రేలు, ౨=అంగుళి. వెన్ను, వెనుక, మేను, వీఁపు-3 = పృష్ఠము. గద్దువ, గడ్డము, గౌద॥ రూ॥ గవుద-౪ = చిబుకము. కడవసము, చట్టు, తోలు, కళాసము-౪ = చర్మము. మోఁకాళ్లు = జానువులు. పిక్క, చిఱుదొడ-౨ = జంఘ. తుఱువు, తొడ-౨ = ఊరువు. ముడ్డి॥ రూ॥ మూడి, పిఱుఁదు, తుంటి-౪ = కటి.

సీ. పునుక పుఱియ పుచ్చె ♦ యనఁ గపాలం బొప్పు
బుజము మూఁ పనఁ జెల్లు ♦ భుజము పేళ్లు
బట్ట వలువ కోక ♦ పుట్టంబు గింటెంబు
చీర నా వసనంబు ♦ చెలఁగు నఱుత

గొంతు కుత్తుక యఱ్ఱు ♦ కొలికి మెడ యనంగ
గళమున కగుఁ బిడి♦కిలి యన ముష్టి
కగుఁ బ్రసృతికిఁ జేర ♦ యన నంజలికి దోయి
లన హస్తమునకు మూ ♦ రనఁగఁ బొసఁగు
తే. బార యనఁగను వ్యామాఖ్య ♦ పరఁగు జేన
దుత్త యనఁ దాలమున కొప్పు ♦ బెత్త యనఁగ
నంగుళాభిఖ్య యగు నంజ ♦ హజ్జ యడుగు
నాఁగఁ బాదాఖ్య లగు లోక♦నాథ సాంబ. 18

టీ. పునుక, పుఱియ॥రూ॥ పుఱ్ఱియ-పుఱ్ఱె,పుచ్చె-౫ = కపాలము. బుజము, మూఁపు-౨ = భుజము. బట్ట, వలువ, కోక, పుట్టము, గింటెము, చీర-౬ = వస్త్రము. అఱుత, గొంతు, కుత్తుక, అఱ్ఱు, కొలికి, మెడ-౬ = కంఠము. పిడికిలి = ముష్టి. చేర=ప్రసృతి (పుడిసిలి). దోయిలి॥ రూ॥ దోసిలి-౨ = అంజలి. మూర = హస్తము. బార = వ్యామము. జేన, దుత్త-౨ = తాలము. బెత్త = అంగుళము. అంజ, హజ్జ॥రూ॥ అజ్జ, అడుగు-3 = పాదము.

సీ. చనులు గుబ్బలు చండ్లు ♦ చాచులు పాలిండ్లు
చన్ను లనంగఁ గు♦చంబు లమరు
నారు నూఁగా రన ♦ నలరు రోమావళి
పావలఁ గనుతావు ♦ పత్తె బుయ్య
మరునిల్లు దుబ్బన ♦ మదనమందిర మొప్పుఁ
బిల్లలఁ గలిగించు♦వేరు చుల్లి
బుల్ల బెల్ల మనంగఁ ♦ బొసఁగు శేఫము గాఁడు
గుద్ద పిఱ్ఱ యనంగ ♦ గుదము దనరుఁ

తే. పైఁట పయ్యఁట పయ్యెద ♦ పయఁట చెఱఁగు
నాఁగఁ జేలాంచలాభిధా♦నంబు చెలఁగుఁ
గలువడము చందువా మేలు ♦ కట్టనంగ
నతిశయిల్లు వితానాహ్వ♦యములు సాంబ. 19

టీ. చనులు, గుబ్బలు, చండ్లు, చాచులు, పాలిండ్లు, చన్నులు-౬ = స్తనములు. ఆరు, నూఁగారు-౨ = నాభిక్రిందిరోమావళి. పాపలఁగనుతావు = బిడ్డలను గనుపట్టిచోటు, పత్త, బుయ్య, మరునిల్లు = మన్మథుని గృహము, దుబ్బ-౫ = మన్మథగృహము (ఆఁడుగుఱి). పిల్లలఁ గలిగించుపేరు = బిడ్డలను బుట్టించుటకు మూలభూతమైనది, చుల్లి॥రూ॥ చుల్ల, బుల్ల, బెల్లము-౮ = శిశ్నము. గాఁడు, గుద్ద, పిఱ్ఱ-3 = గుదము. పైఁట, పయ్యఁట, పయ్యెద రూ॥ పయ్యద॥ పయఁట, చెఱఁగు-౬ వస్త్రాంచలము (చీరకొంగు). కలువడము, చందువా, మేలుకట్టు-౩ = వితానము.

సీ. చెలి ముద్దుగుమ్మ యు♦గ్మలి నవలా చాన
కన్నె బిత్తరి గోతి ♦ కలికి మగువ
జవరాలు చేడియ ♦ జవ్వని తొయ్యలి
నాతి పైదలి యెల♦నాగ లేమ
సకియ జక్కవచంటి ♦ చామ చిల్కలకొల్కి
గుబ్బెత ప్రోయాలు ♦ కొమ్మ పడఁతి
పొలఁతి ముద్దియ నన♦బోఁడి యింతి మిటారి
నెలఁతుక వాల్గంటి ♦ నెలఁత తెఱవ
తే. యన్ను లతకూన యొయ్యారి ♦ యతివ వెలఁది
చెలియ సకి బోటి కొమరిత ♦ చిగురుబోఁడి

ముగుద వగలాఁడి సింగారి ♦ ముదిత యువిద
గరిత యన భామినీసమా♦ఖ్య లగు సాంబ. 20

టీ. చెలి, ముద్దుగుమ్మ = మనోజ్ఞురాలైనది, ఉగ్మలి, నవలా, వాన, కన్నె ॥రూ॥ కన్నియ, బిత్తరి = శృంగారచేష్టగలది, గోతి, కలికి = మనోజ్ఞురాలైనది, మగువ, జవరాలు = యౌవనము గలది, చేడియ, జవ్వని = యౌవనముగలది, తొయ్యలి, నాతి, పైదలి॥ రూ॥ పయిదలి, ఎలనాగ, లేమ, స॥యు, జక్కవచంటి = జక్కవపక్షులవంటి స్తనములుగలది, చామ, చిలుకల కొలికి = చిలుక కొలికి వంటి కొలుకులుగలది, గుబ్బెత = గుబ్బచన్నులుగలది-వయసుకి, ప్రోయాలు, కొమ్మ, పడఁతి, పొలఁతి, ॥రూ॥ పొల్తి, ముద్దియ, ననఁబోడి = పువ్వువలె మెత్తనిదేహముగలది, ఇంతి, మిటారి = మిటారముగలది, నెలఁతుక, వాల్గంటి = నిడుదలైన కన్నులుగలది, నెలఁత, తెఱవ, అన్ను, లతకూన = లతతీగవంటిది, ఒయ్యారి = ఒయ్యారముకలది, అతివ, వెలఁది ॥రూ॥ వెలఁదుక, చెలియ, సకి, బోటి, కొమరిత, చిగురుఁబోఁడి = చిగురువలె మృదువైన శరీరము గలది, ముగుద, వగలాఁడి = చిన్నెలుగలది, సింగారి = శృంగారముగలది, ముదిత, ఉవిద, గరిత-గెర = స్త్రీ

సీ. ఆనవాలు పులు ♦ గంగమచ్చము గుఱు
తడియాల మన లాంఛ♦నాఖ్య లొదవు
జడిలి గొబ్బున వేగ ♦ సరగు గ్రక్కున వడి
వేగిర మనఁదగు ♦ వేగమునకు
మరియాద గడి మేర ♦ సరు దెల్ల కర యనం
బఱఁగు మర్యాదకు ♦ వెఱఁగు వింత
యక్కజ మబ్బుర ♦ మరిది నివ్వెఱ యబ్రి
మచ్చెరు వన నద్భు ♦ తాఖ్య లమరుఁ

తే. బరుగు కదలిక పరు వన ♦ మెఱయు ధావ
నమ్మునకు వేడె మొనరించెఁ ♦ గ్రమ్మెఁ బొదివెఁ
జుట్టుకొని నావరించె నా ♦ నిట్టినుడులు
వేష్టనంబున కమరు స ♦ ర్వేశ సాంబ. 21

టీ. ఆనవాలు, పులుగు, అంగముచ్చము, గుఱుతు, అడియాలము-౫ = లాంఛనము, జడితి, గొబ్బున, వేగ, సరగు, గ్రక్కున, వడి, వేగిరము-౭ = వేగము. మరియాద, గడి, మేర, సరుదు, ఎల్ల, కర-౬ = మర్యాద (హద్దు). వెఱగు, వింత, అక్కజము, అబ్బురము, అరిది, నివ్వెఱ, అబ్రము, అచ్చెరువు-౮ = అద్భుతము. పరుగు, కదలిక, పరువు-3 = ధావనము (పరుగెత్తుట). వేడెమొనరించె, క్రమ్మె, పొదివె, చుట్టుకొని, ఆవరించె-౫ = పరివేష్టించెను.

సీ. బువ్వ మెతుకు కూడు ♦ బోన మోరెము పసా
దము వంటకము పస ♦ దనము బాతు
సాద మోగిర మన ♦ జరుగు నన్నము పేళ్ళు
కుడిచె బోసేసె సా ♦ పడియె నమలె
నారోగిణ మొనర్చె ♦ నారగించె మెసవెఁ
దినె మెక్కె నన భుక్తి ♦ గొనుట కలరు
బనులు చెయ్యులు సేఁత ♦ లనఁ గర్మముల కొప్పెఁ
గనలు మోడి యలుక ♦ కినుక కిన్క
తే. నాఁగఁ గోపాఖ్య లగు లజ్జ ♦ నాన సిగ్గు
బొసుగు పుయిలోట సిబ్బితి ♦ పుచ్చటి కనఁ

బరఁగు వ్రీడాఖ్య యోల నె♦పంబు సాక

నంగ వ్యాజం బమరు జగ♦న్నాథ సాంబ. 22

టీ. బువ్వ, మెతుకు, కూడు, బోనము, ఓరెము, పసాదము, సంతుకము, పసదనము, బాతు, పాదము, ఓగిరము-౧౧=అన్నము. కుడిచె, బోసేసె, సాపడిరె, నమలె, ఆరోగిణమొనర్చె, ఆరగించె, మెసవె ॥రూ॥ మెసఁగె, తినె, మెక్కె-౧౦=భుజించెను పనులు, చెయ్వులు, చేతలు-౩=కృత్యములు, కనలు, మోడి, అలుక ॥రూ॥ అల్క, కినుక, కిన్క-౬=కోపము. లజ్జ, నాన, సిగ్గు, బొసుకు, పుయిలోటు, సిబ్బితి, పుచ్చటిక ॥రూ॥ పుచ్చడీక-౮=లజ్జ. ఓల, నెపము ॥రూ॥ నెవము, సాకు-౩=వ్యాజము.

సీ. పానుపు తలిమంబు♦పఱుపు లే పన మెత్త

సెజ్జ యనఁగ శయ్య♦చెలఁగు చుండుఁ

బన్నుండెఁ దెన్నుండెఁ♦బండుకొనెఁ బరుండెఁ

బవ్వళించెను బండెఁ♦బడకసేసె

న త్తమిల్లె ననంగ♦నలరారు శయనించె

ననుటకు నిద్దుర♦గొనియె గుఱక

గొనియె నిద్దురవోయెఁ♦గూర్కెడె నన నిద్రి

తున కొప్పు లేచె మే♦ల్కొనియె మేలుకొ

తే. వయ్యె నన జాగ్రదభిధాన♦మమరు వేడ్క

మెలిమి వేడుక సంతోస♦మింపు ముదము

సంతసము సొంపు మే లరు♦సం బనంగఁ

బ్రమదమున కాఖ్య లగు జగ♦త్పాల సాంబ. 23

టీ. పానుపు ॥రూ॥ పాన్పు, తలిమము, పఱుపు, శేపు, మెత్త సెజ్జ-౭ = శయ్య. పన్నుండె, తెన్నుండె పా॥ తొన్నుండె, పండుకొనె, పరుండె, పవ్వళించెను, పండె, పడకసేసె, అత్తమిల్లె -౯ = శయనించెను. నిద్దురగొనియె ॥రూ॥ నిదురగొనియె, గుఱకగొనియె, నిదుర వోయె, కూర్కె-డె-౫ = నిద్రించెను. లేచె, మేల్కాంచె ॥పా॥ మేల్కనె, మెలఁకువయ్యె-౪ = జాగరూకుఁడయ్యెను. (ప్రబోధమందెను.) వేడ్క, ఎలమి, వేడుక, సంతోసము, ఇంపు, ముదము, సంతసము, సొంపు, మేలు,అసముం౧౦ = సంతోషము.

సీ. పలికె వాక్రుచ్చె న♦ప్పనసేసె మందలిం
చెను విన్నవించెఁ జె♦ప్పె ననె నొడివె
నాడెఁ బల్కె వచించె ♦ నన భాషణము సేసె
ననుట కొ వీనిచ్చె ♦ నాలకించె
వినెఁ జెవియొగ్గెను ♦ వినియె నాలించె నా
శ్రుతమయ్యె ననుట కొఁ ♦ జులుక చొక
యులక మెల్లిద మన ♦ నొనరు బఘుతపేళ్లు
పులకలొత్తెను గగు♦ర్పొడిచె గగురు
తే. పాటె గరుపాటె మైమోజు♦పర్వె ననఁగఁ
దగును రోమాంచనామముల్ ♦ నగవు నవ్వు
నగు న వన హాసమున కొప్పు ♦ నడిమిదిన్నె
దీవి యన ద్వీప మగుఁ బర♦దేవ సాంబ. 24

టీ॥ పలికె, వాక్రుచ్చె, అప్పనసేసె, మందలించె, విన్నవించె,చెప్పె, అనె, నొడివె, ఆడె, పల్కె, వచించె-౧౧ = సంభాషించెను. వీనిచ్చె, ఆల

కంచె, విని, చెవియొగ్గె, వినిరో, ఆలించె-౬ = వినెను. చులుక ॥రూ॥ చుల్క, చౌక ॥రూ॥ చవుక, చులక, ఎల్లిదము-౬ = లఘుత్వము. పులకలొత్తెను, గగుర్పొడిచె, ॥రూ॥ గగురుపొడిచె-గగ్గురుపొడిచె, గగురుపాటె, గగుపాటె, మైమోఁడుపర్చె-౭ = రోమాంచమయ్యె. నగవు, నవ్వు, నగు, నవు-౪ = హాసము. నడిమిదిన్నె, దీవి-౨ = ద్వీపము.

సీ॥ జోత జాగిలి కేల్మోడ్పు ♦ జోహారు గిడిగిడి
మోడుపు చేకూర్పు ♦ మ్రొక్కు మొగుపు
చిన్నిపూ చేమోడ్పు ♦ జేజె వెన్నెల చెంగ
నాలు గొబ్బులు టెంక♦ణాలు నేర
డల్లుల్ సలా మన ♦ నమరు దండము పేళ్లు
పళ్లెము కంచము ♦ పళ్లెరంబు
తెలె హరివాణంబు ♦ తలియ తట్టి యనంగ
భాజనం బగు గిన్నె ♦ బటువు కోర
తే. డబ్బర యనంగఁ జషకమా ♦ దప్పి దూప
దప్పి దగ నీరువ ట్టన ♦ దాహ మమరుఁ
జాగ మోవి పుడుకు పెట్టు ♦ తేగ మోగి
యనఁగఁ ద్యాగసమాభిఖ్య ♦ లగును సాంబ. 25

టీ. జోత॥రూ॥ జోతము, జాగిలి, కేల్మోడ్పు, జోహారు॥రూ॥ జోహారువు జోహారు-జొహారువు, గిడిగిడి, మోడుపు॥ రూ॥ మోడ్పు, చేకూర్పు, మ్రొక్కు, మొగుపు, చిన్నిపూ, చేమోడ్పు, జేజె, వెన్నెల, చెంగనాలు, గొబ్బిలు, టెంకణాలు, నేరడల్లులు, సలాము-౨౩ = నమస్కారము. పళ్లెము॥ రూ॥ పళ్ళెము, కంచము, పళ్లెరము, తెలె॥రూ॥ తెలియ,

పాఁరివాణము, కలిశము, కట్టె-౯ = పాత్రము. గిన్నె, బటువు, కోర, డబ్బర ॥రూ॥ దబ్బర-౫ = చమసము. డప్పి, దూప, దస, దప్పి, నీరువట్టు-౫ = దాహము. చాగము, ఈవి, పుదుకు, పెట్టు, తేగము, ఈగి-౬ = త్యాగము.

సీ. అగపడెఁ జేపడె ♦ నబ్బె దొరకెఁ జిక్కెఁ
దగిలెఁ దగుల్కొనెఁ ♦ దగులువడియెఁ
బట్టువడియెఁ జిక్కు♦వడెఁ దవిలె ననంగ
నమరు గృహీతాఖ్య ♦ లఱచె నేడ్చె
వాపోయె మొఱలిడె ♦ వాచఱచె ననంగ
రోదనంబున కగు ♦ రొద గలిబిలి
చప్పుడు గొలగొల సద్దు ♦ కూఁత యులివు
నలుకుడు రవళి యం ♦ తనఁగ ధ్వనికి
తే. నలరుఁ గలసెఁ బెరసెఁ గూడెఁ ♦ హత్తె దొరసె
నందెఁ బొందెఁ బెనఁగెఁ జెందె ♦ నంటె ననఁగ
నమరు సక్తాఖ్య లోనయ్యె ♦ నగ్గమయ్యె
లోఁబడె ననంగ స్వవశాఖ్యలు చను సాంబ. 26

టీ. అగపడె, చేపడె, అబ్బె, దొరకె, చిక్కె, తగిలె, తగులుకొనె, తగులువడె, పట్టువడె, తవిలె-౧౦ = గృహీతుఁడయ్యె. అఱచె, ఏడ్చె, వాపోయె, మొఱలిడె, వాచఱచె-౫ = రోదనముచేసె. రొద, గలిబిలి, చప్పుడు, గొలగొల, సద్దు, కూఁత, ఉలివు, అలుకుడు, రవళి ॥రూ॥ రవాళి, అంతు-౧౧ = ధ్వని. కలసె, బెరసె, కూడె, హత్తె, అందె, పొందె, పెనఁగె, చెందె, అంటె-౧౦ = సక్తమయ్యె. లోనయ్యె, అగ్గమయ్యె, లోఁబడె-3 = స్వవశమయ్యె.

సీ. ఎడసె వీడెను బాసె ♦ నెడబాసెఁ బురివిచ్చె
వేఱుపడె ననంగ ♦ వెలయుచుండుఁ
బ్రత్యేకమయ్యె నగ ♦ పలుకులు వెడలించె
వెళ్లఁగొట్టెను దోలె ♦ వెలలఁబన్నెఁ
దఱిమె రొప్పె ననంగఁ ♦ దనరు నుచ్చాటనం
బొనరించె ననుటకుఁ ♦ గనియెఁ జూచెఁ
గనుఁగొనెఁ దిలకించెఁ ♦ గనెఁ గాంచె ననఁ జెల్లు
దర్శించె ననుటకుఁ ♦ దాల్చెఁ బూనె
తే॥ నాని మోచె ననఁగఁ జెల్లు ♦ నధివసించె
ననుట కరికట్టెఁ బోనీక ♦ నంకెచేసె
నాఁగె నిల్పెఁ దటాయించె ♦ నడ్డగించె
నానుకొనె ననఁ దగు వార♦ణాఖ్య సాంబ. 27

టీ. ఎడసె, వీడెను, పాసె, ఎడబాసె, పురివిచ్చె, వేఱుపడె-౬ = ప్రత్యేకమయ్యె. వెడలించె, వెళ్లఁగొట్టె, తోలె, వెలలఁబన్నె, తఱిమె, రొప్పె -౬ = ఉచ్చాటనముచేసె. కనియెను, చూచెను, కనుఁగొనెను, తిలకించెను, కనెను, కాంచెను-౬ = దర్శించెను. తాల్చె, పూనె, ఆనె, మోచె-౪ = వహించె. అరికట్టె, పోనీకనంకెచేసె, ఆఁగె, నిలిపె, తటాయించె, అడ్డగించె, ఆనుకొనె-౭ = వారించె.

సీ. అంటుగ్రాఁకొనియె ము♦ట్టయ్యెఁ జెఱఁగుమాసెఁ
గడకేఁగె నింటికిఁ♦గాకపోయె
వనఁగ దూరస్థకుఁ ♦ దనరుఁ దానముచేసె
నీళ్లుపోసికొనె ము♦నింగెఁ గుంకె

నన నిమజ్జనమయ్యె ♦ ననుటకుఁ దగు మడి
మడుఁగు మడు వనంగ ♦ నడరు శుచికి
మైల కట్టువిడుపు ♦ మా పన మలినాఖ్య
లగుఁ దల్పు వాకిలి ♦ యనఁ గవాట
తే. మున కొనరు నేకతంబు మం♦తన మనంగ
నంతరంగమునకుఁ జెల్లు ♦ నక్కఱ పని
యొంజలియు జోలి యనఁ గార్య ♦ మొనరు గంజి
వార్పన యవాగునామముల్ ♦ వఱలు సాంబ. 28

టీ. అంటుగైకొనియె, ముట్టయ్యె, చెఱఁగుమాసె, కడకేఁగె, ఇంటికిఁ గాకపోయె-౫ = రజస్వలయయ్యె. తానముచేసె, నీళ్లుపోసికొనె, మునిఁగె, క్రుంకె-౪ = స్నానమయ్యెననుట. మడి, మడుఁగు, మడువు-3 = పరిశుద్ధి. మైల॥ రూ॥ మయిల, కట్టువిడుపు, మాపు-౪ = మాలిన్యము. తల్పు॥ రూ॥ తలుపు, వాకిలి-3 = కవాటము. ఏకతము, మంతనము-౨ = అంతరంగము. అక్కఱ, పని, ఒంజలి, జోలి-౪ = కార్యము. గంజి, వార్పు-౨ = యవాగువు.

సీ. ఒకటి యొక్కఁ డొకండు ♦ నొం డన నేకాఖ్య
జమి డిమ్మ డిబ్బడి ♦ జంట రెండు
దుగ రెట్టి దువ యన ♦ ద్విగుణాఖ్య కవ జోడు
దంట దోయి యనంగ ♦ ద్వంద్వసంఖ్య
మూ రెండొకటి తిగ ♦ మూఁ డనఁ ద్రియసంజ్ఞ
చౌ యుడ్డ తీవంచ ♦ చౌకము నలు

నాలు గనఁగఁ జతు♦ర్నామముల్ చౌవంచ
యరపది యేను నై ♦ దనఁగఁ బంచ
తే. కంబు నా ఇత్తిగ యన ష♦ట్కంబు చక్క-
పగడ సత యే డనంగ స♦ప్తకము దచ్చి
యెనిమి దన నష్టకము తొమ్మి ♦ దనఁగ నవము
పదియు నీరైదన దశాఖ్య ♦ పరఁగు సాంబ. 29

టీ. ఒకటి, ఒక్కఁడు, ఒకఁడు ఒండు-౪ = ఏకము, జమిడి (రూ॥ జమలి, ఇమ్మడి రూ॥ ఇనుమడి -ఇన్మడి, ఇబ్బడి, జంటు, రెండు, దుగ, రెట్టి, దువ-౧౧ = ద్విగుణము (రెండు). కవ, జోడు, దంటు, దోయి-౪ = ద్వంద్వము. మూ, రెండొకటి, తిగ, మూఁడు-౪ = త్రిసంఖ్య. చౌ, ఉడ్డ, తీసంచ (౩ + ౧), చౌకము, నలు, నాలుగు-౬ = చతుస్సంఖ్య. చౌవంచ (౪ + ౧), అరపది, ఏను, ఐదు (రూ॥ అయిదు-౫ = పంచసంఖ్య. ఆఱు, ఇత్తిగ (౨ × ౩)-౨ = షట్సంఖ్య. చక్కపగడ (౬ + ౧), సత, ఏడు-౩ = సప్తసంఖ్య. దచ్చి, ఎనిమిది-౨ = అష్టసంఖ్య. తొమ్మిది = నవసంఖ్య. పది, ఈరైదు (౨ × ౫)-౨ = దశసంఖ్య.

సీ. పదునొకం డనఁగను ♦ బరఁగు నేకాదశం
బీరాఱు పండ్రెండు ♦ బార యనఁగ
రవిసంఖ్య యగు నానెఁ ♦ దాగ్రెఁ దాగ్రెను గొగ్రెల
ననఁగఁ బానముచేసె ♦ ననుట కొనరుఁ
బనివినియెను బోయెఁ ♦ జనె నేఁగె నరిగె నాఁ
గృతగమనునకుఁ జే ♦ ల్లెసఁగుఁ గ్రిమ్మ-
రించెఁ ద్రిప్పెను మగి♦డించె మరల్చె నా
నావర్తన మొనర్చె ♦ ననుట కొనరుఁ

తే. బాఱె వ్రేల్లెను బరువెత్తెఁ ♦ బఱచెఁ గదలె
నుఱికెఁ దొలఁగె నటమరించె ♦ జరిగె నన్నఁ బ
లాయితుం డయ్యె ననుటకు ♦ నలరుచుండు
సకలసురచక్రవర్తి శ్రీ♦సాంబమూర్తి. 30

టీ. పదునొకండు = ఏకాదశసంఖ్య. ఈరాఱు (౨+౬) పండ్రెండు బార-3 = ద్వాదశసంఖ్య. ఆనెను, త్రాగెను. త్రావెను, క్రోలెను-౪ = పానముచేసెను. పనివినియెను, పోయెను, చనెను, ఏఁగెను, అరిగెను-౫ = కృతగమనుఁడయ్యెను. క్రమ్మఱించె, త్రిప్పె, మగిడించె, మరల్చె-౪ = ఆవర్తనముచేసెను. పాఱెను, వ్రేల్లెను, పరువెత్తెను ॥రూ॥ పరుగెత్తెను, పఱచెను, కదలెను, ఉఱికెను, తొలఁగెను, అటమరించెను, జరిగెను-౧౦ = పలాయితుఁడయ్యెను.

సీ. గడుసరి దిట్ట యొ♦క్కటి వాఁడిగలవాఁడు
వడికాఁడు పోటరి ♦ బంటు మేటి
మనసరి తెంపరి ♦ మొనకాఁడు మిడిమాసి
వడివాఁ డనంగ శూ♦రుఁడు సెలంగు
నని చివ్వ యేత్తెఱ ♦ యాలము బవరము
పోట్లాట పెనఁకువ పోరు ♦ కలను
కయ్యము దురము జ♦గడ మన యుద్ధాఖ్య
లమరు మద్దత్తు వె♦న్నాస తోడు
తే. పాటు సావాసము పతాలు ♦ బాసట యన
రాజిలు సహాయమునకు వే♦రమ్ము కంటు

సూడు పగ దేస మనఁగఁ బొ♦ల్చును విరోధ
నామములు సర్వలోకైక♦నాథ సాంబ. 31

టీ. గడుసరి, దిట్ట, ఎక్కటి, వాడిగలవాఁడు, వడికాఁడు, పోటరి, బంటు, మేటి, మనసరి, తెంపరి, మొనకాఁడు, మిడిమాసి = వాఁడిగలమనుష్యుఁడు, వడివాఁడు -౧౩= శూరుఁడు. అని, చివ్వ, ఏడ్తెఱ, ఆలము, బవరము, పోట్లాట, పెనఁకువ, పోరు, కలను, కయ్యము, దురము, జగడము-౧౨= యుద్ధము. మద్దత్తు, వెన్నాస, తోడుపాడు, సావాసము, పరాలు, బాసట-౬= సహాయము. వేరము, కంటు, సూడు, పగ, దేసము-౫=విరోధము.

సీ. నులిచె వెంపరలాడె ♦ నుగ్గాడె దెగటార్చెఁ
జక్కాడెఁ బగదెంచెఁ ♦ జంపెఁ జెండెఁ
సదమద మొనరించెఁ ♦ జదిపెఁ బీఁచమడంచె
నులిమెఁ జాఁగఁబొలాడెఁ ♦ బిలుకుమార్చెఁ
ఒరిమార్చె ముగియించె ♦ నుఱుముసేసె నడంచెఁ
ద్రుంచెఁ బొగరుమార్చెఁ ♦ దునిమె మడిపె
మన్నిగొనియె రూపు♦మాపె గీటడఁగించె
మడియించెఁ దూలించె ♦ మలిపె ననఁగ
తే. బొసఁగు వధియించె ననుటకుఁ ♦ బ్రోచెఁ బ్రోవె
సాఁకెఁ గాపాడె బ్రతికించె ♦ సంతరించె
బెంచె మనిపె ననఁగను బో♦షించుట కగు
సకల సురచక్రవర్తి శ్రీ♦సాంబమూర్తి. 32

టీ. నులిచె, వెంపరలాడె, నుగ్గాడె, తెగటార్చె, చక్కాడె, పగదెంచె, చంపె, చెండె, సదమద మొనరించె, చదిపె, పీఁచమడఁచె ।రూ॥

పించమడఁచె, సరిమె, చాఁగఁబలాడె, పిలుకు మాన్చె, పరిమార్చె, ముగియించె, నుఱుముసేసె, అడఁచె, త్రుంచె, పొగరుమార్చె, తునిమె, పడిపెమన్నిగొనె, రూపుమాపె, గీటడఁగించె, పడియించె, తూలించె, వలిపెవిఁ = వధించెను. ప్రోచె, ప్రోవె, సాఁకె, కాపాడె, బ్రతికించె, సంతరించె, పెంచె ॥రూ॥ పెనిచె, మనిపె ॥రూ॥ మనిచె, మంచె-౧౧ = పోషించెను.

సీ॥ ఇచ్చ తలఁపు మది ♦ యెద మన సనఁ జిత్త
మగుఁ దమకము మేలు ♦ మరులు బాళి
తమి వలపు విరాళి ♦ మమత నా మోహమా
నాఁడాది యదిసుత ♦ నాఁటనుండి
తలనాఁడు నాఁడుమొ♦దలు నాఁటఁబట్టి యా
నాఁడనిక్కి యదిమొదల్ ♦ నాఁటఁగోలె
యనఁగఁ దదారభ్య ♦ యనుట కౌ మంచి మేల్
బాగు లెస్స యన శు♦భంబు లలరు
తే॥ వనట యంగలారుపు వెత ♦ వంత గోడు
బాద యంగద వగ పనఁ ♦ బరఁగుఁ బీడ
పదవి సిరి కల్మి యనఁగ సం♦పదకు వెలయు
నితము పేరి మిం పన హిత ♦ మెసఁగు సాంబ. 33

టీ. ఇచ్చ, తలఁపు, మది, ఎద, మనసు-౫ = చిత్తము. తమకము, మేలు, మరులు, బాళి, తమి, వలపు, విరాళి, మమత-౮ = మోహము. నాఁడాది, అదిసుత, నాఁటనుండి, తలనాఁడు, నాఁడుమొదలు, నాఁటఁబట్టి, ఆనాఁడునిక్కి, అదిమొదలు, నాఁటఁగోలె-౯ = తదారభ్యయనుట. మంచి,

మేలు, బాగు, లెస్స-౪ = శుభము. వసటు, అంగలారుపు, వెత, వంత, గోడు, బాధ, అంగద, వగపు-౮ = పీడ. పదవి, సిరి, కల్మి-3 = సంపద. ఇతము, పేరిమి, ఇంపు-3 = హితము.

సీ॥ జతపీడె నెడసె నాఁ ♦ జను విరహము పేరు
లెనసెఁ బైకొనెఁ బొందె ♦ నేలెఁ గలసె
నన సంగమ మొనర్చె ♦ ననుట కొఁ బొలయల్క
వెడమోడి యనఁ జెల్లు ♦ వెలయుఁ బ్రణయ
కలహమునకు జడ ♦ గాంజ గంజా బంగి
యనఁగ గళంజాహ్వ♦యంబు లలరు
మబ్బు లాహిరి కైపు ♦ మస్తన మత్తత
భాసిల్లుఁ దొడుసు నుం♦పడ మనంగ
తే॥ భోగవనితకుఁ దగుఁ దెంపి ♦ ముసుకు ముంక
మాసక మ్మన విధవనా♦మములు సెలఁగుఁ
బైరవాసంబు దోవతి ♦ పంచె యనఁగ
నిల బహిర్వసనాభిఖ్య ♦ లలరు సాంబ. 34

టీ. జతపీడె, ఎడసె-౨ = విరహము. ఎనసె, పైకొనె, పొందె, ఏలె, కలసె-౫ = సంగమము చేసె. పొలయల్క, వెడమోడి-౨ = ప్రణయ కలహము. జడ, గాంజ, గంజా, బంగి-౪ = కలంజము (గంజాయి). మబ్బు, లాహిరి, కైపు, మస్తు-౪ = మత్తత. తొడుసు, ఉంపడము-౨ = భోగస్త్రీ. తెంపి, ముసుకు, ముంక, మాసకమ్మ-౪ = విధవ. బైరవాసము॥రూ॥ బయిటివాసము, దోవతి, పంచె-౪ = బహిర్వసనము (బయటివస్త్రము).

సీ॥ విచ్చేసె నేతెంచె ♦ వచ్చెను వేంచేసె
నరుదెంచెఁ జనుదెంచె ♦ ననఁగ నాగ
తునిపేరు లగు మగ♦తనము మగఁటిమి
గం డనఁ బౌరుషా♦ఖ్యలు చెలంగు
గద్దించె నదలించె ♦ గదిమెను నుఱిమె నా
గర్జించె ననుట కౌ♦ గట్టి యుక్కు
చేఁగ యూట యుదుటు ♦ చేవ యుఱవు బిగు
వన దృఢత్వముపేరు ♦ లలరు జట్టి
తే. విలువ రో వెల యనఁ గ్రియాఖ్యలు దనర్చుఁ
గప్రము సిరంబు గంబూర ♦ కప్పుర మన
వెలయుఁ జంద్రంబు వెలిగ్రుక్క ♦ గిలుకు పలుకు
రవపలు కనంగ మణితాఖ్య ♦ లవును సాంబ. 35

టీ. విచ్చేసె, ఏతెంచె॥ రూ॥ ఏఁగుదెంచె, వచ్చె, వేంచేసె, అరుదెంచె॥ రూ॥ అరుగుదెంచె, చనుదెంచె-౮ = వచ్చెను. మగతనము, మగఁటిమి, గండు-3 = పౌరుషము. గద్దించె అదలించె, గదిమె, ఉఱిమె-౪ = గర్జించె. గట్టి, ఉక్కు, చేఁ, ఊట, ఉదుటు, చేవ, ఉఱవు, బిగువు-౮ = దృఢత్వము. జట్టి, విలువ, రో, వెల -౪ = క్రియము. కప్రము, సిరము, గంబూర॥ రూ॥ గంబూరము, గంబురము, గంబురా, కప్పురము॥ రూ॥ కపురము-౮ = కర్పూరము. వెలిగ్రుక్క, గిలుకుపలుకు, రవపలుకు-3 = మణితము.

సీ. లేమి పేదరికము ♦ లేమిడి లేవడి
నిష్పచ్చర మిఁడుమ ♦ నెవ్వ యనఁగ

దారిద్ర్యనామముల్ ♦ తగు దెస యాత్రము
కడగండ్లు గోరము ♦ కస్తి బెడఁద
యడలుచే టన విప ♦ దాఖ్యలు వర్తిల్లుఁ
డెక్కమెగురఁగొట్టె ♦ డింక వేసెఁ
బెద్దనిద్దురవోయె ♦ బిద్దె మడిసెఁ జచ్చెఁ
జనె గంతుకొనెఁ దుర్రింగె ♦ సమసె నేఁగెఁ
తే. గూలె నీల్గెఁ గెడసెఁ దెళ్లెఁ ♦ గుర్రింకె బుర్రింగెఁ
దెరలెఁ బోయె ముగిసెఁ దేఱెఁ ♦ దొరఁగె ననఁగఁ
బరఁగు మృతునిసమాఖ్యలు ♦ బవిరి చుట్టు
వేడె మన వలయాభిధల్ ♦ వెలయు సాంబ. ౩౬

టీ. లేమి, పేదరికము, లేమిడి, లేవడి, నిప్పచ్చరము, ఇడుమ, నెవ్వ-౭ = దారిద్ర్యము. దెస, ఆత్రము ॥రూ॥ అత్తరము, కడగండ్లు, గోరము, కస్తి, బెడఁద, అడలు, చేటు-౯ = విపత్తు. టెక్కమెగురఁగొట్టె, డింక వేసె, పెద్దనిద్దురవోయె, బిద్దె, మడిసె, చచ్చె, చనె, గంతుకొనె, త్రుంగె, సమసె, ఏఁగె, కూలె, ఈలిగె, కెడసె, త్రెళ్లె, త్రుంకె, బ్రుంగె, తెరలె, పోయె, ముగిసె, తేఱె, తొరఁగె-౨౨ = మృత్యుఁడయ్యె. బవిరి, చుట్టు, వేడెము-3 = వలయము.

సీ. గమిపోఁజు మొత్తము♦కదుపు చేరువ బారు
పిండు కూటువ పరి ♦ దండు దిమ్ము
గుంపు తుటుము గుమి♦కూటు పదు పనంగ
బృందాఖ్య యగు వెళ్లె ♦ వెడలె వెలసె

వెలువడె ననఁ బేళ్లు ♦ వెలయు నిర్గతుఁ డంట
కెన్నఁడు వాలాయ ♦ మెపుడు నిచ్చ
లెల్లప్పు డెప్పటి ♦ కేపొద్దు నెడప కే
నాఁ డెప్పు డుడుగక ♦ నాఁజెలంగు
తే. సంతతాఖ్య కొలము వంగ♦సమ్ము వంగ
డమ్మనఁ గులాఖ్య వర్తిల్లుఁ గ్రి♦మ్మఱి మఱి
మగుడ వెండియుఁ బలుమఱు ♦ మరల సారె
తిరుగ ననఁ బునరాఖ్యలు ♦ పరఁగు సాంబ. 37

టీ. గమి, పోఁజు, మొత్తము, కదుపు, చేరువ, బారు, పిండు, కూటువ, పరి, దండు, దిమ్మ, గుంపు, తుటుము, గుమి, కూటు, పదువు-౧౬ = సమూహము. వెళ్ళె, వెడలె, వెలలె, వెలువడె-౮ = నిర్గతుఁడయ్యె. ఎన్నఁడు, వాలాయము, ఎపుడు, నిచ్చలు ॥పా॥ నిచ్చ, ఎల్లప్పుడు, ఎప్పటికిన్, ఏపొద్దును, ఎడపక, ఏనాఁడు, ఎప్పుడు, ఉడుగక-౧౨ = సదా. కొలము, వంగసము, వంగడము-3 = కులము. క్రిమ్మఱన్, మఱి, మగుడన్, వెండియున్, పలుమఱు, మరలన్, సారె, తిరుగన్-౮ = పునః.

సీ॥ పంద కోఁచ పిఱికి ♦ పాఱుఁబో తనఁగను
సమరభీరుని పేరు ♦ లమరుచుండు
విడియము వీడెంబు ♦ వీడ్యము వక్కాకు
తమలము బాగాలు ♦ తమ్మలంబు
నాఁ జనుఁ దాంబూల♦నామముల్ గొనియాడె
నగ్గించెఁ బొగడెఁ గొం♦డాడె నెంచెఁ

క్రైవార మొనరించె ♦ నా వినుతికిఁ బేళ్లు
కర్చివ్చు కోరిక కోర్కి ♦ యిచ్ఛ యనఁగ
తే॥ నిచ్ఛ కగు రోసెఁ బరికించె ♦ నెమకెఁ దడవె
వెదకె నారసె నరసెను ♦ వెతకె ననఁగ
దనరు నన్వేషణాఖ్యలు ♦ తన్నెఁ దాఁచె
నడుగుతాటించెఁ గాళ్ళచే ♦ నడిచె ననఁగ
నమరుఁ బదతాడనాభిధా♦నములు సాంబ. 38

టీ. పంద, కోఁచ, పిఱికి, పాఱుఁబోతు-3 = యుద్ధభీరువు. విడి యము, వీడెము, వీడ్యము, వక్కాకు, తమలము, బాగాలు, తమ్మలము-8 = తాంబూలము. కొనియాడె, అగ్గించె, పొగడె, కొండాడె, ఎంచె, క్రైవార మొనరించె-6 = స్తోత్రముచేయుట. కర్చివ్చు, కోరిక, కోర్కి, ఇచ్ఛ-4 = ఇచ్ఛ. రోసె పరికించె, నెమకె, తడవె, వెదకె, ఆరసె, అరసె, వెతకె-8 = అన్వేషించుట. తన్నె, తాఁచె, అడుగుతాటించె, కాళ్ళచేనడిచె-4 = పాదములోఁ దన్నుట.

సీ॥ కొమరు చొక్కాటమ్ము ♦ గొనబు చొకారము
చొక్కము మేలిమి ♦ జోఁక పొలుపు
నాణెంబు సొరు వి♦న్నాణంబు తిన్నన
పరఁగు చొక్కా చెల్వు ♦ మురువు తనరు
నగు తియ్య పొనరు చె ♦ న్నలరు నలువు తీరు
వఱలు జాను చెలంగు ♦ కొఱలు నొనరు
చను తగు నొప్పు నె♦సంగు న నెడు పేళ్లు
తగు మంజులమునకు ♦ దండ యొద్ద

తే॥ చెంత కుఱఁగలి డగ్గఱ ♦ చేర్వ పొంత
దాపు సరస కెలను పజ్జ ♦ పాశ్రు వద్ద
యండ చక్కి గరిడి యన ♦ నమర నా స
మీపనామములు మనోజ్ఞ♦రూప సాంబ. 39

టీ. కొమరు, చొక్కాటము ॥రూ॥ చొకాటము-చొక్కటము, గొనబు, చొకారము ॥రూ॥ చొక్కారము, చొక్కము, మేలిమి, జోఁక, పొలుపు, నాణెము ॥రూ॥ నాఁడెము, సొరు, విన్నాణము, తిన్నన, పరగు, చొక్కా ॥రూ॥ చొక్క-చొకా(ఈ 3 ను, చొక్కమునకు వృత్తిని మీఁది వర్ణము లోపింపఁగా మిగిలినరూపములు), చెల్వు, మురుపు, తనరు, అగు, తియ్యు, పొనరు, చెన్ను, అలరు, నలువు, తీరు, వఱలు, జాను, చెలఁగు, కొఱలు, ఒనరు, చను, తగు, అమరు, ఒప్పు, ఎసఁగు -౪౦ = మంజులమైనది. దండ, ఒద్ద, కుఱఁగలి, డగ్గర॥రూ॥డగ్గఱ, చేర్వ ॥రూ॥ చేరువ, పొంత, దాపు, సరస, కెలను, పజ్జ, పాశ్రు, వద్ద, అండ, చక్కి, గరిడి-౧౭ = సమీపము.

సీ. పిమ్మటఁ దరువాతఁ ♦ బిదప వెన్క వెనుక
ననఁగఁ బశ్చాదభి♦ఖ్యలు చెలంగు
సడలె వదలె వీశ్రె ♦ జాఱె వీడె ననంగఁ
జ్యుతసమాఖ్య లగు లొ♦చ్చు కొదవ కడమ
కుఱుచ యొచ్చెము తగ్గు ♦ కొంచెము తక్కువ
మందు కొదవ లోను ♦ కొద్ది యనఁగ
మెఱయు న్యూనతపేర్లు ♦ మిక్కిలి యెక్కువ
యెచ్చు పెల్లుదనము ♦ పెచ్చు మిగుల

తే. హెచ్చనఁగ నధికాభిఖ్య • లెసఁగుచుండుఁ
దొలుత ముందర మున్ మున్ను • తొల్లి మునుపు
ముందు మును తొలి యనఁ జనుఁ • బూర్వమునకుఁ
దడవు జాగన నాలస్య • మడరు సాంబ. 40

టీ. పిమ్మట, తరువాతన్ (తరువాయికి సప్తమ్యేకవచనము) పిదప, వెన్క, వెనుక-౫ = అనంతరము. సడలె, వదలె, వీఁగె, జాఱె, వీడె-౫ = చ్యుతమయ్యె. లొచ్చు, కొఱత, కడమ, కుఱుచ, ఒచ్చెము, తగ్గు, కొంచెము, తక్కువ, కుందు, కొదవ, లోను, కొద్ది-౧౨ = న్యూనత. మిక్కిలి, ఎక్కువ, ఎచ్చు, పెల్లుదనము, పెచ్చు, మిగులన్, హెచ్చు-౭ = అధికము. తొలుత, ముందర॥ పా॥ ముందఱ, మున్ను, తొల్లి, మునుపు, ముందు, మును, తొలి-౮ = పూర్వము. తడవు, జాగు-౨ = ఆలస్యము.

సీ. తాఱుమాఱయ్యెను • దడఁబడె వీడ్వడె
నన విపర్యాసాఖ్య • లమరు సాము
సగము సాఁబా లనఁ • దగు నర్థ మనుటకుఁ
దూఁకొనెఁ జొరఁబాఱెఁ • దూఱె జొచ్చె
ననఁగఁ బ్రవేశించె • ననుటకుఁ దనరారు
మొత్తెఁ గొట్టెను వ్రేసె • మోఁదె ననఁగఁ
బ్రహరించె ననుట కౌఁ • బనిచె ననిచెఁ బుచ్చె
నంపెఁ బుత్తెంచెఁ బొ•మ్మనియెఁ బంపె
తే. గెలువు మనె ననఁ బ్రస్థితా•ఖ్యలు చెలంగుఁ
జాయ పొం తనఁ జొ టనఁ • బాయ యిక్క
చక్క తా వనఁగఁ బ్రదేశ•సంజ్ఞ దనరు
నంబరనదీలసజ్జటా•డంబ సాంబ. 41

టీ. తాఉమాఱయ్యె, తడఁబడి, వీద్వడె-౩ = విపర్యాసము (తలక్రిందు). సాము, సగము, సాఁబాలు-౩ = అర్థము. తూఁకొనె, చొరఁబాఱె, తూఱె, చొచ్చె-౪ = ప్రవేశించె. మొత్తె, కొట్టె, వ్రేసె, మోఁదె-౪ = ప్రహరించె. పనిచె, అనిచె, పుచ్చె, అంపె, పుత్తెంచె, పొమ్మనియె, పంపె, గెలువుమనె-౮ = ప్రయాణము సేయించె. చాయ, పొంత, చోటు, పాయ, యిక్క, చక్కి, తావు-౭ = ప్రదేశము.

సీ. అచట నయ్యెడ నందు ♦ నచ్చోట నదిగో నట
నచ్చట నక్కడ ♦ నకడ నాడ
నావంక నల్లదె ♦ యనఁ దత్ప్రదేశాఖ్య
లొదవు ముంగల మ్రోల ♦ నెదుట ముందు
ముందట యనఁగ స♦ముఖము పేళ్లు రహించు
నిరుదెస లిరువంక ♦ లిరుగెలంకు
లిరుపక్క లిరుమైల ♦ లిరుగేవ లిరుగడల్
సూరె లనెడిపేళ్లు ♦ మీఱు నుభయ
తే. పార్శ్వనామముల్ వడసెందె ♦ బాళితాఁకె
మైమఱచెఁ గడపట్టె సో♦మ్మసిలె ననఁగ
మూర్ఛకొఁ గికురించెను ♦ మోసపుచ్చెఁ
బిక్కచేసె నా వంచన♦పేళ్లు సాంబ. 42

టీ. అచట, అయ్యెడ, అందు, అచ్చోట, అదిగో॥ రూ॥ అడె, అట, అచ్చట, అక్కడ, అకడ, అడ, అవంక, అల్లదె॥ రూ॥ అల్లదిగో-౧౪ = ఆప్రదేశమునందు. ముంగల, మ్రోల, ఎదుట, ముందు, ముందట-౫ = సముఖము. ఇరుదెసలు, ఇరువంకలు॥ రూ॥ ఇర్వంకలు, ఇరుగెలఁకులు, ఇరుప్రక్కలు,

ఇరుమైలలు, ఇరుగేవలు, ఇరుగడలు, నూరెలు-౪ = ఉభయపార్శ్వములు. వడసెందె, ఖాళితాకె, మైమఱచె, కడపట్టె, సొమ్మసిల్లె-౫ = మూర్ఛ నొందె. కికురించెను, మోసపుచ్చె, పిక్కుచేసె-3 = వంచించె.

సీ॥ వెఱ బీతు దిగు లళ్కు ♦ వెఱ పదరు బెదరు
జళు కెద జడు పన ♦ వెలయు భయము
కత్తి వా లడిదము ♦ కైదువు నన ఖడ్గ
మెసఁగు బల్లెము గద ♦ యీటె చివ్వ
యనఁగ గుంతాఖ్య లౌ ♦ నామెత పండుగ
పబ్బం బనఁగ నుత్స♦వమున కలరు
వంక వంకర సొట్ట ♦ డొంక నన వక్రిత
చెలఁగు దుడుకు లూటి ♦ జులిమి దుండ
తే. గమ్మనఁగ నుద్ధతాఖ్య లౌఁ ♦ గాని వల్లె
మంచిది యనంగఁ దగు సమ్మ♦తించుటకును
గుఱుచ యరచట్ట దుత్తాయి ♦ కుబుస మనఁగ
నమరుఁ గూర్పాసనామధే♦యములు సాంబ. 43

టీ. వెఱ, బీతు, దిగులు, అళ్కు॥ రూ॥ అళుకు, వెఱపు, పదరు, బెదరు, జళుకు, ఎద, జడుపు-౧౧ = భయము. కత్తి, వాలు, అడిదము, కైదువు-౪ = ఖడ్గము. బల్లెము, గద, ఈటె, చివ్వ-౪ = కుంతము. ఆమెత, పండుగ॥రూ॥ పండుగు-పండువు, పబ్బము-౫ = ఉత్సవము. వంక, వంకర, సొట్ట, డొంక-౪ = వక్రిత. దుడుకు, లూటి. జులిమి, దుండగము,-౪= ఔద్ధత్యము, కాని, వల్లె, మంచిది-3 = సమ్మతించుటను సూచించుట. కుఱుచ, అర చట్ట, దుత్తాయి, కుబుసము-౪ = రవిక.

STUDENTS LITERARY ASSOCIATION, LIBRARY

సీ॥ పావాలు పావలు ♦ పావుకోళ్లన నెల్లుఁ
బాదుకాభిఖ్యలు ♦ పాదుపోసు
లూఁడ్పులు పాపోసు ♦ లుద్దముల్ మెట్లు చె
ప్పు లనఁగ బాదర♦క్షలకుఁ దనరు
నంగడి బాజా ర♦నంగ విపణి పొల్చు
గొన మల్లె నారి నా ♦ గుణము పరఁగుఁ
మొన యొ డ్డనఁగ వ్యూహ♦మున కగుఁ బెడబొబ్బ
యార్పన నట్టహా♦సాఖ్య లెసఁగు
తే. లావు సత్తువ యనఁగ బ♦లంబు చెలఁగు
నట్ట మొండె మనఁగఁ గబం♦ధాఖ్య లలరు
దూల నవ తీఁట యనఁగఁ గం♦డూతి కొనరు
శంబరాహితమదభిదా♦డంబ సాంబ. **44**

టీ. పావాలు, పావలు, పావుకోళ్లు-3 = పాదుకలు. పాదుపోసులు, ఊడ్పులు, పాపోసులు, ఉద్దములు, మెట్లు, చెప్పులు-6 = పాదరక్షలు. అంగడి, బాజారు-2 = విపణి. గొనము, అల్లె, నారి-3 = వింటియల్లె త్రాడు. మొన, ఒడ్డు-2 = వ్యూహము. పెడబొబ్బ, అర్పు-2 = అట్టహాసము. లావు, సత్తువ-2 = బలము. అట్ట, మొండెము -2 = కబంధము. దూల, నవ, తీఁట-3 = కండూతి.

సీ. విలు విల్లు సింగాణి ♦ విల్ సింగిణి యనంగఁ
గోదండమున కగుఁ ♦ గోపు కొప్పు
నాఁ జమ్మ ధనుర్గుణ♦నామంబులు లకోరి
యుద్ధపటు నారస ♦ మమ్ము తీరు

ములికి సరము కోల ♦ చిలుకు తూ పన శరా
ఖ్యలు మించు మైమఱువు ♦ కమరు జోడు
దగలా జిరాయి బొంద♦ళము దుప్పటమును
చిలుకత్తు బం దనఁ ♦ జెలఁగుఁ గవచ
తే. మరద మనఁ దే రనఁగ రథం ♦ బమరు హౌాయలు
బండి కొల్లారుబండి నాఁ ♦ బరఁగుఁ గోళ
తాంగనామముల్ మునికోల ♦ యారెకోల
ముల్లుకో లనఁ దోత్త్రంబు ♦ మొనయు సాంబ. 45

టీ. విలు, విల్లు, సింగాణి, విల్, సింగిణి॥ రూ॥ సింగిణీ-౬ = కోదండము (విల్లు). కోపు, కొప్పు-౨ = వింటికొప్పు. లకోరి॥ రూ॥ లకోరీ, అంపలు, నారసము, అమ్ము, తీరు, ములికి, సరము, కోల, చిలుకు, తూపు-౧౧ = బాణము. మైమఱువు॥ రూ॥ మైమఱువు, కమరు, జోడు, దగలా, జిరాయి, బొందళము, దుప్పటము, చిలుకత్తు, బందు-౧౦ = కవచము. అరదము, తేరు-౨ = రథము. హౌాయలుబండి, కొల్లారుబండి॥ రూ॥ కొలారుబండి - కొల్లాబండి-౪ = గోళతాంగము (గాడీ). మునికోల, ఆరెకోల, ముల్లుకోల॥ రూ॥ ములుకోల-౪ = తోత్త్రము (చబుకు).

సీ. దీవట్లు పంజులు ♦ దివ్వటీల్ దివటీలు
దివియ లనం గర♦దీపిక లగు
నొగ కాఁడిమ్రాఁ కనఁ ♦ దగుఁ గూబరము కాన్క
కానుక సూడిదె ♦ కప్ప మనఁగఁ
గరము పేళ్లగు గద్దె ♦ గద్దియ యనఁగ సిం
హాసననామంబు ♦ లమరు గొాజ

గొల్లెనయు గుడారు ♦ గూడార మనఁ దగుఁ
బటకుటీరము నొప్పి ♦ బాద యలఁత
తే. తెగులు తెవులన రోగాఖ్య ♦ లగును వెజ్జు
మందరి యనంగ వైద్యనా♦మంబు లెసఁగు
దండ చేరు సరము పేరు ♦ తావడంబు
సరి యనఁగ హారనామముల్ ♦ హారయు సాంబ. **46**

టీ. దీవట్లు, కంజులు, దివ్వటీలు, దివటీలు, దివియలు-గీ=కరదీపికలు. నొగ, కాడిమ్రాఁకు-వి=కూబరము. కాన్క, కానుక ॥ రూ॥ కానిక, సూడిదె,. కప్పము-గీ=కరము (పన్ను). గద్దె, గద్దియ-సింహాసనము. గొటిజ, గొల్లెన ॥ రూ॥ గొల్లియన, గుడారు॥ రూ॥ గుడారము, గూడారము-ఓ=పటకుటీరము(డేరా). నొప్పి, బాద, అలఁత, తెగులు, తెవులు-గీ=రోగము. వెజ్జు, మందరి-వి=వైద్యుఁడు. దండ, చేరు, సరము, పేరు, తావడము ॥ రూ॥ తావళము, సరి-2=హారము.

సీ. సోబె సిబ్బె మనఁ బొ♦ల్చును గిలాసము కొంగు
చెఱఁగు చుంగన నొప్పుఁ ♦ జేలము తుద
నెయ్యి నేచము రన ♦ నెగడు నాజ్యముపేళ్లు
తైలాఖ్య యగు నూనె ♦ తలచము రన
దివ్వెచమురు నామి♦దెము నాముదం బన
నేరండతైలాఖ్య ♦ లెసఁగుఁ గోవు
సారాయి యనఁ జెల్లు ♦ వారుణీనామముల్
తిలపిష్టమున కగుఁ ♦ దెలికపిండి

తే. గాన్గుపిండి యనంగఁ ద♦క్రింబు వెలయుఁ
చల్ల మజ్జిగ యన దధి♦సంజ్ఞ దనరుఁ
పెరుఁగు కలు పన గోరంట ♦ బెల్ల మచ్చు
నా గుడాభిఖ్య లగు జగ♦న్నాథ సాంబ. 47

టీ. సోబె, సిబ్బెము-౨ = కిలాసము. కొంగు, చెఱఁగు, చుంగు-౩ = వస్త్రముకొన. వేయి॥ రూ॥ నెయ్యి, నే, చమురు-౪ = ఘృతము. నూనె, తలచమురు-౨ = తైలము. దివ్వెచమురు, ఆమిదెము, ఆముదము-౩ = ఏరండతైలము. కోపు, సారాయి-౨ = మద్యము. తెలికపిండి, గాన్గుపిండి-౨ = తిలపిష్టము. చల్ల, మజ్జిగ-౨ = తక్రము. పెరుఁగు, కలుపు-౨ = దధి, గోరంట, బెల్లము, అచ్చు-౩ = గుడము.

సీ. ఒడమెలు సొమ్ములు ♦ తొడవు లనఁగఁ జెల్లు
భూషణాఖ్యలు విత్త♦మునకు రూక
ధనము రొక్క మనంగఁ ♦ దనరు మేలుతరంబు
మేల్బంతి కన్నారు ♦ మీసరంబు
తలకట్టు నాఁగ భా♦సిలు శ్రేష్ఠనామంబు
లనవ్రుడు నాఁగ నా ♦ ననఁగ నావు
డనఁగఁ జెల్లు ననంగ ♦ ననెడిపేరులకు విం
జామరము లన విం♦జామర లన
తే. జమిడిపీచోపు లనఁ జామ♦రముల కొన
హాతు కల్కండ చక్కెర ♦ పంచదార
కండచక్కెర మేల్పుల♦కండ మనఁగ
శర్కరాభిఖ్య లగు శైల♦చాప సాంబ. 48

టీ. ఒడమెలు, సొమ్ములు, తొడవులు-౩=భూషణములు. రూక, ధనము, రొక్కము-౩ = విత్తము. మేలుతరము, మేల్బంతి, కన్నాకు, మీసరము, తలకట్టు-౫=శ్రేష్ఠము. ఆనవుడుఁ, నాఁగ, నాఁ, అనఁగ, నావుడు-౫=అనఁగా. వింజామరములు, వింజామరలు, జమిడివీచోపులు-౩ = చామరములు. నవాతు, కల్కండ, చక్కెర, పంచదార, కండచక్కెర, మేలుపులకండము-౬ = శర్కర.

సీ. సైకము తోడెము ♦ సన్న మన్నువ జిల్గు
వలిపెము చిఱు లేఁత ♦ కొలఁది యలఁతి
యసదు లే జీబన ♦ నమరు స్వల్పమునకుఁ
బెను గొప్ప బలు పేరు ♦ పెద్ద దొడ్డ
గన మన నధికాఖ్య ♦ లొనరుఁ దోరము హొమ్ము
గమక మొ మ్మనఁగ స్థూ♦లము చెలంగు
దస్సె గుండె ముడింగె ♦ దాఁకె నుబ్బడఁగెను
గ్రమ్మఁ గ్రుంగెను డొంకె ♦ సగ్గ స్రుక్కఁ
తే. దగ్గ నన క్షీణదశ కగు ♦ డబ్బు బద్దు
పొల్లు దబ్బఱ తాటోటు ♦ బొంకు రవళి
కల్ల జూ దన నన్నృతంబు♦పేళ్లు వెలయు
నిలుకడ యనంగ నిరతాఖ్య ♦ నెగడు సాంబ.        49

టీ. సైకము, తోడెము, సన్నము, అన్నువ, జిల్గు ॥ రూ ॥ జిలుఁగు, వలిపెము, చిఱు, లేఁత, కొలఁది, అలఁతి, అసదు, లే, జీబు-౧౪ = స్వల్పము. పెను, గొప్ప, బలు, పేరు, పెద్ద, దొడ్డ, గనము -౭ = అధికమైనది. తోరము, హొమ్ము, గమకము, ఒమ్మ-౪ = స్థూలము. దస్సె, గుండె,

ముడిఁగె, తాఁకె, ఉబ్బడఁగె, మగ్గె, కృంగె, డొంకె, సగ్గె, సుక్కె, తగ్గె-౧౧=క్షీణించె. డబ్బు, బద్దు, పొల్లు, దబ్బఱ ॥రూ॥ డబ్బఱ, టాటోటు, బొంకు, రవలి ॥రూ॥ తవలీ, కల్ల, జాదు-౧౧=అసత్యము. నిలుకడ=నిరతము.

సీ. ఎంచె గణుతిచేసె ♦ నెన్నికనిడె నెన్నె
నఁగ గణించుట ♦ కమరుఁ దాల్మి
సైరణ యో ర్పన ♦ శాంతతపే ళ్లగు
నెమ్మి నెమ్మది హాయి ♦ నిమ్మళంబు
నాఁగ నిరాతంక♦నామము లగు వెడ
యలయిక బడలిక ♦ యలపు సేద
యనఁగ శ్రీమాఖ్య లౌ ♦ నగ్గలం బాయెను
మేరతప్పెను మట్టు♦మీఱె మించె
తే. వెక్కసం బయ్యె నుఱవయ్యెఁ ♦ గ్రిక్కిరిసెను
నఁనగ నుత్కృష్ట మనుట కౌ ♦ నావరించె
నిండె నెగడె వెలసెఁ బర్వె ♦ నిగిడె ననఁగ
వ్యాప్త మయ్యె ననెడి పేళ్ల ♦ కలరు సాంబ. 50

టీ. ఎంచె, గణుతిచేసె, ఎన్నికనిడె, ఎన్నె -౪=గణించుట. తాల్మి ॥రూ॥ తాలిమి, సైరణ ॥రూ॥ సయిరణ, ఓర్పు ॥రూ॥ ఓరుపు-౬=శాంతత్వము. నెమ్మి, నెమ్మది, హాయి, నిమ్మళము -౪=నిరాతంకము. వెడ, అలయిక, బడలిక, అలపు, సేద -౫=శ్రమ. అగ్గలమయ్యెను, మేరతప్పెను, మట్టు మీఱెను, మించె, వెక్కసమయ్యె, ఉఱవయ్యె, క్రిక్కిఱిసె-౭=ఉత్కృష్టమయ్యె. ఆవరించె, నిండె, నెగడె, వెలసె, పర్వె, నిగిడె -౬=వ్యాపించె.

సీ. అవసడి యాడిక ♦ యాఅడి సడి అట్టు
సగడు దూ అన నింద ♦ కమరు మాల్మి
యలవాటు వాడుక ♦ యలవడు టనఁ బొల్చుఁ
బరిచయాభిఖ్యలు ♦ పన్నిదంబు
పందెము జూద మ♦నం దగు ద్యూతంబు
నిబ్బది నిక్కము ♦ నిలువరంబు
నిజము నిక్కువ మన ♦ నెగడు సత్యముపేళ్ళు
గోర్వంక నెలకూన ♦ గోటినాటు.
తే. వా నఖక్షత మగును దం♦తక్షతములు
కెరలు పలునొక్కు వాతెఱ♦కెంపు పెదవి
గంటి కెమ్మోవిగుఱి యనఁ ♦ గౌఁగిలి యనఁ
గవుఁగి లనఁగ నాలింగనా♦ఖ్య లగు సాంబ. 51

టీ. అవసడి, ఆడిక, ఆఅడి, సడి, అట్టు, అగడు. దూఱు-౭ = నింద. మాల్మి ॥రూ॥ మాలిమి, అలవాటు, వాడుక, అలవడుట-౫ = పరిచయము. పన్నిదము, పందెము, జూదము॥రూ॥జాజము-౪ = ద్యూతము. నిబ్బది, నిక్కము, నిలువరము, నిజము, నిక్కువము-౫ = సత్యము. గోర్వంక॥రూ॥గోరువంక, నెలకూన, గోటినాటు-౪ = నఖక్షతము. పలునొక్కు, వాతెఱకెంపు, పెదవిగంటి, కెమ్మోవిగుఱి-౪ = దంతక్షతము. కౌఁగిలి, కవుఁగిలి-౨ = ఆలింగనము.

సీ. నాగకెసరులు చె♦న్నంగులు కురువులు
భోజనప్రియములు ♦ రాజనములు
గన్నెరు లిప్పపూల్ ♦ గంగాజలంబులు
మ్లట్టకారులు పూల♦మంజరీలు

పెద్దవంకలు పాల♦వెల్లులు ముత్తెపు
సరులు సంబావులు ♦ చంద్రివంక
యేనుఁగుకొమ్ములు ♦ మానికములు వన్నె
పూలు సీతాభోగ♦ము లన శాలి
తే. ధాన్య మెసఁగును దూము ముం♦త ముకుసంబు
బల్ల కుంచ సోల త♦వ్వ పడి యడ్డ
గరిసె పుట్టి సెలగ మెడా ♦ కల మనంగ
ధాన్యములు గొల్చువానికిఁ ♦ దగును సాంబ. 52

టీ. నాగకేసరులు, చెన్నంగులు, కురువులు, భోజనప్రియములు, రాజనములు, గన్నేరులు, ఇప్పపూలు, గంగాజలములు, మట్టకారులు, పూల మంజరీలు, పెద్దవంకలు, పాలవెల్లులు, ముత్తెపుసరులు, సంబావులు, చంద్రి వంకలు, ఏనుఁగుకొమ్ములు, మానికములు, వన్నెపూలు, సీతాభోగములు ఈ ౧౯ యును వడ్లవిధములపేళ్లు. తూము, ముంత, ముకుసము, బల్ల, కుంచము, సోల, తవ్వ, పడి, అడ్డ, గరిసె, పుట్టి, సెలగ, మెడా, కలము ఈ౧౪ ను ధాన్యములు కొల్చు సాధనములపేళ్లు.

క॥ ఇ మ్మనుజవర్గుఁ జేసితి
సమ్ముదమున దీని విని♦జనులు భళా చో
క్క మ్మనఁగా నెంతయు నన
ఘ మ్మనఁగా మహిని వెలయుఁ♦గావుత సాంబా. 53

తా. ఈమానవవర్గును రచించినాఁడను. ఇది వినునట్టిజనులు 'బళా రే యెంతచొక్కమైనది, నిర్దోషమైనది' అనఁగా భూమియందుఁ బ్రసిద్ధికెక్కుఁ దునుగాత.

మానవవర్గు-సమాప్తము.

## స్థా వ ర వ ర్గు.

---

క॥ శ్రీవరదాయక పాయక
దేవరనామాంకితముగఁ ♦ దేటపఱిచెదన్
స్థావరవర్గును గవితా
భావరసజ్ఞు లెద మెచ్చఁ ♦ బశుపతి సాంబా. 54

తా. సంపత్కరము లగు వరముల నిచ్చువాఁడా! పశుపతీ! సాంబమూర్తీ! కవిత్వపుభావమును రసమును నెఱింగినవారు మెచ్చుకొనునట్లు స్థావరవర్గును నెడతెగక నీపేర నంకితముగా విశదపఱుచుచున్నాను.

సీ. ఇలతాల్పు గట్టు గు♦బ్బలి కొండ మల తిప్ప
యన శైలనామంబు ♦ లమరు మంచు
టిలతాల్పు వడకుగు♦బ్బలి దుగ్గికన్నయ్య
గట్లరాయఁడు బేసి♦కంటిమామ
చలికొండ వలిమల ♦ పులుచూలితాత నా
హిమగిరినామంబు ♦ లెసఁగుఁ బసిఁడి
గట్టు వేల్పులమన్కి♦పట్టు క్రొన్నెలదారి
సింగిణి యన మేరు ♦ శిఖరి వొల్చు
తే. విసపుమేఁతరిబలుటెంకి ♦ వెండికొండ
తెలిమల యనంగ రజతాద్రి ♦ తేజరిల్లు
బటువుమల త్రుదగట్టనఁ ♦ బరఁగుఁ జక్రి
వాళగిరిపేళ్లు త్రిభువన♦వంద్య సాంబ. 55

టీ. ఇలతాల్పు = భూమినిధరించినది, గట్టు, గుబ్బలి, కొండ, నగ, తిప్ప-౬ = పర్వతము. మంచుటిలతాల్పు = మంచుకొండ, వడఁకుగుబ్బలి = చలికొండ, దుగ్గికన్నయ్య = దుర్గను(పార్వతిని) కన్నతండ్రి, గట్లరాయఁడు = పర్వతరాజు, వేసి...మామ = శివునిమామ, చలికొండ, చలిమల, పులుచూలి తాత = బొల్లుకసవునఁబుట్టిన కుమారస్వామికి పితామహుఁడు-౮ = హిమవంతుఁడు. పసిఁడిగట్టు = బంగారుపర్వతము, వేల్పుల...పట్టు = దేవతలవాసస్థానమైనది, క్రొన్నె...సింగిణి = లేఁతచంద్రుని ధరించిన శివునికి విల్లైనది-3 = మేరుపర్వతము. విసపు...టెంకి = విషమును భక్షించిన శివునిగొప్పస్థానము, వెండికొండ, తెలిమల = తెల్లనికొండ-3 = కైలాసపర్వతము. బటువుమల = గుండ్రనైనకొండ, తుదగట్టు = కడపటనుండుకొండ-౨ = చక్రవాళపర్వతము.

సీ॥ కవ్వపుమల తరి♦గట్టన మంథరం
బడరుఁ దూరుపుమల ♦ పొడుపుఁదిప్ప
మొదటికొండ యనఁగ ♦ నుదయాచలం బొప్పుఁ
బడమటిమల క్రుంకు♦పుడమితాల్పు
నా యస్తగిరి నగు ♦ ఆయి ఆ కల్లనఁ
బ్రిస్తరాఖ్య దలిర్చుఁ ♦ బల్లె యూరు
కుప్పం బనఁగ గ్రామ ♦ మొప్పును బ్రోలు వీ
డనఁ బట్టణముపేరు ♦ లలరుచుండు
తే. నిరవు టెంకి యునికి యిక్క ♦ యిల్లు గీము
మనికి పట్టు బిడారు కొం♦ప యిలు నెలవు
నట్టు తా వన మందిర♦నామము లగు
శంబరాహితమదభిదా♦డంబ సాంబ. 56

టీ. కవ్వపుమల = (సముద్రమును చిలికినపుడు) కవ్వముగానుండిన కొండ, తరిగట్టు = (సముద్రమును) చిలికినకొండ-౨ = మంధరపర్వతము. తూరుపుమల = తూర్పుదిక్కున నుండుకొండ, పొడుపుందిప్ప = ఉదయపర్వతము, వెలుపటికొండ-౩ = ఉదయపర్వతము. పడమటిమల = పడమటి నుండు కొండ, క్రుంకుపుడమిగొల్వ = అస్తమించుపర్వతము-౨ = అస్తగిరి. ఱాయి, ఱా, కల్లు-౩ = శిల. పల్లె, ఊరు, కుప్పము-౩ = గ్రామము. ప్రోలు, వీడు-౨ = పట్టణము. ఇరవు॥ రూ॥ ఇరవు, సెంకి, ఉనికి, ఇక్క, యిల్లు, గీము, మనికి, పట్టు, బిడారు, కొంప, ఇలు, నెలవు, నట్టు, తావు-౧౫ = మందిరము.

సీ. టెంకాయచెట్టన ♦ టెమ్రాను నారిక
డరం బన నారికే♦ళంబు దనరుఁ
దా డనఁ దాళి మా ♦ దాళిమ్మ దానిమ్మ
యన దాడిమియుఁ బొన్న ♦ పొన యనంగ
బున్నాగముఁ దనర్చు ♦ గన్నేరు గన్నెరు
నాఁగను గరవీర♦నామము లగు
రేఁగు రే నన బద♦రికిఁ జెల్లు మారేడు
బిలువ మనఁ దనర్చు ♦ బిల్వమునకు

తే. జమ్మి జం బన శమి యగుఁ ♦ జంపకంబు
దనరు సంపెఁగ సంపఁగ ♦ యనఁగ నెల్లి
యుసిరి యుసిరిక యన ధాత్రి ♦ కొప్పు రాగి
యనఁగ రా వన నశ్వత్థ ♦ మొనరు సాంబ. 57

టీ. టెంకాయచెట్టు ॥రూ॥ తెంకాయచెట్టు, టేఁమ్రాను ॥రూ॥ తేమ్రాను, నారికడము-4 = నారికేళము. తాడు = తాళవృక్షము (తాటిచెట్టు). దాళిమ్మ, దాడిమ్మ॥ రూ॥ దానిమ్మ-3 = దాడిమి. పొన్న, పొన-2 = పున్నాగవృక్షము. గన్నేరు, గన్నెరు-2 = కరవీరము. రేఁగు, రేను-2 = బదరి. మారేడు, బిలువము - 2 = బిల్వము. జమ్మి, జంబు*-2 = శమీవృక్షము. సంపెఁగ, సంపఁగ॥ రూ॥ సంపఁగియ-3 = చంపకము. నెల్లి, ఉసిరి, ఉసిరిక-3 = ధాత్రి. రాగి, రావి-2 = అశ్వత్థము.

సీ. అత్తి మేడి యనంగ ♦ నౌదుంబరం బొప్పు
మావి మామి డన నా♦మ్రమము దనఁప్పు
వెలఁగ వెలంగ నా ♦ వెలయుఁ గపిత్థంబు
మల్లె మల్లియ నాఁగ ♦ మల్లిక యగు
జాజి జాది యనంగ ♦ జాతి యౌ నేరేడు
నేరెడు నా జంబు ♦ నెగడుచుండుఁ
బాదిరి కలిగొట్టు ♦ నాఁ దగుఁ బాటలి
పొగడ పొవ డన నొ♦ప్పును వకుళఁపు
తే. మ్రాఁకు మ్రాను చె ట్టనఁగ ద్రు♦మంబు చెలఁగు
తీఁగ తీఁగియ లతకూన ♦ తీఁగె యనఁగఁ
దనరు లతపేరు పూవులు ♦ ననలు విరులు
పువ్వు లలరులు నా సుమం♦బు లగు సాంబ. 58

టీ. అత్తి, మేడి-2 = ఉదుంబరము. మావి, మామిడి-2 = ఆమ్రవృక్షము. వెలఁగ, వెలంగ-2 = కపిత్థము. మల్లె, మల్లియ-2 = మల్లిక. జాజి, జాది-2 = జాతి పుష్పము. నేరేడు, నేరెడు-2 = జంబూవృక్షము.

---

* ఇది శమీవృక్షనామమగుట విచార్యము.

పాదిరి, కలిగొట్టు-౨ = పాటలి, పొగడ, పొవడ-౨ = వకుళము. మ్రాఁకు, మ్రాను, చెట్టు-3 = సామాన్యముగా వృక్షము. తీఁగ॥ రూ॥ తీవ, తీఁగియ రూ॥ తీవియ, ఆతకూన, తీఁగె ॥రూ॥ తీవె-౭ = లత. పూవులు ॥రూ॥ పూలు, ననలు, విరులు, పువ్వులు ॥రూ॥ పువులు, అలరులు-౭ = పుష్పములు.

సీ. మొక్క మోటిక మోసు ♦ మోక మొలక యన
 నంకురనామంబు ♦ లలరు నిగురు
తలిరు చిగురు నాఁగఁ ♦ దగుఁ బల్లవాఖ్యలు
 కొన తుద యన నగ్ర♦మునకుఁ బొల్చుఁ
దొఱ తొలి తొఱ్ఱ నాఁ ♦ దరుకోటరం బొప్పుఁ
 దమ్మి తామర నఁగ ♦ జమ్మి పరఁగుఁ
దొగ తొవ కలు వనఁ ♦ దగు నుత్పలమునకు
 దట్టంబు జొంపంబు ♦ తఱుచు జీబు
తే. గుమురు తంపర యన నిబి♦డము దనర్చు
మొగడ మొగ్గ యనం దగు ♦ ముకుళమునకు
నిక్షుకాండంబునకుఁ బేరు ♦ లెసఁగు చెఱకు
కనులుగలమ్రాను తియ్యమ్రా ♦ ననఁగ సాంబ. 59

టీ. మొక్క, మోటిక॥ రూ॥ మొట్టిక-మొటిక, మోసు, మోక, మొలక-౭ = అంకురము. ఇగురు, తలిరు, చిగురు॥ రూ॥ చివురు-౪ = పల్లవము. కొన, తుద-౨ = అగ్రము. తొఱ, తొలి, తొఱ్ఱ-3 = వృక్షకోటరము. తమ్మి, తామర-౨ = తామరసము. తొగ, తొవ, కలువ-3 = ఉత్పలము. దట్టము, జొంపము, తఱుచు, జీబు, గుమురు॥ రూ॥ గుబురు, తంపర-౭ = నిబిడము. మొగడ, మొగ్గ-౨ = ముకుళము. చెఱకు, కనులుఁగలమ్రాను, తియ్యమ్రాను-3 = ఇక్షుకాండము.

సీ. తెలుపు తెల్లన తెల్ల ♦ తెలి వెల్ల వెలి యన
ధవళవర్ణ మెసఁగుఁ ♦ దొవరు తొగరు
కెంజాయ యెఱు పెఱ్ఱ ♦ కెంపన రక్తవ
ర్ణమగు నల్లన కఱి♦నల్ల కప్పు
నలు పన నీలవ♦ర్ణము పొల్చుఁ జామనఁ
బసరుచా యన శ్యామ♦మెసఁగు నందు
నలిది పసు పనంగ ♦ నగుఁ బీతవర్ణంబు
తేట నున్నన నున్న ♦ తెలివి నునుపు
తే. నిద్ద మన స్నిగ్ధత నెసంగు ♦ నిగ్గు డాలు
మినుకు మిన మించు నిగ తళ్కు ♦ మెఱుఁగు చికిలి
కళుకు జిగి రంగు మెఱ పనఁ ♦ బొలుచుఁ గాంతి
నొడ్డు దరి గట్టనఁగఁ గూల ♦ మొనరు సాంబ. 60

టీ. తెలుపు, తెల్లన, తెల్ల, తెలి, వెల్ల, వెలి - ౬ = తెల్లవర్ణము. తొవరు, తొగరు, కెంజాయ, ఎఱుపు, ఎఱ్ఱ, కెంపు-౬ = రక్తవర్ణము. నల్లన, కఱి, నల్ల, కప్పు, నలుపు-౫ = నీలవర్ణము. చామన, పసరుచాయ-౨ = శ్యామవర్ణము. అలిది, పసుపు-౨ = పీతవర్ణము. తేట, నున్నన, నున్న, తెలివి, నునుపు, నిద్దము-౬ = స్నిగ్ధత. నిగ్గు, డాలు, మినుకు॥ రూ॥ మిసుక్కు, మిన, మించు, నిగ, తళుకు॥ రూ॥ తళ్కు, మెఱుంగు, చికిలి, కళుకు, జిగి, రంగు, మెఱుపు-౧౫ = కాంతి. ఒడ్డు, దరి, గట్టు-౩ = కూలము.

సీ. అణి చినుకుఁబూస ♦ పాణి సుప్పాణి ము
త్తెము ముత్తియంబు ము♦త్యమనఁ దనరు
మౌక్తికాఖ్యలు కెంపు ♦ మానికము రతన
మనఁగ మాణిక్యాహ్వ♦యంబు లలరుఁ

బగడము పవడం బ◆నఁగ విద్రుమము బొల్చుఁ
బక్కిరాయనిఱాయి ◆ పచ్చ యనఁగ
మరకతము దలిర్చు ◆ మగఱాలు మూలఱా
లన వజ్రము లగుఁ బు◆ల్లంటుఱాయి

తే. కప్పుఱాయి యనఁగ నీల ◆ మొప్పుఁ బిల్లు
పూరి చిగిరింత యేట్రింత ◆ పాచుఁగు గడ్డి
గఱిక పచ్చిక వెణుతురు ◆ కసవు తుంగ
విడవలి యనఁ దృణాఖ్యలు ◆ నెలయు సాంబ. 61

టీ. ఆణి, చినుకుఁబూస = స్వాతివర్ష బిందువుచేఁ బుట్టెడు పూస, పాణి, సుప్పాణి॥ రూ॥ సుపాణి, ముత్తెము, ముత్తియము; ముత్యము-౮ = మౌక్తికము. కెంపు, మానికము, రతనము-౩ = మాణిక్యము. పగడము, పవడము-౨ = విద్రుమము. పక్కిరాయనిఱాయి, పచ్చ-౨ = మరకతము. మగఱాలు, మూలఱాలు-౨ = వజ్రములు. పుల్లంటుఱాయి, కప్పుఱాయి-౨ = నీలము. పిల్లు, పూరి, చిగిరింత, ఏట్రింత, పాచుఁగు, గడ్డి, గఱిక, పచ్చిక, వెణుతురు, కసవు, తుంగ, విడవలి-౧౨ = తృణము.

సీ. ఎల్లి చుట్టువు గోడు ◆ గెండమెఱు వనంగ
ఛత్రంబు దనరు ధ్వ◆జంబు వేళ్లు
టెక్కము టెక్కెము ◆ టెక్కియము సిడంబు
పడగ డా లనఁ జెల్లు ◆ నిడివి నిడుద
పోఁగ నిడుపు చాఁపు ◆ నాఁగ దీర్ఘమున కా
మఱుఁగు చా టోలము ◆ మఱు వనంగ

దగఁ బిధానాఖ్యలు ♦ జగతి జగిలె తిన్నె
యరుఁగన వేదిక ♦ కమరు నేల
తే. యిల పుడమి మన్ను బువి పంట♦వలఁతి యనఁగ
ధరణి కగు విప్పు వెడలుపు ♦ విరివి పఱపు
వెడఁద యన విస్తరాఖ్యలు ♦ వెలయుఁ బైరు
ససి యనఁగ సస్యనామము ♦ లెసఁగు సాంబ. 62

టీ. ఎల్లి; చుట్టువు; గొడుగు; ఎండమఱువు - ౪ = ఛత్త్రము. టెక్యము; టెక్కెము; టెక్కియము; సిడము; పడగ; డాలు-౬ = ధ్వజము. నిడివి; నిడుద; సోఁగ; నిడుపు; చాఁపు-౫ = దీర్ఘము. మఱుఁగు; చాటు; ఓలము; మఱువు-౪ = పిధానము. జగతి; జగిలె ॥రూ॥ జగ్గిలె; తిన్నె ॥రూ॥ తిన్నియ; అఱుఁగు ॥రూ॥ అరఁగు-౭ = వేదిక. నేల; ఇల; పుడమి; మన్ను; బువి; పంటవలఁతి-౬ = భూమి. విప్పు; వెడలుపు; విరివి ॥రూ॥ విఱివి; పఱపు; వెడఁద-౬ = విస్తారము. పైరు; ససి-౨ = సస్యము.

సీ. మోడు మొరడు మొద్దు ♦ మో టన స్థాణు వౌ
బొఱియ కలుఁగు బొక్క ♦ బొంద లొయ్య
యన బిలాఖ్యలు చెల్లు ♦ నడుసు బురద జొంపి
యస లనఁ బంకాఖ్య ♦ లెసఁగు మడుఁగు
మడు వన హ్రద మొప్పుఁ ♦ బొడ వన నున్నతం
బగు గోడ యనఁగఁ గు♦డ్యంబు పొల్చు
సోరణగండ్లన ♦ మీఱు గవాక్షము
మాడుగుల్ మిద్దెలు ♦ మచ్చు లనఁగ

తే. దారునిర్మితగృహము లౌఁ ♦ దరకసంబు
బత్తళిక పొది దొన యనఁ ♦ బరఁగుఁ దూణి
పెట్రె మందసమును బెట్టె ♦ పెట్టియ యనఁ
బేటికాభిఖ్య లగు గుణ♦పేటి సాంబ. 63

టీ. మోఁడు ॥రూ॥ మ్రోఁడు; మొరడు; మొద్దు; మోటు-౫ = స్థాణువు; బొఱియ ॥రూ॥ బొఱ్ఱియ; బొఱ్ఱె; కలుఁగు; బొక్క; బొంద; లోయ-౭ = బిలము. ఆదుసు; బురద; ఊఁపి; అసలు-౪ = పంకము. మడుఁగు; మడువు-౨ = హ్రదము. పొడవు ॥పా॥ పొడువు-౨ = ఉన్నతము. గోడ = కుడ్యము. సోరణగండ్లు ॥రూ॥ సోర్ణగండ్లు-౨ = గవాక్షము. మాడుగులు ॥రూ॥ మాడువులు; మిద్దెలు; మచ్చులు-౪ = దారునిర్మితగృహములు. తరకసము; బత్తళిక; పొది; దొన-౪ = తూణీరము. పెట్రె; మందసము; పెట్టె, పెట్టియ-౪ = పేటిక.

సీ. ఎన జోడు మాదిరి ♦ యీడు పురుడు మాద్రి
సాటి పాటి తరంబు ♦ దీటు దినుసు
సరి యుద్ది ప్రతి దిన్ను ♦ సవతు పోలిక దొర
జత యనఁగా సదృ♦శమున కెసఁగుఁ
బల్లకి పల్లకీ ♦ పాలకి పాల్కి నాఁ
బల్యంకి కాఖ్యలు ♦ పరఁగు లాలి
యుయ్యాల యుయ్యేల ♦ యూయెల తొట్ల జో
ల యనంగ డోలి కా♦హ్వయము లెసఁగుఁ
తే. గంకటియు మంచ మనఁ జెల్లు ♦ ఖట్వమునకుఁ
బీఁట పల్క యనఁగ నొప్పుఁ ♦ బీఠమునకు

బరణియుఁ గరాట మనుపేళ్లు ♦ భరణి కమరు
నిచ్చెన యనంగ నిశ్శ్రేణి ♦ నెగడు సాంబ. 64

టీ. ఎన; జోడు; మాదిరి; ఈడు; పురుడు; మాదిరి; సాటి; సాటి; తరము; దీటు; దినుసు; సరి; ఉద్ది; ప్రతి; దిస్సు; సవతు; పోలిక; దొర; జత-౧౯=సదృశము. పల్లకి,పల్లకీ; పాలకి; పాల్కి-౪=పల్యంకిక. లాలి; ఉయ్యాల॥ రూ॥ ఉయ్యేల; ఊయాల; ఊయల; ఉయాల; ఉయ్యేల॥ రూ॥ ఉయ్యెల; ఊయేల; ఊయెల॥ రూ॥ ఉయేల; తొట్ల; జోల-౧౩=డోల; కంకటి; మంచము-౨=ఖట్వము. పీఁట; పలక-౨=పీఠము. బరణి; కరాటము-౨=భరణి. నిచ్చెన=నిశ్శ్రేణి.

సీ. ఉలి యు క్కను మనంగ ♦ నొనరు నయ స్సంజ్ఞ
చెంబు రాగి యనఁ దా♦మ్రం బెసంగుఁ
దగరము కరుగు డ♦నఁగ సీసము రహించు
కాంస్యంబు వర్తిల్లుఁ ♦ గంచనంగఁ
ద్రిపునామ మమరుఁ బి♦త్తళి యిత్తళి యనంగఁ
గుండలు చట్లు మూఁ♦కుళ్లు బుడ్లు
కడవలు బానలు ♦ పిడతల్ వెసఁ గ్లన
భాండముల్ తగు నాఁచు ♦ పాఁచి యనఁగ

తే. శైవలం బగు నూతులు ♦ బావు లనఁగ
వెలయుఁ గూపంబులకు గుంట ♦ కొలను కొలఁకు
తిరుకొళం బన సరసికిఁ ♦ బరఁగు వాఁక
యేఱు వంక వాఁ గనఁ బేరు ♦ లెసఁగు సాంబ. 65

టీ. ఉలి; ఉక్కు; ఇనుము-౩ = అయస్సు. చెంబు; రాగి-౨ = తామ్రము. తగరము; కరుకుడు-౨ = సీసము. కంచు = కాంస్యము. పిత్తళి; ఇత్తళి॥ రూ॥ ఇత్తడి-౩ = త్రిపువు. కుండలు; చట్లు; మూకుళ్లు; బుడ్లు; కడవలు; బానలు; పిడతలు; వెసళ్లు-౮ = భాండములు. నాఁచు; పాఁచి॥ రూ॥ ప్రాఁచి-౩ = శైవలము. నూతులు; బావులు-౨ = కూపములు. గుంట; కొలను; తిరుకొళము (ఇది అఱవపదము) -౪ = సరస్సు. వాఁగు; ఏఱు; వంక; వాఁక -౪ = నది.

సీ. మీల్ మీలు చేఁపలు ♦ మీనులు తెఱగంట్లు
మచ్చెము లనఁ జెల్లు ♦ మత్స్యములకుఁ
దాఁబేలు తామేలు ♦ నాఁ బొల్చుఁ గూర్మము
నెండ్రిండ్రికా యన ♦ నెసఁగుఁ గర్కి
యోడ కల మనంగ ♦ నొనరు నావకు వాన
జడి ముసు రనఁగ వ♦ర్షమున కలరు
వానరాల్ వడగండ్లు ♦ నా నొప్పుఁ గరకలు
నిసుమన నిసు కన ♦ నిసు వనంగ

తే. మెఱయు సైకతనామముల్ ♦ కురుజు తేనె
పుట్టతేనియ పెరతేనె ♦ పువ్వుఁదేనె
జుంటితేనియ యనఁ దగు ♦ సుమరసంబు
శంబధరనుతసుగుణక♦దంబ సాంబ. 66

టీ. మీల్; మీలు; చేఁపలు; మీనులు; తెఱగంట్లు = అనిమిషములు; మచ్చెములు-౬ = మత్స్యములు. తాఁబేలు; తామేలు-౨ = కూర్మము. ఎండ్రి; ఎండ్రికాయ-౨ = కర్కి. ఓడ; కలము-౨ = నావ. వాన; జడి;

ముసురు-3 = వాన. వానరాలు; వడగండ్లు-2 = కరకలు. ఇసుము; ఇసుక; ఇసువు-3 = సికత. కురుజుతేనె; పుట్టతేనె; పెరతేనె; పువ్వుఁదేనె; జుంటితేనె-5 పుష్పరసము.

సీ. జముకాణము తివాసి ♦ జంబుకాణ యనంగఁ
గంబళాఖ్య లగు బం♦గారు హొన్ను
జాళువా పుత్తడి ♦ మేలిమి బంగరు
పసిఁడి పొన్ను కడాని ♦ పైఁడి యుదిరి
యన సువర్ణము వొల్చు ♦ నపరంజి కుందనం
బనఁ దప్తకనక మాఁ ♦ దునుక తునియ
చిదురుప చిదుర నాఁ ♦ జెలఁగు ఖండమునకు
బొది ప్రోగు వామియుఁ ♦ బ్రోవు తిట్ట
తే. కుప్ప యన రాశి కగు సజ్జ ♦ యుప్పరిగయు
మహాలు మేడ యనంగ హా♦ర్మ్యమగుఁ ద్రోవ
దారి తెన్ను తెరు వనఁ బ♦థంబు వెలయు
రవ రజం బన లవముపే ♦ ళ్లవును సాంబ. 67

టీ. జముకాణము; తివాసి; జంబుకాణ-3 = కంబళము (రత్నకంబళి). బంగారు ॥రూ॥ బంగారము; హొన్ను; జాళువా ॥రూ॥ జాళ్వా; పుత్తడి॥ రూ॥ పుత్తళి; మేలిమి; బంగరు; పసిఁడి; పొన్ను; కడాని; పైఁడి ॥రూ॥ పయిడి; ఉదిరి-12 = సువర్ణము. అపరంజి; కుందనము-2 = తప్తసువర్ణము. తునుక॥ రూ॥ తున్క, తునియ; చిదురుప ॥రూ॥ చిద్రుప; చిదుర-5 = కండము. పొది; ప్రోగు॥ రూ॥ పోగు; వామి; ప్రోవు; తిట్ట; కుప్ప-7 = రాశి. ఉప్పరిగ; మహాలు; మేడ-3 = హర్మ్యము. త్రోవ; దారి; తెన్ను; తెరువు ॥రూ॥ తెర్వు-5 = మార్గము. రవ, రజము-2 = లేశము.

సీ. అడవి కాన యనంగ ♦ నటవికిఁ దగు హజాసు
తోఁట సింగారపుఁ♦దోఁట నంద
వన మనంగను నుప♦వన మొప్పు నడబావి
డిగ్గియ దొరువ వన ♦ దీర్ఘిక తగుఁ
బవ్వళింపుబిడారు ♦ పడుకటి ల్లనఁ గేళి
గృహ మగు బోనపు♦టిల్లు వంట
యిల్లు సువారంపు♦టి ల్లనఁ బాకమం
దిరము రాజిలు దగ♦తీర్పు చల్ల
తే. పంది లనఁ జలిపంది ల♦నం దనర్చు
సలిలశాలాభిధలు నీరు♦చల్ల నీరు
మజ్జిగయు జలతక్రనా♦మములు విసన
కఱ్ఱ వీవన యన వృంత♦క మగు సాంబ. 68

టీ. అడవి; కాన-౨ = అటవి. హజాసుతోఁట; సింగారపుఁదోఁట; నందవనము - 3 = ఉపవనము. నడబావి; డిగ్గియ॥ రూ॥ డిగియ-దిగ్గియ; దొరువు-౫ = దీర్ఘిక. పవ్వళింపుబిడారు = శయనస్థానము; పడుకటిల్లు-౨ = కేళిగృహము. బోనపుటిల్లు = అన్నగృహము; వంటయిల్లు; సువారపుటిల్లు-3 = పాకశాల. దగతీర్పు; చల్లపందిరి; చలిపందిరి-3 = పానీయశాల. నీరుచల్ల; నీరుమజ్జిగ-౨ = జలతక్రము విసనకఱ్ఱ, వీవన-౨ = వృంతకము.

క. భువి నీస్థావరవర్గును
సవరణ వ్రాసినను వినినఁ ♦ జదివిన యమ్మా
నవులను విద్యామతులై
భవశాలురఁ గా నొనర్పు ♦ పశుపతి సాంబా. 69

తా. భూమిలో నీస్థావరవర్గును జక్కఁగా వ్రాసినను; వినినను; జదివినను; నట్లుచేయుమనుష్యులను బశుపతీ! సాంబా! విద్యాబుద్ధిసంపదలచే నొప్పువారినిగాఁ జేయుము.

స్థావరవర్గు - సంపూర్ణము.

---

తి ర్య గ్వ ర్గు.

క. శ్రీగౌరీపతి నీపై
బా గౌ రీతి రచియింతుఁ ♦ బటుకవితాధా
రాగతిఁ దిర్యగ్వర్గును
వేగమె నిగిడించి ప్రోవ♦వే శ్రీసాంబా. 70

తా. శ్రీపార్వతీనాథా! సాంబా! నేను మంచికవిత్వధారావైఖరితోఁ జక్కనివిధమున నీ కంకితముగాఁ దిర్యగ్వర్గును రచించెదను. దానిని శీఘ్రముగాఁ గొనసాగించి కాపుమా.

సీ. నెఱసరి సింగంబు ♦ తెఱమొగము మెకంబు
మెకములదొర జడ♦మెకము బొబ్బ
మెకము వెడఁదనోటి♦మెకము గుబ్బలిపట్టి
గుజ్జు మేనుంగుల♦గొంగ యనఁగఁ
జెలఁగు సింహముపేళ్లు ♦ పులి చాఱలమెకంబు
తెరువుగాఁపరి పసి♦తిండిపోతు
మువ్వన్నెమెక మనఁ ♦ బొలుపొందు వ్యాఘ్రంబు
వాపురము పటాణి ♦ వారువంబు

తే. జక్కి మావు గుఱ్ఱము తేజి ♦ యెక్కిరింత
తత్తడి రవాలు నడగండు ♦ కత్తలాని
తురికి బాబా యనంగ నొప్పుఁ ♦ దురగమునకు
గొమ్మనంగఁ దనరారు శృం♦గమ్ము సాంబ. 71

టీ. కేసరి; సింగము; తెఱ...మెకము-తెఱపగా (విశాలముగా) నుండు ముఖముగలమృగము-పంచాస్యము; మెక...దొర = మృగరాజు; జడమెకము = జటలు గలమృగము; బొబ్బమెకము = బొబ్బలు వేయుమృగము; వెడఁదనోటిమెకము = విశాలమగు నోరుగలమృగము; గుబ్బలిపట్టిగుఱ్ఱము = పార్వతివాహనము; ఏనుంగులగొంగ = ఏనుఁగులకు శత్రువు-౯సింహము. పులి; చాఱలమెకము = చాఱికలు (రేఖలు) గల మృగము; తెరువుగాఁపరి = దారిని గాచుకొనియుండునది; పసి...పోతు = పశువులను భక్షించునది; మువ్వన్నెమెకము = మూఁడువర్ణములుగల మృగము-౫వ్యాఘ్రము. వావురము; పటాణి, నాయవము॥ రూ॥ వార్వము; జక్కి; మావు; గుఱ్ఱము; తేజి॥ రూ॥ తేజీ; ఎక్కిరింత॥ రూ॥ ఎకిరింత; తత్తడి; రవాలు; నడగండు; కత్తలాని॥ పా॥ కత్తళిండు; తురికి, బాబా-౧౧ = అశ్వము. కొమ్ము = శృంగము.

సీ. సిబ్బెమేనిమెకంబు ♦ గబ్బుచెంపమెకంబు
గొప్పయజ్జమెక మె♦క్కుడుమెకంబు
గోరు చెయ్యిగలమె♦కము రెంటతాఁగుడే
నుఁగు పలుగొమ్ములు♦దగినమెకము
హత్తి బల్లలమెకం ♦ బన దంతిపేళ్లగుఁ
బుట్టకూటిమెకంబు ♦ బొచ్చుమెకము
వెనుచూపుమెక మెల్గు ♦ వెలినోటిమెక మన
భల్లూకనామముల్ ♦ పరఁగు గొరిజ

తే. గొరిసె యన ఖుర మమరును ♦ గోరనంగ
నఖము తగు జోడనలు రవ♦నడలు నడ్డ
వేడెములు పర్వు లనఁ జుట్టు♦వేడెము లనఁ
బంచధారలనామముల్ ♦ పరఁగు సాంబ. 72

టీ. సిబ్బె...మెకము = సిబ్బెములు (పొడలు) గలశరీరముతోఁ గూడిన మృగము; గబ్బు...మెకము = మదజలముకంపుగలచెక్కులతోఁ గూడిన మృగము; గొప్ప...మెకము = గొప్పయొడలు గలమృగము; ఎక్కుడు మెకము = మహామృగము; గౌరు॥ రూ॥ గవురు; చెయ్యిగల మెకము - తొండము గలమృగము-కరి; రెంట(ద్రాగుడు = రెంటిచే (అనఁగా తొండముచేతను నోటిచేతను) (ద్రాగునది-ద్విపదము; ఏనుఁగు॥పా॥ ఏనిక; పలు...మెకము = పండ్లే (అనఁగా దంతములే) కొమ్ములుగా నొప్పినమృగము; హత్తి-హస్తి; బల్తలమెకము = పెద్దతలగల మృగము-౧౩ = గజము. పుట్ట...మెకము = పుట్టకూటిని (అనఁగా చీమగుడ్లతోఁ గలసిన పుట్టమట్టిముద్దను) దినునట్టి మృగము; బొచ్చుమెకము = శరీరమెల్ల బొచ్చు దట్టముగాఁగల మృగము; వెను...మెకము = వెనుకచూపులు గలమృగము; ఎల్గు॥ రూ॥ ఎలుఁగు-ఎలువు; వెలి...మెకము = తెలుపైన మోరగల మృగము-౭ = భల్లూకము. గొరిజ; గొరిసె-౨ = ఖురము. గోరు = నఖము. జోడనలు = ధౌరితకము; రవనడలు = రవగాలు-ఆస్కందితము; అడ్డవేడెములు; పర్వులు; చుట్టువేడెములు-ఈ ౫ను ఆశ్వపుఁబంచధారలు.

సీ. పసి గిడ్డి మొదవ వావు ♦ పసరము తొడు కనఁ
బశువుపే ళ్ళగు గిబ్బ ♦ బసవఁ డాల
ఘోతు నాఁబోతు మూఁ♦పురముదా ల్పెద్దు ము
క్కంటిమా వన వృషా♦ఖ్యలు దనర్చుఁ

గోడె గిత్త యనంగఁ ♦ గొఱలు నుక్షాఖ్యలు
కేప్రు పడ్డయు దూడ ♦ లేఁగ పెయ్య
యన వత్సనామంబు ♦ లలరును నెనుపెంటి
బఱ్ఱె నా మహిషికిఁ ♦ బరఁగు దుంత
తే. దున్నపో తన మహిష మౌ ♦ దొడ్లు తొఱ్ఱు
పట్టు లనఁగ గోస్థానముల్ ♦ పరగు మంద
కదుపు పదు వనఁ జెలఁగు గో♦గణము పాగ
లాయ మన నొప్పు వాజిశా♦లకును సాంబ. 73

టీ. పసి; గిడ్డి; మొదవు; ఆవు; పసరము; తోడుకు-౬=పశువు. గిబ్బ; బసవఁడు; ఆలపోతు; ఆఁబోతు; మూఁపురముదాల్పు = కకుదముదాల్చినది; ఎద్దు; ముక్కంటిమావు = శివునిగుఱ్ఱము-౭ = వృషభము. కోడె; గిత్త-౨ = ఉక్షము. క్రేపు; పడ్డ; దూడ; లేఁగ; పెయ్య॥ రూ॥ పెయ-౬ = వత్సము. ఎనుపెంటి; బఱ్ఱె-౨=మహిషి. దుంత; దున్నపోతు-౨ = మహిషము. దొడ్లు; తొఱ్ఱుపట్టులు-౨=గోస్థానములు. మంద; కదుపు; పదువు-3=గోసమూహము పాగ॥ రూ॥ పాగా; లాయము-3 = అశ్వశాల.

సీ. సింగంబుగొంగ ద♦చ్చియడుగులమెక మ
నఁగ శరభాఖ్యలొఁ ♦ దగరు జంట
మొగము వేలుపు తేజి ♦ పొట్టేలు గొఱియపో
తేడిక యన మేష ♦ మెసఁగు నిఱ్ఱి
నులికొమ్ముమెక మన ♦ వెలయుఁ గృష్ణమృగంబు
జింక లే డన మృగి ♦ చెలఁగుఁ బిల్లి

చీలి యనంగ మా♦ర్జాల మౌఁ గుందేలు
చెవులపో తనఁగ రం♦జిలు శశంబు

తే. నొంటె లొట్టిపిట్ట యనఁగ ♦ నుష్ట్ర మమరుఁ
గణితి కణఁ జనఁ దనరు గో♦కర్ణమృగము
పిక్కుమెక మెండ్రిమేఁతరి ♦ నక్క బుద్ది
మెక మనఁగఁ జంబుకాఖ్యలు ♦ మెఱయు సాంబ. 74

టీ॥ సింగంబుగొంగ = సింహమునకు విరోధి; దచ్చి... మెకము = ఎనిమిదికాళ్ళమృగము-౨ = శరభమృగము. తగరు; జంట... తేజి = రెండు ముఖములుగలదేవుఁ డగునగ్నిగుఱ్ఱము; పొట్టేలు ॥రూ॥ పొట్టెలు; గొఱియ పోతు॥ రూ॥ గొఱ్ఱియపోతు-గొఱ్ఱెపోతు; ఏడిక-౭= మేషము. ఇఱ్ఱి; నలి... మెకము = మెలిగానుండు కొమ్ములుగలమృగము-౨ = కృష్ణమృగము. (నెలగ జింక) జింక; లేడి॥ రూ॥ లేటి-3 = ఆఁడుజింక. పిల్లి; చీలి-౨ = మార్జాలము. కుందేలు॥ రూ॥ కుందెలు; చెవులపోతు-3 = శశము. ఒంటె॥ రూ॥ ఒంటెఁడు; లొట్టిపిట్ట ॥రూ॥ లొట్టిపిట-లొటిపిట్ట-లొటిపిట॥పా॥ లొట్టియ-లొట్టె-లొట్టెనుఁగు ౯ = ఉష్ట్రము. కణితి॥రూ॥ కడితి; కణఁజు॥రూ॥ కడఁజు-౪ = గోకర్ణమృగము. పిక్కుమెకము = వంచనగలమృగము-వంచకము; ఎండ్రిమేఁతరి = ఎండ్రికాయలు ఆహారముగాఁగలది; నక్క; బుద్దిమెకము-౪ = జంబుకము.

సీ. కొమ్మెంకిమెకంబు ♦ తిమ్మఁడు వెకిరింత
కోఁతి నాఁ గపిపేళ్ళు ♦ కొఱలుచుండు
జల్లితోఁకమెకంబు ♦ సవరంపుమెక మనఁ
జమరికిం జనుఁ బంది ♦ చప్పరింత

కొమ్మకాఁ డూటమెకమ్ము వేపులమిత్తి
ముస్తెలమేపరి మోటుమెకము
వాలుమెకంబు రోఁబంటరి యొంటరి
ముట్టెమెకము పీఁటవెట్టుమెకము
తే. ఏకలము గుర్గురింత నెసఁగు దంష్ట్రి
పోడమెకము దుప్పి యనఁ బోలుఁ బడరు రామ
మృగము మనుఁబోతనఁగ బుశ్యమృగము దనరు
బల్లి గౌళిన ముసలికిఁ బరఁగు సాంబ. 75

టీ. కొమ్మ... మెకము = చెట్లకొమ్మలు వాసస్థానముగాఁగల మృగ ము-శాఖామృగము; తిమ్మఁడు; వెకిరింత = వెక్కిరించునది; కోఁతి ॥రూ॥ క్రోఁతి-గ్రీ = వానరము. జల్లితోఁక మెకము = వెండ్రుకలు కుచ్చుగా తోఁక యందుఁగల మృగము; సవరపుమెకము-ఇ = చమరీమృగము. పంది; చప్ప రింత = చప్పరించునది; కొమ్ముకాఁడు; ఊటమెకము = దృఢమైనమెకము; వేపులమిత్తి = కుక్కలను జంపునది, ముస్తెలమేపరి = ముస్తలను దినునట్టిది; మోటుమెకము = *మోటుపయోగింపఁబడు మృగము; వాలుమెకము = క్రూరమృగము; రోఁబంటరి; ఒంటరి; ముట్టెమెకము = ముట్టెగలమృగము; పీఁటవెట్టుమెకము = పాదుకొని కదలక గూర్చుండు మృగము; ఏకలము; గుర్గురింత = ఘుర్ఘురధ్వని సేయునది-గిరి = పంది. పోడమెకము = మచ్చలు గలమృగము; దుప్పి-ఇ = రామమృగము. మనుఁబోతు = బుశ్యమృగము. బల్లి; గౌళి-ఇ = బల్లి.

---

*మోటు అనఁగా పందిమొదలు మనుష్యాదిరూపముగా వేఁటకాండ్రు మఱుఁగుకై నిలిపెడు కపటలక్ష్యము.

సీ. తోఁడేలు గొఱియల♦సూడన వృకమొప్పు
ముంగిస వెంట్రువ ♦ ముంగి యనఁగ
బభ్రువు తగుఁ గొక్కు ♦ పందికొక్కన మూషి
కకుఁ బొల్చు గాడిద ♦ గాలిగాఁడు
చలువగుఱ్ఱము ఓవు♦జక్కి యన ఖరాఖ్య
లగు మొఱుగుడు జాగి♦లమ్ము కుక్క
వేపి నా శునకంబు ♦ వెలయును దొండ యూ
సరవెల్లి యనఁ దగు ♦ సరటమునకుఁ
తే. జిట్టెలుక యన బాలమూ♦షికకుఁ బొల్చు
నుడుము తేళ్ళమేపరి యన ♦ నొనరుచుండు
నవని గౌధేరనామధే♦యములు మహిత
సకలసురచక్రవర్తి శ్రీ♦సాంబమూర్తి. 76

టీ. తోఁడేలు॥ రూ॥ తోఁడెలు గొఱియలసూడు = గొఱ్ఱెలకు శత్రువు - ౨ = వృకము. ముంగిస; వెంట్రువ; ముంగి - 3 = బభ్రువు. కొక్కు, పందికొక్కు - ౨ = మూషిక. గాఁడిద॥ రూ॥ గాడ్ద; గాలిగాఁడు; చలువగుఱ్ఱము = చాకలిచలువసేయు వస్త్రములను మోయుగుఱ్ఱము; ఓవు జక్కి = చాకలి ఓవున నుండుగుఱ్ఱము (చాకలికి గుఱ్ఱమువలె నుపయోగించునదని భావము) - ౫ ఖరము. మొఱుగుడు = మొఱుగునట్టిది; జాగిలము; కుక్క; వేపి - ౪ = శునకము. తొండ; ఊసరవెల్లి - ౨ = సరటము; చిట్టెలుక = బాలమూషిక. ఉడుము; తేళ్లమేపరి = తేళ్లను భక్షించునది - ౨ = గౌధేరము.

సీ. తంతువాయ మగు బా♦దట్టుపురువు సన్న
పిల్లి సాలీఁ డన ♦ రాళ్లరాసి

గాఁడు గరిమిడి యెల్క ♦ యన నాఖువు దగు
నెఱకలు చట్టుపల్ ♦ గఱులు ఱెక్క
లన బక్షములు పొల్చు ♦ లావు లీఁక లనఁగఁ
బర్ణంబు లగు గువ్వ ♦ పక్కి పిట్ట
పులుఁ గనఁ బక్షికి ♦ వెలయు మదికొలంకు
పులుఁగు తెల్లనిపిట్ట ♦ నలువ తేజి
తే. పాలు నీరును వెలిసేయు♦పక్కి యంచ
యన మరాళంబు తగుఁ గెంపు♦కనులపుల్గు
తలిరు మేఁతరి సాకుఁడు♦పులుఁగు మావి
కొమ్మయిలుపుల్గు కోవెల ♦ కోయి లనఁగఁ
బరభృతమునామధేయముల్ ♦ పరఁగు సాంబ. 77

టీ. పాదట్టుపురువు॥రూ॥ పాదొట్టుపురువు=బూసిని గలిగించుపురుగు; సన్నపిల్లి; పాలీఁడు-ర = తంతువాయము (సాలెపురుగు). రాళ్లరాసిగాఁడు; గరిమిడియెల్క-౨ = ఆఖువు(రాజమూషకము). ఎఱకలు; చట్టుపలు; రూ॥ చెట్టుపలు, గఱులు; ఱెక్కలు-౫ = పక్షములు. లావులు; ఈఁకలు-౨ = పర్ణములు. గువ్వ,పక్కి, పిట్ట, పులుఁగు-ర = పక్షి. మదికొలఁకుపులుఁగు = మానససరస్సుపక్షి, తెల్లనిపిట్ట = తెల్లనిపక్షి; నలువ తేజి = బ్రహ్మవాహనము; పాలునీరును వెలిసేయు పక్కి = క్షీరనీరముల వేఱుపఱచుపక్షి; అంచ-౫ = హంస. కెంపుకనుల పులుఁగు = ఎఱ్ఱనికన్నులుగలపక్షి; తలిరుమేఁతరి = చిగురును భక్షించునది; సాఁకుడుపులుగు = అన్యపక్షులచేఁ బెంపఁబడినపక్షి-పరపుష్టము, మావి...పుల్గు=మామిడికొమ్మ వాసస్థానముగాఁ గలపక్షి; కోవెల; కోయిల-౬=కోకిల.

సీ. పచ్చతెక్కలపుల్గు ♦ పచ్చవిల్తుని తేజి
పలుకులపులుఁగు నాఁ ♦ జిలుక చిల్క-
యనఁగ శుకాభిఖ్య ♦ లగు బట్టికాఁడు గో
ర్వంక గోరింక గో♦రంక యనఁగ
శారికాహ్వయము లె♦సంగు నట్టువపిట్ట
నెమ్మి జుట్టుఁబులుగు ♦ నెమిలి నెమలి
పురివిప్పియాడెడి♦పులుఁగు కన్నులుగల
పులుఁగన బర్హికి ♦ వెలయుచుండు
తే. జంటపిట్ట బటువు గువ్వ ♦ జక్కవ యనఁ
గోకనామంబు లగు మంచు♦గ్రోలుపుల్గు
నిప్పులనుమ్రింగుపులుఁగు వె♦న్నెలపులుఁగన
నమరును జకోరనామధే♦యములు సాంబ. 78

టీ. పచ్చతెక్కలపుల్గు = పచ్చని తెక్కలుగలపక్షి, పచ్చవిల్తుని తేజి = మన్మథునిగుఱ్ఱము; పలుకులపులుఁగు = మాటలు నేర్చుకొను పక్షి; చిలుక; చిల్క = 6 = శుకము. గోర్వంక॥ రూ॥ గోరువంక = గొరువంక; గోరింక; గోరంక - 6 = శారిక. నట్టువపిట్ట = నాట్యమాడుపక్షి; నెమ్మి॥ రూ॥ నమ్మి; జుట్టుఁబులుగు = తలయందు సిగగలపక్షి—శిఖి; నెమలి; నెమిలి; పురివిప్పియాడెడు పులుఁగు; కన్నులుగలపులుఁగు = పురులయందుఁ గన్నుల వంటియాకారములు గలిగియుండుపక్షి - 5 = బర్హి. జంటపిట్ట = పోతును పెంటియు జంటగానుండుపక్షి; బటువుగువ్వ = గుండ్రనిపక్షి; జక్కవ - 3 = చక్రవాకము. మంచుగ్రోలుపుల్గు; నిప్పులను మ్రింగుపులుఁగు; వెన్నెల పులుఁగు - 3 = చకోరము.

సీ. విరితేనెతాౘ్రివుడు ♦ మరునల్లె బమ్మిపుర్వు
తుమ్మెద తేఁటి ము♦ద్దుగలకాళ్ల
పురుగన భ్రమరంబు ♦ పొలుచు లకోరీలు
బకదారు లొడ్డీలు ♦ పల్లటీలు
పావురములు నేల♦పల్లటీల్ కూకీలు
పావురా లంతర♦పల్లటీలు
సురటీ లనంగఁ బొ♦ల్చును గలరవములు
కొక్కెర క్రౌంచయుఁ ♦ గొక్కరాయి
తే. యనఁగ గ్రౌంచాఖ్య లగుఁ గొంగ ♦ యన బకంబు
జాలె జలకట్టె యణుజు వే♦సడము లగుడు
జావడము వారణము బైరి ♦ సాళువంబు
కనిసెరము చెంచడము డేగ ♦ యనఁగఁ దనరు
శ్యేనమునకు మునీశ్వరా♦ధీన సాంబ. 79

టీ. విరితేనెతాౘ్రివుడు = మకరందమును గ్రోలునది-మధుపము; మరునల్లె=మన్మథుని యల్లెత్రాడు; బమ్మిపుర్వు = భ్రమరము; తుమ్మెద; తేఁటి; ముద్దుగలకాళ్లపురుగు = (3 × ౨) ఆఱుకాళ్లపురుగు-షట్పదము-౬ = భ్రమరము. లకోరీలు; బకదారులు; ఒడ్డీలు; పల్లటీలు; పావురములు; నేలపల్లటీలు; కూకీలు; పావురాలు; అంతరపల్లటీలు; సురటీలు-౧౦ = పారావతములు (పారావతభేదముల వేర్వేఱుగా గ్రహింపఁదగును). కొక్కెర, క్రౌంచ; కొక్కరాయి-3 = క్రౌంచపక్షి. కొంగ = బకము. జాలె ॥రూ॥ జాలియ, జలకట్టె ॥రూ॥ జలకట్టియ ॥పా॥ సెలకట్టె, అణుజు ॥రూ॥ అడుజు, వేసడము, లగుడు జావడము, వారణము, బైరి ॥రూ॥ బయిరి, సాళువము ॥రూ॥ సాళ్వము కనిసెరము, చెంచడము, డేగ-౧౮ = శ్యేన (భేద)ములు.

సీ. కరువలిమేఁతరి ♦ కంటివిన్కరి పాము
పుట్టకాఁపరి తాఁచు ♦ చుట్టపురుగు
విసముతాలుపు చిల్వ ♦ బుసపుర్వు నాభోగి
వెలయుఁ జిలువఱేఁడు ♦ వెన్నుపాన్పు
తడవులనిఁడుపడు ♦ తరిగట్టుత్రాఁడన
నహిపతి కగు నజ్జ♦యలుఁగుపులుఁగు
కోడి పుంజన నొప్పుఁ ♦ గుక్కుటనామముల్
గుడ్లగూబ పగటి♦గ్రుడ్డి గూబ
తే. యనఁగ ఘూకాభిధానంబు ♦ లగు లకుముకి
మీనవల్లంకి పొదలిక ♦ మీలగొంగ
యనఁగఁ జను వర్తికకుఁ బేరు ♦ లమరు దివ్వె
యార్పు మిడుత శలభాఖ్య ♦ లమరు సాంబ. 80

టీ.కరువలిమేఁతరి = వాయువును భక్షించునది-పవనాశనము, కంటి విన్కరి = కన్నులచే వినునది-చక్షుశ్శ్రవము, పుట్టకాఁపరి = వల్మీకమున వసించునది-తాఁచు, చుట్టపురుగు = చుట్టగా చుట్టుకొనుపురుగు-చక్రి, విసము తాలుపు = విషమును ధరించునది-విషధరము, చిల్వ ॥రూ॥ చిలువ = విషము గలనోరుగలది, బుసపుర్వు = బుసకొట్టుపురుగు-౯ = సర్పము. చిలువఱేఁడు = సర్పములకురాజు, వెన్నుపాన్పు = విష్ణువుపడుక, తడవులనిఁడుపఁడు = చిరకాలముగానుండునది, తరిగట్టుత్రాడు = మందరపర్వతమునకు సముద్ర మథనకాలమున కవ్వపుఁద్రాడుగాఁగట్టఁబడినది-౭ = ఆదిశేషుఁడు. అజ్జ... పులుఁగు = పాదములే యాయుధముగాఁగలపక్షి - చరణాయుధము, కోడి, పుంజు-౩ = కుక్కుటము. గుడ్లగూబ, పగటిగ్రుడ్డి-దివాంధము, గూబ-౩ =

ఘూకము. లకుముకి, మీనవల్లంకి - మీనవల్లిక, పాదలిక, మీలగ్రోంగ = చేపల విరోధి-౮ = వర్తిక. దివ్వెటూర్పు = దీపములనార్పునది, మిడుత-౨ = శలభము.

సీ. కాటుకపిట్టకూఁ♦కటిగువ్వ యేటిరింత
పులుఁగులగదుమరి ♦ పోలిగాఁడు
నాఁగ భరద్వాజ♦నామముల్ తగు గబ్బి
లము గబ్బిడా గబ్బి♦లాయి చీకు
రా యనంగనుఁ దైల♦పాయి కాఖ్యలు చెల్లు
మాఱినుదోలుచుపిట్ట ♦ మాఱినుపోటు
వనఁగ దార్వాఘాట♦మున కగు బెగ్గుర
మన సారసమ్మున ♦ కలరు నీరు
తే. కట్టె నీరు పా మన వల♦గర్ద మలరుఁ
బుడమి చెవి పాములబిడారు ♦ పుట్ట యనఁగ
మించు వల్మీకనామముల్ ♦ మెట్టు తాప
మెట్టిక యన సోపానాఖ్య ♦ మెఱయు సాంబ. ౭౧

టీ. కాటుకపిట్ట, కూకటిగువ్వ, ఏటిరింత, పులుఁగులగదుమరి = పక్షులను గదుమునది, పోలిగాఁడు॥రూ॥ పోలఁడు-౬ = భారద్వాజము. గబ్బిలము, గబ్బిడా॥ రూ॥ గబ్బిలాయి, గబ్బిడాయి, చీకురాయి ॥రూ॥ చీకురువాయి-౬ = తైలపాయిక. మాఱినుదోలుచుపిట్ట, మాఱినిపోటువు-౨ = దార్వాఘాటము (వడ్రింగిపిట్ట). బెగ్గురము = సారసపక్షి. నీరుకట్టె॥ రూ॥ నీరుకట్టియ, నీరుపాము-౩ = అలగర్దము. పుడమిచెవి = భూమికర్ణము, పాముల బిడారు = సర్పముల స్థానము, పుట్ట-౩ = వల్మీకము. మెట్టు ॥పా॥ మెట్టిక, తాప, మెట్టిక-౮ = సోపానము.

సీ. గుమికాఁడు కాకి నాఁ ♦ గొఱలుఁ గాకముపేళ్లు
గ్రిద్ధ యనంగ గృ♦ధ్రింబు వెలయు
జరగు గుబ్బిలికాఁడు ♦ సకినాలు వెలయించు
పక్కి పగటిచీకు ♦ పైఁడికంటి
యనఁ గనకాక్షికిఁ ♦ దనరు జవాది జ
వ్వాజి యనఁగ సాంక♦వము దనర్చు
కస్తూరి పీణెయుఁ ♦ గస్తురి యనఁ బొల్చు
మృగనాభిచట్టపు♦మెకము పునుఁగుఁ
తే. బిల్లి యొత్తెడుపిల్లి నాఁ ♦ బేళ్లు వెలయు
గంధిలమునకుఁ జాతకా♦ఖ్యలు దనర్చు
వానకోయిల మబ్బుసీ♦రానుపిట్ట
యనఁగఁ గైలాసశైలవి♦హార సాంబ. 82

టీ. గుమికాఁడు, కాకి-౨ = కాకము. గ్రిద్ధ॥ రూ॥ గద్ధ-౨ = గృధ్రిము. గుబ్బిలికాఁడు ॥రూ॥ గుబిలి, సకినాలు...పక్కి = శకునములను దెలుపుపక్షి, పగటి-చీకు = పగటిపూట గుడ్డిగానుండునది, పైఁడికంటి = కనకాక్షి-౫ = కనకాక్షి. జవాది॥ రూ॥ జవ్వాది-జవ్వాదు, జవ్వాజి ॥రూ॥ జవాజి-౫ = సంకుమదము. కస్తురి-కస్తూరి, పీణియ ॥రూ॥ పీణె, కస్తూరి-౮ = మృగనాభి. చట్టపుమెకము = పునుగుచట్టముగల మృగము, పునుఁగుఁబిల్లి, ఒత్తెడుపిల్లి-3 = గంధిలము. వానకోయిల, మబ్బు...పిట్ట = మేఘజలమును దాగ్రుపక్షి-౨ = చాతకము.

సీ. పొడకోడి కానపుం ♦ జడవిపుం జన వన
కుక్కుటం బగు బొల్లి♦కోడి నీరు

కోడి యనఁగ జల♦కుక్కుటంబు దలిర్చు
పిట్ట పిచ్చిక యూరఁ♦బిచ్చిక యనఁ
దగుఁ జటకమున కొ ♦ దాఁటరి చలికాపు
కప్ప యనఁగ భేక ♦ మొప్పు జలగ
నల్లత్రాగు డన రా♦జిల్లు జలూకము
మొగటిపురువు గోడ♦పురువు నల్లి
తే. నాఁగ మత్కుణ మగు నీవ ♦ యీఁగ యనఁగఁ
మక్షికకు నొప్పు ములుపుర్వు ♦ మంటితిండి
తే లనఁగ వృశ్చికంబు వ♦ర్తిల్లు జొచ్చు
పురుగు దోమన మశకంబు ♦ పరఁగు సాంబ. 83

టీ. పాడకోడి, కానపుంజు, అడవిపుంజు-3=వనకుక్కుటము. బొల్లికోడి, నీరుకోడి-2=జలకుక్కుటము. పిట్ట, పిచ్చిక॥ రూ॥ పిచ్చుక, ఊరఁబిచ్చిక-4=చటకము. దాటరి=గంతులువేసి చరించునది-ప్లవము, చలికాపు=చలికాలమున (అనగా వర్షాకాలమున) కలుగునది-వర్షాభువు, కప్ప-3=మండూకము. జలగ, నల్లత్రాగుడు=నెత్తురును పీల్చునది-2=జలూకము. మొగటిపురువు, గోడపురువు, నల్లి-3=మత్కుణము. ఈవ, ఈఁగ-2=మక్షిక. ములుపుర్వు=కొండిగలపురుగు, మంటితిండి=మన్నుదినునది, తేలు 3=వృశ్చికము. జొచ్చుపురుగు, దోమ-2=మశకము.

క. ప్రీతిని భవదంకిత మా
నీతిర్యగ్వర్గ జగము ♦ లెన్నఁగ లోకా
తీతం బై పూతం బై
ఖ్యాతం బై ధరను వెలయుఁ ♦ గావుత సాంబా. 84

తా. సాంబమూర్తీ! ప్రీతిగలుగునట్లు నీకంకితము సేయఁబడిన యీ తిర్యగ్వర్గ జనము లెన్నఁగా లోకోత్తరమైనదియుఁ బవిత్రమైనదనియుఁ బ్రసిద్ధిచెందినదియునై భూమియందు విలసిల్లును గాత.

తిర్యగ్వర్గు సంపూర్ణము.

---

## నానార్థవర్గు.

క. శ్రీనాయకసాయక వా
ణీనాయక ముఖ్యవినుత ♦ నీపేరిట నే
నానార్థవర్గుఁ జేసెద
నానార్థము లొసఁగి ప్రోవు ♦ నను గృప సాంబా. 85

తా. లక్ష్మీనాథుఁడగువిష్ణువు బాణముగాఁ గలవాఁడా! బ్రహ్మ మొదలగువారిచే స్తోత్రము చేయఁబడినవాఁడా! సాంబమూర్తీ! నేను నీకంకితముగా నానార్థవర్గును రచించెదను. నాకు ననేకార్థముల నిచ్చి రక్షింపుము.

సీ. గుణమున కాటకుఁ ♦ గోపు నా విలసిల్లు
గోతికి శాఖ కొ ♦ మ్మనఁగ
శకలంబునకును మా♦టకుఁ బలు కన మించు
నిసువుకు గోవు నా♦ బసి యనంగఁ
గటికిఁ బైపూరికిఁ ♦ గప్పనఁ జెన్నొందుఁ
గొట్టుకుఁ గడమ కొఁ ♦ గొఱంత యనఁగ

మగగుఱ్ఱమునకు గు♦ల్మమున కౌ గుం డన
నెలకు జాబిల్లి కౌ ♦ నెల యనంగ
తే. నూటకును జేవకుఁ దనర్చు ♦ నూట యనఁగ
వేఁడుటకుఁ గాఁకకుఁ దలిర్చు ♦ వేఁడి యనఁగ
నంకమునకును బిడ్డకును గం ♦ దనఁగఁ బరఁగు
లలితమునిమానసాబ్జరో♦లంబ సాంబ. 86

టీ. కోపు = గుణము (అల్లెత్రాడు), ఆట. కొమ్మ = స్త్రీ, చెట్టుకొమ్మ. పలుకు = శకలము (తునుక), మాట. పసి = నిసువు, గోవు. కప్పు = కఱి (నలుపు), ఇంటిమీఁదిపూరి. కొఱఁత = కొఱ్ఱు (ఊరి), తక్కువ. గుండు = మగగుఱ్ఱము, గుల్మము. నెల = చంద్రుఁడు, మాసము. ఊట = ఊరెడునీరు, చేవ. వేఁడి = ప్రార్థించి (వేఁడుధాతువు క్త్వార్థకము), కాఁక. కందు = కళంకము, బిడ్డ.

సీ. ఈఁతచెట్టును లోఁతు ♦ నీఁత యనఁ జెలంగు
నజ్జకుఁ గ్రింది కౌ ♦ నడు గనంగ
మాల్మికి నడత కి♦మ్మగు నలవా టన
నమ్మకు నవ్వ కౌ ♦ నవ్వ యనఁగ
గోడుగును మఱునాఁడు ♦ నలుసు నెల్లి యనంగ
నెఱ్ఱకుఁ డిండి కౌ ♦ నెర యనంగ
విరికిఁ నొప్పుటకును ♦ వెలయు నల రనంగ
బేరును దండ యగుఁ ♦ బే రనంగఁ
తే. నది యనుటకు భంగమున కౌ ♦ నల యనంగ
నాత్రిమునకు వృత్తమున కౌ ♦ నక్కఱ యన

నాలమునకుఁ బలుకుట కౌ ♦ నని యనంగ
నంబరధునీలసజ్జటా♦డంబ సాంబ. 87

టీ. ఈఁత = ఈఁతచెట్టు, లోఁతు. అడుగు = పాదము, క్రింది. అలవాటు = మాలిమి (మచ్చిక), నడత. అవ్వ = అమ్మ (తల్లి), అవ్వ (తల్లితల్లి). ఎల్లి = గొడుగు, మఱునాఁడు. ఎర = ఆహారము. ఎఱ = ఎఱ్ఱ. ఒలరు = పువ్వు, ఒప్పునసుట. పేరు = నామము, దండ (సరము). అల = అదియునట్లు, తరంగము. అక్కఱ = ఆతురము, అక్కర = ఒకఛందోవృత్తము. అని = యుద్ధము, పలికి.

సీ. ములికికిఁ జెఱువుకో♦పునకు న ల్గనఁ బొల్చు
నైదును దాను నే ♦ నన రహించుఁ
జెవిసామ్మునకును దం♦తువుకుఁ బోఁ గనఁ జెల్లుఁ
బురిటికి సాటికిఁ ♦ బురు డనఁ దగు
నడవికిఁ జూడమి ♦ కగుఁ గాన యనఁ బొల్చుఁ
గల్లును తాయియుఁ ♦ గ ల్లనంగఁ
గంచుకొమ్మునకు శృం♦గమున కొఁ గొ మ్మనఁ
జాఁచికి దొంగ కౌ ♦ నాఁ చనంగఁ
తే. గరువలికి దయ్యమునకు నౌ ♦ గాలి యనఁగ
ఘటికయును దల్పు మల్కూ నౌ ♦ గడియ యనఁగ
నూటికిని మర్దనమున కౌ ♦ నూ అనంగఁ
జటులదైతేయమదశైల♦శంబ సాంబ. 88

టీ. అల్గు॥ రూ॥ అలుఁగు = ములికి, చెఱువుకోపు. ఏను = ఐదు, నేను. పోఁగు = చెవిసొమ్ము, తంతువు. పురుడు = జాతాశౌచము, సాటి. గాన =

అడవిఁ, (దుర్దాంతమైనప్పుడు) చూడమి యనుట. కల్లు = మద్యము, ఔయి. కొమ్ము = కొమ్ము అను కంచువాద్యము, ఎద్దులు మొదలైనవానికొమ్ము. నాఁచు = పాఁచి, దొంగ. గాలి = కరువలి(వాయువు), దయ్యము. గడియ = ఘటిక, తలుపుగడె. నూఱు = శతము, సన్నగంటు మర్దించుట.

సీ. కడుపుగడ్డయుఁ దూము ♦ నడరు బల్ల యనంగఁ
విఱివికి శయ్యకొఁ ♦ బఱ పనంగఁ
గౌముదికిని మొగ్గకు ♦ కగు వెన్నెల యనంగఁ
బగలును గంటు నోఁ ♦ బగ లనంగ
నంగళ్లు నొకపోఁగు ♦ నగును బేఁట యనంగ
నెమిలికి మైత్రికొ ♦ నెమ్మి యనఁగఁ
బసుపుతావికి వీధి ♦ కెసఁగు వాడ యనంగఁ
జలికిని గాలి కొ ♦ వలి యనంగఁ

తే. బట్టునకుఁ గొమ్మనుటకు నోఁ ♦ బట్టనంగ
భేదమునకు మూలమున కొ ♦ వే ఱనంగ
ఫలమునకు వృద్ధునకుఁ దగుఁ ♦ బండనంగ
దాసహృదయకాసారకా♦దంబ సాంబ. 89

టీ. బల్ల = కడుపులోనిగడ్డ, తూము. పఱపు = విరివి, పడుక. వెన్నెల = చంద్రిక, మొగ్గ. పగలు = పగటిపూఁట, కఁటు (విరోధము). పేఁట = అంగళ్లు, పేట = పోఁగు. నెమ్మి = నెమిలి, మైత్రి. వాడ = పసుపుతావి, వీధి. వలి = చలి, గాలి. పట్టు = దుకూలము, గ్రహించు. వేఱు = భేదము, వేరు = చెట్టుమూలము. పండు = ఫలము, వృద్ధుఁడు.

సీ. సాముకూటమునకు ♦ సరస కౌ గరిడినా
సౌరును ములికి యగాఁ ♦ దీరనంగ
హయశాలకును బాగ ♦ కమరుఁ బాగా యన
మావి కామ్రమున కౌ ♦ మావి యనఁగ
గాహళి కొక చెట్టు ♦ కలరు *బూరుగ యన
జడితికి విరతి కౌ ♦ వడి యనంగ
హొన్నున కుపకృతి ♦ కొనరు మేల్మి యనంగ
మురువును సొగసు నౌ ♦ మురు వనంగఁ
తే. గళుకునకుఁ గంపకోట కౌ ♦ వెలుఁ గనంగ
మాను మనుటయుఁ దరువు నౌ ♦ మా ననంగ
జేవడికిఁ బోలిక కెసంగుఁ ♦ గైవడి యన
డమరుశూలపాశాంకుశా♦డంబ సాంబ. 90

టీ. గరిడి = సాముకూటము, సమీపము. తీరు = సౌరు (అందము), బాణము. పాగా = అశ్వశాల, తలపాగ. మావి = మావి (జరాయువు), మామిడిచెట్టు. బూరుగ = బూరుగుచెట్టు, ఊఁదెడి కాహళవాద్యము. వడి = జడితి (వేగము), పద్యములందలి యతి. మేలిమి = బంగారు, ఉపకారము. మురువు = చేతిమురుగు, సొగసు. వెలుఁగు = కళుకు (కాంతి), వెలుఁగు = కంపకోట. మాను = విడుచు (క్రియ), మ్రాను. కైవడి = చేతిపడి, పోలిక.

సీ. ఘూకంబునకుఁ జెవి♦గూబ కౌ గూబన
శిశువును బులియు నౌఁ ♦ జిఱుత యనఁగ

* వృక్షపరముగా 'బూరుగు' అనియు వాద్యపరముగా 'బూరగ' అనియుఁ బ్రయోగములు కనఁబడుచున్నవి. కాని 'బూరుగ' అనురూపము మృగ్యము.

సంధ్యవార్చుటకు సం♦జకు సందె యనఁ బొల్చుఁ
బక్షియుఁ దరువు నాఁ ♦ బాల యనఁగ
నొకమ్రాఁకునకు వాతె♦ఱకు మోవి యనఁ జెల్లు
రిక్కయు బొట్టు నాఁ ♦ జుక్క యనఁగఁ
నూరకు శ్వాసాన♦కుఁ జెలంగు నూర్పన
హెచ్చు నెక్కుటయు నా ♦ నెక్కు డనఁగఁ
తే. కుచములకుఁ దల్పుచీలకు ♦ గుబ్బ యనఁగ
బక్కకును కుణపమున కా ♦ బడు గనంగ
దళసరికిఁ బర్ణమునకు నా ♦ దళ మనంగ
శంబరాంకకపర్దావ♦లంబ సాంబ. 91

టీ. గూబ = గుడ్లగూబ, చెవిగూబ (కర్ణమూలము). చిఱుత = శిశువు, చిఱుతపులి. సంజె = సంధ్యవార్చుట, సంధ్యాకాలము. పాల = పాలపక్షి, పాలచెట్టు. మోవి = ఒకానొకచెట్టు, పెదవి. చుక్క = నక్షత్రము, నొసటిబొట్టు. ఊర్పు = ఊర, శ్వాసము. ఎక్కుడు = హెచ్చు, ఎక్కుట. గుబ్బ = కుచము (స్తనము), తలుపుచీల. బడుగు = బక్క (చిక్కినది), కుణపము (పీనుఁగు). దళము = దళసరి, ఆకు.

సీ. లేపన మెత్తకు ♦ లేపుటకుఁ దనర్చు
డా లనఁగాఁ గాంతి ♦ డాలుఁ బరఁగు
నాఁ డనఁ దగు నాది♦నమునకు సీమకు
మించ చన జడలకు ♦ మిఱుట కగు
మోడి నా నల్కకుఁ ♦ బైఁడితునకకుఁ జెల్లు
బా రన బార యీ♦రాఱు నొనరు

దండ నాఁ జెంతకు ♦ దామంబున కెసంగు
సరి యన దండకు ♦ సమమున కగుఁ

తే. దోర మనఁగను స్థూలము ♦ నోముదార
మమరు నాఱు త్రిగయును నూఁ♦గారు నగును
గ్రుడ్డనఁగ నండమున కంధ♦కునకుఁ బొసఁగు
నంబరతరంగిణీజటా♦డంబ సాంబ. 92

టీ. లేపు = మెత్త, లేపుట. డాలు = కాంతి, డెక్కెము. నాఁడు = ఆదినము, నాడు = సీమ (దేశము). మించు = మెఱుఁగుఁదీఁగె, మీఱుట. మోడి = కోపము, బంగారుతునుక. బార = వ్యామపరిమాణము, పండ్రెండు. దండ = చెంత, పుష్పాదులదండ. సరి = దండ, సమము. తోరము = స్థూలమైనది, నోముదారము. ఆఱు = షట్సంఖ్య, ఆరు = నూఁగారు. గ్రుడ్డు = కోడిమొదలైనవానిగ్రుడ్డు, గ్రుడ్డివాఁడు.

సీ. కొ ప్పనంగను వింటి♦కొనకును గబరి కొ
నెన్ను నా నెన్నున ♦ కెన్నుట కగు
న బ్బనంగఁ దండ్రి ♦ కగపడమికిఁ జెల్లు
నప్ప యనఁగఁ దండ్రి ♦ కక్క కమరుఁ
గలు పన మడిలోని ♦ కసవును బెరుఁగు నొ
బా సన నానకు ♦ భాష కలరు
డ బ్బన గవ్వకు ♦ డంబంబునకుఁ బొల్చు
మే లన మరులకు ♦ మెచ్చున కగు

తే. బా లగును క్షీరమునకును ♦ భాగ్యమునకుఁ
గమ్మ యనఁ బత్త్రికకుఁ జెవి♦కమ్మ కెనయుఁ
బాప యన బిడ్డకును గనుఁ ♦ బాప కెనయుఁ.
దాపసోత్తమవినుతిక♦దంబ సాంబ. 93

టి. కొప్పు=వింటికొన, కబరి. ఎన్ను=సస్యాదులయెన్ను, గణించుట. అబ్బ = తండ్రి, అబ్బక = దొరకను. అప్ప = తండ్రి, అక్క-కలుపు = మడిలోనికసవు, పెరుఁగు. బాస = ఆన, భాష. డబ్బు = గవ్వ. డంబము. మేలు = మరులు, మెచ్చుతెలుపుట (పా॥ తాడన రజ్జువుఁ♦దాటిమఁ దగు॥ తాడు = దారము, తాటిచెట్టు.) పాలు = క్షీరము, భాగము. కమ్మ = జాబు, చెవికమ్మ. పాప = బిడ్డ, కనుఁబాప.

సీ. పెర యనఁగాఁ దేనె ♦ పెరకు వింతకుఁ బొల్చు
మెఱుఁ గనఁ గాంతికి ♦ మించున కగు
బండ నాఁ దిట్టుకుఁ ♦ బలుగుఱాతికిఁ జెల్లు
బంతి నాఁ జెండును ♦ బంక్తియు నగుఁ
బెరుఁ గన దధికిని ♦ వృద్ధికిఁ దనరారు
వేఁట నా గొఱియకు ♦ వేఁట కమరు
వెలి యన బయటికి ♦ వెల్లనకుఁ దనర్చు
వీ డన వదలును ♦ వీడు నలరు

తే. మ బ్బనఁగ మందుసొక్కును ♦ మబ్బును నగు
బులు గనఁగ లాంఛనమునకుఁ ♦ బులుఁగు కొదవు

నా లనఁగ గోవులకు భార్య ♦ కతిశయిల్లు
శంబరాహితమదభిదా♦డంబ సాంబ. 94

టీ. పెర = తేనెతెట్టు, అన్యము. మెఱుఁగు = కాంతి, మెఱుపు. బండ = తిట్టు, పలుగుతాయి. బంతి = చెండు, పంక్తి. పెరుఁగు = దధి, పెరుఁగుట. వేఁట = గొఱ్ఱె, వేఁట (మృగయ). వెలి = బయలు, తెల్లన. వీడు = వదలు (క్రియ), పట్టణము. మబ్బు = మందుసొక్కు, మేఘము. పులుగు = గుఱుతు, పులుఁగు = పక్షి. ఆలు = ఆవులు, భార్య.

అవతారిక:— ఈ క్రిందియొక పద్యమున సంస్కృతాంధ్రములు రెండు నైనై నానార్థములుగల పదములను గొన్నిఁటిని దెలుపుచున్నాఁడు.

సీ. గురు వన నొజ్జకుఁ ♦ బరువునకుఁ జెలంగు
నారి నా యల్లెకు ♦ నాతి కెనయు
నూ రనఁ బల్లెకు ♦ నూరువునకుఁ బొల్చుఁ
దమి యన రాత్రికిఁ ♦ దమికి నమరుఁ
గిరి యన దంతికిఁ♦గప్పునకుఁ దనర్చుఁ
జింత నాఁ దింత్రిణి ♦ చింత యొనరు
మూల యనఁగఁ గోణ♦మునకు రిక్కకుఁ జెల్లు
మను వన బ్రతుకును ♦ మనువును నగుఁ
తే. కూట మన శిఖరమునకును ♦ గుంపున కగు
జాతి యన నన్వయమునకు ♦ జాతి కెనయుఁ

బురి యనఁగ నెమ్మితోఁకకుఁ ♦ బురికిఁ దనరు
సకలసురచక్రవర్తి శ్రీ♦సాంబమూర్తి. 95

టీ. గురువు, ఇది (సంస్కృతమైనపుడు) ఉపాధ్యాయులకును, (తెనుఁగైనపుడు) పరుగునకును పేరు. జ్యా = (సం) అల్లెత్రాడు, (తె) స్త్రీ. ఊరు = (సం) తొడ, (తె) పల్లె. తమి = (సం) రాత్రి, (తె) తమకము. కరి = (సం) ఏనుఁగు, (తెనుఁగున శకట రేఫయుక్తమైనపుడు) నలుపు. చింత = (సం) విచారము, (తె) చింతచెట్టు. మూల = (సం) మూలానక్షత్రము, (తె) కోణము. మనువు = (సం) వైవస్వతాదులగు పదునలుగురికిఁ గల సామాన్యనామము. (తె) బ్రతుకు. కూటము = (సం) పర్వతశిఖరము, (తె) గుంపు. జాతి = (సం) జాజిపువ్వు, (తె) కులము. పురి = (సం) పట్టణము. (తె) నెమిలితోఁక.

క. నిస్తులలక్షణకవి యగు
కస్తూరీరంగసుకవి ♦ ఘటియించిన యీ
సిస్తగు నాంధ్రనిఘంటు ప్ర
శస్తంబై వెలయుఁగాత ♦ జగతిని సాంబా! 96

తా. సాంబమూర్తీ! అసమానుఁడైన లక్షణకవేత్త యగు కస్తూరిరంగ కవివరుఁడు రచించిన యీమేలైన తెనుఁగునిఘంటువు ప్రఖ్యాతిచెందినదై జగమునందు విలసిల్లును గాక.

క. ఈరుచిరాంధ్రనిఘంటు మ
హారూఢి వహించి మించి ♦ యారవిశశిభూ
తారకమై తారకమై
తారక మాఁగాత సుకవి♦తతులకు సాంబా. 97

తా. సాంబమూర్తీ! మనోహరమైన యీ తెనుఁగునిఘంటువు గొప్పయున్నతినిబొంది యతిశయించి సూర్యచంద్రభూనక్షత్రములుండువఱకు నుండునదై సుందరమై కవిశ్రేష్ఠుల సమూహములకుఁ దాను (పదార్థసందేహాదులనుండి) దాఁటించునది యగునుగాక.

సాంబనిఘంటువు సమాప్తము.

---

మా స్వంత ప్రచురణములు.

**1939** సం॥ నూతన ప్రణాలిక ననుసరించి

గిడుగు నరశింహమూర్తి. బి. ఏ. ఎల్. టి.

విద్వాన్ నాగలింగమ్ వేంకటేశ్వరశాస్త్రి

ఉభయభాషాప్రవీణ

ప్రతాప రామకోటయ్య, P. O. L.,

అక్కపెద్ది రామకోటిశాస్త్రిగార్లచే రచియింపబడిన

# సాహితీవాచకములు

1 తరగతి గుంటూరు, కృష్ణాజిల్లా బోర్డులలో పెట్టబడినవి.

| | |
|---|---|
| 1 తరగతి అపూర్వుడు ... ... | 0—3—0 |
| 2 తరగతి డిటో ... ... | 0—3—0 |
| 3 తరగతి డిటో ... ... | 0—4—0 |
| 4 తరగతి ... ... | 0—5—0 |
| 5 తరగతి ... ... | 0—6—0 |

# కృష్ణాజిల్లాబోర్డుంతటను

హైస్కూల్సు, మిడిల్ స్కూల్సులోను పెట్టబడిన

గరిమెళ్ళ మాధవరావు బి. ఏ. బి. యిడి., గారిచే

రచియింపబడిన

| | | | |
|---|---|---|---|
| భవానీవాచకం | 6వ తరగతి | (ఫస్టుఫారం) | 0—7—0 |
| డిటో | 7వ తరగతి | (సెకండుఫారం) | 0—8—0 |
| డిటో | 8వ తరగతి | (థర్డుఫారం) | 0—9—0 |

214

25